www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

గురువారం | 14-3-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 64 సంచిక (Issue) : 329 | శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరఋతువు, ఫాల్గుణమాసం, శుక్లపక్షం; తిథి: పంచమి రా. 11.27 తదుపరి షష్ఠి; నక్షత్రం: భరణి సా. 4.57 తదుపరి కృత్తిక వర్జ్యం: తె. 4.33-6.05; దుర్ముహూర్తం: ఉ. 10.26-11.14, మ. 3.12-3.59; అమృతఘడియలు: మ. 12.26-1.56; రాహుకాలం: మ. 1.30-3.00; సూర్యోదయం: 6.28; సూర్యాస్తమయం: 6.22 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

బదిలీల స్కామ్ 50 కోట్లు

భారీ స్థాయిలో టీచర్ల అక్రమ బదిలీలు

- క్షేత్రస్థాయి నుంచే వసూళ్లు ప్రారంభం
- మొదట ప్రజాప్రతినిధుల సిఫారసులు
- ఆ తర్వాత పైస్థాయిలో కదిలిన ఫైళ్లు
- 2 చోట్ల సమర్పించుకున్న టీచర్లు
- రెండు జిల్లాల డీఈవోలపై దౌర్జన్యం
- చివరికి కమిషనరేట్ నుంచి ప్రక్రియ
- అక్రమ బదిలీల ఆర్డర్లు విడుదల

12

లారీ ఇసుక ₹40 వేలా?



బంగారంతో పోటీ పడటమా?.. హైకోర్టు విస్మయం

5 ఎకరాల్లో అనుమతి పొంది 50 ఎకరాల్లో తవ్వకాలా? రాష్ట్ర ప్రభుత్వం ఏం చేస్తోంది?
-హైకోర్టు సూటి ప్రశ్న

- సామాన్యులకు అందేలా చూసే బాధ్యత ప్రభుత్వానిదే
- తవ్వకం, తరలింపుపై అధికారులకు నియంత్రణేదీ?
- రీచ్‌ల్లో ఏం జరుగుతున్నదో వారికి తెలియడం లేదు
- మండలస్థాయిలో పాయింట్ పెట్టి విక్రయించండి
- 'ఎంవోఈఎఫ్' నివేదికపై కౌంటర్ వేయండి
- ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం.. విచారణ 20కి వాయిదా

ఇలా చేయండి

మండలస్థాయిలో ఓ పాయింట్‌ను ఏర్పాటుచేసి వినియోగదారులకు అందుబాటు ధరలో ఇసుకను విక్రయించాలి.

రీచ్‌ల నుంచి వాహనాల ద్వారా ఇసుక రవాణా చేసే విషయంలో ఎంవోఈఎఫ్ మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలి.

రీచ్‌లు ఉండే ప్రాంతాల్లో స్థానికులతో కలిసి అధికారులు రవాణా మార్గాలను నిర్ణయించాలి..



అమరావతి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఇసుక ధర బంగారంతో పోటీపడుతోందని హైకోర్టు వ్యాఖ్యానించింది. లారీ ఇసుకను రూ.40వేలకు విక్రయించడంపై విస్మయం వ్యక్తం చేసింది. ఇసుక మైనింగ్ అనుమతులు పొందిన కంపెనీ అధిక ధరకు విక్రయిస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం ఏం చేస్తోందని ప్రశ్నించింది. ఇసుక తవ్వకం, తరలింపు పై మైనింగ్ శాఖ అధికారులు నియంత్రణ కోల్పోయారని ఆక్షేపించింది. ఇసుక రీచ్‌లలో ఏం జరుగుతుందో కూడా వారికి తెలియడం లేదని పెదవి విరిచింది. ఐదు ఎకరాల్లో మైనింగ్ అనుమతులు పొంది 50 ఎకరాల్లో అక్రమ మైనింగ్ చేస్తుంటే ప్రభుత్వం ఏం చేస్తోందని నిలదీసింది. ఇసుక ధరను ఎలా నిర్ణయిస్తున్నారు....వినియోగదారులకు ఏవిధంగా సరఫరా చేస్తున్నారంటూ ఆరాతీసింది. ఇసుక ధర సామాన్యులకు అందుబాటులో ఉండేలా చూడాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని తేల్చిచెప్పింది. మండలస్థాయిలో

మిగతా 3వ పేజీలో...



2018 గ్రూప్-1 మెయిన్స్ రద్దు

- జవాబుపత్రాల మూల్యాంకనంలో అక్రమాలు
- ఏపీపీఎస్సీ చట్టనిబంధనలు అనుసరించలేదు
- మెయిన్స్ పరీక్ష తాజాగా నిర్వహించండి
- అభ్యర్థులకు 2 నెలల సమయం ఇవ్వాలి: హైకోర్టు
- ఎంపిక ప్రక్రియ 6 నెలల్లో పూర్తిచేయాలని ఆదేశం
- అక్రమాలతో లబ్ధి పొందిన వారిని గుర్తించడం సాధ్యంకాదు.. రద్దే ఉత్తమం: న్యాయమూర్తి

హైకోర్టు తీర్పుపై అప్పీలుకు వెళ్తాం: ఏపీపీఎస్సీ

అమరావతి, మార్చి 13(ఆంధ్రజ్యోతి): 2018లో ఇచ్చిన నోటిఫికేషన్ ఆధారంగా ఏపీపీఎస్సీ నిర్వహించిన గ్రూప్-1 మెయిన్స్ జవాబుపత్రాల మూల్యాంకనంలో అక్రమాలు చోటు చేసుకున్నాయని హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. గతంలో జరిగిన మెయిన్స్ పరీక్షను రద్దు చేస్తూ తీర్పు ఇచ్చింది. మూల్యాంకనం చేసేందుకు అనుసరించిన

మిగతా 3వ పేజీలో...

ఏపీపీఎస్సీ పరువు గంగపాలు!

- కొవిడ్ పేరుతో మొదట డిజిటల్ మూల్యాంకనం
- కోర్టు ఆదేశాలతో మళ్లీ మాన్యువల్‌గా.. అదీ రెండుసార్లు
- డిజిటల్, మాన్యువల్‌కు 62% తేడా.. మార్కులపై దాటవేత

3

పేద మహిళలకు ఏటా రూ.లక్ష



ప్రభుత్వోద్యోగాల్లో 50 శాతం వాటా

- ఆశా, అంగన్వాడీల వేతనాల పెంపు
- మధ్యాహ్న భోజన సిబ్బందికి కూడా
- దేశవ్యాప్తంగా ప్రతి జిల్లాలో సావిత్రిబాయి పూలే హాస్టళ్లు
- ఐదు 'మహిళా న్యాయ్' గ్యారెంటీలు
- మహారాష్ట్ర భారత్ జోడో న్యాయ్ యాత్రలో ప్రకటించిన రాహుల్‌గాంధీ

ధులే, మార్చి 13: కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్‌గాంధీ మహిళలకు ఐదు 'మహిళా న్యాయ్ గ్యారెంటీలు' ప్రకటించారు. లోక్‌సభ ఎన్నికల్లో తమ పార్టీ విజయం సాధిస్తే దేశవ్యాప్తంగా పేద మహిళలందరికీ రూ.లక్ష చొప్పున ఇస్తామన్నారు. ఈ మొత్తాన్ని వారి బ్యాంకు ఖాతాల్లో డిపాజిట్ చేస్తామని తెలిపారు. మహిళలకు ప్రభుత్వోద్యోగాల్లో 50 శాతం రిజర్వేషన్ కల్పిస్తామన్నారు. భారత్ జోడో న్యాయ్ యాత్రలో భాగంగా ఆయన మహారాష్ట్రలోని ధులేలో బుధవారం జరిగిన బహిరంగ సభలో ప్రసంగించారు. ఆశా వర్కర్లు, అంగన్వాడీ కార్యకర్తలు, మధ్యాహ్న భోజన పథకం సిబ్బంది వేతనాలను రెట్టింపు చేస్తామన్నారు. మహిళా హక్కులపై వారిలో చైతన్యం తీసుకురావడానికి, వారికి న్యాయపరంగా సాయం చేసేందుకు ఓ నోడల్ అధికారిని నియమిస్తామని చెప్పారు. మహిళల కోసం దేశవ్యాప్తంగా ప్రతి జిల్లాలో సావిత్రిబాయి పూలే హాస్టళ్లను నెలకొల్పుతామన్నారు. 'కన్యాకుమారి నుంచి శ్రీనగర్ వరకు ఇదివరకు నేను చేపట్టిన భారత్ జోడో యాత్రలో 4వేల కిలోమీటర్లు నడిచాను. లక్షల మంది ప్రజలతో సంభాషించాను. అన్యాయం కారణంగానే హింస, విద్వేషాలు రేగుతున్నాయని రైతులు, యువత, మహిళలు

మిగతా 2వ పేజీలో...

72 మందితో బీజేపీ రెండో జాబితా

నాడు 'హోదా'పైనే తగాదా!

బీజేపీతో ఉన్నప్పుడు అది తప్ప అన్నీ తెచ్చాం: చంద్రబాబు

- రాష్ట్రానికి కేంద్ర సహకారం కావాలి
- రాష్ట్రం కోసమే 3 పార్టీల పొత్తు
- విపక్షాలు విడివిడిగా పోటీ చేస్తే ఓట్లు చీలి గెలవొచ్చని జగన్ ఆశ
- దాని కోసం ఆయన ఎన్నో చేశారు
- తక్కువ సీట్లు తీసుకుంటున్నారని జనసేన, బీజేపీలను రెచ్చగొట్టారు
- ప్రజలు గెలవాలంటే వైసీపీ ఓడాలి
- మేమెవరం అహానికి పోలేదు
- జనం కోసం అందరం తగ్గాం: బాబు

అమరావతి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక హోదా విషయంలో తప్ప బీజేపీతో గతంలో తమకెలాంటి తగాదా లేదని టీడీపీ అధినేత, మాజీ సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. భావోద్వేగంతో హోదా అడిగామని.. బీజేపీతో ఉన్నప్పుడు అది తప్ప రాష్ట్రానికి అన్నీ తెచ్చామని చెప్పారు. రాష్ట్రానికి రావలసిన వాటి కోసం నిరంతరం ప్రయత్నం చేస్తూనే ఉంటామని, ప్రయత్నం మానేది లేదని తేల్చిచెప్పారు. బుధవారమిక్కడ ఉండవల్లిలోని తన నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. జగన్ విధ్వంస పాలనతో కుప్పకూలిన రాష్ట్రాన్ని తిరిగి నిలబెట్టడానికే మూడు పార్టీలం పొత్తు

మిగతా 11వ పేజీలో...



ఆడపిల్లల కోసం 'కలలకు రెక్కలు' వెబ్‌సైట్‌ను ప్రారంభించి, మాట్లాడుతున్న టీడీపీ అధినేత చంద్రబాబు

ఆడపిల్లలకు అండ

- వారి 'కలలకు రెక్కలు' ఇచ్చే దిశగా అడుగులు
- బ్యాంకు రుణాలకు ప్రభుత్వమే గ్యారెంటీ.. వడ్డీ కూడా పూర్తిగా మాఫీ
- విదేశీ చదువులతో పాటు ఏ కోర్సుకైనా సాయం
- ఫీజు రీయింబర్స్‌మెంట్ సహా ఇతర ప్రభుత్వ పథకాలకు ఇది అదనం
- లబ్ధిదారులపై పరిమితి లేదు.. ఎన్ని లక్షల మందికైనా ఇస్తాం: బాబు
- విద్యార్థినుల రిజిస్ట్రేషన్లు షురూ.. ఇప్పటికి 12 వేల మంది నమోదు

11

నేడు టీడీపీ రెండో జాబితా!

- 25 అసెంబ్లీ, 10 లోక్‌సభ పేర్లు ప్రకటించే చాన్స్
- మరో 10 స్థానాలకు జనసేన అభ్యర్థులు ఖరారు!
- బీజేపీలో 9 సీట్లపై కసరత్తు కొలిక్కి.. నేడు జాబితా

అరాచక పార్టీతో పోరాటం



- ఈ ఎన్నికల్లో కచ్చితంగా గెలిచి తీరాలి
- టీడీపీ, బీజేపీతో సమన్వయంతో వెళ్లాలి
- ఒత్తిళ్లు వస్తే వెంటనే పార్టీ దృష్టికి తేవాలి
- జనసేన అభ్యర్థులకు పవన్ దిశానిర్దేశం

అమరావతి, మార్చి 13(ఆంధ్రజ్యోతి): 'రాబోయే సార్వత్రిక ఎన్నికలు ఏపీ గతిని మారుస్తాయి. ఈ ఎన్నికల్లో మన కూటమి పోరాడుతున్నది అరాచకాన్ని, హింసను, కక్ష సాధింపునూ నమ్ముకున్న పార్టీతో అని మరచిపోవద్దు' అని జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. బుధవారం మంగళగిరి పార్టీ కార్యాలయంలో జనసేన అభ్యర్థులు, నాయకులతో ఆయన ముఖాముఖి మాట్లాడారు. పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. 'ఈ ఎన్నికల్లో మనం కచ్చితంగా గెలిచి తీరాలి. ఎన్నికల ప్రక్రియలో

మిగతా 11వ పేజీలో...

హోదాపై నోరు మూతపడిందేం?



- జగన్‌కు షర్మిల సూటి ప్రశ్న
- అభ్యర్థుల ఎంపికపై ఢిల్లీలో కసరత్తు
- కాంగ్రెస్ ఏపీ స్ర్కీనింగ్ కమిటీ భేటీ
- లోక్‌సభ, అసెంబ్లీ అభ్యర్థులపై చర్చ
- ఓటు బ్యాంకు పెంపే లక్ష్యం

11



అమెరికా అధ్యక్ష బరిలో మళ్లీ బైడెన్, ట్రంప్!

- ఇరువురి అభ్యర్థిత్వాల ఖరారు
- అధ్యక్ష ఎన్నికల్లో రెండోసారి రీమ్యాచ్

వాషింగ్టన్, మార్చి 13: అమెరికా అధ్యక్ష పీఠం కోసం జోబైడెన్, డొనాల్డ్ ట్రంప్ మళ్లీ పోటీ పడబోతున్నారు. రిపబ్లికన్ పార్టీ నుంచి ట్రంప్, డెమొక్రాటిక్ పార్టీ తరఫున బైడెన్ అభ్యర్థిత్వాలు ఖరారయ్యాయి. ఇరువురూ తమ పార్టీల నుంచి కావాల్సిన నామినేషన్లను కైవసం చేసుకున్నారు. జోబైడెన్‌కు 1,968 మంది ప్రతినిధుల మద్దతు అవసరం కాగా జార్జియాలో గెలుపుతో ఆయనకు మార్గం సుగమమైంది. ఇక వాషింగ్టన్, మిస్సిసిపీ, నార్తన్ మరియానా దీవుల్లోనూ బైడెన్ విజయం ఖాయమని పార్టీ వర్గాలు ధీమాగా ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే బైడెన్ మాట్లాడుతూ.. 'దేశ భవిష్యత్తును నిర్ణయించే అవకాశం ఓటర్ల చేతిలో ఉంది. ధైర్యంగా నిలబడి ప్రజాస్వామ్యాన్ని కాపాడతారా? లేదా కూల్చేందుకు

మిగతా 2వ పేజీలో...



నిరంకుశ పాలనకు 67% మంది సై

- దేశంలో నిరంకుశ, సైనిక పాలనకు పెరిగిన మద్దతు
- సైనిక పాలనకు 72% మంది ఓకే
- ప్యూ రిసెర్చ్ నివేదికలో వెల్లడి

2

22,217



ఐదేళ్లలో జారీ చేసిన ఎలక్టోరల్ బాండ్లు

- వాటిలో 22,030 బాండ్లను వివిధ రాజకీయ పార్టీలు నగదు రూపంలోకి మార్చుకున్నాయి
- మిగతా సొమ్ము పీఎం సహాయ నిధికి జమ
- సుప్రీంకోర్టుకు ఇచ్చిన అఫిడవిట్‌లో ఎస్‌బీఐ
- ఎస్‌సీబీఏ అధ్యక్షుడు రాష్ట్రపతికి రాసిన లేఖను ఖండించిన అసోసియేషన్ సభ్యులు
- ఎస్‌బీఐ నుంచి బాండ్ల వివరాలు అందాయి
- వాటిని గడువులోగా ప్రచురిస్తాం: సీఈసీ

న్యూఢిల్లీ, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల బాండ్లకు సంబంధించిన వివరాలు తెలుపుతూ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) బుధవారం సుప్రీంకోర్టుకు అఫిడవిట్ సమర్పించింది. 2019 ఏప్రిల్ 1 నుంచి.. ఈ కేసులో సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన 2024 ఫిబ్రవరి 15 వరకూ.. 22,217 ఎన్నికల బాండ్లను జారీ చేసినట్టు అందులో వెల్లడించింది. వాటిలో 22,030 బాండ్లను వివిధ రాజకీయ పార్టీలు నగదుగా మార్చుకున్నట్టు తెలిపింది. ఏ ఎలక్టోరల్ బాండ్‌ను ఎవరు కొన్నారు? ఏ రోజు కొన్నారు? దాని విలువ ఎంత? అనే వివరాలన్నింటినీ సుప్రీంకు సమర్పించిన అఫిడవిట్‌లో పొందుపరచినట్టు ఎస్‌బీఐ తెలిపింది. ఎన్నికల బాండ్లకు సంబంధించిన వివరాలను ఎన్నికల సంఘానికి

మిగతా 2వ పేజీలో...

కోర్టుకైతే వెంటనే చెప్పలేం.. కేంద్రం అడిగితే ఆగమేఘాలపై ఇచ్చేస్తాం!

- ఎన్నికల బాండ్ల వివరాలపై ఎస్‌బీఐ ధోరణి ఇదే
- గతంలో కేంద్ర ప్రభుత్వం అడిగిన 48 గంటల్లో సమర్పణ
- ఆధారాలతో సహా 'రిపోర్టర్స్ కలెక్టివ్' సంచలన వ్యాసం

2

కొణిజేడు ఇనుప ఖనిజం జిందాల్‌కే

- ప్రైవేటు సంస్థకు 89 శాతం వాటా ఇచ్చి సంయుక్త భాగస్వామిగా ఎంపిక చేసిన సర్కారు
- సొంత ఖనిజాలు కలిగిన ఏపీఎండీసీకేమో 11%
- కోడ్‌కు ముందే హడావుడిగా టెండరు ప్రక్రియ పూర్తి!
- ఇలాగే జరగనుందని ముందే చెప్పిన 'ఆంధ్రజ్యోతి'
- వాటాల నిర్ణయంలో రూల్స్ తప్పారని స్పష్టీకరణ
- త్వరలో జిందాల్‌తో జాయింట్ వెంచర్ ఒప్పందం
- తొలి నుంచీ గుట్టుగానే టెండర్ వివరాలు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ముడి ఇనుప ఖనిజం (ఐరన్ ఓర్) టెండర్లలో 'ఆంధ్రజ్యోతి' చెప్పిందే అక్షర సత్యమయింది. ప్రకాశం జిల్లా కొణిజేడు ఐరన్‌ఓర్ ప్రాజెక్టును జిందాల్ (జేఎస్‌డబ్ల్యూ)గ్రూప్‌నకు కట్టబెట్టారు. ఇటీవల నిర్వహించిన టెండర్లలో రెండు కంపెనీలు పాల్గొనగా, అందులో జిందాల్ ఏ1 బిడ్డర్‌గా నిలిచి టెండర్ దక్కించుకుంది. ఈ విషయాన్ని ఆంధ్రప్రదేశ్ ఖనిజాభివృద్ధి

మిగతా 12వ పేజీలో...



ఈసీల నియామకాలపై రేపు సుప్రీం అత్యవసర విచారణ

- 'నియామక బిల్లు'పై అభ్యంతరం వ్యక్తం చేస్తూ గతంలోనే పిటిషన్లు
- తాజాగా కోర్టుకు ఏడీఆర్

2

ఉత్తరాఖండ్‌లో ఉమ్మడి పౌరస్మృతి

- బహుభార్యత్వంపై నిషేధం
- బిల్లుకు రాష్ట్రపతి ముర్ము ఆమోదం
- చట్టంతో మహిళలకు ప్రత్యేక హక్కులు

2

అణు యుద్ధానికి సిద్ధం!



- కానీ..తొందరపడడం లేదు : పుతిన్
- ఉక్రెయిన్ మద్దతుగా అమెరికా సైన్యాన్ని మోహరిస్తే అణు యుద్ధం తప్పదు
- ఉక్రెయిన్‌తో చర్చలకు సిద్ధమని వెల్లడి

మాస్కో, మార్చి13: అణు యుద్ధానికి సాంకేతికంగా సిద్ధంగా ఉన్నామని, ఉక్రెయిన్‌కు మద్దతుగా అమెరికా తన సైన్యాన్ని పంపితే అణుయుద్ధం తప్పదని రష్యా అధ్యక్షుడు వ్లాదివిర్ పుతిన్ హెచ్చరించారు. ఈ నెల 15-17 మధ్య రష్యాలో అధ్యక్ష ఎన్నికలు జరగనున్నాయి. ఈ సందర్భంగా పుతిన్ స్థానిక మీడియాతో మాట్లాడుతూ.. రష్యా ప్రజలు తనకు మరో ఆరేళ్ల పదవీకాలం కట్టబెట్టడం ఖాయమన్నారు. అణు యుద్ధానికి రష్యా సాంకేతికంగా సిద్ధంగానే ఉందని, అయితే.. దానికోసం తాము తొందరపడడంలేదన్నారు. ఉక్రెయిన్‌పై అణ్వాయుధాలను ప్రయోగించాల్సిన అవసరం తమకు కనిపించడంలేదని చెప్పారు. 'ఒకవేళ ఉక్రెయిన్‌కు మద్దతుగా అమెరికా తన బలగాలను మోహరిస్తే ఈ చర్య ను నేరుగా యుద్ధంలో జోక్యం చేసుకున్నట్టు భావించి తీవ్రం గా పరిగణిస్తాం. దానికి తప్పక బదలిస్తాం. ప్రతి అంశం అణు యుద్ధం దిశగా పరుగులు తీస్తుందని నేను భావించడం లేదు. ఆ పరిస్థితి వస్తే మాత్రం మేం సిద్ధంగానే ఉన్నాం' అని పుతిన్ అన్నారు. 2022 ఫిబ్రవరిలో రష్యా సైనికులను ఉక్రెయిన్‌లోకి పంపి న పుతిన్ ఆ దేశంతో పూర్తిస్థాయి యుద్ధానికి తెరలేపారు. దీనిలో అమెరికా, ఐరోపా దేశాలు జోక్యం చేసుకుంటే యుద్ధం తీవ్రస్థాయికి చేరుతుందని, తాము అణ్వాయుధాలను కూడా వాడాల్సి వస్తుందని పుతిన్ ఇప్పటికే అనేకసార్లు హెచ్చరించారు. కాగా, ఉక్రెయిన్‌తో చర్చలు జరిపేందుకు రష్యా సుముఖంగానే ఉందని పుతిన్ చెప్పారు. ఒకవేళ అమెరికా అణు పరీక్ష లు నిర్వహిస్తే.. రష్యా అదే పనిచేస్తుందని హెచ్చరించారు.

అణ్వాయుధ సూపర్ పవర్

రష్యా ప్రపంచంలోనే అతిపెద్ద అణ్వాయుధ నిల్వ కలిగిన దేశం. ఫెడరేషన్ ఆఫ్ అమెరికన్ సైంటిస్ట్స్ (ఎఫ్ఏఎస్) నివేదిక ప్రకారం రష్యా వద్ద 5,580 అణ్వాయుధాలున్నాయి. వాటిలో 1,200 ఆయుధాలకు కాలం చెల్లినా మరో 4,380 ఆయుధాలను దీర్ఘకాలిక లాంచర్లు, స్వల్ప శ్రేణి వ్యూహాత్మక లాంచర్ల కోసం నిల్వ చేసి ఉంచారని ఎఫ్ఏఎస్ పేర్కొంది. రష్యా తన వద్ద ఉన్న వాటిలో ఇప్పటికే 1,710 వ్యూహాత్మక వార్‌హెడ్‌లను వివిధ ప్రాంతాల్లో మోహరించింది. సోవియట్ యూనియన్ పతనం అనంతరం రష్యా ఇంతవరకూ అణు పరీక్షలు నిర్వహించలేదు. కాగా రష్యా పేర్కొన్న 2020 అణు సిద్ధాంతం.. రష్యా అధ్యక్షుడు అణ్వాయుధాన్ని ఉపయోగించడాన్ని పరిగణించే పరిస్థితులను నిర్దేశిస్తుంది. దీని ప్రకారం శత్రు దేశాలు అణ్వాయుధాలు లేదా ఇతర మారణాయుధాలను ఉపయోగించి చేసే దాడులకు ప్రతిస్పందనగా అణు దాడికి దిగవచ్చు. లేదా దేశ ఉనికికే ముప్పు వాటిల్లినప్పుడు రష్యా అధ్యక్షుడు అణు దాడికి ఆదేశించవచ్చు.

ఈసీల నియామకాలపై రేపు సుప్రీం అత్యవసర విచారణ

న్యూఢిల్లీ, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న వేళ కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్(సీఈసీ), ఎన్నికల కమిషనర్ల (ఈసీ) నియామకాల అంశం మరోసారి తెరపైకి వచ్చింది. గతంలో కమిషనర్ అనూప్ చంద్ర పాండే పదవీ విరమణ చేయగా, ఇటీవల మరో కమిషనర్ అరుణ్ గోయెల్ అనూహ్యంగా రాజీనామా చేశారు. దీంతో ప్రస్తుతం కేంద్ర ఎన్నికల సంఘంలో ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ ఒక్కరే ఉన్నారు. దీంతో ఈనెల 15లోగా ఎన్నికల కమిషనర్ల పోస్టులను భర్తీ చేసేందుకు కేంద్రం కసరత్తు చేస్తోంది. ఈ క్రమంలోనే ఎన్నికల కమిషనర్ల నియామకాల ప్రక్రియపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ దాఖలైన పిటిషన్లపై ఈనెల 15న అత్యవసర విచారణకు అంగీకరిస్తూ సర్వోన్నత న్యాయస్థానం నిర్ణయం తీసుకుంది.

ఉత్తరాఖండ్ ఉమ్మడి పౌరస్మృతి.. రాష్ట్రపతి ఓకే

న్యూఢిల్లీ, మార్చి 13: ఉత్తరాఖండ్ అసెంబ్లీలో గత ఫిబ్రవరిలో ప్రవేశపెట్టిన ఉమ్మడి పౌరస్మృతి(యూనిఫామ్ సివిల్ కోడ్) బిల్లుకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము బుధవారం ఆమోద ముద్ర వేశారు. దీంతో యూసీసీకి చట్టబద్ధత పొందిన తొలి రాష్ట్రంగా ఉత్తరాఖండ్ నిలిచింది. ఈ చట్టం ప్రకారం గిరిజనులు తప్ప మిగతా పౌరులందరికీ మతాలకతీతంగా వివాహం, విడాకులు, వారసత్వ హక్కులు వంటి అంశాల్లో సమాన హక్కులు వర్తిస్తాయి. కాగా, సహజీవనం చేస్తున్న వారు రిజిస్టర్ చేసుకోవాలని అప్పుడే వారికి పుట్టబోయే పిల్లలకి రక్షణ ఉంటుందని, రిజిస్టర్ చేసుకోని వారు చట్టపరంగా శిక్షార్హులని యూసీసీలో పొందుపరిచారు.

నిధుల ఫ్రీజ్ కేసులో కాంగ్రెస్‌కు లభించని ఊరట

న్యూఢిల్లీ, మార్చి 13: ఆదాయపన్ను శాఖ అధికారులు కాంగ్రెస్ పార్టీ బ్యాంకు ఖాతాలోని రూ.105 కోట్ల నిధులను ఫ్రీజ్ చేసిన వ్యవహారంపై మరోసారి ఇన్‌కమ్ ట్యాక్స్ అప్పిలేట్ ట్రిబ్యునల్(ఐటీఏటీ)నే ఆశ్రయించాలని ఢిల్లీ హైకోర్టు తేల్చి చెప్పింది. ఇప్పటికే ట్రిబ్యునల్ ఇచ్చిన ఆదేశాలపై స్టే ఇచ్చేందుకు నిరాకరించింది. ఐటీఏటీ ఇచ్చిన ఆదేశాలను కూడా సమర్థించింది. ఈ మేరకు జస్టిస్ యశ్వంత్‌వర్మ, జస్టిస్ పురుషైంద్రకుమార్ కౌరవ్ ధర్మాసనం బుధవారం తీర్పు వెలువరించారు.

ప్రపంచంలోనే తొలి ఏఐ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్

- అమెరికా కంపెనీ కాగ్నిషన్ సృష్టి



వాషింగ్టన్, మార్చి 13: ప్రపంచంలోనే మొట్టమొదటిసారిగా ఏఐతో పని చేసే సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌ను రూపొందించినట్లుగా అమెరికాకు చెందిన కాగ్నిషన్ కంపెనీ ప్రకటించింది. దానికి డెవిన్ అని పేరు పెట్టింది. వేలాది నిర్ణయాలతో ముడిపడిన సంక్లిష్టమైన పనులను కూడా డెవిన్ చేయగలదని తెలిపింది. 'ఈ కృత్రిమ మేథో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కొత్త విషయాల్ని నేర్చుకోగలదు. తప్పులను సవరించగలదు. సాఫ్ట్‌వేర్ నిపుణుడు చేసే అన్ని పనులను నిర్వర్తించే విధంగా డెవిన్‌లో షెల్, కోడ్ ఎడిటర్, బ్రౌజర్ వంటి డెవలపర్ టూల్స్‌ను నిక్షిప్తం చేశాం. వీటన్నిటిలోకి ముఖ్యమైనది.. తన యూజర్ (వినియోగదారు)తో కలిసి పని చేయగల సామర్థ్యాన్ని దీనికి కల్పించాం. తాను చేస్తున్న పనిలో ప్రగతిని డెవిన్ ఎప్పటికప్పుడు తెలియజేస్తుంది. వచ్చే సూచనలను, సలహాలను స్వీకరించి పనితీరును మెరుగుపర్చుకుంటుంది' అని కాగ్నిషన్ వివరించింది.

బరిలో గడ్కరీ, గోయల్

- 72 మందితో బీజేపీ రెండో జాబితా

న్యూఢిల్లీ, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థుల రెండో జాబితాను బీజేపీ విడుదల చేసింది. ఈసారి 72 సీట్లకు అభ్యర్థులను ప్రకటించింది. బుధవారం విడుదల చేసిన జాబితాలో కేంద్ర మంత్రులు నితిన్ గడ్కరీ (నాగపూర్), ప్రహ్లాద్ జోషీ (ధార్వాడ్), పీయూష్ గోయల్ (ముంబై నార్త్), అనురాగ్ ఠాకూర్ (హమీర్‌పూర్)లకు చోటు దక్కింది. హరియాణా మాజీ సీఎం మనోహర్ లాల్ ఖట్టర్ కర్నాల్ లోక్‌సభ నుంచి బరిలో దిగనున్నారు. ఉత్తరాఖండ్ మాజీ సీఎం త్రివేంద్రసింగ్ రావత్ (హరిద్వార్), కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మై (హవేరీ)కు కూడా చోటు దక్కింది. కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి యడ్యూరప్ప తనయుడు రాఘవేంద్ర.. షిమోగా నుంచి నిలవనున్నారు. దేశంలో మొత్తం 543 లోక్‌సభ స్థానాలు ఉన్నాయి. తొలి జాబితాలో 195 మంది అభ్యర్థులను ప్రకటించిన బీజేపీ ఇప్పటికి 267 స్థానాలకు బీజేపీ అభ్యర్థులను ప్రకటించినట్లయింది. రెండో జాబితాలో తెలంగాణలో 6స్థానాలకు అభ్యర్థులను ఖరారుచేసింది. ఆదిలాబాద్ (ఎస్టీ) నుంచి నగేశ్, పెద్దపల్లి (ఎస్సీ)-జి.శ్రీనివాస్, మెదక్-రఘునందన్‌రావు, మహబూబ్‌నగర్-డీకే అరుణ, నల్లగొండ-శానంపూడి సైదిరెడ్డి, మహబూబాబాద్ (ఎస్టీ)లో అజ్మీరా సీతారాం నాయక్ పోటీచేయనున్నారు. ఇంకా ఖమ్మం, వరంగల్ అభ్యర్థులను ఖరారు చేయాల్సి ఉంది.

దేశంలో నిరంకుశ, సైనిక పాలనకు మద్దతు

- ప్యూ రిసెర్చ్ నివేదికలో వెల్లడి

న్యూఢిల్లీ, మార్చి 13: మన దేశంలో పాలన ఎలా ఉండాలన్న దానికి సంబంధించి తాజాగా అమెరికాకు చెందిన మేథో సంస్థ నిర్వహించిన ఒక సర్వే వివరాలు చర్చనీయాంశంగా మారాయి. మూడింట రెండు వంతులకు పైగా భారతీయులు దేశంలో నిరంకుశ లేదా సైనిక పాలనకు మద్దతు ఇస్తున్నట్టు ప్యూ రిసెర్చ్ సెంటర్ నిర్వహించిన సర్వేలో వెల్లడైంది. సర్వే జరిపిన 24 దేశాల్లో ఇది భారత్‌లోనే అత్యధికం కావడం గమనార్హం. ఈ దేశాల్లో గత ఏడాది ఫిబ్రవరి 20 నుంచి మే 22 వరకు 30,861 మంది నుంచి అభిప్రాయాలు తీసుకుని నివేదిక రూపొందించారు. ఈ సర్వే నివేదిక ఈ ఏడాది ఫిబ్రవరి 28న ప్రచురితమైంది. దీని ప్రకారం సర్వేలో పాల్గొన్న భారతీయుల్లో 67 శాతం మంది నిరంకుశ పాలనకు, 72% మంది సైనిక పాలనకు మద్దతు తెలిపారు. ప్రాతినిధ్య ప్రజాస్వామ్యానికి మద్దతు తగ్గింది. భారత్‌లో ఎలాంటి న్యాయపరమైన, చట్టపరమైన జోక్యం లేకుండా ఒక 'బలమైన నాయకుడి' పాలనకు మద్దతు 2017లో 55 శాతం ఉండగా.. 2023లో ఇది 67 శాతానికి పెరిగింది.

అమెరికా అధ్యక్ష బరిలో మళ్లీ బైడెన్, ట్రంప్!

(మొదటి పేజీ తరువాయి)

అనుమతినిస్తారా? మన భద్రత, స్వేచ్ఛను కాపాడే హక్కు పునరుద్ధరిస్తారా? లేదా వాటిని దూరం చేసేవారికి అవకాశమిస్తారా..?' అని వ్యాఖ్యానించారు. ఇటు ట్రంప్ కూడా వాషింగ్టన్‌లో గెలుపుతో తనకు కావాల్సిన 1,215 మంది ప్రతినిధుల మద్దతును సంపాదించుకున్నారు. చివరి వరకు ట్రంప్‌కు పోటీగా ఉన్న నిక్కీ హేలీ కూడా వైదొలిగిన సంగతి తెలిసిందే. ఈ ఏడాది నవంబరులో అధ్యక్ష పీఠం ఎన్నికలు జరగనున్నాయి. బైడెన్, ట్రంప్.. ఎన్నికల్లో రెండో సారి తలపడనుండటం ఆసక్తిగా మారింది. అయితే అధ్యక్ష ఎన్నికల చరిత్రలో రీమ్యాచ్ జరగడం (వరుసగా రెండుసార్లు ఒకే అభ్యర్థుల పోటీ) ఇదే రెండోసారి. అంతకుముందు 2020లోనూ బైడెన్, ట్రంప్‌లే పోటీపడ్డారు. 1952 అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ల నుంచి డ్వైట్ ఐసెన్‌హోవర్, డెమొక్రాట్ల నుంచి అడ్లై స్టీవెన్‌సన్-2 పోటీ పడగా.. 1956 ఎన్నికల్లోనూ వారే బరిలో నిలిచారు.

కోర్టుకైతే వెంటనే చెప్పలేంగానీ..

కేంద్రం అడిగితే ఆగమేఘాలపై ఇచ్చేస్తాం.. ఎన్నికల బాండ్ల వివరాలపై ఎస్‌బీఐ ధోరణి

- గతంలో సర్కారు అడిగిన 48గంటల్లో సమర్పణ
- ఆధారాలతో 'రిపోర్టర్స్ కలెక్టివ్' వ్యాసం



న్యూఢిల్లీ, మార్చి 13: ఎన్నికల బాండ్ల వివరాలు మార్చి 6లోగా ఈసీకి సమర్పించాలని ఫిబ్రవరి 15న సుప్రీంకోర్టు ఆదేశిస్తే..'అదంతా చాలా శ్రమతో కూడుకున్న పని. దాతలు, గ్రహీతల వివరాలు సరిపోల్చి చూడడానికి కొన్ని నెలల సమయం పడుతుంది. అంచేత గడువును జూన్ 30 దాకా పొడిగించండి' అని కోరిన ఎస్‌బీఐ.. గతంలో అవే వివరాలను కేంద్రం కోరితే ఆగమేఘాలపై ఇచ్చింది తెలుసా? నిబంధనల ప్రకారం జారీ చేసిన ఎన్నికల బాండ్‌ను 15 రోజుల్లోగా పార్టీలు నగదుగా మార్చుకోకపోతే ఆ మొత్తం పీఎం జాతీయ సహాయనిధికి జమకావాల్సి ఉండగా.. ఒక సందర్భంలో ఎక్స్‌పైరీ తేదీ తర్వాత కూడా ఒక పార్టీ ఆ బాండ్లను నగదుగా మార్చుకోవడానికి సహకరించిందని తెలుసా? ఎస్‌బీఐ కోర్టుకు చెబుతున్నవన్నీ వట్టి సాకులేనని.. తల్చుకుంటే అతి తక్కువ సమయంలోనే అడిగిన వివరాలను సమర్పించగలదని తెలుసా? దీనికి సంబంధించి లోకేశ్ బాత్రా అనే సామాజిక కార్యకర్త సేకరించిన అనేక ఆధారాలతో 'ద రిపోర్టర్స్ కలెక్టివ్' వెబ్‌సైట్ తన బ్లాగులో ఒక సంచలన వ్యాసాన్ని ప్రచురించింది. ఎస్‌బీఐ నిజ స్వరూపాన్ని బయటపెట్టింది. 2019, 2020సంవత్సరాల్లో జారీ అయిన ఎన్నికల బాండ్ల గడువు ముగిసిన 48 గంటల్లోపు వాటి వివరాలను దేశంలోని అన్ని బ్రాంచ్‌ల నుంచి సేకరించి కేంద్ర ఆర్థిక శాఖకు సమర్పించిందని అందులో పేర్కొంది. ఇలా బాండ్ల షెల్ఫ్ లైఫ్ ముగిసిన ప్రతిసారీ కేంద్రానికి వాటి పూర్తి సమాచారాన్ని (దాత, గ్రహీత, బాండ్ల విలువ తదితర వివరాలు) అందజేసిందని వెల్లడించింది. 2020 వరకూ ఎస్‌బీఐ అలా ఇచ్చిన సంగతి నిజమేనని తమ విచారణలో తేలినట్టు తెలిపింది. రిపోర్టర్స్ కలెక్టివ్ వ్యాసం ప్రకారం.. జారీ అయ్యే ప్రతి బాండుకు ఆడిట్ ట్రయల్‌ను ఎస్‌బీఐ నిర్వహించేది. అంటే.. ఆ బాండ్లను కొన్నదెవరు? నగదుగా మార్చుకున్న పార్టీ ఏది? తదితర వివరాలు. ప్రతి బాండుపై ఉండే సీరియల్ నంబర్‌తో ఎస్‌బీఐ వాటి పరిస్థితిని ట్రాక్ చేసేది. 2018లో కేంద్రం ఈ స్కీమ్‌ను ప్రవేశపెట్టినప్పుడే.. ఇలా సీరియల్ నంబర్ ఉండాలని ఎస్‌బీఐ పట్టుబట్టింది. దీంతో ట్రాకింగ్ సులువవుతుంది. వాస్తవం ఇలా ఉండగా.. ఎస్‌బీఐ సుప్రీంకోర్టులో ఇందుకు భిన్నమైన వాదన వినిపించింది. బాండ్లను కొన్నవారి వివరాలు ఒకచోట, గ్రహీతల వివరాలు వేరొకచోట ఉంటాయని.. దేశంలోని అన్ని ఎస్‌బీఐ బ్రాంచ్‌ల్లో అమ్ముడైన బాండ్లు, గ్రహీతల వివరాలు సీల్డ్ కవర్లలో ముంబైలోని ప్రధాన కార్యాలయానికి వస్తాయని.. విరాళాలు ఇచ్చినవారి వివరాలను గోప్యంగా ఉంచేందుకు ఆ వివరాలనూ విడివిడిగా ఉంచుతామని.. కాబట్టి ఆ రెంటింటినీ జోడించి ఇవ్వడానికి సమయం పడుతుందన్నది ఎస్‌బీఐ వాదన. కానీ..'నో యువర్ కస్టమర్ (కేవైసీ)' ద్వారా, పైకి కనిపించని సీరియల్ నంబర్ల ద్వారా ఎన్నికల బాండ్లను కొన్నవారి వివరాలను ఎస్‌బీఐ సేకరించగలదని, వాటిని వారు ఏ పార్టీకిచ్చారో తెలుసుకోగలదని కేంద్ర ఆర్థిక శాఖే తన అంతర్గత పత్రాల్లో ఒకదాంట్లో పేర్కొనడంగమనార్హం. కాగా ఎన్నికల బాండ్లకు సంబంధించి ఎస్‌బీఐ కేంద్రంతో ఎంత కలిసికట్టుగా పనిచేయగలదో 'రిపోర్టర్స్ కలెక్టివ్' తన వ్యాసంలో వివరించింది. 2018లో ఒక పార్టీ ఎస్‌బీఐ న్యూఢిల్లీ శాఖను సంప్రదించి, తమ వద్ద గడువుతేదీ ముగిసిన బాండ్లు కొన్ని ఉన్నాయని, వాటిని నగదుగా మార్చుకోవడానికి అవకాశమివ్వాలని కోరింది. ఆ బ్రాంచ్ అధికారులు ముంబైలోని 'ట్రాన్సాక్షన్ బ్యాంకింగ్ యూనిట్'ను సంప్రదించగా ఆ విభాగం ఆ బాండ్లు ఎవరు కొన్నారు? ఏ పార్టీకిచ్చారు తదితర వివరాలన్నింటినీ క్షణాల్లో సేకరించి..ఆ సమాచారాన్ని కేంద్ర ఆర్థిక శాఖ అధికారుల ముందు పెట్టారు. అప్పుడు ఎస్‌బీఐ కార్పొరేట్ ఆఫీసు రంగంలోకి దిగి.. ఏంచేయాలో చెప్పాలని సలహా అడిగింది. తక్షణమే స్పందించిన కేంద్ర ఆర్థికశాఖ.. ఆ బాండ్లను నగదుగా మార్చుకునేందుకు సదరు రాజకీయ పార్టీని అనుమతించాలని సూచించింది. దీంతో ఎస్‌బీఐ కార్పొరేట్ ఆఫీసు మెరుపువేగంతో స్పందించి.. గడువు ముగిసిపోయిన బాండ్లను మార్చుకునే అవకాశాన్ని సదరుపార్టీకి కల్పించాలని ఢిల్లీ బ్రాంచ్‌కు ఆదేశాలిచ్చింది. ఈ ప్రక్రియ 24 గంటల్లో జరిగిందంటే ఎస్‌బీఐ, కేంద్రం ఎంత సమన్వయంతో పనిచేస్తున్నాయో అర్థం చేసుకోవచ్చు. నాడు ఆ బాండ్లను సొమ్ము చేసుకోవడానికి వచ్చిన పార్టీ ఏదో ఎస్‌బీఐ రికార్డుల్లో, కేంద్ర ఆర్థికశాఖ రికార్డుల్లోనూ లేదు. ఒక్కొక్కటీ రూ.కోటి విలువైన 10బాండ్లను ఎవరు ఎప్పుడు కొన్నారో, వాటిని సొమ్ము చేసుకున్న పార్టీ ఏదో ఎస్‌బీఐకి, కేంద్ర ఆర్థిక శాఖకు తెలుసు.

వెంటనే ఇవ్వగలదు..

ఎన్నికల బాండ్ల వివరాలివ్వడానికి ఎస్‌బీఐకి నెలల తరబడి సమయం అక్కర్లేదని, వెంటనే ఇవ్వగలదని.. 2017, 2018లో ఈ పథకం అమల్లో కీలకంగా వ్యవహరించిన విశ్రాంత అధికారి సుభాష్ చంద్రగార్గ్ తెలిపారు. సీనియర్ జర్నలిస్ట్ బర్ఖాదత్‌కు చెందిన 'మోజోస్టోరీ' యూట్యూబ్ చానల్‌కు ఆయన ఇంటర్వ్యూ ఇచ్చారు. దాంట్లో ఆయన సుప్రీంకోర్టు అడిగిన సమాచారాన్ని ఇవ్వడానికి ఏ పరిస్థితుల్లో అయినా ఎస్‌బీఐకి అంత సమయం పట్టదని తేల్చిచెప్పారు.

లోకం తీరు



ఐదేళ్లలో 22,217 బాండ్లు

(మొదటి పేజీ తరువాయి)

సమర్పించాలంటూ ఫిబ్రవరి 15న తాము ఇచ్చిన తీర్పు అమలుపై తీసుకున్న చర్యల గురించి వివరిస్తూ ఎస్‌బీఐ చైర్మన్, ఎండీ అఫిడవిట్ దాఖలు చేయాలంటూ సుప్రీంకోర్టు సోమవారం ఆదేశించింది. ఈమేరకు ఎస్‌బీఐ చైర్మన్ దినేశ్‌కుమార్ ఖారా ఈ అఫిడవిట్‌ను కోర్టుకు సమర్పించారు. తాము జారీ చేసిన ఎలక్టోరల్ బాండ్లను ఏ పార్టీ, ఏ తేదీన నగదుగా మార్చుకుందనే వివరాలను ఈసీకి సమర్పించినట్టు అఫిడవిట్‌లో పేర్కొన్నారు. దాని ప్రకారం.. 2019 ఏప్రిల్1 నుంచి ఏప్రిల్11 నడుమ 3,346 ఎన్నికల బాండ్లు జారీ చేయగా వాటిలో 1,609 బాండ్లను పార్టీలు నగదుగా మార్చుకోగా.. 2019 ఏప్రిల్12 నుంచి 2024 ఫిబ్రవరి15 నడుమ 18,871 బాండ్లు జారీ కాగావాటిలో 20,421 బాండ్లను పార్టీలు నగదు చేసుకున్నాయి. ఎలక్టోరల్ బాండ్లను పొందిన రాజకీయ పార్టీలు వాటిని 15రోజుల్లోగా నగదుగా మార్చుకోకుంటే ఆమొత్తం ప్రధానమంత్రి జాతీయ సహాయ నిధికి బదిలీ చేయాల్సి ఉంటుంది. ఈమేరకు.. పార్టీలు నగదుగా మార్చుకోని 187బాండ్లను రిడీమ్ చేసి పీఎం జాతీయ సహాయనిధికి జమచేసినట్టు ఎస్‌బీఐ తన అఫిడవిట్‌లో పేర్కొంది. కాగా.. ఎలక్టోరల్ బాండ్లు రాజ్యాంగవిరుద్ధమని దేశ అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పుపై ప్రెసిడెన్షియల్ రిఫరెన్స్ కోరాలంటూ సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ (ఎస్‌సీబీఏ) అధ్యక్షుడు ఆదిష్ సి అగర్వాలా.. రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు లేఖ రాయడాన్ని బార్ అసోసియేషన్ ఖండించింది. అధ్యక్షుడు అలా లేఖ రాయడానికి తామెలాంటి అధికారమూ ఇవ్వలేదని.. అందులో ఆయన వెలిబుచ్చిన అభిప్రాయాలను తాము సమర్థించట్లేదని అందులో తేల్చిచెప్పింది. ఆదిష్ సి అగర్వాలా లేఖ.. సుప్రీంకోర్టు అధికారాలను తగ్గించేలా ఉందని, దాన్ని తాము నిర్ద్వంద్వంగా ఖండిస్తున్నామని పేర్కొంది. కాగా ఎస్‌బీఐ నుంచి ఎన్నికల బాండ్ల వివరాలు అందాయని, వాటిని సుప్రీం ఆదేశాల మేరకు నిర్ణీతసమయంలోగా తమ వెబ్‌సైట్‌లో ప్రచురిస్తామని సీఈసీ రాజీవ్‌కుమార్ జమ్మూలో తెలిపారు.

సీఎఫ్‌డీ వినతిపై నిర్ణయం తీసుకోండి

- కేంద్ర ఎన్నికల సంఘానికి హైకోర్టు ఆదేశం

అమరావతి, మార్చి 13(ఆంధ్రజ్యోతి): వలంటీర్లను ఎన్నికల సంబంధ విధులకు దూరంగా ఉంచాలని కేంద్ర ఎన్నికల సంఘం ఇచ్చిన ఉత్తర్వులను ఉల్లంఘించడంపై సిటిజన్ ఫర్ డెమోక్రసీ సంస్థ సమర్పించిన వినతిని పరిగణలోకి తీసుకొని మూడు వారాల్లో తగిన నిర్ణయం తీసుకోవాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని హైకోర్టు ఆదేశించింది. వ్యాజ్యాన్ని పరిష్కరించింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ ఆర్.రఘునందనరావుతో కూడిన ధర్మాసనం బుధవారం ఆదేశాలిచ్చింది. వలంటీర్లను ఎన్నికల విధులకు దూరంగా ఉంచాలని ఈసీ ఇచ్చిన ఉత్తర్వులను ఉల్లంఘిస్తున్నా, చీఫ్ ఎలక్టోరల్ అధికారి ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారని, ఈ వ్యవహారంపై తాము సమర్పించిన వినతిని పరిగణలోకి తీసుకొని తగిన చర్యలు తీసుకొనేలా కేంద్ర ఎన్నికల సంఘాన్ని ఆదేశించాలని కోరుతూ సిటిజన్ ఫర్ డెమోక్రసీ (సీఎఫ్‌డీ) కార్యదర్శి నిమ్మగడ్డ రమేశ్‌కుమార్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యం బుధవారం విచారణకు రాగా పిటిషనర్ తరఫున న్యాయవాది ఎస్.అశ్వనీకుమార్ వాదనలు వినిపించారు.

ఎన్నికల విధుల్లో వలంటీర్లు పాల్గొనకుండా నిరోధించండి

- హైకోర్టులో పిల్... విచారణ 20కి వాయిదా
- విషయాన్ని తేల్చాల్సింది ఎన్నికల సంఘం: మరో బెంచ్

రాష్ట్రంలో ఏ రాజకీయ పార్టీ కార్యకలాపాల్లో పాల్గొనకుండా, గ్రామ-వార్డు సచివాలయ వలంటీర్లను నిలువరించాలని, వారు ఎన్నికల విధుల్లో పాల్గొనకుండా నిరోధించాలని కోరుతూ కడపజిల్లా, రాజంపేటకు చెందిన షేక్ అబుబాకర్ సిద్ధిఖీ దాఖలు చేసిన పిల్ మార్చి 20కి వాయిదా పడింది. బుధవారం వ్యాజ్యం విచారణకు రాగా అడ్వకేట్ జనరల్ ఎస్.శ్రీరామ్ స్పందిస్తూ... వలంటీర్ల నియామకాన్ని సవాల్ చేస్తూ 2019లో పిల్ దాఖలైందన్నారు. హైకోర్టు విచారణ జరిపి దానిని పరిష్కరించిందన్నారు. వలంటీర్లతో ముడిపడిన మరో వ్యాజ్యం ఢిల్లీ హైకోర్టులో పెండింగ్‌లో ఉందన్నారు. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది ఉన్నం మురళీధరరావు వాదనలు వినిపిస్తూ.. ఎన్నికల సంబంధ విధులకు వలంటీర్లను దూరంగా ఉంచాలని ఈసీ ఇచ్చిన ఆదేశాలు అమలు కావడం లేదన్నారు. ప్రతిఇంటికీ వెళ్లి వైసీపీ తరఫున ప్రచారం చేయాలని వలంటీర్లకు బహిరంగంగా పిలుపు ఇచ్చారన్నారు. ఈ దశలో ధర్మాసనం కలగజేసుకుంటూ వలంటీర్ల వ్యవహారంలో ఈ కోర్టు గతంలో ఇచ్చిన ఉత్తర్వులను పరిశీలించాలని సీనియర్ న్యాయవాదికి సూచించింది. తరువాత పిల్‌పై విచారణ కొనసాగిస్తామని స్పష్టం చేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ ఆర్.రఘునందనరావుతో కూడిన ధర్మాసనం ఆదేశాలిచ్చింది.

సీఎం ప్రసంగం రాజ్యాంగ విరుద్ధమని ఎలా ప్రకటిస్తాం?

ప్రభుత్వ కార్యక్రమాల్లో సీఎం జగన్ రాజకీయ ప్రసంగం చేయడంతో పాటు వైసీపీ తరఫున ప్రచారం చేయాలని వలంటీర్లను కోరడాన్ని సవాల్ చేస్తూ బాపట్ల జిల్లా అన్నంబొట్లవారిపాలెంకి చెందిన చెన్నుపాటి సింగయ్య వేసిన పిల్‌ను హైకోర్టు కొట్టివేసింది. సీఎం ప్రసంగాన్ని రాజ్యాంగ విరుద్ధమని ఎలా ప్రకటించగలమని కోర్టు ప్రశ్నించింది. ఈ మేరకు సీజే జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ ఆర్.రఘునందనరావుతో కూడిన ధర్మాసనం బుధవారం ఆదేశాలిచ్చింది.

అన్నీ వదిలేశారు!

- వైసీపీ కార్యకర్తలను మించి మరీ వలంటీర్ల పార్టీ సేవలు
- ఒంగోలులో పార్టీ కండువాలతో మంత్రి సురేశ్‌కు స్వాగతం
- పలు చోట్ల ఎన్నికల ర్యాలీల్లో కూడా
- పెద్దిరెడ్డి ఇలాకాలో చీరల పంపిణీ

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

ప్రజలకు సేవ చేయాల్సిన వలంటీర్లు ఎన్నికల వేళ అధికార పార్టీకి కార్యకర్తల కన్నా ఎక్కువైపోయారు. నిన్న మొన్నటి వరకు గుట్టుగా వైసీపీకి సేవ చేసినవారు.. ఇప్పుడు తమనెవరు ప్రశ్నిస్తారులే అన్న ధీమాతో ఏకంగా పార్టీ కండువాలు కప్పేసుకుని, వైసీపీ జెండాలు పట్టేసుకుని రంగంలోకి దిగిపోతున్నారు. మంత్రులకు స్వాగతాల నుంచి అధికార పార్టీ నేతల ప్రచారాల వరకు ఎందెందు చూసినా వలంటీర్లే కనిపిస్తున్నారు.

- ప్రకాశం జిల్లా కొండపి మండలం చోడవరంలో మంత్రి ఆదిమూలపు సురేశ్ బుధవారం గ్రామ సచివాలయాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా చోడవరంలో మహిళా వలంటీర్లు వైసీపీ కండువాలు మెడలో వేసుకుని, ఆ పార్టీ జెండాలు పట్టుకుని మంత్రికి స్వాగతం పలికారు. అనంతరం ఆయనతో సెల్ఫీలు దిగారు.
- కాకినాడ జిల్లా రౌతులపూడి గ్రామానికి చెందిన వలంటీరు గొంపా గోవింద్ 12న వైసీపీ ఆవిర్భావ దినోత్సవం నేపథ్యంలో రౌతులపూడి మండలం చార్లంకలోని జలపాతంవద్ద వైసీపీ జెండాను పట్టుకుని గెంతులేశాడు. దీనికి సంబంధించిన వీడియో జగన్‌పై కూర్చిన పాటను జోడించి సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు.



పుంగనూరు సచివాలయం నుంచి చీరలు తీసుకొస్తున్న వలంటీరు

- శ్రీసత్యసాయి జిల్లా కదిరిలో వైసీపీ అభ్యర్థి మక్బూల్ బాషాతో కలిసి పలువురు గ్రామ వలంటీర్లు, ఉపాధి పథకం ఫీల్డ్ అసిస్టెంట్లు, ప్రభుత్వ మద్యం దుకాణాల సూపర్‌వైజర్లు ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. పోలేవాండ్లపల్లి, బాలేపల్లి తండా, పూజలకుంటపల్లి, రాజంవాండ్లపల్లి, రాజంవాండ్లపల్లి తండాలో జరిగిన ప్రచారాల్లో వలంటీర్లు పాల్గొన్నారు.
- శ్రీకాకుళం జిల్లా పాతపట్నంలో వైసీపీ ఎమ్మెల్యే రెడ్డిశాంతి 1500 మందికి తాయిలాలు పంపిణీ చేశారు. తొలి విడతగా రూ.10వేల చొప్పున ఇచ్చినట్లు తెలుస్తోంది. వలంటీర్ల పరిధిలో ఉన్న 50 ఇళ్లతో పాటు అదనంగా ఓట్లు తీసుకురావాలని సూచించినట్లు సమాచారం.
- మంత్రి పెద్దిరెడ్డి ప్రాతినిధ్యం వహించే చిత్తూరు జిల్లా పుంగనూరులో వార్డు సచివాలయం నుంచే వలంటీర్ల ద్వారా మహిళలకు చీరల పంపిణీ చేపట్టారు. వలంటీర్లను అధికారులే పిలిపించి వీటిని అందజేశారు. ఈ విషయం తెలిసి సోషల్ డెమక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా జిల్లా అధ్యక్షుడు జమీర్‌లాల్ 16వ వార్డు సచివాలయానికి వెళ్లి వలంటీర్లను ప్రశ్నించారు. అయితే, నీకెందుకు చెప్పాలంటూ వలంటీర్లు ఎదురు తిరిగారు. ప్రభుత్వ కార్యాలయం నుంచే ఎన్నికల తాయిలాలు పంపిణీ అవుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని జమీర్‌లాల్ ఆవేదన వ్యక్తం చేశారు.



మెడలో వైసీపీ కండువాలతో మంత్రి సురేశ్ వెంట నడుస్తున్న వలంటీర్లు

టీడీపీలో చేరిన వలంటీర్లు

మచిలీపట్నం టౌన్, మార్చి 13: వలంటీర్లకు కూడా వైసీపీపై నమ్మకం సడలుతోంది. దీంతో వలంటీర్లు, గృహ సారథులు వైసీపీకి రాంరాం చెబుతున్నారు. కృష్ణా జిల్లాలో నలుగురు వాలంటీర్లు, ఒక గృహసారథి బుధవారం టీడీపీ నేత, మాజీ మంత్రి కొల్లు రవీంద్ర సమక్షంలో టీడీపీలో చేరారు. మచిలీపట్నం కార్పొరేషన్ పరిధిలోని 39వ డివిజన్‌కు చెందిన గృహసారథి ఆనంద్ ఫణికుమార్, వలంటీర్లు వెంకట కృష్ణ, చంద్రకళ, సునీత, కనకమహాలక్ష్మి టీడీపీ కండువా కప్పుకొన్నారు.

పేద మహిళలకు ఏటా లక్ష!

(మొదటి పేజీ తరువాయి)

నాతో చెప్పారు. అందుకే రెండో యాత్ర పేరులో న్యాయ్ అనే పదాన్ని జోడించాం. మోదీ ప్రభుత్వం పారిశ్రామికవేత్తలకు రూ.16 లక్షల కోట్ల మేర మాఫీచేసింది. కానీ రైతులు, యువత రుణాలను మాఫీ చేయలేదు. ఇంతకంటే పెద్ద అన్యాయం మరొకటి ఉండదు. విధాన నిర్ణయాల్లో, వనరుల పంపిణీలో అన్ని కులాలు, వర్గాలకు వారి వారి జనాభా ప్రాతిపదికన భాగస్వామ్యం కల్పించాలని కాంగ్రెస్ ప్రతిపాదిస్తోంది. లోక్‌సభ, అసెంబ్లీల్లో మూడో వంతు రిజర్వేషన్‌కు సంబంధించి కేంద్రం మహిళలను మోసగించింది. సదరు బిల్లును ఆమోదించినా పదేళ్ల తర్వాత అమలు చేస్తామంటోంది. మా ప్రభుత్వం వస్తే తక్షణమే మహిళా కోటాను అమలు చేస్తుంది' అని హామీ ఇచ్చారు. ఆర్వీ పట్టణంలో వాహనంపై నుంచి ఆయన మాట్లాడుతూ.. లోక్‌సభ ఎన్నికల్లో ఈవీఎంల ద్వారా కాకుండా బ్యాలెట్ పేపర్ల ద్వారా జరగాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారని తెలిపారు. 'ఈవీఎం హటావో' అని వారు అంటుంటే ఎన్నికల సంఘం వినడం లేదన్నారు. ఎన్నికల ముంగిట ఇటీవల ఓ ఎన్నికల కమిషనర్ రాజీనామా చేశారని.. కచ్చితంగా ఏదో తప్పు జరిగిందని వ్యాఖ్యానించారు. బీజేపీకి వచ్చే ఎన్నికల్లో 400 సీట్లు వస్తేనే రాజ్యాంగాన్ని మార్చగలమని కర్ణాటక బీజేపీ ఎంపీ అనంతకుమార్ హెగ్డే చేసిన వ్యాఖ్యలపై స్పందిస్తూ.. రాజ్యాంగాన్ని మార్చే శక్తి ప్రపంచంలో ఎవరికీ లేదన్నారు. ఇక్కడ మాట్లాడడం పూర్తయ్యాక కొందరు పిల్లలను రాహుల్ జీపు బాయ్‌నెట్ వద్దకు పిలిచారు.

ఖర్చులకు డబ్బుల్లేవు: ఖర్గే

కలబుర్గి(కర్ణాటక), మార్చి 13: కాంగ్రెస్ పార్టీ తీవ్ర నిధుల కొరతను ఎదుర్కొంటోందని ఆ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అన్నారు. ప్రజలు విరాళాలుగా ఇచ్చిన డబ్బులు ఉంచిన కాంగ్రెస్ బ్యాంకు ఖాతాలను బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం స్తంభింపజేసిదని చెప్పారు. దీంతో ప్రస్తుతం ఖర్చు చేయడానికి తమ వద్ద డబ్బులు లేవన్నారు. ఐటీ విభాగం కూడా తమ పార్టీపై భారీగా జరిమానాలు విధించిందని వాపోయారు. బుధవారం ఆయన కర్ణాటకలోని కలబుర్గిలో నిర్వహించిన బహిరంగ సభలో మాట్లాడారు. సుప్రీంకోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ ఎలక్టోరల్ బాండ్ల ద్వారా తమకు వచ్చిన రూ.వేల కోట్ల వివరాలు వెల్లడించడానికి బీజేపీ సిద్ధంగా లేదని ఆరోపించారు. వారి తప్పుడు పనులు బయట పడతాయి కాబట్టే జూలై వరకూ సమయం అడిగారని ఖర్గే ధ్వజమెత్తారు.

బడుగులే మా పథకాల లబ్ధిదారులు

- 'పీఎం-సూరజ్' పోర్టల్ ప్రారంభంలో మోదీ
- అసోంలో 1, గుజరాత్‌లో 2 సెమీకండక్టర్ పరిశ్రమలకు వర్చువల్‌గా శంకుస్థాపన

న్యూఢిల్లీ, మార్చి 13: తమ ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో అత్యధిక లబ్ధిదారులు ఎస్సీలు, ఎస్టీలు, ఓబీసీలేనని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. కానీ గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఈ వర్గాలను నిర్లక్ష్యం చేసిందని, దేశాభివృద్ధిలో వారి పాత్రను గుర్తించలేదని విమర్శించారు. బుధవారం ఆయన 'పీఎం-సూరజ్' జాతీయ పోర్టల్‌ను ప్రారంభించారు. దేశవ్యాప్తంగా ఎస్సీలు, బీసీలకు రుణ సహాయం అందించడం 'పీఎం-సూరజ్' పోర్టల్ లక్ష్యం. ఇప్పటి వరకు లక్ష మందికి రూ.720 కోట్ల రుణాలు అందజేశామని మోదీ చెప్పారు. కాగా, అసోంలోని మోరీగా జిల్లాలో, గుజరాత్‌లోని ధోలేరా, సానంద్‌లో రెండు సెమీకండక్టర్ ప్లాంట్లకు మోదీ వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. 'మేడ్ ఇన్ ఇండియా' సెమీకండక్టర్ చిప్ ఎంతో దూరంలో లేదని, ఇది భారత్ స్వయంసమృద్ధిలో కీలకపాత్ర పోషిస్తుందన్నారు. ఈ పరిశ్రమలతో దేశ యువత లబ్ధి పొందుతుందన్నారు. కాగా, ధోలేరా ప్లాంట్ శంకుస్థాపనలో కేంద్ర టెలికాం, ఐటీ శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ పాల్గొన్నారు. ఈ ఏడాది చివరిల్లా సానంద్ ప్లాంట్ నుంచి, 2026 చివరికల్లా ధోలేరా ప్లాంట్ నుంచి చిప్‌లు తయారై బయటకొస్తాయని తెలిపారు. 2029 కల్లా సెమికండక్టర్ల తయారీలో టాప్-5 దేశాల్లో భారత్ ఉంటుందన్నారు.

ఏపీపీఎస్సీ పరువు గంగపాలు!

గ్రూప్-1 మెయిన్స్ నిర్వహణలో విఫలం

అమరావతి, మార్చి 13(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) పరువు గంగలో కలిసిపోయింది. కీలకమైన గ్రూప్-1 మెయిన్స్ పరీక్షల ప్రక్రియను పూర్తిచేయడంలో కమిషన్ దారుణంగా విఫలమైంది. చివరికి హైకోర్టు జోక్యం చేసుకుని ఏపీపీఎస్సీ తీరును ఎండగట్టే పరిస్థితిని తెచ్చుకుంది. మెయిన్స్ ప్రశ్నపత్రాలను మూల్యాంకనం చేయడంలో కమిషన్ తీరును ధర్మాసనం తీవ్రంగా తప్పుబట్టింది. ఇప్పటికే జగన్ ప్రభుత్వంలో నిర్వహించిన గ్రామ, వార్డు సచివాలయాల పరీక్షల్లో అవకతవకలు జరిగినట్లు పెద్దఎత్తున ఆరోపణలు రాగా, ఇప్పుడు గ్రూప్-1లోనూ అదే సీన్ రిపీట్ అయింది.

అసలేం జరిగిందంటే...

169 పోస్టుల భర్తీ కోసం టీడీపీ ప్రభుత్వం 2018లో గ్రూప్-1 నోటిఫికేషన్ జారీచేసింది. 2019 మే నెలలో ప్రిలిమ్స్ జరిగింది. ఆ తర్వాత వైసీపీ ప్రభుత్వం మెయిన్స్ నిర్వహణను ఆలస్యం చేసింది. ప్రిలిమ్స్ నుంచి 1:50 నిష్పత్తిలో అభ్యర్థులను ఎంపిక చేసి, 2020 డిసెంబరులో మెయిన్స్ నిర్వహించింది. 2018లో ఇచ్చిన నోటిఫికేషన్‌లో మెయిన్స్ పరీక్షల మూల్యాంకనం కన్వెన్షనల్ (సంప్రదాయ) విధానంలో ఉంటుందని పేర్కొన్నారు. అంటే మాన్యువల్(చేతితో దిద్దే)గానే మూల్యాంకనం జరగాలి. కానీ కొవిడ్ కారణంగా అంతమంది ఒకే చోట కూర్చుంటే ఇబ్బంది అవుతుందనే కారణాన్ని చూపించిన ఏపీపీఎస్సీ.. డిజిటల్ విధానంలో మూల్యాంకనం పూర్తిచేసి, ఫలితాలు ప్రకటించింది. మెయిన్స్ రాసిన వారినుంచి 1:2 నిష్పత్తిలో ఇంటర్వ్యూలకు ఎంపిక చేశారు. స్పోర్ట్స్ కోటా పోగా 326 మంది ఇంటర్వ్యూలకు ఎంపికైనట్లు ఏపీపీఎస్సీ తెలిపింది. అయితే నోటిఫికేషన్‌లో సంప్రదాయ విధానం అని పేర్కొని, డిజిటల్‌గా ఎలా చేస్తారంటూ కొందరు అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించారు. విచారణ అనంతరం మాన్యువల్ విధానంలోనే మూల్యాంకనం చేయాలని కోర్టు ఆదేశించింది. దీంతో రెండోసారి మూల్యాంకనం చేయగా అందులో ఏకంగా 62శాతం మంది అభ్యర్థులు మారిపోయారు. డిజిటల్‌గా పేపర్లు దిద్దినప్పుడు ఎంపికైన 326 మందిలో, 202 మంది మాన్యువల్ మూల్యాంకనంలో అనర్హులయ్యారు. దీంతో మళ్లీ కొందరు అభ్యర్థులు కోర్టును ఆశ్రయించారు. మాన్యువల్ మూల్యాంకనాన్ని ఒకసారి చేయాలని హైకోర్టు ఆదేశిస్తే రెండుసార్లు చేశారని అభ్యర్థులు వాదించారు. అందువల్లే 62శాతం మంది మారిపోయినట్లు ఆరోపించారు. ఈ వాదనలను పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు మొత్తం మెయిన్స్ పరీక్షనే రద్దు చేసింది.

తుది మార్కుల్లో గోప్యత

గ్రూప్-1 పరీక్షల తుది ఫలితాలను 2022 జూలై 5న ఏపీపీఎస్సీ చైర్మన్ గౌతం సవాంగ్ ప్రకటించారు. ఇంటర్వ్యూలకు ఎంపికైన అభ్యర్థులు భారీగా మారిపోవడంపై విలేకరులు ప్రశ్నించగా.. 'ఎక్కడా రీవాల్యుయేషన్ అనేది ఉండదు. ఒకసారి మూల్యాంకనం చేసిన పేపరును, రెండోసారి మరొకరు చేస్తే ఎంతో కొంత వ్యత్యాసం వస్తుంది' అని సమర్థించుకున్నారు. కానీ 62శాతం మంది ఎందుకు మారిపోయారనే దానికి ఆయన సమాధానమివ్వలేదు. అభ్యర్థులు తుది మార్కుల వివరాలు తర్వాత ఇస్తామన్న ఆయన ఎన్నిసార్లు అడిగినా మార్కులు మాత్రం వెల్లడించలేదు. ఏపీపీఎస్సీ పరీక్షలన్నీ పారదర్శకం అని ప్రకటించుకుంటూనే మార్కులను మాత్రం రహస్యంగా ఉంచారు.

రెండుసార్లు మాన్యువల్‌గా...

మెయిన్స్ పరీక్ష పేపర్లను రెండుసార్లు మాన్యువల్‌గా ఎందుకు మూల్యాంకనం చేశారనేది అంతుపట్టడం లేదు. డిజిటల్ మూల్యాంకనాన్ని తప్పుబట్టిన హైకోర్టు మాన్యువల్‌గా చేయాలని ఆదేశించడంతో, దాన్ని ఆసరాగా తీసుకున్న ఏపీపీఎస్సీ రెండుసార్లు మాన్యువల్ విధానంలో మూల్యాంకనం చేసింది. దీన్ని అభ్యర్థులు ప్రధానంగా సవాల్ చేశారు. తమకు కావాల్సినవారి కోసమే ఇలా రెండోసారి మూల్యాంకనం చేశారని ఆరోపించారు. అంతా పారదర్శకం అంటూ ఇంతకాలం ఏపీపీఎస్సీ మభ్యపెడుతూ రాగా ఇప్పుడు హైకోర్టు ఆదేశాలతో మొత్తం వ్యవహారం బయటపడింది. డిప్యూటీ కలెక్టర్లు, డీఎస్పీ పోస్టులను అమ్ముకున్నారని ప్రతిపక్షాలు, నిరుద్యోగులు మొదటినుంచీ ఆరోపిస్తున్నారు. ఇందులో రూ.150 కోట్ల స్కాం జరిగిందని టీడీపీ ఆరోపిస్తోంది.

సీబీఐ విచారణ జరిపించాలి: నిరుద్యోగ జేఏసీ

గ్రూప్-1 మెయిన్స్‌లో అక్రమాల వెనుక ప్రభుత్వ పెద్దల హస్తం ఉందని నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ షేక్ సిద్ధిక్ ఆరోపించారు. ఒకే ప్రశ్నపత్రాన్ని రెండుసార్లు మూల్యాంకనం చేయాల్సిన అవసరం ఏమిటని ప్రశ్నించారు. మెయిన్స్‌లో అక్రమాలు జరిగాయని హైకోర్టు తీర్పుతో స్పష్టమైందని, దీనిపై సీబీఐ విచారణ జరిపించి, వాస్తవాలు వెలికి తీయాలని ఆయన డిమాండ్ చేశారు.

ఏపీపీఎస్సీని భ్రష్టుపట్టించిన జగన్

▸ హైకోర్టు తీర్పు ప్రభుత్వానికి చెంపపెట్టు: లోకేశ్



మంగళగిరి సిటీ, మార్చి 13: ఏపీపీఎస్సీని సీఎం జగన్ వైసీపీఎస్సీగా మార్చేసి భ్రష్టుపట్టించారని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ మండిపడ్డారు. 2018 గ్రూపు-1 మూల్యాంకనంలో అవకతవకలను నిర్ధారిస్తూ మెయిన్స్‌ను రద్దు చేస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని బుధవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో ఆయన పేర్కొన్నారు. హైకోర్టు తీర్పు వైసీపీ ప్రభుత్వానికి చెంపపెట్టు లాంటిదన్నారు. జగన్ ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు 2.3 లక్షలకు పైగా ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తానని, ఏటా జాబ్ కేలెండర్ విడుదల చేస్తానని హామీ ఇచ్చి నిరుద్యోగ యువతను దారుణంగా మోసగించారని ధ్వజమెత్తారు. జాబ్ కేలెండర్ బదులు సాక్షి కేలెండర్ చేతిలో పెట్టాడని ఎద్దేవా చేశారు. గ్రూప్-1 పేపర్ల మూల్యాకనాన్ని ఇష్టారాజ్యంగా నిర్వహించి నిరుద్యోగుల ఉసురు పోసుకున్నారని దుయ్యబట్టారు. ఎటువంటి అర్హతలు లేకపోయినా వైసీపీ నేతలు, జగన్ బంధువులు ఏపీపీఎస్సీ సభ్యులుగా చేరి మొత్తం పరీక్షల వ్యవస్థను, మూల్యాంకనం, ఇంటర్వ్యూ పద్ధతులకు పాతరేశారని మండిపడ్డారు. 49వేల ఓఎంఆర్ షీట్లు మార్చేశారని నిరుద్యోగ జేఏసీ, విద్యార్థి సంఘాలు చేస్తున్న ఆరోపణలపై జగన్ ప్రభుత్వం మౌనం వహించడం వెనుక ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. త్వరలో ప్రజా ప్రభుత్వం ఏర్పడుతుందని, కోర్టు ఆదేశాలకు అనుగుణంగా ప్రభుత్వ ఉద్యోగాలన్నీ పారదర్శకంగా భర్తీ చేస్తామని లోకేశ్ భరోసా ఇచ్చారు.

2018 గ్రూప్-1 మెయిన్స్ రద్దు

(మొదటి పేజీ తరువాయి)

విధానం చట్ట నిబంధనలకు విరుద్ధమని స్పష్టం చేసింది. జవాబుపత్రాలను పలుమార్లు మూల్యాంకనం చేయడం ఏపీపీఎస్సీ నిబంధనల్లోని రూల్ 3(9)కి విరుద్ధమని పేర్కొంది. మెయిన్స్‌లో అర్హులుగా పేర్కొంటూ 2022 మే 26న ఏపీపీఎస్సీ విడుదల చేసిన జాబితాను రద్దు చేసింది. తాజాగా మెయిన్స్ పరీక్ష నిర్వహించి, నిబంధనలకు అనుగుణంగా జవాబుపత్రాలు మూల్యాంకనం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం, ఏపీపీఎస్సీని ఆదేశించింది. అభ్యర్థులు పరీక్షకు సిద్ధమయ్యేందుకు కనీసం రెండునెలల సమయం ఇవ్వాలని స్పష్టం చేసింది. ఎంపిక ప్రక్రియను ఆరునెలల్లో పూర్తి చేయాలని తేల్చిచెప్పింది. ఇప్పటికే పోస్టింగ్ తీసుకున్న అభ్యర్థులు కోర్టు ఇచ్చే తుది తీర్పుకి కట్టుబడి ఉంటామని, భవిష్యత్తులో చట్టబద్ధమైన హక్కు కోరబోమని అఫిడవిట్ సమర్పించారని గుర్తు చేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు బుధవారం తీర్పు ఇచ్చారు. 2018లో ఇచ్చిన నోటిఫికేషన్ ఆధారంగా ఏపీపీఎస్సీ నిర్వహించిన గ్రూప్-1 మెయిన్స్ పరీక్ష జవాబుపత్రాల మూల్యాంకనంలో భారీగా అక్రమాలు చోటు చేసుకున్నాయని, ఆ ప్రక్రియను రద్దు చేయాలని కోరుతూ పలువురు అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించారు. డిజిటల్ మూల్యాంకనంలో 326 మందిని ఏపీపీఎస్సీ అర్హులుగా తేల్చిందని, ఆ తరువాత నిర్వహించిన మాన్యువల్ మూల్యాంకనంలో అందులో 202మందిని అనర్హులుగా పేర్కొన్నారన్నారు. జవాబుపత్రం ఒకటే అయినప్పుడు 62శాతం మంది ఎలా అనర్హులు అవుతారని ప్రశ్నించారు. ఈ వ్యాజ్యాలపై హైకోర్టు పలు దఫాలుగా విచారణ జరిపింది. గ్రూప్-1 ప్రధాన పరీక్షలో ఎంపికైన అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి, ఎంపిక ప్రక్రియను కొనసాగించేందుకు ఏపీపీఎస్సీకి అనుమతిస్తూ 2022 జూన్ 24 హైకోర్టు ద్విసభ్య ధర్మాసనం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఫలితాల ప్రకటన, పోస్టింగ్ ఆర్డర్స్ ఇచ్చినట్లైతే... అవి ప్రధాన వ్యాజ్యాల్లో కోర్టు ఇచ్చే తుది తీర్పునకు లోబడి ఉంటాయిని స్పష్టంగా పేర్కొంది. అదే విషయాన్ని పోస్టింగ్ ఆర్డర్స్‌లోనూ ప్రస్తావించాలని ఏపీపీఎస్సీకి నిర్దేశించింది. అలాగే కోర్టు ఇచ్చే తుది తీర్పుకి కట్టుబడి ఉంటామని, ఉద్యోగాలకు ఎంపికైన నేపథ్యంలో భవిష్యత్తులో చట్టబద్ధమైన హక్కు కోరబోమని పోస్టింగ్ తీసుకున్న అభ్యర్థుల నుంచి హామీపత్రం తీసుకోవాలని కమిషన్‌ను ఆదేశించింది. ఈ నేపథ్యంలో ప్రధాన వ్యాజ్యాలపై హైకోర్టు సింగిల్ జడ్జి సుదీర్ఘ విచారణ జరిపి బుధవారం తీర్పు వెల్లడించారు.

తీర్పులో ఏముందంటే...

'మాన్యువల్ మూల్యాంకనం కోసం అవసరమైన కంట్రోల్ బండిల్ స్లిప్స్ రూపకల్పన, ముద్రణ, సరఫరా కోసం డేటాటెక్ కంపెనీకి ఏపీపీఎస్సీ 2021 నవంబంలో రూ.17,936 చెల్లించింది. హాయ్‌ల్యాండ్‌లోని ఆవాసా రిసార్ట్‌లో 2021 డిసెంబరు 5 నుంచి 2022 ఫిబ్రవరి 26 తేదీల మధ్య మొదటిసారి మాన్యువల్ మూల్యాంకనం చేసినట్లు పిటిషనర్లు తగిన ఆధారాలను కోర్టు ముందు ఉంచారు. రిసార్ట్‌లో మూల్యాంకనం ఏర్పాట్లు చేసినందుకు రూ.20.6లక్షలు చెల్లించారు. ఈ చెల్లింపులపై స్పష్టత ఇవ్వడంలో ఏపీపీఎస్సీ విఫలమైంది. రెండోసారి మాన్యువల్ మూల్యాంకనం చేసేందుకు అవసరమైన 49,000 ఓఎంఆర్ బార్‌కోడ్ షీట్ల ప్రింటింగ్, సరఫరా నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం 2022 ఫిబ్రవరి 25న డేటాటెక్ సంస్థకు ఆర్డర్ ఇచ్చింది. అందుకుగాను రూ.3.34 లక్షలు చెల్లించారు. అదే ఏడాది మార్చి 25 నుంచి మే 25 తేదీల మధ్య రెండోసారి మాన్యువల్‌గా మూల్యాంకనం చేశారు. కోర్టు ముందుంచిన వివరాలను పరిశీలిస్తే రెండుసార్లు మాన్యువల్ విధానంలో మూల్యాంకనం చేసినట్లు స్పష్టమవుతోంది. ఇలా ఎందుకు చేయాల్సి వచ్చిందో రాష్ట్ర ప్రభుత్వం, ఏపీపీఎస్సీకే కారణాలు తెలియాలి. మూల్యాంకనంలో అక్రమాలు చోటుచేసుకున్నాయని పిటిషనర్లు సమర్పించిన ఆధారాలు రుజువు చేస్తున్నాయి. డిజిటల్ విధానంలో మూల్యాకనం విధానాన్ని తప్పుపట్టిన హైకోర్టు మాన్యువల్ విధానంలో జవాబుపత్రాలు దిద్దాలని ఆదేశాలు ఇచ్చిన తరువాత రాష్ట్ర ప్రభుత్వం, ఏపీపీఎస్సీ మరిన్ని అవకతవకలకు పాల్పడ్డాయి. అవే ఎంపిక ప్రక్రియను ప్రశ్నించడానికి ఆస్కారం కల్పించాయి. ఏపీపీఎస్సీ, రాష్ట్ర ప్రభుత్వం తీరుతో జవాబుపత్రాల మూల్యాంకనం నిష్పాక్షికంగా, న్యాయబద్ధంగా జరగలేదు. డిజిటల్, మాన్యువల్ విధానంలో పలుసార్లు మూల్యాంకనం చేయడం ద్వారా ప్రతిభావంతులైన అభ్యర్థులను అనుర్హులుగా ప్రకటించి ఏపీపీఎస్సీ, రాష్ట్ర ప్రభుత్వం తమకు నచ్చినవారిని ఎంపిక చేసే ఆస్కారం ఉంది. ప్రజల్లో విశ్వాసం పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం, దాని యంత్రాంగాలు పరీక్షల నిర్వహణలో స్వచ్ఛత పాటించాలి. మాన్యువల్ మూల్యాంకనంలో అక్రమాలకు పాల్పడి లబ్ధిపొందిన వ్యక్తులను గుర్తించడం సాధ్యం కాదు. ఈ నేపథ్యంలో పరీక్షను రద్దు చేయడమే ఉత్తమం. మెయిన్స్‌లో అర్హులుగా పేర్కొంటూ 2022 మే 26న ఏపీపీఎస్సీ ఇచ్చిన జాబితాను రద్దు చేస్తున్నాం. తాజాగా మెయిన్స్ నిర్వహించి, జవాబుపత్రాలను నిబంధనలకు అనుగుణంగా మూల్యాంకనం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం, ఏపీపీఎస్సీని ఆదేశిస్తున్నాం' అని న్యాయమూర్తి తీర్పులో పేర్కొన్నారు.

హైకోర్టు తీర్పుపై అప్పీలుకు వెళ్తాం: ఏపీపీఎస్సీ

2018 గ్రూప్-1 నోటిఫికేషన్ మెయిన్స్ పరీక్షలను రద్దు చేస్తూ బుధవారం హైకోర్టు ఇచ్చిన తీర్పుపై అప్పీలుకు వెళ్తామని ఏపీపీఎస్సీ ప్రకటించింది. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేసింది. మధ్యాహ్నం తీర్పు వెలువడగానే అప్పీలుకు వెళ్తామంటూ ప్రభుత్వ అనుకూల మీడియాలో వార్తలు వచ్చాయి. ఏపీపీఎస్సీకి బదులుగా ప్రభుత్వం చేస్తున్న హడావిడిపై అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో అప్పీలుకు వెళ్తామంటూ బుధవారం రాత్రి క్లుప్తంగా ఒక్క వాక్యంతో ఏపీపీఎస్సీ ప్రకటన ఇచ్చింది.

మెయిన్స్ రద్దు ఇదే తొలిసారి

సివిల్ సర్వీసెస్ తర్వాత గ్రూప్-1 ఉద్యోగాలే కీలకంగా భావిస్తారు. గ్రూప్-1 నుంచి ఐఏఎస్ అయ్యే అవకాశాలు ఉండటంతో ఈ పోస్టులకు విపరీతమైన పోటీ ఉంటుంది. అలాంటి పోస్టుల భర్తీలో అత్యుత్సాహంతో ఏపీపీఎస్సీ అభాసుపాలైంది. డిజిటల్ మూల్యాంకనాన్ని హైకోర్టులో సవాల్ చేయాలని ప్రభుత్వ పెద్దలే ప్రోత్సహించారన్న ఆరోపణలూ ఉన్నాయి. గతంలో ఎప్పుడూ గ్రూప్-1 మెయిన్స్ రద్దు చేసిన దాఖలాలు లేవని అభ్యర్థులు చెబుతున్నారు. రాష్ట్ర విభజన తర్వాత ఇలా పరీక్షల నిర్వహణ విఫలం కావడం ఇదే తొలిసారి.

'పదేళ్లు ఉమ్మడి రాజధాని హైదరాబాద్' పిల్ కొట్టివేత

▸ చట్టం చేయాలని పార్లమెంట్‌ను ఎలా ఆదేశించగలం?

▸ మాకూ పరిమితులున్నాయి: హైకోర్టు వ్యాఖ్య

అమరావతి, మార్చి 13(ఆంధ్రజ్యోతి): ఏపీ తెలంగాణ రాష్ట్రాలకు హైదరాబాద్‌ను మరో పదేళ్లు ఉమ్మడి రాజధానిగా కొనసాగించేందుకు చట్టం తెచ్చేలా కేంద్ర హోంశాఖను ఆదేశించాలంటూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని హైకోర్టు బుధవారం కొట్టివేసింది. చట్టం చేయాలని పార్లమెంట్‌ను తాము ఎలా ఆదేశించగలమని ప్రశ్నించింది. తమకూ కొన్ని పరిమితులు ఉన్నాయని పేర్కొంది. ఆదేశాలివ్వడం పిల్ దాఖలు చేసినంత తేలిక కాదని వ్యాఖ్యానించింది. ఈ వ్యవహారంలో జోక్యం చేసుకోలేమని పేర్కొంటూ పిల్‌ను కొట్టివేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ ఆర్.రఘునందనరావుతో కూడిన ధర్మాసనం బుధవారం ఆదేశాలిచ్చింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు హైదరాబాద్‌ను మరో పదేళ్లు ఉమ్మడి రాజధానిగా కొనసాగించేందుకు చట్టం తెచ్చేలా కేంద్ర హోంశాఖను ఆదేశించాలని కోరుతూ ఉమ్మడి కృష్ణా జిల్లా, ఇబ్రహీంపట్నానికి చెందిన ప్రజాసంక్షేమ సేవ సంఘం కార్యదర్శి పొదిలి అనిల్‌కుమార్ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. ఈ వ్యాజ్యం బుధవారం విచారణకు రాగా పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.... హైదరాబాద్ పదేళ్లు ఉమ్మడి రాజధానిగా కొనసాగుతుందని ప్రకటించిన గడువు ఈ ఏడాది జూన్ 2తో ముగుస్తుందని తెలిపారు. ఏపీ పునర్విభజన చట్టంలో నిర్దేశించిన చట్టబద్ధమైన విధులు నిర్వర్తించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. దీంతో రెండు రాష్ట్రాల మధ్య ఆస్తులు, అప్పులు తొమ్మిదో షెడ్యూల్‌లో పేర్కొన్న కంపెనీలు, కార్పోరేషన్ల ఆస్తుల విభజన పూర్తి కాలేదని తెలిపారు. వివాదాలు పరిష్కారమయ్యేవరకు మరో పదేళ్లపాటు హైదరాబాద్‌ను ఉమ్మడి రాజధానిగా కొనసాగిస్తూ చట్టం చేసేలా కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరారు. ఈ వాదనలు పరిగణలోకి తీసుకున్న ధర్మాసనం.. చట్టం చేయాలని పార్లమెంట్‌ను తాము ఎలా ఆదేశించగలమని ప్రశ్నించింది. వ్యాజ్యాన్ని కొట్టివేస్తున్నట్లు ప్రకటించింది.

సచివాలయ ఉద్యోగులకు రాజకీయ రంగు పులమొద్దు

▸ వెంకట్రామిరెడ్డిపై ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం ఫైర్

అమరావతి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): గ్రామ,వార్డు సచివాలయ ఉద్యోగులకు రాజకీయ రంగు పులమొద్దని ఏపీజీఈఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి పై ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దేవరపల్లి సురేష్ మండిపడ్డారు. ఉద్యోగులపై రాజకీయ ముద్ర పడితే క్షేత్రస్థాయిలో ప్రజల నుంచి తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయని బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ఉద్యోగులతో వెంకట్రామిరెడ్డి రాజకీయ ర్యాలీలు సరికాదని, సీఎం జగన్ మెప్పుకోసం ఆయన వేరే మార్గం ఎంచుకోవాలని హితవు పలికారు.

కన్నతండ్రే కాలయముడు!

▸ భార్యపై అనుమానంతో కూతురి గొంతు కోశాడు

▸ కర్నూలు జిల్లాలో దారుణం



చిన్నారి వర్షిణి

కోసిగి, మార్చి 13: కన్నతండ్రే కాలయముడిగా మా రాడు.. ఇప్పుడప్పుడే చిట్టి చిట్టి మాటలతో.. బుడిబుడి అడుగులతో ఇంట్లో సందడి చేస్తున్న కన్నకూతురిని కర్కశంగా గొంతుకోసి హతమార్చాడు. ఈ సంఘటన కర్నూలు జిల్లా కోసిగి మండల పరిధిలోని జంపాపురంలో బుధవారం చోటుచేసుకుంది. జంపాపురం ఎస్సీ కాలనీలో కగల్లు శాంతి కుమార్, ఆశీర్వాదమ్మలకు మూడేళ్ల క్రితం పెళ్లయింది. వీరికి 18 నెలల వర్షిణి అనే కూతురు ఉంది. తండ్రి శాంతకుమార్ భార్య ఆశీర్వాదమ్మపై అనుమానం పెంచుకుని.. వర్షిణి తనకు పుట్టలేదని, తన భార్య అక్రమ సంబంధం కొనసాగిస్తోందనే అనుమానంతో ఆ పాపను మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత కత్తితో గొంతుకోసి హత్య చేశాడు. నిద్రలేచి చూసిన తల్లి ఆశీర్వాదమ్మ బిడ్డ కనిపించకపోవడంతో ఇంటి పరిసరాల్లో కంగారుగా వెతికింది. పశువుల పాకలో రక్తపుమడుగులో ఉన్న చిన్నారి వర్షిణిని చూసి కుప్పకూలింది. తండ్రే హత్య చేసినట్లు గుర్తించిన గ్రామస్థులు శాంతికుమార్‌ను ఓ గదిలో బంధించారు. బుధవారం ఉదయం సీఐ ప్రసాద్, ఏఎస్ఐ నాగరాజు ఘటనా స్థలికి చేరుకుని, నిందితుడిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. భార్యపై అనుమానంతోనే తన కుమార్తెను హత్య చేసినట్లు నిందితుడు ఒప్పుకున్నట్లు సీఐ ప్రసాద్ తెలిపారు.

గీతాంజలిది హత్యా.. ఆత్మహత్యా?!

▸ అన్ని కోణాల్లో పరిశీలిస్తున్నామన్న పోలీసులు

▸ ఘటన స్థలంలో ఫోన్, ఆధారాల కోసం అన్వేషణ

తెనాలి/తెనాలి క్రైమ్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా తెనాలికి చెందిన గీతాంజలి ఆత్మహత్యకు పాల్పడిందా! లేక ఆమెను హత్య చేసేందుకు ఎవరైనా ప్రయత్నించారా? ఇంతకీ ఆమె ఫోన్ ఏమైంది? ఘటనా స్థలంలో లేదంటే ఎవరికి దొరికి ఉంటుంది? అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు మొదలుపెట్టారు. ఈ నెల 4న ఆమె జగనన్న కాలనీలో ఇంటి పట్టా తీసుకున్న వీడియో వైరల్ అయింది. ఆ తర్వాత 7న తెనాలి రైల్వేస్టేషన్ ఉత్తరం వైపు క్యాబిన్ దగ్గర్లో రైలు కింద పడబోగా తలకు గాయమై అపస్మారక స్థితికి వెళ్లిన గీతాంజలిని గుంటూరు సర్వజనాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ 9న ఆమె మరణించారు. వైద్యశాల నుంచి వచ్చిన సమాచారం ఆధారంగా రైల్వే పోలీసులు కేసు నమోదుచేశారు. విచారణలో భాగంగా బుధవారం తెనాలి డీఎస్పీ నేతృత్వంలోని బృందం ఘటనా స్థలాన్ని పరిశీలించింది. జనసంచారం తక్కువగా ఉండే ప్రదేశం కావటంతో ఆత్మహత్య చేసుకునేందుకు గీతాంజలి అక్కడికి వచ్చి ఉంటే చాలా నెమ్మదిగా వస్తున్న రైలుకు ఎదురు ఎందుకు వెళ్లి ఉంటుందనే అనుమానాలను పోలీసులు వ్యక్తం చేశారు. ఫోన్ మాట్లాడుతూ వెళ్లి అనుకోకుండా ప్రమాదానికి గురయిందా అనే కోణంలో భాగంగా ఆమె ట్రాక్‌పై ఎటునుంచి ఎటువైపు పడిపోయిందో కూడా పరిశీలించారు. ఇద్దరు వ్యక్తులు ఆమెను రైలు కిందికి తోసేశారనే ప్రచారం నేపథ్యంలో.. హత్య చెయ్యాలని భావిస్తే నెమ్మదిగా వస్తున్న రైలు కాకుండా వేగంగా వచ్చే రైలు కోసం చూసేవారు కదా అనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఏదైనా ఘర్షణ జరిగి ఆవేశంలో తోసి ఉంటే, ఆ అవసరం ఎవరికి ఉంటుందన్న కోణంలోనూ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మరోవైపు మృతురాలి ఫోన్ కోసం ఘటనా ప్రదేశంలో సిబ్బంది గాలించారు. అది దొరికితే కేసు చాలా వరకు ఒక కొలిక్కి వస్తుందనే అభిప్రాయాన్ని పోలీసులు వ్యక్తం చేశారు. ఆమె ప్రమాదానికి గురైన రైలు డ్రైవర్‌ను విచారిస్తే చాలావరకు సమాచారం వస్తుందని భావిస్తున్నారు. దీనికితోడు గీతాంజలి పోస్టుమార్టం నివేదిక కూడా కీలకం కానుంది. అది వచ్చాక కేసు విచారణ మరింత వేగవంతం చేస్తామని రైల్వే పోలీసులు పేర్కొన్నారు. పోలీసు బృందం ఆర్‌పీఎఫ్ స్టేషన్‌లో సమావేశమై ఘటన జరిగిన తీరుపై చర్చించింది. విచారణ ఇప్పుడే మొదలైందని, త్వరలో అన్ని వివరాలు వెల్లడిస్తామని డీఎస్పీ రమేశ్ తెలిపారు.

గీతాంజలి మరణానికి కారకుడు సజ్జల భార్గవ్

▸ తెలుగు యువత ప్రధాన కార్యదర్శి రవినాయుడు



తిరుపతి(కపిలతీర్థం), మార్చి 13: గీతాంజలి మరణాన్ని రాజకీయాలకు వాడుకోవడం బాధాకరమని.. ఆమె మరణానికి కారణమైన సజ్జల భార్గవ్ రెడ్డే తిరిగి ఈ అంశాన్ని రాజకీయాలకు వాడుకోవడం సిగ్గుచేటని తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవినాయుడు విమర్శించారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆయన బుధవారం మీడియాతో మాట్లాడారు. చావులను అడ్డం పెట్టుకొని రాజకీయం చేయడం వైసీపీకి కొత్తేమీ కాదన్నారు. 2009లో వైఎస్ మరణంతో పుట్టిన వైసీపీ 2019లో బాబాయి వివేకా హత్యతో అధికారంలోకి వచ్చిందన్నారు. ఈ ఘటనపై సిటింగ్ జడ్జితో విచారణ చేపట్టి, కేసు విచారణను సీబీఐకి అప్పగించాలని రవినాయుడు డిమాండ్ చేశారు.

లారీ ఇసుక రూ. 40 వేలా?

(మొదటి పేజీ తరువాయి)

ఓ పాయింట్‌ను ఏర్పాటుచేసి వినియోగదారులకు అందుబాటు ధరలో ఇసుకను విక్రయించాలని సూచించింది. వివిధ ఇసుక రీచ్‌ల్లో ఎలాంటి అనుమతులు లేకుండా జీసీకేసీ సంస్థ భారీ యంత్రాలతో ఇసుకను వెలికితీస్తున్నట్లు ఆధారాలతోసహా కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వశాఖ (ఎంవోఈఎఫ్) నివేదిక సమర్పించిందని గుర్తుచేసింది. ఈ నివేదికపై కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. సామాన్య ప్రజలకు అసౌకర్యం కలిగించడానికి వీల్లేదని పేర్కొంది. ఇసుక రవాణా మార్గాలలో సీసీ కెమెరాల ఏర్పాటు, వేగం నియంత్రణ, అక్రమ మైనింగ్ నిరోధించేందుకు నిపుణుల సలహాలు అవసరమని గుర్తు చేసింది. ఈ నేపథ్యంలో గోవా రాష్ట్రంలో అక్రమ మైనింగ్‌ను నిరోధించడంలో కీలకంగా వ్యవహరించిన ఓ మహిళా సీనియర్ న్యాయవాదిని అమికస్ క్యూరీగా నియమించింది. ఇప్పటికే అమికస్ క్యూరీగా సేవలందిస్తున్న సీనియరు న్యాయవాది కేఎస్ మూర్తికి అదనంగా ఆమెను నియమించారు. విచారణను ఈ నెల 20కి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ ఆర్.రఘునందనరావుతో కూడిన ధర్మాసనం బుధవారం ఆదేశాలిచ్చింది. పల్నాడు జిల్లా అమరావతి మండలం ముత్తాయపాలెం గ్రామం పరిధిలో జయప్రకాశ్ వెంచర్స్ సంస్థ ఇసుకను అక్రమంగా తవ్వి తరలిస్తోందని, నదికి అడ్డంగా ర్యాంపులు ఏర్పాటుచేసి భారీ వాహనాలతో తరలిస్తున్నారని జీవీఎస్ఎస్ ప్రసాద్ అనే వ్యక్తి, మరో ఐదుగురు గత ఏడాది ఏప్రిల్‌లో పిల్ దాఖలు చేశారు. పిటిషనర్ తరపున న్యాయవాది జంపని శ్రీదేవి వాదనలు వినిపించారు. ఎంవోఈఎఫ్ తరపున న్యాయవాది యజ్ఞదత్ వాదనలు వినిపించారు. "ఎంవోఈఎఫ్, కేంద్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు ఇసుక రీచ్‌లను పరిశీలించి జీసీకేసీ సంస్థ ఇసుకను అక్రమంగా తవ్వి తరలిస్తోందని నిర్ధారించారు. అందుకు సంబంధించిన నివేదికను కోర్టు ముందు ఉంచుతాం. ఇసుక మైనింగ్ చేసేందుకు జీసీకేసీ సంస్థకు ఎలాంటి అనుమతులు లేవు" అని వాదించారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున అడ్వకేట్ జనరల్ ఎస్.శ్రీరామ్ స్పందిస్తూ... జీసీకేసీ సంస్థకు మైనింగ్ అనుమతులు ఉన్నాయన్నారు. భారీ యంత్రాలతో మైనింగ్ చేయకుండా ఇప్పటికే చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఎంవోఈఎఫ్ దాఖలు చేసిన నివేదిక పై సవివరంగా కౌంటర్ వేస్తామన్నారు. అందుకు సమయం ఇవ్వాలని అభ్యర్థించారు. అమికస్ క్యూరీ కేఎస్ మూర్తి వాదనలు వినిపిస్తూ.... ఇసుకను రవాణా చేసే విషయంలో ఎంవోఈఎఫ్ నిబంధనలు రూపొందించిందన్నారు. వాటిని అమలు చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు. "కొన్ని ప్రాంతాల్లో జనావాసాల మధ్య నుంచి ఇసుకను భారీ వాహనాల్లో రవాణా చేస్తున్నారు. దీంతో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వాహనాలు ఢీకొని మృత్యువాత పడుతున్నారు" అని తెలిపారు. ఈ వివరాలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం... ఎంవోఈఎఫ్ నివేదికపై కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది.

వలంటీర్లను ఎన్నికలకు దూరంగా ఉంచండి

సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ డిమాండ్

అమరావతి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): గ్రామ, వార్డు వలంటీర్లను ఎన్నికలకు దూరంగా ఉంచాలన్న ఆదేశాలను రాష్ట్ర ఎన్నికల అధికారులు బేఖాతరు చేస్తే మరోసారి హైకోర్టును ఆశ్రయిస్తామని సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ స్పష్టం చేసింది. బుధవారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది. 'రాష్ట్రంలో వలంటీర్ల వ్యవస్థను రాజకీయ ప్రయోజనాల కోసం నిస్సిగ్గుగా వాడుతున్న వైనాన్ని ఎన్నికల కమిషన్ ఆఫ్ ఇండియా దృష్టికి ఇది వరకే వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలతోపాటు సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ తీసుకురాగా, తగు చర్యలు తీసుకోవాలంటూ సీఈవో ఆంధ్రప్రదేశ్‌కు 1-2-2024న ఆదేశాలు జారీ చేసింది. ఈ ఉత్తర్వులను కలెక్టర్లకు 2వారాల తర్వాత మాత్రమే పంపారు. సీఈవో ఉదాసీన వైఖరి దృష్ట్యా సీఎఫ్‌డీ ఏపీ హైకోర్టులో 5-3-2024న డబ్ల్యూపీని ఫైలు చేసింది. ఈ రోజు విచారణలో.. సీఎఫ్‌డీ అభ్యర్థన మేరకు ఈసీఐ వెంటనే తగు చర్యలు తీసుకోవాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటికైనా ఈసీఐ, సీఈవో ఆంధ్రప్రదేశ్ స్పందించి నష్ట నివారణ చర్యలు తీసుకోవడంలో విఫలమయితే, తిరిగి ఈ విషయంలో అత్యున్నత న్యాయస్థానాలను ఆశ్రయిస్తాం' అని సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ ప్రకటనలో తేల్చి చెప్పింది.

టీడీపీ నేతలే లక్ష్యంగా రెండో రోజూ తనిఖీలు

▸ ముందుగానే గ్రానైట్ ఫ్యాక్టరీలు, క్వారీలు మూత

▸ ఏమీ పాలుపోక వెనుదిరిగిన విజిలెన్స్ అధికారులు



బల్లికురవ మండలంలో పనులు నిలిపివేసిన గ్రానైట్ క్వారీ

బల్లికురవ, మార్చి 13: టీడీపీ సానుభూతిపరులే లక్ష్యంగా గ్రానైట్ ఫ్యాక్టరీలు, క్వారీలలో వరుసగా రెండో రోజూ విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేపట్టారు. వాటిలో పనులు పూర్తిగా నిలిపివేసి తాళాలు వేయడంతో అధికారులు ఏమి చేయాలో పాలుపోక ఫొటోలు తీసుకొని వెనుదిరిగారు. మంగళవారం బాపట్ల జిల్లా మార్టూరు మండలం జొన్నతాళి వద్ద అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ బంధువు కామేపల్లి లక్ష్మీప్రసాద్ నిర్వహిస్తున్న గ్రానైట్ ఫ్యాక్టరీలపై కృష్ణా జిల్లా విజిలెన్స్ ఏడీ ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టిన విషయం తెలిసిందే. బుధవారం సంతమాగులూరు మండలం గురిజేపల్లి, బల్లికురవ మండలాలలోని వీర్లకొండ వద్ద లక్ష్మీప్రసాద్ గ్రానైట్ క్వారీలలో తనిఖీలు చేపట్టేందుకు పోలీసు బందోబస్తుతో విజిలెన్స్ అధికారులు వచ్చారు. గతంలోనే దాడులు చేసి జరిమానాలు విధించటంతో క్వారీలు నిర్వహించటం కష్టమని భావించిన యజమాని పనులు పూర్తిగా ఆపేసి తాళాలు వేశారు. రెండు మండలాల్లో ఉన్న మూడు క్వారీలు మూసి ఉండటంతో విజిలెన్స్ అధికారులు వాటి ఫొటోలు తీసుకొని తనిఖీలు చేపట్టకుండానే వెనుదిరిగారు.

వైసీపీ నాయకుల వేధింపులు.. టీడీపీ కార్యకర్త ఆత్మహత్యాయత్నం

తర్లుపాడు, మార్చి 13: వైసీపీ నాయకుల వేధింపులు తాళలేక టీడీపీ కార్యకర్త తన పొలంలో పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఈ ఘటన బుధవారం ప్రకాశం జిల్లా తర్లుపాడు మండలంలోని పోతలపాడు పంచాయతీలోని కందల్లపల్లెలో చోటుచేసుకుంది. పోతలపాడు గ్రామ సర్పంచ్ గాయం శ్రీనివాసులరెడ్డి అన్న వెంకటేశ్వరరెడ్డి అలియాస్ బొర్రయ్య.. వైసీపీ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి టీడీపీ కార్యకర్తలపై దౌర్జన్యం చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ఈ కోవలోనే.. అదే పంచాయతీలోని కందల్లపల్లెకు చెందిన బ్రహ్మతేజకుమార్‌ను పలుమార్లు ఇబ్బందులకు గురిచేశాడు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో బ్రహ్మతేజకుమార్ వెలుగు ఆఫీస్‌లో వీవోఏగా పనిచేస్తుండగా, వైసీపీ ప్రభుత్వం వచ్చిన వెంటనే అతడిని తొలగించి, అతడికి రావాల్సిన 14నెలల జీతం కూడా ఇవ్వనివ్వలేదు. అతడి భూమిని ఆన్‌లైన్‌లో నుంచి తీయించి, కుటుంబానికి ఎలాంటి సంక్షేమ పథకాలూ అందకుండా అడ్డుకున్నారు. ఇటీవల కాలంలో వేధింపులు ఎక్కువయ్యాయి. దీంతో బ్రహ్మతేజ బుధవారం పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నం చేశారు. కుటుంబ సభ్యులు అతడిని 108లో మార్కాపురం జిల్లా వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతున్న బాధితుడు మాట్లాడుతూ బొర్రయ్య అనేకమార్లు బెదిరించి చిత్రహింసలకు గురిచేసినట్లు తెలిపారు. మంగళవారం తన భార్యకు ఫోన్ చేసి దుర్భాషలాడినట్లు వాపోయారు. వేధింపులు భరించలేక పురుగుమందు తాగినట్లు బ్రహ్మతేజకుమార్ తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వేముల సుధాకర్ తెలిపారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

బైడెన్ బోలుమాటలు

అమెరికా అధ్యక్షుడు జోబైడెన్ అడపాదడపా హెచ్చరికలు చేయడం, ఇజ్రాయెల్ అధినేత నెతన్యాహూ వాటిని బేఖాతరు చేయడం ఎంతోకాలంగా చూస్తున్నదే. దక్షిణగాజాలోని రఫాలో క్షేత్రస్థాయి దాడులకు ఇజ్రాయెల్ సిద్ధపడుతున్న తరుణంలో, అమెరికా అధ్యక్షుడు బైడెన్ కఠినంగా చేసిన ఓ వ్యాఖ్యకు, మెత్తనిమాటలతోనే నెతన్యాహూ ఘాటుగా సమాధానం చెప్పారు. గాజాలో మానవసంక్షోభాన్ని నివారించడానికి నెతన్యాహూ చేయాల్సినంత చేయడం లేదని, గాజాయుద్ధంలో ఆయన వైఖరి ఇజ్రాయెల్‌కు మేలుకంటే కీడు ఎక్కువ చేసేట్టున్నదని బైడెన్ విమర్శించిన విషయం తెలిసిందే. ఒక భయానకమైన యుద్ధాన్ని కొనసాగించేందుకు అన్నివిధాలా సాయపడుతున్న అమెరికాకు కొన్ని విషయాల్లో ఇజ్రాయెల్ పట్ల ఆగ్రహాలు, అలకలూ ఉండటం సహజం. గాజాలో మానవసంక్షోభం మీద ఒక సెనెటర్ ఆందోళన వ్యక్తంచేస్తే, ఆయనను శాంతపరచడానికి బైడెన్ ఈ నాలుగుమాటలూ అన్నారు తప్ప, అక్కడి పరిస్థితులతో మనసుచలించిపోయికాదు. నెతన్యాహూ వ్యవహారశైలితో ఆగ్రహం చెందినట్టుగా కనిపించినప్పటికీ, ఇజ్రాయెల్‌కు సాయం చేసే విషయంలో తన వైఖరిలో ఏ మార్పూ ఉండబోదని బైడెన్ మరోపక్క తేల్చేశారు కూడా.

దాదాపు 15 లక్షలమంది పాలస్తీనియన్లు ఆశ్రయం పొందుతున్న రఫా నగరంలో క్షేత్రస్థాయి దాడులకు తాను పట్టుబట్టబోతున్నట్టు నెతన్యాహూ చేసిన వ్యాఖ్య బైడెన్‌కు దీటైన సమాధానమే. ఇటువంటి ఆచరణతో రఫాను ఇజ్రాయెల్ దురాక్రమించుకొనే ప్రమాదం ఉన్నదని అంతా భయపడుతున్న తరుణంలో నెతన్యాహూ తన మనసులో మాట చెప్పేశారు. రఫాలోకి చొరబడినపక్షంలో అమెరికా సైనికసాయం నిలిచిపోతుందన్న హెచ్చరికలకు ఆయన ఏ మాత్రం విలువ ఇవ్వలేదని అర్థం. రఫాలోకి కూడా చొరబడి అన్ని లక్షలమంది ప్రాణాలు ప్రమాదంలో పడవేయకండి అని మరో పదిరోజుల్లో యూరోపియన్ కౌన్సిల్‌లో తీర్మానించి, నెతన్యాహూను ఈ దిశగా అడ్డుకొనేందుకు ఈయూ దేశాల అధినేతలంతా సిద్ధపడుతున్న తరుణంలో, రఫాలో కాలూని, శత్రుసంహారాన్ని పూర్తిచేసి, పనిచక్కబెట్టుకుంటానని నెతన్యాహూ ముందే తేల్చేశారు.

రంజాన్ మాసంలోనూ అదేస్థాయిలో జనసంహారం జరుగుతూ, విధ్వంసం కొనసాగుతున్నది కనుక, అమెరికా అధ్యక్షుడు అంతర్గత రాజకీయ ఒత్తిళ్ళకు అనుగుణంగా ఏదో మాట్లాడుతూంటారు. 160 రోజులుగా సాగుతున్న మారణకాండలో 31వేలమంది మరణించినట్టు పాలస్తీనా అధికారులు చెబుతూంటే, వారిలో 13వేలమంది ఉగ్రవాదులున్నారన్నదే తనకు సంబంధించిన విషయమని నెతన్యాహూ అంటున్నారు. ఉగ్రవాదుల ఏరివేత పేరిట ఐదునెలలుగా అది సాగించిన విధ్వంసంతో గాజా పూర్తిగా నేలమట్టమైంది. రహస్యమార్గాలున్నాయన్న పేరిట ఎత్తయిన భవనాలను, ఆయుధాగారాలన్న ఆరోపణతో ఆస్పత్రులనూ కూడా కూల్చివేసిన ఘనుడు నెతన్యాహూ. ఇటీవల అంతర్జాతీయ న్యాయస్థానానికి దక్షిణాఫ్రికా సమర్పించిన వేర్వేరు రకాల ఆధారాలు ఇజ్రాయెల్ అమానుషత్వానికీ, దాష్టీకానికీ నిదర్శనం. ఆహారాన్ని తెస్తున్న ముపెట్టుక్కుల వెంట పరుగులు తీసిన పాలస్తీనియన్లమీద ఇజ్రాయెల్ సైనికులు కాల్పులు జరిపిన ఇటీవలి ఘటన గాజా ప్రజల తీవ్రదుస్థితికి, యూదు రాజ్య దుర్మార్గానికి అద్దంపడుతుంది. ఆకలితో ఉన్నవారిమీద అమానుషత్వాన్ని చూపిన ఆ ఘటన జాతిహననం కేసులో ఐసీజే చేసిన తీవ్రమైన వ్యాఖ్యలు ఇజ్రాయెల్‌ను ఏ మాత్రం ప్రభావితం చేయలేదనడానికి నిదర్శనం. అంతటి దారుణం జరిగినప్పటికీ అమెరికా తన మిత్రదేశాన్ని వెనకేసుకొస్తున్నట్టుగానే మాట్లాడింది. ప్రశ్నిస్తున్నట్టుగా, నిలదీస్తున్నట్టుగా కనిపిస్తూ, మరోపక్క వెనకేసుకొస్తూ ఇజ్రాయెల్ విషయంలో అమెరికా నిత్యం ఓ అద్భుతమైన నాటకాన్ని కొనసాగిస్తూ ఉంటుంది. గాజామీద దాడులు ఆపాలి, కనీసం రంజాన్ మాసంలోనైనా కాల్పుల విరమణకు ఇజ్రాయెల్ అంగీకరించాలి అని మొన్నీమధ్య బైడెన్ తన దేశప్రజలను ఉద్దేశించి చేసిన ప్రసంగంలో నెతన్యాహూకు ఓ విజ్ఞప్తి చేశారు. ఎప్పటిలాగానే ఆయన ఈ మాటలను లక్ష్యపెట్టలేదు, తన మాట విననందుకు అమెరికా అధ్యక్షుడికి ఏ మాత్రం అవమానం కలగడం లేదు, ఆయుధాల సరఫరా ఆపేస్తాను జాగ్రత్త అని కోపంతో ఊగిపోవడం లేదు. యుద్ధం ఆపాలనీ, మానవసాయం అందించాలని భద్రతామండలిలో కొన్ని దేశాలు తీర్మానాలతో ముందుకు వస్తే, వాటిని వీటో చేసి, ఈ యుద్ధాన్ని ఇజ్రాయెల్ చక్కగా, తనకు నచ్చినరీతిలో చేసుకోవడానికి అమెరికా దోహదపడుతోంది. ఆర్థిక, ఆయుధ, నైతిక సాయంతో నెతన్యాహూ ప్రవచిత సంపూర్ణ విజయానికి అండగా నిలుస్తోంది. రఫాపై దాడికి పూనుకుంటే లక్ష్మణరేఖ దాటినట్టేనని అమెరికా అధ్యక్షుడు హెచ్చరించడం, రఫా దిశగా అడుగులు పడుతున్నాయని నెతన్యాహూ తేల్చేయడాన్ని బట్టి ముగింపులేని ఈ నాటకాన్ని

బహుజన అధికార కేతనం కాన్షీరామ్

భారతదేశంలో కులం పేరుతో అణగదొక్కబడిన ఎనభయ్యైదు శాతం మెజారిటీలను బహుజనులుగా సంఘటితం చేసి, రాజ్యాధికారం తీసుకురావడానికి మాన్యశ్రీ కాన్షీరామ్ పూనుకున్నారు. అతి తక్కువ జనాభా సంఖ్యతో పదిహేను శాతంగా ఉన్న హిందూ ఆధిపత్య కులాలను 'రూలింగ్ మైనారిటీలు'గా కాన్షీరామ్ గుర్తించారు. వీరి రాజకీయ దోపిడీని నివారించడానికి 'ఓట్లు మావి – సీట్లు మీవా? చెల్లదు ఇకపై చెల్లదు!' అని కాన్షీరామ్ చేసిన నినాదం దేశమంతా మార్మోగింది. అణగారిన కులాల వారికి కులం పునాదిగా జనాభా దామాషా ప్రకారం అధికారంలో భాగస్వామ్యం కల్పించడానికి జీవిత కాలం శ్రమించిన బహుజన విప్లవ నాయకుడు కాన్షీరామ్. షెడ్యూల్ కులాల వారు స్వతంత్ర రాజకీయాలు చేసి, ఓబీసీలు మత మైనారిటీలతో ఐక్య సంఘటన నిర్మించి ఎలా అధికారంలోకి రావచ్చునో కాన్షీరామ్ నిరూపించారు.

ఏ కమ్యూనిటీకి అధికారంలో భాగస్వామ్యం ఉండదో, ఆ కమ్యూనిటీ అంతరించి పోతున్నట్టేనని కాన్షీరామ్ అన్నారు. తాత్కాలిక సామాజిక న్యాయం వద్దనీ, దాని స్థానంలో మొత్తం సామాజిక, ఆర్థిక, రాజకీయ పరివర్తన కావాలని అన్నారు. అధికారమే విజయానికి ముఖ్య తాళం చెవి అన్నారు. బహుజనులు అధికారంలోకి రావాలంటే రాజకీయ ప్రజా ఉద్యమం అవసరం అని గుర్తించారు. ఆ ఉద్యమం ఓట్లను సంఘటితం చేసేదిగా, ఓట్లని సీట్లుగా మార్చేదిగా, సీట్లు రాష్ట్రాల్లో అధికారాన్ని స్థాపించేవిగా, అంతిమంగా కేంద్రంలో అధికారంలోకి వచ్చే గురుతర రాజకీయ లక్ష్యం బహుజనులదని కాన్షీరామ్ ప్రకటించారు.

కులం ఉన్నంత వరకు దానిని అణగారిన కులాల వారి ప్రయోజనాల కోసం వాడాలి. అందుకు ఆటంకం ఏర్పడితే కుల నిర్మూలన కోసం పోరాడుదామని కాన్షీరామ్ పిలుపునిచ్చారు. బ్రాహ్మణవాదం విజయవంతం అవుతున్నంత కాలం ఇతర వాదాలు ఏవీ విజయవంతం కాలేవని, దేశంలో ప్రాథమికమైన, నిర్మాణాత్మకమైన సామాజిక మార్పు బహుజనులకు ఎంతో అవసరం అని కాన్షీరామ్ అభిప్రాయం. 'వ్యవస్థ తలుపుల దగ్గర నిలబడి న్యాయం అడగడానికి మనం ఎంతో కాలం నుంచి తడుతూనే ఉన్నాం. కానీ, న్యాయం పొందలేకపోయాం. ఇప్పుడు తలుపులు బద్దలు కొట్టడానికి సమయం వచ్చింది' అని కాన్షీరామ్ బహుజనులకు పిలుపునిచ్చారు.

దేశంలో బహుజనులకు రాజ్యాధికారం సాధించాలంటే జనరంజకమైన పద్ధతుల్లో ప్రజల్ని సమీకరించాల్సిన అవసరం ఉందని కాన్షీరామ్ గుర్తించారు. అందుకోసం తాను చేస్తున్న ఉద్యోగాన్ని వదిలేసి, బ్యాక్‌వర్డ్ అండ్ మైనార్టీస్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (బాంసెఫ్)ని కాన్షీరామ్ 1978లో స్థాపించారు. అలాగే, దళిత్ సోషిత్ సమాజ్ సంఘర్ష సమితి (డిఎస్–4)ని 1981లో కాన్షీరామ్ స్థాపించారు. తన అనుయాయులతో కలిసి బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ)ని 1984లో కాన్షీరామ్ స్థాపించారు. కొంతమంది అనుచరులతో, కార్గిల్ నుంచి కన్యాకుమారి వరకు దేశంలో నలభై రోజుల పాటు మూడు వేల కిలోమీటర్ల సైకిల్ యాత్రను కాన్షీరామ్ నిర్వహించారు. ఈ సందర్భంగా కాన్షీరామ్ కొన్ని నినాదాలు సృష్టించారు అవి: 'కులాన్ని నిర్మూలిద్దాం – బహుజన సమాజాన్ని స్థాపిద్దాం', 'స్వతంత్ర భారతదేశంలో బహుజనులు ఎందుకు బానిసత్వంలో ఉన్నారు?', 'మండల కమిషన్‌ని అమలు చెయ్యి – లేకుంటే గద్దె దిగిపో!', 'ఏ భూమి ప్రభుత్వానిదో – ఆ భూమి బహుజనులది!', 'ఎవరిది ఎంత జనాభాయో – వారిది అంత భాగస్వామ్యం', 'పార్లమెంటుకు నడు – నీ కాళ్ళ మీదే నిలబడు', 'ఓట్లు మావి సీట్లు మీవా? చెల్లదు! ఇకపై చెల్లదు!', 'తిలక్, తరాజ్, తల్వార్‌లను తరిమికొట్టండి!', 'అధికారులు, ఉద్యోగులు, విద్యావంతులారా! పే బ్యాక్ టు ది సొసైటీ', 'బహుజనుల అంతిమ లక్ష్యం – ఈ దేశాన్ని పరిపాలించడం!', 'బహుజనుల విజయానికి ముఖ్యమైన తాళం చెవి – రాజ్యాధికారం' మొదలగు నినాదాలను, రాజకీయ జాతీయాలను, కొత్త రాజకీయ భాషను కాన్షీరామ్ బహుజన రాజకీయాలకు నేర్పించారు.



రాజకీయాల్లో కాన్షీరామ్ సృష్టించిన నినాదాలు, లేవనెత్తిన ప్రశ్నలు, వాడిన భాష, తాత్త్విక దృష్టి, బహుజనుల రాజకీయ వ్యాకరణం అయింది. బహుజనుల రాజకీయ కార్యక్రమం అయింది. ఇది ఎప్పటికప్పుడు రాజకీయ సైరన్ అయ్యి, బహుజనుల గుండెల్లో మోగుతూనే ఉంటుంది.

వర్తమాన భారతదేశ రాజకీయ పర్యావరణంలో బహుజనుల పొలిటికల్ విజన్, పొలిటికల్ ప్రోగ్రామ్‌పై కాన్షీరామ్ చెరగని ముద్ర వేశారు. భారతదేశ కుల సమాజంలో ఇప్పటి రాజకీయాలకు తగినట్లుగా అధికారంలో కమ్యూనిటీ భాగస్వామ్యం పునాదిగా ఉండే రాజకీయ కార్యక్రమాన్ని, ఒక సరికొత్త రాజకీయ వ్యాకరణాన్ని, వ్యూహాన్ని దేశ రాజకీయాల్లో కాన్షీరామ్ ప్రవేశపెట్టారు. దేశంలోనే అతిపెద్ద రాష్ట్రమైన ఉత్తరప్రదేశ్‌లో 1995లో మొదటిసారి, 1997 జూన్ మూడవ తేదీన రెండోసారి, 2007 మార్చి ఇరవైన మూడోసారి, బీఎస్పీ నాయకురాలు, చర్మకార సామాజిక వర్గానికి చెందిన మహిళ, బహెన్ జీ కుమారి మాయావతి మూడుసార్లు ముఖ్యమంత్రి అయి చరిత్ర సృష్టించారు. ఈ నేపథ్య సృష్టికర్త కాన్షీరామ్. 1999లో బీఎస్పీకి 14 మంది ఎంపీలు పార్లమెంట్‌లో ఉండేవారు. అలాగే, కాన్షీరామ్ 1991 నుంచి 96 వరకూ ఇటావా పార్లమెంట్ నియోజకవర్గం నుంచి, 1996 నుంచి 98 వరకూ హోషియార్‌పూర్ పార్లమెంటు నియోజకవర్గం నుంచి లోక్‌సభ సభ్యునిగా ఎన్నికయ్యారు. బహుజనుల స్వయం గౌరవం, సమానత్వం, విముక్తి, కుల నిర్మూలన కోసం, అత్యాచారాలు అంటరానితనాలకు ప్రతిఘటన మొదలగు లక్ష్యాల సాధన కోసం భారతీయ కిసాన్ మజ్దూర్ ఆందోళన్, సఫాయి మజ్దూర్ ఆందోళన్, చేతివృత్తిదారుల ఆందోళన్, శరణార్థుల ఆందోళన్, భాగస్వామ్య హక్కుల (భాగీదారి) ఆందోళన్‌లను కాన్షీరామ్ దేశవ్యాప్తంగా నిర్వహించారు. 'ఎనిమిది శాతం ఓట్లను పొందిన చోట, ఏ పార్టీ అయినా సొంత ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకోలేక, మనపై ఆధారపడే పరిస్థితులను సృష్టించాలి. ఇరవై శాతం ఓట్లను సాధించుకున్నకాడ, మన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకోవాలి' అనే స్పష్టమైన ఎరుకతో కాన్షీరామ్ రాజకీయ పావులను కదిపేవారు. మనువాద మనీ, మాఫియా, మీడియాలను ఎదుర్కొనే విధంగా కాన్షీరామ్ బహుజనులను తయారు చేశారు.

అంబేడ్కర్ అనంతరం, అంబేడ్కర్ రాజకీయ కార్యక్రమాన్ని సృజనాత్మకంగా ముందుకు తీసుకుపోయిన గొప్ప నాయకుడు కాన్షీరామ్. అంబేడ్కర్ బాట చూపించగా, కాన్షీరామ్ నడిచి చూపించారు. బహుజన రాజకీయ కార్యక్రమాన్ని జాతీయ స్థాయిలో ప్రారంభించి రాజకీయ పార్టీగా సంఘటితం చేసి, పటిష్టపరిచిన ఘనత కాన్షీరామ్ గారిది. అప్రెస్డ్ ఇండియన్ పత్రిక, బహుజన నాయక్, బహుజన సంఘటన పత్రికలను కాన్షీరామ్ స్థాపించి, సంపాదకునిగా వాటిని నడిపించారు. అలాగే, 'చెంచా యుగం' అనే గ్రంథాన్ని కాన్షీరామ్ రాశారు. డాక్టర్ అంబేడ్కర్ – గాంధీల మధ్య 1932 సెప్టెంబర్ 24న పూనా ఒడంబడిక జరిగింది. ఈ ఒప్పందం ద్వారా దళితులు, రాజకీయ అధికార స్వయం ప్రతిపత్తిని కోల్పోయారు. గాంధీ ఆధిపత్య కులాల రాజకీయాలకు ప్రతినిధిగా, ఈ సాంఘిక అన్యాయానికి పొడిగట్టారు. ఈ ఒప్పందం ద్వారా, దళితులు రాజకీయ బానిసత్వ చట్రంలో ఎలా నెట్టివేయబడినారో ఈ గ్రంథంలో కాన్షీరామ్ వివరంగా విశ్లేషించారు. 1934 మార్చి 15వ తేదీన పంజాబ్ రాష్ట్రం రోపార్ జిల్లా ఖవాస్‌పూర్ గ్రామంలో కాన్షీరామ్ జన్మించారు. 2006 అక్టోబర్ 9న తన డెబ[illegible] రెండో ఏట తీవ్ర అనారోగ్యంతో, కాన్షీరామ్ తనువు చాలించారు. రాజకీయాల్లో కాన్షీరామ్ సృష్టించిన నినాదాలు, లేవనెత్తిన ప్రశ్నలు, వాడిన భాష, తాత్త్విక దృష్టి, బహుజనుల రాజకీయ వ్యాకరణం అయింది. బహుజనుల రాజకీయ కార్యక్రమం అయింది. ఇది ఎప్పటికప్పుడు రాజకీయ సైరన్ అయ్యి, బహుజనుల గుండెల్లో మోగుతూనే ఉంటుంది.

■ కృపాకర్ మాదిగ

(మార్చి 15 కాన్షీరామ్ 90వ జయంతి)

లెక్క తేల్చుకోవాల్సింది ప్రజలే

ఎన్నికల తేదీలు వెల్లడయ్యేవేళ అంకెల దాడి మొదలయింది. ప్రజల నాడి పట్టుకుని, ఫలితాలను ఊహించగలిగిన గజకర్ణ గోకర్ణులు విజృంభిస్తున్నారు. ఈ ఒపీనియన్ పోల్సూ, సర్వేలూ కుతూహలాలను చల్లార్చడానికి మాత్రమే కాదు, వాతావరణాన్ని వేడెక్కించడానికి, మనసులను మళ్లించడానికి కూడా! గాలి అటు వీస్తున్నదా, ఇటు వీస్తున్నదా అన్న చర్చలలో పడి, అసలు తన ఓటుతోనే గాలులు ఎటైనా వీస్తాయని సాధారణ ఓటర్లు మరచిపోతారు. గాలివాటంలో పడిపోయి, గెలుస్తారని హంగామా జరుగుతున్న పక్షానికే ఓటు వేస్తారు.



అంబానీల టీవీ సిఎన్ఎన్ 18, దేశవ్యాప్త అభిప్రాయసేకరణ చేసింది. బీజేపీ బలం తెలిసిన రాష్ట్రాల్లోనేమో, ఒకటీ అరా తప్ప అన్ని స్థానాలూ ఆ పార్టీ లెక్కలోనే వేస్తున్నారు, ఇండియా కూటమి బలం ఉన్న రాష్ట్రాల్లోనేమో ఎన్డీయేకు ఉదారంగా సీట్లు ఇస్తున్నారు. అటూ ఇటూ చేసి, 370 మరో 30 కలిపి 400 దగ్గర లెక్క తేలుస్తారు. ఈ ఛానెలే ఇట్లా ఉంటే, ఇక రిపబ్లిక్ ఎట్లా ఉంటుందో ఊహించండి: టైమ్స్ నౌ కూడా రెండు తక్కువ 400 దాకా లెక్క లాగించింది. బీజేపీకి ఈ నాలుగొందల పిచ్చి ఎందుకో ఆ పార్టీ ఎంపీ మాజీ మంత్రి అనంత్ కుమార్ హెగ్డే మొన్న చెప్పేశారు. రాజ్యాంగాన్ని మారుస్తారట. పీఠికలోనుంచి సోషలిజాన్ని, లౌకికవాదాన్ని తీసేస్తారట. దేశంలోనుంచి తీసేయగలిగారు కానీ, ఆ పుస్తకంలోనుంచి తీసేయడానికి మాత్రం కావలసిన బలం లేదని బీజేపీ పెద్దలకు బెంగగా ఉన్నది. లోకసభలో ఎట్లాగో భారీ బలం సంపాదించుకున్నా, రాజ్యసభ ఒకటి తలనొప్పిగా ఉంది. కొన్ని రాష్ట్రాలు ఇంకా ప్రతిపక్ష రాష్ట్రాల చేతిలో ఉండడం వల్లనే రాజ్యసభ చేతికి రావడం లేదు. ఇప్పుడు నాలుగొందలు తెచ్చుకుని, రాజ్యసభలో బలమూ తెచ్చుకుని, రాష్ట్రాలలో ఇతరేతర పద్ధతులలో బలగం పెంచుకుని, దేశాన్ని ఇక దున్నేద్దామన్న ఆలోచన వారికి ఉండవచ్చు. రానున్న రోజులు ఎంత భయంకరంగా, జటిలంగా ఉండబోతున్నాయో అన్న భయం కలుగుతున్నది, అదే సమయంలో అతి బలహీన ప్రతిపక్షం, నిస్సహాయ అల్పసంఖ్యాక శ్రేణులు కూడా నిరంకుశత్వాన్ని ఎంతో కొంత ఇబ్బంది పెట్టగలవని తెలిసినప్పుడు, ప్రజాస్వామ్యం మీద ముచ్చటేస్తుంది.

* * * *

ఓట్ల, సీట్ల లెక్కలే కాదు. ఈ దేశానికి వేరే లెక్కలు కూడా ఉన్నాయి. కృత్రిమంగా ఎక్కించిన ద్వేషమూ, బంట్లుగా మారిపోయిన సకల వ్యవస్థలూ మాత్రమే కాదు, ఈ దేశానికి ఆర్థిక సామాజిక జీవనాలు కూడా ఉన్నాయి. వారసత్వం మీద గర్వం లేనివాడు భవిష్యత్తును అందుకోలేడని నరేంద్రమోదీ ఈ మధ్య అన్నారు. కానీ, తలదించుకోవలసి వచ్చే పరిస్థితుల మధ్య మనుగడే అసాధ్యం అవుతుంది.

అంతర్జాతీయ మతస్వేచ్ఛల అమెరికా కమిషన్ (యుఎసఐసిఎఫ్) మతమైనారిటీల మీద సరిహద్దులకు ఆవల కూడా గురిపెడుతున్న భారత్ వైఖరిపై తమకు ప్రత్యేకంగా ఆందోళన ఉన్నదని ఈ మధ్యే చెప్పింది. స్వీడన్‌కు చెందిన ప్రజాస్వామ్య నాణ్యతా పరిశీలనా సంస్థ, వి-డెమ్ ప్రకారం భారతదేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉన్నది. మొత్తం 202 దేశాలలో, టాంజానియా, మెక్సికో, బొలీవియా వంటి దేశాలకు దిగువన, నైజర్, ఐవరీ కోస్ట్ దేశాల మధ్య నూటానాలుగో ర్యాంకులో ఉన్నది. ఆ సంస్థ దృష్టిలో భారత్ స్థాయి 2018లోనే పడిపోయింది. ఎన్నికల పద్ధతిలో నడిచే నియంతృత్వం అని భారత్‌ను వాళ్లు వర్గీకరించారు.

పొరపాటు సమాచారం, దురుద్దేశ్యంతో కూడిన సమాచారం భారతదేశానికి దాపురించిన అతి పెద్ద ప్రమాదాలని 'వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్' '2025 గ్లోబల్ రిస్క్ రిపోర్టు' హెచ్చరించింది. ఎన్నికల వేళ ఈ ముప్పు మరింత అధికమని చెప్పింది. 2019 ఎన్నికల సందర్భంగాను, ఆ తరువాత వచ్చిన కొవిడ్ మహమ్మారి సమయంలోను వివిధ పక్షాలు సామాజిక మాధ్యమాలను ఎట్లా ఆయుధాలుగా సంధించిందీ, భయాందోళనలను పెంచి హింసకు కారణమయిందీ ఆ నివేదిక గుర్తు చేసింది. అసత్య, అవాస్తవ సమాచార వ్యాప్తి ఎన్నికల ప్రక్రియలను తీవ్రంగా అస్థిరపరచి కొత్తగా ఎన్నికయ్యే ప్రభుత్వాల న్యాయబద్ధతను ప్రభావితం చేసి హింసకు కారణమవుతుందని కూడా వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ నివేదిక హెచ్చరించింది.

కనీస ఆహారం కూడా అందుబాటులో లేని శిశువుల మీద ఈ మధ్య ఒక అధ్యయనం జరిగింది. 92 దేశాల్లో పరిశీలన జరిగిన సమయానికి ఆరు నుంచి 23 నెలల మధ్య వయస్సున్న కోటీ నలభై లక్షల మంది బిడ్డలు, అప్పటికి 24 గంటల ముందు నుంచి పశువుల పాలు కానీ, పొడిపాలుకానీ, ఘన, అర్ధ ఘన ఆహారం కానీ తీసుకోలేదని తేలింది. ఈ నిరాహార శిశువులలో దాదాపు సగం మంది, 67 లక్షల మంది, భారతదేశానికి చెందినవారే. ఐదవ జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే ప్రకారం, నిరాహార శిశువుల సంఖ్య 2016 నుంచి 2021 మధ్య 17.2 నుంచి 17.8 శాతానికి పెరిగింది.



■ కె. శ్రీనివాస్

సందర్భం

ఇది ఇట్లా ఉండా, మరో వైపున గ్రామీణ రంగంలో కూడా ప్రాసెస్డ్ ఆహారం వ్యాపారం పెరిగిందట. ధాన్య ఆహారం, కూరగాయలు వంటి వాటి మీద ఖర్చు తగ్గించి, పానీయాల మీద, ప్యాకింగ్ తినుబండారాల మీద ఖర్చు చేస్తున్నారట. పట్టణ ప్రాంతాలలో కూడా ఇదే ధోరణి. అయితే, గతంలో గ్రామాలలో మొత్తం ఖర్చులో తిండి ఖర్చు 50 శాతం పైనే ఉండేది. ఇప్పుడది 46 శాతానికి వచ్చింది. మిగిలినవి రవాణాకు ఇతర అవసరాలకు ఖర్చు చేస్తున్నారట. 2022---, 23లో గ్రామీణుల నెలసరి వినియోగ ఖర్చు 3773 రూపాయలు, అయితే, పట్టణ నివాసి ఖర్చు 6459 అట. పదేళ్ల కిందటితో పోలిస్తే, ఈ ఖర్చు సామర్థ్యం రెట్టింపు అయినట్టుంది. అదానీ, అంబానీల సామర్థ్యం ఎంత పెరిగి ఉంటుందో తెలియదు. ఆహారంలో కాదు కానీ, పెళ్లి ఖర్చులలో పెరిగిన సామర్థ్యాలను లెక్కవేయాలి.

అభివృద్ధి యుగంలోని నూతన చిరుద్యోగులలో క్యాబ్ డ్రైవర్లు, డెలివరీ సహాయకులు ఎక్కువ. ఈ రెండు రకాల వృత్తులలో స్త్రీల సంఖ్య దాదాపు శూన్యం. ఎస్‌సి ఎస్‌టి క్యాబ్ డ్రైవర్లలో 63 శాతం మంది రోజుకు పదహారు గంటలు పనిచేస్తారు. ఇతర కులాల్లో పదహారు శాతం మంది మాత్రమే అన్ని గంటలు పనిచేస్తారు. నూటికి నలభైమొగ్గురు క్యాబ్ డ్రైవర్ల ఆదాయం నెలకు పదిహేనువేలే. 34 శాతం మంది డెలివరీ బాయ్స్ ఆదాయం నెలకు పదివేలే. సుమారు 45 శాతం మంది వారాంతపు సెలవే తీసుకోరు. 99 శాతం మంది డ్రైవర్లకు కాళ్ల నొప్పులో, నడుం నొప్పులో ఉన్నాయి. పని ఒత్తిడి, మానసిక కుంగుబాటు దాదాపు అందరినీ బాధిస్తున్నాయి.

* * * *

ఇప్సోస్ ఇండియా బస్ అనే సంస్థ ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆమోదనీయతను గణించే సర్వే ఒకటి చేసింది. 2200 మంది శ్రేణుల వారీగా ఎంపికచేసిన అభిప్రాయదాతల నుంచి శాస్త్రీయంగా ఈ సర్వే చేస్తారట. వీరి గత నెల అంచనా ప్రకారం, ఇప్పుడు నూటికి 75 శాతం ఆమోదనీయత నరేంద్రమోదీకి ఉన్నది. పోయిన ఏడాది సెప్టెంబర్‌లో 65 శాతంగా ఉన్నది, ఈ ఫిబ్రవరికి పదిశాతం పెరిగిందట. మధ్యలో ఏమి జరిగిందో అందరికీ తెలిసిందే. అయితే, ఈ సర్వే ప్రకారం ఉత్తరాదిలో 92 శాతం దాకా ఉన్న ఆమోదం, దక్షిణాదిలో 35 శాతమే ఉన్నదట. రంగాల వారీగా చూస్తే విద్య, ఆరోగ్యాలకు అధిక రేటింగ్ దొరికితే, పేదరికం, ద్రవ్యోల్బణం, నిరుద్యోగం, అవినీతి వంటి రంగాలలో సగం కంటె తక్కువే మార్కులు పడ్డాయట.

ఎప్పుడూ ప్రభుత్వాల గురించి మాత్రమే లెక్కలు తీస్తే ఎట్లా? ఈ పాలనలు మనుషుల్ని ఎట్లా తయారు చేస్తున్నాయో తెలుసుకోవడం కూడా అవసరం. సుప్రసిద్ధ ప్యూ రిసర్చి సెంటర్ వాళ్లు, తాజాగా చేసిన ఒక అధ్యయనంలో, భారత ప్రజలు మూడింట రెండు వంతుల మంది సైనిక పాలన గానీ, నిరంకుశ పాలన గానీ కోరుకుంటున్నారట. కోర్టులూ చట్టాలూ చట్టసభలూ గొడవ లేకుండా దృఢమైన నాయకుడు దేశాన్ని పాలించాలనే కోరిక 2017కు, 2023కు మధ్య 12 శాతం పెరిగిందట. నరేంద్రమోదీ పాలకుడుగా ఉండగా కూడా ఆ కోరిక పెరుగుతోందంటే, అంతకు మించిన నాయకుడు కావాలనా? లేక, ఈ నాయకుడే మరింత ఉక్కు పాలన అందించాలనా? ఇండోనేషియాలో కూడా ఇదే గోలట. సైనికపాలన కావాలని వాళ్లు ఉవ్విళ్లూరుతున్నారట. వాళ్ల తరువాత మనమే. ప్రాతినిధ్య ప్రజాస్వామ్యాన్ని 2017లో భారత్‌లో నూటికి 44 మంది ఇష్టపడితే, ఇప్పుడు వారి సంఖ్య 36 శాతానికి పడిపోయిందట.

కోర్టులూ చట్టాలూ చట్టసభలూ గొడవ లేకుండా దృఢమైన నాయకుడు దేశాన్ని పాలించాలనే కోరిక 2017కు, 2023కు మధ్య 12 శాతం పెరిగిందని ప్యూ రిసర్చి సెంటర్ వాళ్లు, తాజాగా చేసిన ఒక అధ్యయనం వెల్లడించింది. నరేంద్రమోదీ పాలకుడుగా ఉండగా కూడా ఆ కోరిక పెరుగుతోందంటే, అంతకు మించిన నాయకుడు కావాలనా? లేక, ఈ నాయకుడే మరింత ఉక్కు పాలన అందించాలనా?

* * * *

గణాంకాలు అసంఖ్యాకం. ఏ లెక్కలు ఏ సత్యాన్ని చెబుతాయో గుర్తించడం అవసరం. ఏ లెక్కలు నిజమో ఏవి అబద్ధమో తెలుసుకోవడమూ అవసరమే. ప్రపంచ ప్రజల మీదకు ముంచుకు వచ్చే ప్రమాదాలేమిటి అని 'వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్' '2025 గ్లోబల్ రిస్క్ రిపోర్టు'ను రూపొందించింది. 34 రకాల ఆర్థిక, పర్యావరణ, భౌగోళిక రాజకీయ, సామాజిక, సాంకేతిక ప్రమాదావకాశాలను ఆధారం చేసుకుని, వచ్చే రెండేళ్ల కాలంలో ఆయా దేశాలు ఎట్లా ఉండబోతాయో ఆ నివేదిక మదింపు వేసింది. పొరపాటు సమాచారం, దురుద్దేశ్యంతో కూడిన సమాచారం భారతదేశానికి దాపురించిన అతి పెద్ద ప్రమాదాలని ఆ నివేదిక హెచ్చరించింది. ఎన్నికల వేళ ఈ ముప్పు మరింత అధికమని చెప్పింది. 2019 ఎన్నికల సందర్భంగాను, ఆ తరువాత వచ్చిన కొవిడ్ మహమ్మారి సమయంలోను వివిధ పక్షాలు సామాజిక మాధ్యమాలను ఎట్లా ఆయుధాలుగా సంధించిందీ, భయాందోళనలను పెంచి హింసకు కారణమయిందీ ఆ నివేదిక గుర్తు చేసింది. అసత్య, అవాస్తవ సమాచార వ్యాప్తి ఎన్నికల ప్రక్రియలను తీవ్రంగా అస్థిరపరచి కొత్తగా ఎన్నికయ్యే ప్రభుత్వాల న్యాయబద్ధతను ప్రభావితం చేసి హింసకు కారణమవుతుందని కూడా వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ నివేదిక హెచ్చరించింది.

మన రైతుకు ఇంకా దక్కని 'మోదీ గ్యారంటీ'

గత నెల రోజులుగా పొద్దున లేస్తే టీవీలు, రేడియోల నిండా 'మోదీ గ్యారంటీ' అనే మాట హోరెత్తుతోంది. వేల కోట్ల రూపాయల ప్రజల సొమ్మును ఖర్చుపెట్టి అధికారికంగా ప్రచారం చేసుకుంటున్న మోదీ ప్రభుత్వం, తాను ప్రజలకు ఇచ్చి అమలు చేయని హామీల విషయంలో మాత్రం మౌనంగా ఉంటున్నది. గత పదేళ్లుగా అమలు కాని మోదీ ఇచ్చిన హామీల్లో భారత రైతులకు కనీస మద్దతు ధరల విషయంలో ఇచ్చిన హామీ కూడా ఒకటి. ఈ హామీ అమలు చేయకపోవడం వల్ల ఒక్క తెలంగాణ రాష్ట్ర రైతులే గత తొమ్మిదేళ్లలో 2 లక్షల కోట్ల రూపాయలు నష్టపోయారు. దీనిని బట్టి కేంద్రంలో గత పదేళ్ళ మోదీ పాలనలో ఆంధ్రప్రదేశ్‌తో సహా, మొత్తం భారత రైతులు ఎన్ని లక్షల కోట్లు నష్టపోయారో అర్థం చేసుకోవచ్చు.

ఇదేదో మోదీ ప్రభుత్వంపై బురదజల్లడానికి గాలికి మాట్లాడుతున్న మాట కాదు. CACP ప్రతి ఏటా విడుదల చేసే పంట సాగు ఖర్చుల, ధరల నివేదికలు, తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసిన 2021 రాష్ట్ర గణాంక నివేదిక, వ్యవసాయ ప్రణాళికలు, పంటల విస్తీర్ణానికి సంబంధించి వారాంతపు నివేదికలు, తెలంగాణ ఓపెన్ డాటా వెబ్‌సైట్, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ శాఖ నివేదికల ఆధారంగా రైతు స్వరాజ్య వేదిక చేసిన విశ్లేషణ.

గత 29 ఏళ్లలో దేశవ్యాప్తంగా మూడు లక్షల మందికి పైగా రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. ఇదే కాలంలో తెలంగాణ రాష్ట్రం పరిధిలో 30వేల మంది, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కనీసం 25వేల మంది రైతులు బలవన్మరణాలకు పాల్పడ్డారు. రెండు రాష్ట్రాలలోనూ 90శాతం గ్రామీణ కుటుంబాలు అప్పుల ఊబిలో కూరుకుపోవడం, పొట్ట చేత పట్టుకుని వలస వస్తున్న గ్రామీణ ప్రజలతో పట్టణాలు, నగరాలు కిక్కిరిసిపోవడం, నగరపు చౌరస్తాలలో అడ్డాల మీద లక్షల మంది ఉపాధి కోసం ఎదురు చూస్తూ నిల్చోవడం, కనీస సౌకర్యాలు, హక్కులు లేని పట్టణ బస్తీలలో ఇబ్బందులు పడడం – ఇవన్నీ చూస్తున్న, వార్తలుగా వింటున్న ఇతర రంగాల ప్రజలకు అసలేం జరుగుతుందో అర్థం కావడం లేదు. గ్రామీణ పంటల ఉత్పత్తికి, రైతు, కూలీల జీవితాలకు దూరం జరిగిపోయిన వ్యవసాయేతరులు అర్థం చేసుకోవలసిన కొన్ని విషయాలున్నాయి.

జీవనోపాధి కోసం ఏదైనా పనిని ఎంచుకున్న ఏ రంగం వారైనా పనికి తగ్గ ఫలితం అందాలని కోరుకుంటారు. పరిశ్రమల యజమానులు అన్ని ఖర్చులను లెక్కించి ఉత్పత్తి చేసిన సరుకుల ధరలు నిర్ణయించి మార్కెట్‌కు సరఫరా చేస్తారు. వ్యాపారులు కూడా తాము పెట్టిన పెట్టుబడిపై లాభం రావాలని కోరుకుంటారు. కానీ రైతులు పండించే పంటలకు, ఇతర గ్రామీణ ప్రజలు అందించే కూరగాయలు, పండ్లు, పాలు, గుడ్లు, మాంసం, చేపలు లాంటి ఉత్పత్తులకు, ఆదివాసీలు సేకరించే అటవీ ఉత్పత్తులకు మాత్రం లాభం రాకపోగా, నష్టపోతున్న స్థితి ఉంది. గ్రామీణ ప్రజలు అసంఘటితంగా ఉండడం, ఉమ్మడిగా బేరమాడే శక్తి లేకపోవడం ఇందుకు కొంత కారణమయినా, రాజ్యాంగ పరంగా బాధ్యత ఉన్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న తప్పుడు విధానాలు వ్యవసాయ కుటుంబాల ఈ దుస్థితికి ప్రధాన కారణం.

ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా రైతులు, ఆదివాసీలు, ఇతర గ్రామీణ ప్రజలు ఉద్యమాలు చేసినప్పుడల్లా రైతుల కళ్ళు తుడవడానికి ప్రభుత్వాలు కొన్ని కమిషన్‌లు నియమించాయి. కొన్ని హామీలు ఇచ్చాయి. కానీ ఆ హామీలను అమలు చేయకుండా వదిలేశాయి. అలా వదిలేసిన వాటిలో వ్యవసాయ శాస్త్రవేత్త ఎం.ఎస్. స్వామినాథన్ కమిషన్ సిఫారసులు అత్యంత ముఖ్యమైనవి. వ్యవసాయ కుటుంబాల సంక్షోభాన్ని లోతుగా అధ్యయనం చేసిన ఈ కమిషన్ 2006లో ఇచ్చిన నివేదికలో అనేక అంశాలు ఉన్నా, రైతులు పండించే పంటల సమగ్ర ఉత్పత్తి ఖర్చులకు 50శాతం లాభం కలిపి కనీస మద్దతు ధరలను ప్రకటించాలనే సూత్రం ఆధారంగా చేసిన సిఫారసు మాత్రమే మొత్తం రైతు కుటుంబాలకు భరోసా ఇచ్చింది.

పంటలకు కనీస మద్దతు ధర కోరుతూ సాగుతున్న ఈ పోరాటం కొందరు అపోహ పడుతున్నట్లుగా కేవలం పంజాబ్, హర్యానా రాష్ట్ర పెద్ద రైతులు చేస్తున్న పోరాటం కాదు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సహా కోట్లామంది భారత సన్న, చిన్నకారు, మధ్యతరగతి రైతులు ఉమ్మడిగా సాగిస్తున్న పోరాటం. రైతులు అడుగుతున్నది గొంతెమ్మ కోరిక కానే కాదు. 2014లో మోదీ ఇచ్చిన వాగ్దానాన్ని గుర్తు చేయడమే లక్ష్యంగా ఈ ఉద్యమం సాగుతున్నది.



స్వామినాథన్ కమిషన్ సిఫారసును వెంటనే అమలు చేయాలని 2012లో గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న మోదీ అప్పటి యూపీఏ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వానికి ఒక నివేదిక ఇచ్చాడు. బీజేపీ పార్టీ అధికారంలోకి వస్తే ఈ సిఫారసును అమలు చేస్తామని కూడా 2014 ఎన్నికల సందర్భంగా ఆ పార్టీ హామీ ఇచ్చింది. కానీ మోదీ ప్రభుత్వం ఈ సిఫారసును అమలు చేయకపోవడం వల్ల గత పదేళ్లుగా రైతులు లక్షల కోట్ల రూపాయలు నష్టపోతూనే ఉన్నారు.

తెలంగాణ రైతులకు జరుగుతున్న నష్టాన్ని లోతుగా పరిశీలిస్తే రైతులు ఎదుర్కొంటున్న సమస్య తీవ్రత అర్థమవుతుంది. 2023–24 సంవత్సరానికి CACP అంచనా వేసిన క్వింటాలు ధాన్యం సమగ్ర ఉత్పత్తి ఖర్చు రూ.1911 కాగా, స్వామినాథన్ కమిషన్ సిఫారసు ప్రకారం క్వింటాలు కనీస మద్దతు ధర రూ.2867గా ప్రకటించాలి. కానీ గతంలో ఇచ్చిన హామీని ఉల్లంఘించి తప్పుడు పద్ధతుల్లో లెక్కించి, క్వింటాలు ధాన్యానికి ప్రకటించిన మద్దతు ధర కేవలం రూ.2203 మాత్రమే. ఫలితంగా రాష్ట్ర రైతులు ప్రతి క్వింటాలుపై రూ.664, ఎకరానికి రూ.15,818 నష్టపోయారు. పత్తి క్వింటాలుకు సమగ్ర ఉత్పత్తి ఖర్చు రూ.5786 కాగా సిఫారసు ప్రకారం ప్రకటించాల్సిన ధర రూ.8679. కానీ కేవలం క్వింటాలుకు రూ.7020 మాత్రమే ప్రకటించడం వల్ల రైతులు క్వింటాలుకు రూ.1659, ఎకరానికి రూ.14,135 నష్టపోయారు. ఇదే విధంగా మినుములో క్వింటాలుకు రూ.2409, పెసరలో రూ.2269, వేరు శనగలో రూ.1648, సోయాబీన్‌లో రూ.1429, పొద్దు తిరుగుడులో రూ.2180, మొక్కజొన్నలో రూ.606, జొన్నలో రూ.1025, కందిలో రూ.1990 నష్టపోయారు.

2022–23లో స్వామినాథన్ కమిషన్ సిఫారసు ప్రకారం కనీస మద్దతు ధరలు ప్రకటించకపోవడం వల్ల ఆంధ్రప్రదేశ్ వరి రైతులు కూడా ప్రతి క్వింటాలుకూ రూ.648 నష్టపోయారు. ఆ రాష్ట్రంలో పండిన కోటీ 26 లక్షల టన్నులకు గాను ఒక్క సంవత్సరమే రైతులకు రూ.8,178 కోట్ల నష్టం వాటిల్లింది. గత పదేళ్లుగా ఇలాగే జరుగుతూ రావడం వల్ల, వివిధ పంటలు పండించే రైతులు కూడా వేల కోట్ల నష్టం చవిచూస్తున్నారు.

ఉత్పత్తి ఖర్చుల లెక్కింపులో CACP అనుసరిస్తున్న పద్ధతి చాలా అన్యాయంగా ఉంది. రైతులు పెడుతున్న అనేక ఖర్చులను లెక్కలోకి తీసుకోవడం లేదు. లేదా అతి తక్కువ తీసుకుంటున్నారు. ఈ విషయంపై 2013లో ఇచ్చిన రమేష్ చంద్ కమిటీ రిపోర్టును కూడా CACP, కేంద్ర ప్రభుత్వం అసలు పట్టించుకోవడం లేదు. పైగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ లాంటి రాష్ట్రాలలో ఉత్పత్తి ఖర్చులు ఎక్కువ అవుతున్నా, కేవలం ఖర్చుల జాతీయ సగటు ఆధారంగా కనీస మద్దతు ధరలను ప్రకటిస్తున్న కారణంగా, మన తెలుగు రాష్ట్రాల రైతులకు మరింత ఎక్కువ నష్టం వాటిల్లుతున్నది. మోదీ ఇచ్చిన హామీని అమలు చేయకపోవడం వల్ల 2014 నుంచి 2024 వరకూ ప్రతి సంవత్సరం ఈ రెండు రాష్ట్రాల రైతులు వేల కోట్లు నష్ట పోతున్నారని గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల రైతు కుటుంబాల సగటు ఆదాయం నెలకు రూ.10,000 మించకపోవడానికి ఇదే ముఖ్య కారణం.

మార్కెట్‌కి తెచ్చిన పంటకి ప్రకటించిన కనీస మద్దతు ధర కూడా ఎక్కువ శాతం రైతులకు అందడం లేదని రైతు స్వరాజ్య వేదిక అధ్యయనంలో తేలింది. 2021–22లో తెలంగాణ మార్కెట్ యార్డులకు వచ్చిన జొన్నలో 88.64 శాతానికి, 2022–23లో 83.32 శాతానికి కనీస మద్దతు ధర అందలేదు. 2020–21లో మార్కెట్‌కు వచ్చిన మొక్క జొన్నలో 88.64 శాతానికి, 2021–22లో 50.98 శాతానికి కనీస మద్దతు ధర అందలేదు. కందులకు 2020–21లో 51.09 శాతానికి, 2021–22లో 58.29 శాతానికి, పెసరకు 2020–21లో 99.03 శాతానికి, 2021–22లో 99.57 శాతానికి, 2022–23లో 97.74 శాతానికి కనీస మద్దతు ధర కంటే తక్కువ ధరలు అందాయి. మినుములో 2021–22లో 54.45 శాతానికి, 2022–23లో 52.61 శాతానికి, 2020–21లో పత్తికి 94.45 శాతానికి, వరి ధాన్యంలో 2020–21లో 91.20శాతానికి, 2021–22లో 74.78శాతానికి, 2022–23లో 59.64 శాతానికి కనీస మద్దతు ధరలు అందలేదు.

కారణం స్పష్టమే. కేంద్ర ప్రకటిస్తున్న కనీస మద్దతు ధరలకు ఇప్పటి వరకూ చట్టబద్ధత లేదు. అందువల్ల ప్రైవేట్ వ్యాపారులు రైతుల నుంచి కనీస మద్దతు ధరలతో పంటలను కొనడం లేదు. పై రెండు కారణాల రీత్యా రైతులు స్వామినాథన్ కమిషన్ సిఫారసుల ప్రకారం కనీస మద్దతు ధరలు ప్రకటించాలని, ప్రకటించిన కనీస మద్దతు ధరలకు చట్టబద్ధత కల్పించాలని గట్టిగా కోరుతున్నారు. మార్చి 14న ఛలో డిల్లీకి మరోసారి పిలుపు ఇచ్చారు. ఈ రోజు రామ్ లీలా మైదానంలో మహా పంచాయత్ నిర్వహించాలని తలపెట్టారు. దేశవ్యాప్తంగా ఇదే రోజు రాష్ట్ర రాజధానులలో, జిల్లా కేంద్రాలలో ధర్నాలు నిర్వహించాలని పిలుపు ఇచ్చారు.

పంటలకు కనీస మద్దతు ధర కోరుతూ సాగుతున్న ఈ పోరాటం కొందరు అపోహ పడుతున్నట్లుగా కేవలం పంజాబ్, హర్యానా రాష్ట్ర పెద్ద రైతులు చేస్తున్న పోరాటం కాదు. తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ సహా కోట్లామంది భారత సన్న, చిన్నకారు, మధ్యతరగతి రైతులు ఉమ్మడిగా సాగిస్తున్న పోరాటం. రైతులు అడుగుతున్నది గొంతెమ్మ కోరిక కానే కాదు. 2014లో మోదీ ఇచ్చిన వాగ్దానాన్ని గుర్తు చేయడమే లక్ష్యంగా ఈ ఉద్యమం సాగుతున్నది. అందుకే వ్యవసాయ కుటుంబాల సంక్షేమం కోసం జరుగుతున్న ఈ రైతు ఉద్యమానికి ప్రజలంతా సంఘీభావం ప్రకటించాలి.

• కన్నెగంటి రవి
• రాజగోపాల్
రైతు స్వరాజ్య వేదిక



పట్టుబడిన ఫోన్లను పరిశీలిస్తున్న పోలీసులు

ఖరీదైన ఫోన్.. కొన్న కొన్నిరోజులకే పోయిందా..!, మీ వ్యక్తిగత సమాచారం, ఆఫీసు వివరాలు, కాంటాక్టు నెంబర్లు ఉన్న మీ సెల్‌ఫోన్ చోరీకి గురైందా..!, వివిధ ముఖ్యమైన విషయాలకు సంబంధించిన డేటా, ఇతరత్రా వివరాలు నిక్షిప్తమై ఉన్న సెల్ ఉన్నట్టుండి మాయమైపోయిందా.. అయితే, భయపడాల్సిన పనిలేదు. పోలీస్ శాఖ కొత్తగా తీసుకొచ్చిన చాట్‌బోట్ అప్లికేషన్ ద్వారా దొంగతనానికి గురైన మీ ఫోన్‌ను పూర్తి వివరాలు ఉంటే ఇట్టే పట్టేయొచ్చు. రూ.కోటి విలువచేసే 928 సెల్‌ఫోన్లను కమిషనరేట్ పోలీసులు కనుగొని బుధవారం బాధితులకు అప్పజెప్పారు.

ఫోనుపోనూ..

పోయిన సెల్‌ఫోన్లను పసిగట్టే చాట్‌బోట్ అప్లికేషన్

- పోలీస్ కమిషనరేట్‌లో సత్ఫలితాలు
- రూ.కోటి విలువచేసే 928 సెల్‌ఫోన్ల ట్రాక్
- బాధితులకు అందజేసిన పోలీసులు

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : మార్కెట్లో ఒక్కో కంపెనీ ఫోన్‌కు ఒక్కో ధర ఉంటుంది. ధర ఎంత ఉన్నా తమ అవసరాలు తీరడానికి సరిపడా డబ్బు వస్తే చాలని నేరగాళ్లు అనుకుంటున్నారు. రద్దీ ప్రదేశాల్లో ఫోన్లను కాజేస్తున్నారు. వ్యక్తుల కదలికలను బట్టి ఫోన్లను కాజేస్తున్న నేరగాళ్లు మూడు నెలలపాటు వాటిని స్విచ్ఛాఫ్ చేస్తున్నారు. దీనికి ఒక కారణం ఉంది. ఫోన్లు పోయిన వెంటనే బాధితులు పోలీసులను ఆశ్రయిస్తారు. పోలీసులు ఒకవేళ ఐఎంఈఐ నెంబరు ద్వారా ట్రాక్‌చేస్తే ఫోన్ ఎక్కడ ఉందో నిమిషాల్లో తెలిసిపోతుంది. పోలీసులకు చిక్కకుండా ఈ ఫోన్లను మూడు నెలలు స్విచ్ఛాఫ్ చేస్తున్నారు. ఆ తర్వాత ఆ వ్యక్తి కొత్త ఫోన్ కొనుగోలు చేయడంతో పాటు పోగొట్టుకున్న ఫోన్ గురించి పట్టించుకునే పరిస్థితి ఉండదు. ఈ విషయాన్ని బాగా గమనించిన నేరగాళ్లు మూడు నెలల తర్వాత ఎవరో ఒకరికి తక్కువ ధరకు విక్రయించేస్తున్నారు. రూ.40 వేల నుంచి రూ.50 వేల విలువ చేసే ఫోన్లను రూ.10 వేల నుంచి రూ.15 వేలకు విక్రయిస్తున్నారు. రూ.60 వేల నుంచి రూ.70 వేల విలువ చేసే ఫోన్లను రూ.20 వేల నుంచి రూ.30 వేలకు అమ్ముతున్నారు. తమకు పరిచయం ఉన్నవారికి, కామన్ ఫ్రెండ్స్‌గా ఉన్నవారికి, విద్యార్థులకు ఈ ఫోన్లను అంటగడుతున్నారు. దొంగిలించిన ఫోన్లను బస్సులు, రైళ్లలో ప్రయాణాలు చేసేటప్పుడు పరిచయమైన వ్యక్తులకు తక్కువ ధరకు అమ్మేస్తున్నారని పోలీసులు గుర్తించారు.

చాట్‌బోట్ అప్లికేషన్

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల రికవరీ కోసం విజయవాడ పోలీసులు ప్రత్యేకంగా చాట్‌బోట్ అప్లికేషన్ తీసుకొచ్చారు. పోయిన ఫోన్‌కు సంబంధించిన అన్ని వివరాలను ఈ యాప్‌లో నమోదు చేస్తే, సైబర్ క్రైం పోలీసులు వాటి ఐఎంఈఐ నెంబర్ ద్వారా ట్రాక్ చేస్తున్నారు. విజయవాడ, చుట్టుపక్కల ప్రాంతాల్లో పోయిన ఫోన్లు తెలంగాణ, చెన్నై రాష్ట్రాల్లో ఉన్నట్టు గుర్తించి తీసుకొచ్చారు. ఈ ఫోన్లు ఉపయోగిస్తున్న వారిని విచారణ చేయగా, ఖరీదైన ఫోన్లు తక్కువ ధరకు అమ్మడంతో కొనుగోలు చేశామని చెప్పారు. చాట్‌బోట్ యాప్ ద్వారా వచ్చిన ఫిర్యాదులను బట్టి ఇప్పటి వరకు పోలీసులు మొత్తం 928 సెల్‌ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అప్పగించారు.

కమిషరేట్‌లో అత్యధికంగా...

ఎన్టీఆర్ పోలీస్ కమిషనరేట్ సైబర్ క్రైం విభాగ పోలీసులు తొలిసారిగా భారీ మొత్తంలో సెల్‌ఫోన్లను ట్రాక్ చేశారు. వివిధ పరిస్థితుల్లో పోగొట్టుకున్న ఫోన్లను స్వాధీనం చేసుకుని సంబంధిత వ్యక్తులకు బుధవారం అందజేశారు. రూ.కోటి విలువ చేసే 628 సెల్‌ఫోన్లను వాటి యజమానులకు విజయవాడలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో డీసీపీలు అధిరాజ్‌సింగ్ రాణా, రూరల్ డీసీపీ కంచి శ్రీనివాసరావు, సైబర్ క్రైం ఏసీపీ తేజేశ్వరరావు, ఇన్‌స్పెక్టర్ కోమాకుల శివాజీ ఈ సెల్‌ఫోన్లను ఇచ్చారు. ఇంతకుముందు సైబర్ క్రైం ఇన్‌స్పెక్టర్‌గా పుల్లా సత్యానందం ఉన్నప్పుడు రూ.50 లక్షల విలువ చేసే 300 ఫోన్లను బాధితులకు అప్పగించారు.

ఆశ పడినా ఆధారాలు చూడండి

ఖరీదైన ఫోన్లు తక్కువ ధరకు వస్తున్నాయంటే ఆశ కలగడం సాధారణం. తక్కువ ధరకు వస్తున్నాయని ఎలాంటి బిల్లులు పరిశీలించకుండా ఫోన్లను కొనుగోలు చేయొద్దు. ఎవరైనా ఖరీదైన ఫోన్‌ను తక్కువ ధరకు విక్రయిస్తామని ఆఫర్ ఇస్తే ముందుగా బిల్లులు, ఫోన్‌కు సంబంధించిన బాక్స్‌ను పరిశీలించండి. అమ్మడానికి వచ్చిన వ్యక్తి పేరుతో బిల్లు ఉందో లేదో సరి చూసుకోవాలి. అప్పుడు మాత్రమే కొనాలి.

\- కంచి శ్రీనివాసరావు, డీసీపీ

మంగళవారం సీన్..

కనకదుర్గమ్మ వారధి పక్కన, రిటైనింగ్ వాల్‌పై నిర్మించిన 'విజయవాడ రివర్ ఫ్రంట్' పార్కు.. చక్కటి వాతావరణం.. పచ్చటి మొక్కలు.. పిల్లలు ఆడుకునే ఆట పరికరాలు.. పెద్దలు వ్యాయామం చేసుకునే పరికరాలు.. అందమైన ప్రాంగణంతో కళకళలాడిన ఈ పార్కును సీఎం జగన్ ప్రారంభించి 'కృష్ణమ్మ జలవిహారం' అని నామకరణం చేశారు. ఇంకేముంది ఆహ్లాదకరమైన పార్కు మన ముంగిట వాలిందని స్థానికులు తెగ ఆనందపడిపోయారు. కట్ చేస్తే..

బుధవారం సీన్..

రివర్ ఫ్రంట్ పార్కు 'రివర్స్' అయ్యింది. మొండిగా నిలబడిన ఆటపరికరాలు.. ఊడిపడిన వ్యాయామ పరికరాలు.. కనిపించకుండా పోయిన పచ్చటి లాన్.. పూర్తికాని పనులు.. సందర్శకులను రానివ్వకుండా గేటు బయట సెక్యూరిటీ గార్డు.. సీఎం జగన్ వస్తున్నారని పైపై పనులతో, మొండి పరికరాలతో హడావిడి చేసిన అధికారులు ఆయన వెళ్లాక ఇప్పుడు తీరిగ్గా పనులు చేస్తూ సందర్శకులకు తెలిగ్గా నో ఎంట్రీ చెప్పేశారు.



నామ్ కే వాస్తేగా నిలబెట్టిన ఆటపరికరాల వద్ద పిల్లల ఆటలు

రివర్స్ ఫ్రంట్..!

రివర్ ఫ్రంట్ పార్కు పరిస్థితి రివర్స్



కాంక్రీట్ వేసి నిలబెట్టిన ఆట పరికరాలు

- ప్రారంభం రోజే తొందర.. మరుసటిరోజు చిందరవందర
- సీఎం కోసం నామ్‌కే వాస్తేగా నిలబెట్టిన పరికరాలు
- ఇప్పుడు హడావిడిగా చేపడుతున్న పనులు
- సందర్శకులెవరూ రాకుండా బయట సెక్యూరిటీ గార్డు
- ఆశగా వచ్చిన స్థానికులు నిరాశతో వెనక్కి..
- పనులు కానప్పుడు ప్రారంభమెందుకని ఆగ్రహం

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : కనకదుర్గమ్మ వారధికి దిగువన రూ.12.3 కోట్లతో నిర్మించిన రిటైనింగ్ వాల్‌ను ఆనుకుని విజయవాడ 'రివర్ ఫ్రంట్' పేరుతో నిర్మించిన పార్కుపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇక్కడి నుంచి కృష్ణానది అందాలను వీక్షించవచ్చన్న కోణంలో ఈ పార్కును నిర్మించారు. వాల్ వెంబడి వాకింగ్ ట్రాక్, దీనికి రెండువైపులా లాన్ ఏర్పాటు చేశారు. వ్యాయామం చేసుకోవడానికి పరికరాలు, పిల్లలు ఆడుకోవడానికి ఆట పరికరాలను సిద్ధం చేశారు. సీఎం మంగళవారం ప్రారంభించడానికి అనుకూలంగా సిద్ధం చేశారు.

ప్రారంభ కోసమే తొందర

విజయవాడ రివర్ ఫ్రంట్ పేరుతో పార్కును నిర్మించినా, దానికి సీఎం జగన్ కృష్ణమ్మ జలవిహారం అని నామకరణం చేసి ప్రారంభించారు. తొలిరోజు అధికారులు పార్కును సకల హంగులతో సిద్ధంచేసినా.. మరుసటిరోజు కళావిహీనంగా మారింది. సందర్శకులు లోపలకు వెళ్లకుండా ప్రధాన ద్వారం వద్ద సెక్యూరిటీ గార్డును నియమించారు. పార్కులో ఇంకా పనులు జరుగుతున్నాయని, మరో రెండు రోజుల సమయం పడుతుందని చెప్పి వచ్చిన సందర్శకులను, పిల్లలను వెనక్కి పంపేశారు. దీంతో సందర్శకులంతా నిరాశకు లోనయ్యారు. త్వరలో జరగబోయే ఎన్నికల్లో తాను చేసిన అభివృద్ధి ఇదీ.. అని చెప్పుకోవడానికి వీలుగా ఈ పార్కును జగన్ హడావిడిగా ప్రారంభించారని చుట్టుపక్కల వారు విమర్శిస్తున్నారు.

పనులన్నీ చిందరవందర

పులప్స్ బార్, అప్ అండ్ డౌన్, ఊయల, ఫ్రంట్ అండ్ బ్యాక్, జారుడుబల్ల.. ఇవన్నీ చిన్నపిల్లలు ఆడుకునే పరికరాలు. పులప్స్ బార్, ఫ్రంట్ అండ్ బ్యాక్‌పై యువకులు వ్యాయామం చేసుకుంటారు. పార్కు ప్రారంభోత్సవం రోజున ఇవన్నీ బాగానే ఉన్నాయి. బుధవారం మాత్రం నేలపై ఒరిగి ఉన్నాయి. సీఎం రాక కోసం వాటిని ఇసుకలో తాత్కాలికంగా నిలబెట్టామని అక్కడ పనులు చేస్తున్నవారు తెలిపారు. వాటిని పక్కనపెట్టి ఇప్పుడు శాశ్వతంగా అమర్చే పనులు సాగుతున్నాయి. గోతులు తవ్వి ఆ పరికరాలను నిలబెట్టి కాంక్రీట్ వేస్తున్నారు. పార్కుకు మొదటి ప్రదేశంలో మాత్రమే పనులు కొంతవరకు పూర్తయ్యాయి. లోపలకు వెళ్లేకొద్దీ గ్రావెల్ వేయడం, మొక్కలు నాటడం వంటి పనులు జరుగుతున్నాయి. గార్డెనింగ్ పనులు పూర్తిస్థాయిలో జరగలేదు. సీఎం సందర్శించిన ప్రదేశంలో మాత్రమే పనులను పూర్తిచేసి అధికారులు మమ అనిపించారు. పనులు పూర్తికాని పార్కు ప్రారంభోత్సవానికి ఇంత హడావిడి ఎందుకని సందర్శకులు మండిపడుతున్నారు.

ఓట్లు పట్టాలని..

గుట్టుచప్పుడు కాకుండా అక్రమ పట్టాలు సిద్ధం చేసిన కొడాలి నాని



ఎమ్మెల్యే కొడాలి నాని క్యాంప్ కార్యాలయం (ఫైల్)

- వైసీపీ కార్యకర్తలు, సానుభూతిపరులతో జాబితా సిద్ధం
- చక్రం తిప్పుతున్న రెవెన్యూ అధికారి
- పాత తేదీలతో పట్టాల పంపిణీకి ఏర్పాట్లు
- ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సర్వంసిద్ధం
- ఒక్కో పట్టాకు రూ.50 వేల నుంచి రూ.లక్ష వసూలు
- లబ్ధిదారుల పేర్లు బయటకు పొక్కనీయకుండా చర్యలు

అధికార పార్టీ మరో అక్రమానికి తెరలేపింది. ఎమ్మెల్యే నాని అనుచరుల కనుసన్నల్లో అక్రమ పట్టాలు గుట్టుచప్పుడు కాకుండా పంపిణీకి రంగం సిద్ధమైంది. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం వేదికగా నందివాడకు చెందిన రెవెన్యూ ఉద్యోగిని అనధికార డిప్యుటేషన్‌పై తీసుకువచ్చి పట్టాలను సిద్ధం చేస్తున్నట్టు అధికార పార్టీ నాయకులే బహిరంగంగా చెబుతుండటం గమనార్హం. పట్టాలపై పాత తేదీలు వేసి పాత అధికారులతో సంతకాలు పెట్టించి ఎన్నికల షెడ్యూల్ వచ్చేలోపు పంపిణీ చేసేందుకు రెవెన్యూ అధికారులు, ఎమ్మెల్యే అనుచరులు రెండు నెలలుగా కసరత్తు చేస్తున్నారు. గన్నవరంలో ఎమ్మెల్యే వంశీ అక్రమ పట్టాలు పంపిణీ చేసినట్టే గుడివాడ ఎమ్మెల్యే అదే పంథాలో అక్రమ తంతుకు సిద్ధమయ్యారు.

గుడివాడ : ముఖ్యమంత్రి జగన్ గతేడాది జూన్ 6వ తేదీన గుడివాడ పర్యటనలో మరో 3వేల మంది లబ్ధిదారులకు సెంటు స్థలం పట్టాలు ఇస్తానని హామీ ఇచ్చారు. ఇప్పటి వరకూ పట్టించుకోలేదు. గుడివాడను అభివృద్ధి చేయలేదు. ఇచ్చిన హామీలు అమలు చేయలేదు. దీంతో పార్టీ కార్యకర్తల్లోనూ వ్యతిరేకత నెలకొంది. ఎన్నికల్లో లబ్ధి పొందాలంటే ఏదో ఒకటి చేయాలని, కనీసం పార్టీ కార్యకర్తలనైనా నిలబెట్టుకోవాలని స్థానిక ఎమ్మెల్యే భావించారు. రెవెన్యూ అధికారిని పిలిపించి త్వరితగతిన పట్టాలు సిద్ధం చేయాలని, వైసీపీ కార్యకర్తలు, సానుభూతిపరులకు ఇవ్వాలని కోరారు. అధికార పార్టీకి వీరవిధేయులుగా ఉన్న సదరు అధికారి వెంటనే వీఆర్వోలకు పట్టాలు సిద్ధం చేయాలని దిశానిర్దేశం చేశారు. కొందరు వీఆర్వోలు తాము చేయబోమని తేల్చి చెప్పారు. ఎన్నికల అనంతరం సంతకాలు చేయని అధికారులపై తమ పద్ధతిలో చర్యలు తీసుకుంటామని గడ్డం గ్యాంగ్‌తో పాటు రెవెన్యూ అధికారి సైతం బెదిరింపులకు దిగడంతో కొందరు అధికారులు సంతకాలను చేయడానికి ముందుకొచ్చారు.

నెల రోజులుగా జాబితాపై కసరత్తు

ముగ్గురు వైసీపీ నాయకులు, ఇద్దరు రెవెన్యూ అధికారులు కలిసి లబ్ధిదారుల జాబితాపై నెల రోజులుగా కసరత్తు చేస్తున్నారు. అందులో వైసీపీ కార్యకర్తలు, సానుభూతిపరులు ఉండేలా చూసుకుంటున్నారు. పట్టణంతో పాటు మున్సిపాలిటీలో విలీనం కానున్న గ్రామాల నుంచి లబ్ధిదారులను ఎంపిక చేసినట్టు సమాచారం. అంతా సిద్ధం చేసి పాత తేదీలతో పట్టాలు ఇచ్చేందుకు పూనుకున్నారు. బదిలీపై వెళ్లిన అధికారులందరినీ హుటాహుటిన గుడివాడ రావాలని క్యాంప్ కార్యాలయం నుంచి సమాచారం వెళ్లినట్టు విశ్వసనీయవర్గాల సమాచారం. ఎట్టి పరిస్థితుల్లోనూ రెండు రోజుల వ్యవధిలో సంతకాలు పూర్తయి ఎమ్మెల్యే అనుచరులకు అందించాలని అధికారి హుకుం జారీ చేసినట్లు సమాచారం.

పట్టాలకు నగదు వసూలు

లబ్ధిదారుల అవసరాన్ని అవకాశంగా మలుచుకుని గడ్డం గ్యాంగ్, రెవెన్యూ అధికారి ప్రతి పట్టాకూ ధర నిర్ణయించారు. సుమారు 300 మంది లబ్ధిదారులను ఈ విధంగా గుర్తించి, వేరే వారి స్థానంలో వీరి పేర్లు చేర్చారు. ఈ క్రమంలో లబ్ధిదారులను రహస్యంగా క్యాంప్ కార్యాలయానికి పిలిచి రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు డిమాండ్ చేసినట్టు సమాచారం. వీఆర్వోలే లబ్ధిదారుల నుంచి వసూలు చేసి తీసుకురావాలని రెవెన్యూ అధికారి హుకుం జారీ చేశారు. వచ్చిన మొత్తంలో సగభాగాన్ని నందివాడ నుంచి వచ్చిన రెవెన్యూ అధికారి, ఎమ్మెల్యే నానికి అన్నీ తానై నడిపించే రెవెన్యూ అధికారి, గడ్డం గ్యాంగ్ సభ్యులు పంచుకుంటున్నట్టు సమాచారం.

రెవెన్యూ అధికారి తీరు దారుణం

తాను చెప్పినట్టు విని సంతకాలు చేయాలని, లేనిపక్షంలో వారి వ్యవహారాన్ని వేరే విధంగా చూస్తానని సదరు రెవెన్యూ అధికారి దిగువ స్థాయి అధికారులపై బెదిరింపులకు పాల్పడుతున్నట్టు సమాచారం. నోటికి వచ్చిన బూతులు, రాయడానికి వీలు లేని దుర్భాషలతో వీఆర్వోలపై చిందులు తొక్కుతున్నట్టు రెవెన్యూ కార్యాలయ వర్గాలు చెబుతున్నాయి.

లబ్ధిదారుల పేర్లు రహస్యంగా..

సెంటు స్థలం పట్టాలు ఎవరికి ఇచ్చారో, ఏ వార్డుకు చెందిన వారో, ఏ గ్రామానికి చెందినవారో ఇప్పటికీ బహిర్గతం కాలేదు. గుట్టుచప్పుడు కాకుండా వార్డుల్లో, గ్రామాల్లో వైసీపీ నాయకులు పట్టాలను ఇళ్లకు వెళ్లి అందిస్తూ రానున్న ఎన్నికల్లో వైసీపీకి ఓటు చేయాలని కోరుతున్నట్టు తెలిసింది. రెండు రోజులుగా అర్జీలు పెట్టి ఇంటి స్థలం రాని పేదలను గుర్తించి వారిని హుటాహుటిన సచివాలయాలకు పిలిచి మళ్లీ ఆన్‌లైన్ చేయిస్తున్నారు. ఎన్నికల కోడ్ ఏ క్షణమైన అమలులోకి రానుండటంతో అధికార పార్టీ నాయకులు ఈ జిమ్మిక్కులకు పాల్పడుతున్నారు.

చిన్నారిపై వరాహం దాడి

- అడ్డుకోబోయిన అమ్మమ్మపైనా దాడి
- గుడ్లవల్లేరులో ఘటన

- 6లో..



వరాహం దాడిలో గాయపడిన చిన్నారి హర్షిణి



రంజాన్ వేళలు

ఇఫ్తార్ (సాయంత్రం) : 6-19 (గురు)
సహర్ (ఉదయం) : 5-04 (శుక్ర)

1,665 ఓట్ల తొలగింపు

రాష్ట్ర ఎన్నికల సంఘానికి జిల్లా యంత్రాంగం ప్రతిపాదన

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : చనిపోయిన, బదిలీ అయిన ఓట్లకు సంబంధించి వచ్చిన దరఖాస్తుల మేరకు జిల్లాలో 1,665 ఓట్ల తొలగింపునకు యంత్రాంగం రాష్ట్ర ఎన్నికల సంఘానికి ప్రతిపాదనలు పంపింది. జిల్లా ఎన్నికల అధికారి దిల్లీరావు పంపిన ఈ ప్రతిపాదనకు ఎన్నికల సంఘం అంగీకారం తెలిపింది. తిరువూరులో 57, విజయవాడ పశ్చిమలో 335, విజయవాడ సెంట్రల్‌లో 1,053, విజయవాడ తూర్పులో 353, మైలవరంలో 393, నందిగామలో 113, జగ్గయ్యపేటలో 30 మంది ఓట్ల తొలగింపునకు దరఖాస్తులు వచ్చాయి. తిరువూరులో 20, విజయవాడ పశ్చిమలో 270, విజయవాడ సెంట్రల్‌లో 783, విజయవాడ తూర్పులో 255, మైలవరంలో 323, నందిగామలో 2, జగ్గయ్యపేటలో 12 ఓట్ల చొప్పున మొత్తం 1,665 ఓట్లను తొలగించేందుకు జిల్లా ఎన్నికల యంత్రాంగం నిర్ణయించింది. క్షేత్రస్థాయి పరిశీలన మేరకు వీటి తొలగింపునకు ఎన్నికల సంఘం ఆమోదం తెలిపింది.

కోడై కూస్తున్నారు..!

ఐదుశాతం కమీషన్ల కోసం కాంట్రాక్టర్లపై ఒత్తిడి

- కోడ్ వచ్చేలోపు ఎంవోయూలు తీసుకుని డబ్బు ఇవ్వాలని హుకుం
- ఏపీటీడీసీలో ఆధునికీకరణ పనుల కోసం హడావిడి

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : 'ఎన్నికల కోడ్ వచ్చేస్తోంది. తొందరగా డబ్బు కట్టండి. ఎంవోయూలు చేసుకోండి. ఆ తర్వాతే పనులు చేపట్టండి..' అంటూ ఏపీటీడీసీ ఉన్నతాధికారులు కాంట్రాక్టర్లపై ఒత్తిడి తెస్తున్నారు. విజయవాడ డివిజన్‌తో పాటు ఇతర డివిజన్ల పరిధిలోని పర్యాటక యూనిట్లన్నింటిలోనూ కాంట్రాక్టర్ల మెడపై కత్తిపెట్టి ఎదురు డబ్బు కట్టించుకుని పనులు చేయించాలని చూస్తున్నారు. ఇవన్నీ సెక్యూరిటీ డిపాజిట్‌లో, ఎంవోయూ ఫీజులో అనుకునేరు. ఉన్నతాధికారులకు ఇవ్వాల్సిన కమీషన్లు. 'మీకు పనులిచ్చాం కదా.. మాకు ఇవ్వాల్సిన పర్సంటేజీ' అంటూ మొహమాటం లేకుండా ఉన్నతాధికారులు కాంట్రాక్టర్లను అడిగేస్తున్నారు. హడావిడిగా ఎంవోయూలు చేసుకోమని బెదిరించటం, ఎన్నికల కోడ్ పేరుతో ఒత్తిడి తీసుకురావటం వంటి సంఘటనలతో కాంట్రాక్టర్లు సైతం ఆశ్చర్యపోతున్నారు. 'మీరు చేపట్టే పనులకు డబ్బులెక్కడా ఆగవు. బ్యాంకులకు లింకేజీ చేశాం.' అని ఉన్నతాధికారులు చెబుతున్నారు. పనులు చేసి బిల్లులు పెడితే నేరుగా బ్యాంకులే డబ్బులిచ్చేస్తాయంటున్నారు.

ఎన్నికల కోడ్‌కు ముందే..

భవానీ ఐల్యాండ్, హరిత బెర్మ్‌పార్క్, సూర్యలంక, నాగార్జున సాగర్ తదితరాలతో పాటు అనేక డివిజన్లలోని పర్యాటక ప్రాజెక్టుల్లో ఆధునికీకరణ పనుల కోసం ఇటీవల ఏపీటీడీసీ ఉన్నతాధికారులు టెండర్లు పిలిచారు. ఆధునికీకరణ అనంతరం వీటిని ప్రైవేటుకు కట్టబెట్టేందుకు సిద్ధం చేస్తున్నారు. కమీషన్ల కోసం ఆశ పడిన ఉన్నతాధికారులు ఐదు శాతం డబ్బు ముందుగా కట్టాలని కోరుతున్నారు. ఒక్కో యూనిట్‌లో సగటున రూ.2 కోట్ల నుంచి రూ.4 కోట్ల వరకు పనులకు టెండర్లు పిలిచారు. 5 శాతం అంటే రూ.20 లక్షల నుంచి రూ.40 లక్షల మేర వసూలు చేయటానికి ప్లాన్ వేశారు. ఎంవోయూలు చేసుకుంటే ఎప్పుడైనా పనులు చేసుకోవచ్చని, పేమెంట్లు కూడా ఇబ్బందులు లేకుండా బ్యాంకుల ద్వారా చెల్లించేలా జమ చేయటం జరిగిందని కాంట్రాక్టర్లను మభ్యపెడుతున్నారు. ఒకవేళ ప్రభుత్వం మారితే ఏపీటీడీసీలో జరిగిన దొంగపనులన్నింటిపై విచారణ జరుగుతుందన్న ఉద్దేశంతో ముందే లాభాన్ని వెతుక్కుంటున్నారు.

కాంట్రాక్టర్లలో ఆందోళన

ఉన్నతాధికారుల ఈ ఆఫర్‌తో కాంట్రాక్టర్లు ఉలిక్కిపడుతున్నారు. పనులు చేసేందుకు ఇంకా ఒప్పందాలు కూడా జరక్కుండానే ఉన్నతాధికారులు ఒత్తిడి తెస్తుండటంతో ఎంవోయూలు చేసుకునే విషయంలో కాంట్రాక్టర్లు కూడా ఆలోచనలో పడ్డారు. ఒత్తిడి వస్తున్నా పెద్దగా పట్టించుకోవట్లేదు.

సివిల్ పనులకు మెకానికల్ ఇంజనీర్

పర్యాటక యూనిట్లలో ఆధునికీకరణ పనులకు శ్రీకారం చుట్టిన ఏపీటీడీసీ వాటి బాధ్యతను ఓ అధికారి చేతిలో పెట్టింది. ఆ అధికారి మెకానికల్ ఇంజనీర్. కానీ, ఆయన సివిల్ పనులను పర్యవేక్షిస్తుండటం గమనార్హం. కొవిడ్ సమయంలో ఈ మెకానికల్ ఇంజనీర్ భోజన ప్లేట్లు, ఆఖరుకు బియ్యం దగ్గర కూడా ఎంత కక్కుర్తిపడ్డాడో అందరికీ తెలిసిందే. మార్కెట్ కంటే ఎక్కువ రేటుకు భోజన ప్లేట్లు తెప్పించటం, తక్కువ రకం నిత్యావసరాలను కాంట్రాక్టర్ సరఫరా చేయటం వెనుక కూడా ఇతని పాత్ర ఉంది.



మాక్ పార్లమెంట్‌లో పాల్గొన్న యువతకు సర్టిఫికెట్లు అందజేసిన నిర్వాహకులు

దేశ నిర్మాణంలో యువతది కీలక పాత్ర

» ఆకాశవాణి, ఏడీ శ్రీసాయి వెంపటి

అజిత్‌సింగ్‌నగర్, మార్చి 13 : దేశ నిర్మాణంలో యువత కీలక పాత్ర వహించాలని, రాజకీయాల్లో రాణించి దేశ పురోగతికి పాటుపడాలని విజయవాడ ఆకాశవాణి ఏడీ, శ్రీసాయి వెంపటి అన్నారు. నగరంలోని వీఆర్ సిద్ధార్థ ఇంజనీరింగ్ కాలేజీ ఆడిటోరియంలో బుధవారం 'నైబర్ హుడ్ యూత్ పార్లమెంట్' కార్యక్రమం జరిగింది. యువజన వ్యవహారాలు, క్రీడామంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి శ్రీసాయి వెంపటి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా యువతను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ, యువత, యూత్ స్కిల్స్, బేటీ బచావో, బేటీ పడావో, వంటి ఫ్లాగ్‌షిప్ కార్యక్రమాల ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే వివిధ పథకాల అమలు, దరఖాస్తులు, ప్రయోజనాలను వివరించారు. అలాగే ఆరోగ్యం, స్టార్టప్ ఇండియా, డిజిటల్ ఇండియాలో యువత పాత్ర, స్వచ్ఛభారత్, ఆయుష్మాన్ భారత్ అంశాలపై ప్రసంగించారు. అనంతరం విద్యార్థులు అధికార, ప్రతిపక్షసభ్యులుగా మాక్ పార్లమెంట్ నిర్వహించి తీర్మానం అందజేశారు. జిల్లాస్థాయి నైబర్‌హుడ్ యూత్ పార్లమెంట్‌కు హాజరైన వారందరికి సర్టిఫికెట్లను అందజేశారు. అనంతరం జిల్లా యువజన అధికారి సుంకర రాము మాట్లాడుతూ, యువత తమ అభిప్రాయాలను ధైర్యంగా తెలియజేయాలన్నారు. దేశ వ్యాప్తంగా యువత కోసం నెహ్రూ యువకేంద్ర సంఘటన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పలు కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో కళాశాల డీన్ పాండురంగారావు, నైపుణ్యాభివృద్ధి అధికారి, ఎస్.శ్రీనివాస్, భవిరి శంకరనాథ్, శ్రీరాఘవశర్మ, కె.నరేంద్ర, నీలాంబరం, రఘువీర్, పి.రమేష్‌కుమార్, ఎం.జయరాజాన్‌లు పాల్గొన్నారు.



క్రీడాకారులను అభినందిస్తున్న స్టేడియం కమిటీ

ఉమ్మడి కృష్ణా చాంపియన్లుగా స్టేడియం పవర్‌లిఫ్టర్లు

గుడివాడ, మార్చి 13 : ఇటీవల జరిగిన ఉమ్మడి కృష్ణాజిల్లా పవర్ లిఫ్టింగ్ పోటీల్లో స్థానిక ఎన్టీఆర్ స్టేడియం జిమ్ లిఫ్టర్లు ఓవరాల్ చాంపియన్లుగా నిలిచారని స్టేడియం కమిటీ కోశాధికారి ఏవీ రామాంజనేయులు, జిమ్ కోచ్ మారెళ్ల వెంకటేశ్వరరావులు తెలిపారు. బుధవారం పతకాలు సాధించిన క్రీడాకారుల అభినందన కార్యక్రమం నిర్వహించారు. 105 కేజీల శరీర బరువు విభాగంలో కె.మాణిక్యాలరావు బంగారు పతకం, 66 కేజీల శరీర బరువు విభాగంలో డి.రాజ్‌కుమార్ వెండి పతకం, 74 కేజీల శరీర బరువు విభాగంలో కె.జీవన్‌కుమార్ బంగారు పతకం, 83 కేజీల శరీర బరువు విభాగంలో ఎం.అజయ్‌కుమార్ బంగారు పతకం, 84కేజీల శరీర బరువు విభాగంలో పి.స్వాతిశ్రీ బంగారు పతకం, 93కేజీల శరీర బరువు విభాగంలో జి.ధనుష్ బంగారు పతకం, 105కేజల శరీర బరువు విభాగంలో కె.ఫణికుమార్ వెండి పతకం సాధించారన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ జంపా ఉషాకుమారి, స్టేడియం మేనేజర్ ఎం.సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న హరిబాబు

ధాన్యం డబ్బు రూ. వెయ్యికోట్లు చెల్లించండి

» కౌలురైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హరిబాబు

తోట్లవల్లూరు : రాష్ట్రవ్యాప్తంగా ధాన్యం తోలిన రైతులకు రూ. వెయ్యి కోట్ల డబ్బులను 60 రోజులుగా ప్రభుత్వం విడుదల చేయటం లేదని, దీంతో రైతులు బ్యాంకుల వేధింపులు తట్టుకోలేకపోతున్నారని కౌలురైతు సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి మాగంటి హరిబాబు అన్నారు. తోట్లవల్లూరులో బుధవారం సాయంత్రం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, 21 రోజులకే ధాన్యం డబ్బులు చెల్లిస్తామని చెప్పిన ప్రభుత్వం రెండు నెలలు గడిచినా చెల్లించకపోవటం దారుణమన్నారు. ధాన్యం బస్తా రూ. 1,640 ఉంటే మిల్లర్లు రూ 1,400 మాత్రమే రైతులకు చెల్లించాయని, మిల్లర్లకు ఆర్బీకేలు దళారీ కేంద్రాలుగా మారాయని ఆరోపించారు. ధాన్యం రైతులకు తక్షణమే డబ్బు చెల్లించాలని, లేకుంటే ఆందోళన చేపడతామని ఆయన హెచ్చరించారు. సమావేశంలో శీలం ప్రకాశరావు, సీహెచ్ రాజారావు, వీరంకి శ్రీనివాసరావు, ఎ.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

చిన్నారిపై వరాహం దాడి

» అడ్డుకోబోయిన అమ్మమ్మకూ తీవ్ర గాయాలు



వరాహం దాడిలో గాయపడిన చిన్నారి హర్షిణి, దాడిని వివరిస్తున్న అమ్మమ్మ

గుడ్లవల్లేరు, మార్చి 13 : ఇంటి వాకిట్లో ఆడుకొంటున్న మూడేళ్ల చిన్నారిపై వరాహం దాడి చేసింది. వరాహం దాడిని పసిగట్టిన పాప అమ్మమ్మ దానిబారి నుంచి పాపను విడిపించే ప్రయత్నం చేయగా ఆమె పైన కూడా దాడిచేసి తీవ్రంగా గాయపరిచిన సంఘటన గుడ్లవల్లేరులో బుధవారం రాత్రి చోటుచేసుకొంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక ప్రభుత్వాసుపత్రి ఎదురు వీధిలో నివాసం ఉంటున్న ఉదయశ్రీ మనవరాలు హర్షిణి అమ్మమ్మ ఇంట్లో పెరుగుతోంది. బుధవారం ఇంటి వాకిట్లో ఆడుకుంటున్న సమయంలో అక్కడకు వచ్చిన వరాహం హర్షిణి పైకి ఎగబడి దాడి చేసింది. చిన్నారి పెద్దగా కేకలు పెట్టడంతో ఇంటో ఉన్న ఉదయశ్రీ పరుగెత్తుకు వచ్చి ఆ వరాహాన్ని కొట్టే ప్రయత్నం చేయగా ఆమెపైన కూడా దాడి చేసింది. ఉదయశ్రీ జుట్టు నోట కరచి ఈడ్చుకు కొంతదూరం ఈడ్చుకు వెళ్లింది. వారి అరుపులు విన్న స్థానికులు వచ్చి వరాహాన్ని కర్రలతో కొట్టి వారిని విడిపించారు. బాధితులను స్థానిక ప్రయివేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స చేశారు. ఇటీవల కాలంలో కుక్కలు, పందుల దాడిలో గాయపడి ఆస్పత్రికి వస్తున్న బాధితులు పెరిగారని వైద్యుడు ఉప్పలపాటి వేణుగోపాలరావు పేర్కొన్నారు. గ్రామంలో విచ్చలవిడిగా వీధికుక్కలు, వరాహాలు గుంపులు గుంపులుగా తిరుగుతూ ప్రజలపై దాడి చేస్తున్నాయని గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. పంచాయతీ వారికి చెప్పినా ప్రయోజనం ఉండటంలేదని ఆరోపిస్తున్నారు.

ఆర్టీసీ ఎండీ పేరుతో నకిలీ ఎఫ్‌బీ అకౌంట్

» సైబర్ పోలీసులకు ఫిర్యాదు

విజయవాడ, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : ఫేస్‌బుక్‌లో నకిలీ అకౌంట్లు సృష్టించడానికి సైబర్‌నేరగాళ్లు ఆర్టీసీ ఎండీ సీహెచ్ ద్వారకా తిరుమలరావును కూడా ఎంచుకున్నారు. ఆయన ఫొటోతో ఫేక్ అకౌంట్‌ను తెరిచారు. దీనిపై ఆయన విజయవాడలోని సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ద్వారకా తిరుమలరావు ఫొటోను ప్రొఫైల్‌లో అమర్చి, పక్కనే ద్వారకా తిరుమలరావు అని రాశారు. ఫొటో కింద తెలంగాణ స్టేట్ పోలీస్ అని, విజయవాడలో నివాసం ఉంటున్నట్టు రాశారు. తన పేరుమీద ఫేక్‌బుక్‌లో నకిలీ అకౌంట్ సృష్టించారని ఆయన తెలిపారు. తనకు ఏ సోషల్ మీడియాలోను అకౌంట్లు లేవని ఆయన స్పష్టం చేశారు.

ఓట్ల కోసమే..

దొంగ పట్టాల దగా!



ధర్నా చేస్తూ.. తహసీల్దార్ సతీష్‌కు దొంగ పట్టాలపై వివరిస్తున్న కొల్లు రవీంద్ర

» తహసీల్దార్ కార్యాలయం వద్ద టీడీపీ, జనసేన ధర్నా
» నాలుగు గంటలపాటు నిరసన.. తహసీల్దార్‌కు వినతిపత్రం
» అధికారంలోకి వచ్చాక అవినీతిపై సమగ్ర విచారణ
» వైసీపీ పాలకుల అక్రమాలు బయటపెడతాం : కొల్లు రవీంద్ర

మచిలీపట్నం టౌన్, మార్చి 13 : కృష్ణా జిల్లా కేంద్రమైన మచిలీపట్నంలో పేదలకు వైసీపీ పాలకులు వందలాది దొంగ పట్టాల పంపిణీపై మాజీమంత్రి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి కొల్లు రవీంద్ర ఆధ్వర్యంలో టీడీపీ, జనసేన నేతలు బుధవారం ఉదయం నాలుగుగంటలపాటు ధర్నా నిర్వహించారు. తహసీల్దార్ శిబిరం వద్దకు రావాలంటూ నినాదాలు చేశారు. రాజముద్ర, తేదీలు లేకుండా పట్టాలు ఫోర్జరీ సంతకాలతో ఎలా ఇచ్చారని కొల్లు రవీంద్ర డిప్యూటీ తహసీల్దార్‌ను ప్రశ్నించారు. మూడు గంటల ఆలస్యంగా కార్యాలయానికి తహసీల్దార్‌తో కార్పొరేటర్లు చర్చలు జరిపారు. వైసీపీ నాయకులు లబ్ధిదారులకు ఇచ్చిన నకిలీ పట్టాలను తహసీల్దార్‌కు చూపించారు. ఎన్నికల ముందు పేదలకు పట్టాల పేరుతో ఎర వేస్తున్నారని వారు ధ్వజమెత్తారు. ప్రజలకు ఇచ్చిన పట్టాలు రిజిస్టర్‌లో నమోదు అయ్యాయా అని ప్రశ్నించారు. దానికి రెవెన్యూ అధికారులు రిజిస్టర్ చూపించలేక పోవడంతో నిజాలు నిగ్గు తేల్చాలని డిమాండ్ చేశారు. దీనిపై అవసరమైతే ఆమరణ దీక్షకు దిగుతానని రవీంద్ర పేర్కొనడంతో శిబిరంలో ఉద్రిక్తత చోటు చేసుకుంది. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. బదిలీ అయిన తహసీల్దార్ సునీల్ సంతకాలతో అర్ధరాత్రి వేళ వైసీపీ నాయకుల సమక్షంలో తహసీల్దార్ కార్యాలయంలో పట్టాలు రాయాలంటూ అధికారులపై వత్తిడి చేస్తున్నారని కొల్లు రవీంద్ర ధ్వజమెత్తారు. తనకురెండు రోజుల సమయం ఇస్తే విచారణ జరిపి వివరాలు చెపుతానని తహసీల్దార్ పేర్కొనడంతో ధర్నాను వాయిదా వేశారు. శిబిరం వద్దే నాయకులు, కార్యకర్తలు భోజనాలు చేశారు. ధర్నాలో జనసేన, టీడీపీ నేతలు మాదివాడ రాము, గడ్డం రాజు, మోటమర్రి బాబాప్రసాద్, పంచపర్వాల కాశీవిశ్వనాథం, కుంచె నాని, ఎండి ఇలియాస్ పాషా, పిప్పళ్ల కాంతారావు, కార్పొరేటర్లు మరకాని సమతా కీర్తి, చిత్తజల్లు నాగరాము, అన్నం ఆనంద్, దేవరపల్లి అనిత, కట్టా దుర్గా, సనకా నాగులు, మరకానిపరబ్రహ్మం, పీవీ ఫణికుమార్, పాలపర్తి పద్మ, చిన్నం శివ, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

జి+3 ఇల్లు రద్దు చేసి స్థలం పట్టా ఇచ్చారు

» లబోదిబోమన్న బాధిత మహిళ



మచిలీపట్నం 32వ డివిజన్‌కు చెందిన మహిళ గంజాల జాబాబ్‌కు రుద్రవరంలో జి+3 ఇల్లు మంజూరైంది. అయితే ఆ ఇంటిని బలవంతంగా రద్దు చేసి కరగ్రహారంలో ఇంటి స్థలం అంటగట్టారని బాధితురాలు లబోదిబోమంటోంది. బుధవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆమె మీడియాకు తన గోడును వెళ్లబోసుకుంది. - మచిలీపట్నం టౌన్

ఓటమి భయంతోనే దొంగపట్టాలు

పేదలకు పట్టాలు ఇవ్వడానికి తాను వ్యతిరేకం కాదని, అయితే రోడ్ల పక్కన స్థలాలకు రాత్రికి రాత్రి దొంగ పట్టాలు సృష్టించి ఇస్తున్నారని రవీంద్ర అన్నారు. రవీంద్ర మీడియాతో మాట్లాడుతూ, బదిలీ అయిన తహసీల్దార్ సునీల్ సంతకంతో వందల సంఖ్యలో ఎమ్మెల్యే పేర్నినాని ఆధ్వర్యంలో దొంగ పట్టాలు ఇస్తున్నారన్నారు. నేషనల్ కాలేజీ వద్ద, ఎన్టీఆర్‌కాలనీ వద్ద, విశ్వబ్రాహ్మణ కాలనీ ఇలా పలుప్రాంతాల్లో సర్వే నెంబర్లు లేకుండా పట్టాలు ఇచ్చేస్తున్నారన్నారు. సర్వే నెంబర్లు లేని ఇళ్లకు బ్యాంకులు ఎలా రుణాలు ఇస్తాయన్నారు. సుల్తానగరంలోని ప్రభుత్వ భూములను వైసీపీ కార్యకర్తలు ఆక్రమించి అమ్ముకుంటున్నారన్నారు. వైసీపీ నేతల అక్రమాలపై అధికారంలోకి వచ్చిన తరువాత విచారణ జరిపిస్తామన్నారు.

రోత రాతలతో ఫ్లెక్సీ!

» వైసీపీ నేత పేరుతో ఛాలెంజ్‌లు » అసభ్య పదజాలాలు
» పట్టించుకోని పోలీసులు, మునిసిపల్ అధికారులు
» ప్రశాంత వాతావరణాన్ని కలుషితం చేస్తున్నారంటూ విమర్శలు

పెనమలూరు, మార్చి 13 : "ఒరేయ్ నీకే చెబుతున్నా...జగనన్న కోసం జోగన్నతో మేము సిద్ధం... మీకు దమ్ముంటే బ్యానర్లమీద కాదురా! మీప్రతాపం ఫేస్ టు ఫేస్ చూసుకుందాం రా చెత్త నా..." ఇవి వైసీపీ నాయకుడిగా చెలామణి అవుతున్న పోరంకికి చెందిన అద్దేపల్లి చందు పేరుతో వెలిసిన ఫ్లెక్సీలోని పదజాలం. గత రెండు రోజులుగా ఈ ఫ్లెక్సీ పోరంకి సెంటరు బందరు రోడ్డుపై హల్‌చల్ చేస్తోంది. బందరు రోడ్డుపై ప్రయాణించే వారికి ఇది జుగుప్స కలిగే విధంగా ఉన్నా పోలీసులకు, మునిసిపల్ అధికారులకు ఏమాత్రం పట్టడం లేదు. గతంలో ఇతడు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను ఇతడంటే గిట్టని సొంత పార్టీ వారే చించి పడేయడంతో ఇలాంటి పరుష పదజాలంతో ఈ ఫ్లెక్సీని ఏర్పాటు చేసినట్లు సమాచారం. మంత్రి జోగి రమేష్ బాధ్యతలు చేపట్టిన తర్వాత ఇలాంటి రెచ్చగొట్టే సంఘటనలు పెనమలూరు నియోజకవర్గంలో జరగడం పరిపాటిగా మారిందని పలువురు విమర్శిస్తున్నారు. ప్రశాంతంగా ఉండే కృష్ణా జిల్లా రాజకీయాలను వైసీపీ నేతల పోకడలు కలుషితం చేస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



పోరంకి సెంటర్‌లో రోత రాతతో వెలిసిన ఫ్లెక్సీ

160 సీట్లు గెలుపే లక్ష్యంగా పనిచేద్దాం

» పార్టీ శ్రేణులకు దేవినేని ఉమా పిలుపు

మైలవరం/గొల్లపూడి, మార్చి 13 : వచ్చే ఎన్నికల్లో అవినీతి, అరాచక వైసీపీ ప్రభుత్వానికి ఓటుతో బుద్ధి చెప్పి చిత్తుగా ఓడించడమే కాకుండా 160 సీట్లు గెలుపే లక్ష్యంగా పని చేద్దామని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో కేడర్‌కు పిలుపునిచ్చారు. సైకో విధ్వంసకర పాలనతో రాష్ట్రం 20 ఏళ్లు వెనక్కి వెళ్లిందన్నారు. జీవనాడి పోలవరం పూర్తి కావాలన్నా, రాజధాని అమరావతి కట్టాలన్నా, పెట్టుబడులు, పరిశ్రమలు రావాలన్నా ఇవన్నీ జరిగి రాష్ట్రం బాగుపడాలంటే తెలుగుదేశం-జనసేన-బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి రావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఇందుకోసం ప్రతి ఒక్కరూ సైనికుల్లా పని చేయాలన్నారు. మహిళల కోసం సరికొత్త పథకం కలలకు రెక్కలు పేరుతో కొత్త కార్యక్రమానికి టీడీపీ శ్రీకారం చుట్టిందని అన్నారు.

సీటు మార్పు వెనుక మర్మమేమిటో?

» వైసీపీ ఎమ్మెల్యే రక్షణనిధి అసంతృప్తి



తిరువూరు, మార్చి 13 : పార్టీ నిర్వహించిన ప్రజాభిప్రాయ సర్వే- ఐప్యాక్ సర్వేలో 69 శాతం మంది ప్రజలు తనకు మద్దతు తెలిపినా.. సీటు తనకే ఇస్తానని ముందుగా చెప్పిన పార్టీ అధిష్టానం తనకు గాక మరొకరికి సీటు కేటాయించడంలో మర్మమేమిటో అని ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. బుధవారం స్థానిక క్యాంప్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో పార్టీ అధిష్టానంపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. గడప గడపకు కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తిచేయడంతో పాటు నియోజకవర్గంలో 77 సచివాలయాల నిర్మాణం, రోడ్ల అభివృద్ధి, పార్టీ పిలుపు ఇచ్చిన ప్రతి కార్యక్రమం పూర్తిచేసిన తొలి ఎనిమిది మందిలో జాబితాలో తన పేరు ఉందని ఆయన పేర్కొన్నారు. సీటు ఇస్తామని చెబుతూనే మరోవైపు సర్వే చెయిస్తుండంతో మనస్తాపంతో పార్టీకి, నియోజకవర్గానికి దూరంగా ఉంటున్నట్టు పేర్కొన్నారు. ముఖ్యమంత్రిని కలిసే అవకాశం లేకపోవడంతో పార్టీలో ఏం జరుగుతుందో తెలియని అయోమయ పరిస్థితి నెలకొందన్నారు.



పార్టీ నిర్వహించిన సర్వే రిపోర్టు

కేంద్రంలో మోదీ వస్తేనే రాష్ట్రం అభివృద్ధి

వైసీపీకి, రాజకీయాలకు దూరం అంటూనే కేంద్రంలో మూడోసారి మోదీ అధికారంలోకి వస్తేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే రక్షణనిధి పేర్కొనడంతో రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపీ పొత్తును స్వాగతిస్తున్నట్టు పరోక్షంగా పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారా.. అభిమానులకు సూచనలు చేస్తారా? అన్న ప్రశ్నకు ఎవరి అభీష్టం మేరకు వారు ఆయా పార్టీలకు మద్దతు ఇస్తారని ఆయన సమాధానం చెప్పారు.

ఎన్నికల ఫీవర్



» ఇప్పటికే విధుల్లో అధికారులు బిజీ బిజీ
» కొనసాగుతున్న ఫామ్ 6, 7, 8ల పరిష్కారం
» ఎన్నికల సిబ్బందికి అవగాహన, శిక్షణ కార్యక్రమాలు
» పోలింగ్ సిబ్బందికి విధుల కేటాయింపులు
» పోలింగ్ కేంద్రాల పరిశీలన, సౌకర్యాల పర్యవేక్షణ
» రాజకీయ పార్టీలతో తరచూ సమావేశాలు
» సీఈవో వీసీలు, జిల్లా వీసీలతో క్షణం తీరికలేని పరిస్థితి
» నోటిఫికేషన్ నుంచి అదనపు కీలక బాధ్యతలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగానికి ఎన్నికల ఫీవర్ వచ్చేసింది. రెండు నెలలుగా ఎన్నికల విధుల్లో తలమునకలై ఉన్న అధికారులు ఇక నిరంతర ఏర్పాట్లపై దృష్టి సారిస్తున్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడటమే తరువాయి.. మరింత అప్రమత్తమవుతూ.. ప్రస్తుత విధులతో పాటు ఎన్నికల విధులూ కొనసాగించాల్సి ఉండటంతో ఆ ప్రక్రియ విజయవంతం చేసేందుకు జిల్లా యంత్రాంగం సర్వసన్నద్ధమైంది.

ఎన్నికల విధుల్లో కృష్ణా, ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగం తలమునకలైంది. ఓటర్ల నమోదు, జాబితాల స్వచ్ఛీకరణ, స్పెషల్ సమ్మరీ రివిజన్ (ఎస్ఎస్ఆర్), ఫామ్స్ స్వీకరణ-పరిశీలన, తొలగింపులు, పోలింగ్ కేంద్రాల పరిశీలన, ఏర్పాట్ల పర్యవేక్షణ, ఈవీఎంల నిరంతర తనిఖీతో పాటు వాటిని సన్నద్ధం చేయటం, పోలింగ్ విధులను నిర్వహించే సిబ్బందిని సన్నద్ధం చేయటం, నోడల్ ఆఫీసర్ల నియామకం-వారిచే నిర్వహించాల్సిన బాధ్యతలను పర్యవేక్షించటం, స్ట్రాంగ్‌రూమ్, పోలింగ్ కేంద్రాల సందర్శనలు, తరచూ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశాలు, జిల్లా అధికార యంత్రాంగంతో సమీక్షలు, ఈసీఐతో వీసీలు, అన్నింటికీ మించి పోలింగ్ అధికారులు, సిబ్బందికి శిక్షణా కార్యక్రమాలు నిర్వహించటం వంటి కార్యకలాపాలతో జిల్లా యంత్రాంగం ఉక్కిరిబిక్కిరవుతోంది. ఈ కార్యక్రమాలు నామినేషన్ల తుదిఘట్టం వరకు కొనసాగుతాయి. నోటిఫికేషన్ వస్తే అదనంగా నిర్వహించాల్సిన విధులు అనేకం ఉన్నాయి. నోటిఫికేషన్ వచ్చినప్పటికీ నామినేషన్ల ఘట్టం పూర్తయ్యే వరకు ఫామ్స్ స్వీకరణ ప్రక్రియ కొనసాగుతుంది. రెండు నెలల క్రితం జరిగిన స్పెషల్ సమ్మరీ రివిజన్ (ఎస్ఎస్ఆర్) అనంతరం రాజకీయ పక్షాల, ఓటర్ల నుంచి వచ్చిన ఫామ్ 6, 7, 8లకు సంబంధించిన దరఖాస్తుల ప్రక్రియ కొనసాగుతోంది. క్షేత్రస్థాయిలో పరిశీలన చేసిన తర్వాత అభ్యంతరాలు లేకపోతేనే వీటిని పరిష్కరించాల్సి ఉంటుంది. ఎన్నికల నోటిఫకేషన్‌తో సంబంధం లేకుండా ప్రక్రియను నామినేషన్ల ఘట్టం ముగిసే వరకు పరిష్కరిస్తారు. అలాగే పోలింగ్ కేంద్రాల సన్నద్ధత, సౌకర్యాల కల్పన, ఎన్నికల సిబ్బందికి శిక్షణా కార్యక్రమాలు నిరంతరం పర్యవేక్షిస్తూ ఉండాలి. పోలింగ్ కేంద్రాలను అవసరం మేరకు మార్చే అవకాశాలు ఉంటాయి. ఎన్టీఆర్ జిల్లాలో 20 మండలాలు, మూడు రెవెన్యూ డివిజన్లు ఉన్నాయి. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. వీటికి సంబంధించిన ఎన్నికల విధులతో పాటు కృష్ణాజిల్లాకు చెందిన గన్నవరం నియోజకవర్గంలో కొన్నిగ్రామాలు ఎన్టీఆర్ జిల్లాలో ఉన్నందున వాటికి సంబంధించిన విధులను కూడా నిర్వహించాల్సి ఉంటుంది. ఎన్టీఆర్ జిల్లా పరిధిలో ఎనిమిది మంది రిటర్నింగ్ ఆఫీసర్లు, సహాయ రిటర్నింగ్ అధికారులు-44, ఈఆర్ఓలు-7, ఏఈఆర్‌వోలు-36, సెక్టార్ ఆఫీసర్లు-169, సెక్టార్ పోలీస్ ఆఫీసర్స్-169 మంది, ప్రిసైడింగ్ ఆఫీసర్స్-2137 మంది, పోలింగ్ ఆఫీసర్స్-10,866 మంది, బీఎల్‌వోలు-1863మంది, నోడల్ ఆఫీసర్లుగా ఇప్పటికే 16మందిని ఎంపిక చేయటం జరిగింది. వీరితో పాటు ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఏడువేల మంది పోలీసు బలగాలు అవసరమని నిర్ణయించారు. ప్రస్తుతం పోలీసు బలగాల కొరత ఉంది. జిల్లావ్యాప్తంగా సమస్యాత్మక ప్రాంతాలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. ఇదే సందర్భంలో సరిహద్దు ప్రాంతాలపైనా నిఘా ఉంచాల్సిన అవసరం ఉంది. ఇలా దాదాపుగా జిల్లా యంత్రాంగం పూర్తిగా ఎన్నికల విధుల్లో తలమునకలుగా ఉంది. ఎన్నికల నోటిఫికేషన్ వస్తే కోడ్ అమల్లోకి వచ్చే పరిస్థితుల్లో ప్రవర్తనా నియమావళిని అమలుచేయటం, మీడియా పర్యవేక్షణ, పోలింగ్ మెటీరియల్‌ను సిద్ధం చేసుకోవటం, ఎపిక్‌కార్డులను ఎన్నికల నాటికల్లా ముద్రించి అందచేయటం వంటి విధులు, ఇవికాకుండా నామినేషన్లను స్వీకరించటం, అభ్యర్థుల ప్రచారఖర్చులను లెక్కలు వేయటం, ఎన్నికల ఫిర్యాదులను పరిష్కరించటం, యాప్‌ల వినియోగాన్ని సమీక్షించటం వంటివి నిరంతరాయంగా కొనసాగించాల్సి ఉంటుంది. ఎన్నికల నిర్వహణ తర్వాత.. ఈవీఎంలను భద్రపరచటం కూడా కీలకమే.. స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రపరచటం, కౌంటింగ్ కేంద్రాలకు ఈవీఎంలను తరలించటం దగ్గర నుంచి ఎన్నికల ఫలితాలు పూర్తయ్యేవరకు జిల్లా యంత్రాంగం విధుల్లో తలమునకలై ఉంటుంది.

ప్రణాళికాబద్ధంగా పటిష్ట చర్యలు..

» ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు



రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఢిల్లీరావు

కృష్ణలంక, మార్చి 13 : రానున్న సాధారణ ఎన్నికలను నిష్పక్షపాత, స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించేందుకు ఈసీఐ, సీఈవో మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రణాళికాబద్ధంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఓటర్ల జాబితా నవీకరణ, వివిధ ఫారాల పరిష్కారం, క్రిటికల్, వల్నరబుల్ పోలింగ్ స్టేషన్ల గుర్తింపు ప్రక్రియ, ఏర్పాట్లు, ఎన్నికల ప్రవర్తనా నియమావళి (ఎంసీసీ), వ్యయ పరిశీలన తదితరాలపై కలెక్టర్ వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఫారం-6కు సంబంధించి 3571, ఫారం-7కు సంబంధించి 1361, ఫారం-8కు సంబంధించి 2113 దరఖాస్తులను పరిష్కరించాల్సి వుందని, వీటిని నిబంధనలకు అనుగుణంగా పరిష్కరించనున్నట్టు వివరించారు. పోలింగ్ స్టేషన్ స్థలం, ఏరియా, అనుసంధానించిన మొత్తం ఓటర్లు తదితర అంశాలతో కూడిన జాబితా (అనెక్చర్-3)ను రాజకీయ పార్టీలకు అందించనున్నట్టు తెలిపారు. షెడ్యూల్ విడుదలతో అమల్లోకి రానున్న ఎన్నికల ప్రవర్తనా నియమావళి (ఎంసీసీ), ఫిర్యాదులకు వీలుకల్పించే సీ విజిల్ యాప్, 1950 ఈసీఐ టోల్‌ఫ్రీం నెంబర్ తదితరాల గురించి కలెక్టర్ వివరించారు. సమావేశంలో డీఆర్‌వో వి.శ్రీనివాసరావు, పలు పార్టీల ప్రతినిధులు ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

మూడంచెల భద్రతా ఏర్పాట్లు

» కృష్ణా వర్సిటీలో కౌంటింగ్ కేంద్రాలు పరిశీలించిన కృష్ణాజిల్లా కలెక్టర్, అధికారులు



కౌంటింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద భద్రతా ఏర్పాట్లపై అధికారులతో చర్చిస్తున్న కలెక్టర్ రాజాబాబు

మచిలీపట్నం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : కృష్ణాయూనివర్సిటీలో ఏర్పాటు చేయనున్న స్ట్రాంగ్‌రూమ్‌లు, ఓట్లలెక్కింపు కేంద్రాలు వద్ద మూడంచెల భద్రతను ఏర్పాటు చేయనున్నట్టు కలెక్టర్ పి.రాజాబాబు తెలిపారు. జేసీ గీతాంజలి శర్మ, ఎస్పీ అద్నాన్ నయీం అస్మి, రిటర్నింగ్ అధికారులతో కలిసి బుధవారం వర్సిటీలోని స్ట్రాంగ్‌రూమ్‌లు, కౌంటింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు, పార్లమెంటు నియోజకవర్గానికి సంబంధించిన ఓట్ల లెక్కింపు కృష్ణాయూనివర్సిటీలో జరుగుతుందన్నారు. పోలింగ్ అనంతరం ఈవీఎంలను వర్సిటీకి తరలించడం జరుగుతుందన్నారు. ఇక్కడ 100మీటర్లు, 200మీటర్లు, 300మీటర్ల పరిధిలో కేంద్ర బలగాల పర్యవేక్షణలో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. అసెంబ్లీ నియోజకవర్గాలు, పార్లమెంటు,అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన ఈవీఎంలను వేర్వేరు గదుల్లో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌ల్లో భద్రపరుస్తామన్నారు. అసెంబ్లీ నియోజకవర్గాలవారీగా శాసనసభ, పార్లమెంటు నియోజకవర్గాల ఓట్ల లెక్కింపుకోసం విడివిడిగా కౌంటింగ్ కేంద్రాల ఏర్పాటు, ఈవీఎంలను కౌంటింగ్ కేంద్రాల్లోకి తీసుకువచ్చే మార్గాలు, బారికేడింగ్, తదితర అంశాలపై అధికారులకు కలెక్టర్ పలు సూచనలు చేశారు. కౌంటింగ్ కేంద్రాల్లో అభ్యర్థులకు సంబంధించిన కౌంటింగ్ ఏజెంట్ల రాకపోకలకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. కౌంటింగ్ కేంద్రాల్లో తీసుకోవాల్సిన భద్రతా చర్యలపై ఎస్పీకి కలెక్టర్ పలు సూచనలు చేశారు. కలెక్టర్ వెంట నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు, ఏఎస్పీ ఎస్‌వీడీ ప్రసాద్, కృష్ణాయూనివర్సిటీ వీసీ జ్ఞానమణి, రిజిస్ట్రార్ శోభన్‌బాబు ఉన్నారు.

పెండింగ్ ఓటరు దరఖాస్తులు పరిశీలిస్తున్నాం

జిల్లాలో పెండింగ్ ఉన్న 5415ఓటర్ల దరఖాస్తులను సత్వరం పరిష్కరించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్టు కలెక్టర్ పి.రాజాబాబు తెలిపారు. ముఖేష్‌కుమార్ మీనా కలెక్టర్లు, ఎస్పీలతో బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించగా కలెక్టరేట్ నుంచి కలెక్టర్, జేసీ గీతాంజలి శర్మ, ఎస్పీ అద్నాన్‌నయీం అస్మి పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ఫారం 6, 7, 8 దరఖాస్తులు ఇంకా 5415పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని పరిశీలన చేసి పరిష్కరించే పనిని వేగవంతం చేస్తున్నట్టు తెలిపారు. ఏడు రోజులకు మించిన దరఖాస్తులు 1792 ఉండగా, వాటిలో ఫారం-7కు సంబంధించిన దరఖాస్తులు 1100వరకు ఉన్నట్టు తెలిపారు. వీటిని రాష్ట్ర ఎన్నికలసంఘం పరిశీలనకు పంపామన్నారు. తపాలశాఖ ద్వారా 55446 దరఖాస్తులు పంపిణీ కోసం పంపామని, ఇవి సకాలంలో ఓటర్లకు అందేలా తగు చర్యలు తీసుకోవాలని తపాలశాఖ అధికారులకు సూచన చేశామన్నారు. సమావేశంలో డీఆర్వో కె.చంద్రశేఖరరావు, రిటర్నింగ్ అధికారులు పాల్గొన్నారు.



బ్రాయిలర్ ధరలు
అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	112, 121, 132
చికెన్ విత్ స్కిన్	210
చికెన్ స్కిన్‌లెస్	220

నెక్ కోడిగుడ్డు ధర
విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.33

పార్కులో కల్యాణ మండపాన్ని నిర్మించండి



పాయకాపురం, మార్చి 13 : స్థానిక 62వ డివిజన్ ఎల్‌బీఎస్ నగర్‌లోని పార్కు స్థలంలో కల్యాణ మండపం నిర్మాణం జరిపి ప్రజా ప్రయోజనాలకు వినియోగించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో పార్కు వద్ద బుధవారం నిరసన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన పార్కు స్థలాన్ని అభివృద్ధి చేయాలని, కల్యాణ మండపం నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. కె. దుర్గారావు, శ్రీదేవి, సాంబిరెడ్డి పాల్గొన్నారు.

పౌరసత్వ చట్ట సవరణ బిల్లును నిలిపివేయాలి

● పంజాసెంటర్‌లో వామపక్షాల నిరసన

వన్‌టౌన్, మార్చి 13: రాజ్యాంగం కల్పించిన లౌకిక స్వేచ్ఛను ప్రధానమంత్రి హరించివేస్తున్నాడని వామపక్ష నాయకులు విమర్శించారు. పౌరసత్వ చట్ట సవరణ బిల్లును నిలిపివేయాలని కోరుతూ పంజాసెంటర్‌లో బుధవారం వామపక్ష నాయకుల ఆధ్వర్యంలో నిరసన జరిగింది. ఈ సందర్భంగా సీపీఐ నగర కార్యదర్శి జి. కోటేశ్వరరావు, సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు దోనేపూడి కాశీనాథ్‌లు మాట్లాడుతూ, కేంద్రంలో ప్రధాని వైఖరి అలా ఉంటే రాష్ట్రంలో సీఎం వై ఎస్ జగన్‌రెడ్డి ప్రజల భావ ప్రకటనా స్వేచ్ఛను హరించి వేస్తున్నాడన్నారు. బీజేపీ మతోన్మాద విధానాలను ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు. బీజేపీతో పొత్తుపెట్టుకున్న టీడీపీ, జనసేనలు, పరోక్షంగా మద్దతు ఇస్తున్న వైసీపీలు పునరాలోచనలు చేయాలన్నారు. సెక్షన్ 30 అధికార పార్టీకి వర్తించదా అని ప్రశ్నించారు. తొలుత ఈ కార్యక్రమాన్ని పోలీసులు అడ్డుకున్నారు. వాగ్వాదం అనంతరం నాయకులు ప్రసంగించారు.


సమావేశమైన వీర మహిళలు

పోతిన మహేశ్‌ను గెలిపించుకుంటాం

● జనసేన వీరమహిళలు

వన్‌టౌన్, మార్చి 13: పశ్చిమలో జనసేన అధికార ప్రతినిధి పోతిన మహేశ్‌ను రానున్న ఎన్నికలలో గెలిపించుకుంటామని జనసేన వీరమహిళలు తీర్మానం చేశారు. పశ్చిమలోని జనసేన కార్యాలయంలో బుధవారం వీరమహిళలు సమావేశమయ్యారు. మల్లెపు విజయలక్ష్మి, తిరుపతి అనూష, షేక్ షర్మిల, ఆకారపు విజయకుమారి తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. వీరంతా ఇప్పటి వరకు పశ్చిమలో అనేక సమస్యలపై పోతిన మహేశ్ చేసిన పోరాటాలను, అవినీతి, అక్రమాలను ఎదుర్కొనేందుకు చూపిన ధైర్య సాహసాలను కొనియాడారు. ప్రతి డివిజన్‌లోనూ జనసేనకు అత్యధికంగా మహిళల ఓట్లుపడేందుకు కృషి చేస్తామని ప్రతిన చేశారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

మొగల్రాజపురం, మార్చి 13: విద్యుత్ మరమ్మతులు మెయింటెనెన్స్ నిమిత్తం గురువారం ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు మొగల్రాజపురం సెక్షన్ మహాత్మాగాంధీ ఇండోర్ సబ్ స్టేషన్, 11కేవీ జమ్మిచెట్టు ఫీడర్ పరిధిలో మధుగార్డెన్ ఏరియా, ఏఎస్ రామారావు రోడ్డు, శాంతి నగర్, జమ్మిచెట్టుసెంటర్, ఉడ్‌పేట, బాడవపేట, వాటర్ ట్యాంకు రోడ్డు తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజనీర్ బీవీ సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు.

భారతీనగర్: రింగ్‌రోడ్డు సెక్షన్ పరిధిలో సిద్ధార్థ నగర్ (1 నుంచి 5వ రోడ్స్), మోడరన్ సూపర్ మార్కెట్ ఏరియా, నవోదయ కాలనీ, ఎస్‌బీఐ కాలనీ, సున్నపుబట్టీల సెంటర్, సిద్ధార్థ కాలేజ్ జంక్షన్ పరిసర ప్రాంతాల్లో గురువారం మధ్యాహ్నం 3 గంటల నుంచి 5.00 గంటల వరకు విద్యుత్ నిలిపివేయనున్నట్లు గుణదల సబ్‌స్టేషన్ కార్యనిర్వాహక ఇంజనీర్ పి.హరిబాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.


12వ డివిజన్‌లో గద్దె అనురాధకు హారతులిస్తున్న మహిళలు


11వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారంలో గద్దె రాజేశ్ తదితరులు


రజకులకు ఇస్త్రీ పెట్టెలు అందజేసిన గద్దె రామ్మోహన్

రామ్మోహన్‌కు అండగా నిలబడదాం

జడ్పీ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ

పటమట, మార్చి 13 : వైఎస్ జగన్ ప్రభుత్వం సహకరించకపోయినా తూర్పులో తన సొంత నిధులతో సంక్షేమ కార్యక్రమాలను నిర్వహిస్తూ ప్రజలకు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అండగా నిలిచారని జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ అన్నారు. బుధవారం ఆమె 12వ డివిజన్‌లోని యార్లగడ్డ అప్పారావు వీధిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టీడీపీ-జనసేన-బీజేపీ ఉమ్మడి అభ్యర్థులు ఎమ్మెల్యేగా గద్దె రామ్మోహన్, ఎంపీగా కేశినేని చిన్నిలను అఖండ మెజారిటీలతో గెలిపించాలని అనురాధ కోరారు. చేవూరి రాధకు రూ.25వేల టిఫిన్ బండి అనురాధ అందజేశారు. రామ్మోహన్‌కు మనమంతా అండగా నిలవాలని సూచించారు. కార్పొరేటర్ పొట్లూరి సాయిబాబు, శాయన బుజ్జి, కోగంటి రామారావు, రాజేశ్వరి, ఎం.బుచ్చిబాబు, మాదల చిన్నతల్లిలు పాల్గొన్నారు.

● టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ప్రభుత్వంతోనే సంక్షేమాభివృద్ధి సాధ్యం అని యువ నాయకులు గద్దె రాజేష్, క్రాంతికుమార్‌లు తెలిపారు. బుధవారం 11వ డివిజన్ ఎన్టీఆర్ సర్కిల్ భోగయ్య బజార్ నుంచి ఉమ్మడి కూటమి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు గద్దె రామ్మోహన్, కేశినేని శివనాథ్‌ల విజయాన్ని కాంక్షిస్తూ గద్దె తనయులు రాజేష్, క్రాంతికుమార్‌లు ప్రచార కార్యక్రమం నిర్వహించారు. సంక్షేమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలను ఇంటింటికీ పంపిణీ చేశారు. కోనేరు రాజేష్, పామర్తి కిషోర్, దేవరపల్లి ఆంజనేయులు, పాలడగు ప్రసాద్, కొలసాని నాగమణి, మరీదు శివలు పాల్గొన్నారు.

ఇస్త్రీ పెట్టెలు అందజేత

తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే కార్యాలయంలో బుధవారం 11 మంది నిరుపేద కుటుంబాలకు గద్దె రామ్మోహన్ తన సొంత నిధులతో రూ.80వేలు విలువ చేసే ఇస్త్రీ పెట్టెలను అందజేశారు. ఈ సందర్భంగా ముమ్మనేని ప్రసాద్ మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి, పేదల సంక్షేమానికి గద్దె కృషి చేశారని తెలిపారు. ఎమ్మెల్యేగా గద్దె, ఎంపీగా కేశినేని చిన్నిలను రజకులు గెలిపించాలన్నారు. కార్పొరేటర్ పొట్లూరి సాయిబాబు, మాదల రాజ్యలక్ష్మి, హయత్‌ఖాన్, గద్దె రమేష్, జనసేన నాయకులు అన్నే జనార్ధనరావులు పాల్గొన్నారు.

● వచ్చే ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 20 లక్షలు ఉద్యోగాల భర్తీకి చర్యలు తీసుకుంటుందని ఎమ్మెల్యే గద్దె తనయులు గద్దె రాజేష్, క్రాంతిలు అన్నారు. 10 డివిజన్ ప్రచారంలో వారు మాట్లాడారు. యువతకు బంగారు భవిష్యత్ చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. దేవినేని అపర్ణ, పి. శ్రీనివాస్, కొలసాని నాగమణిలు పాల్గొన్నారు.

మహాశక్తితో మహిళలు మహారాణులు

● మహిళలతో ఆత్మీయ సమావేశంలో బొండా ఉమా

పాయకాపురం, మార్చి 13 : టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు ప్రకటించిన మహాశక్తి పథకంతో రాష్ట్రంలోని మహిళలందరూ మహారాణులుగా మారడం ఖాయమని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బొండా ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. 62వ డివిజన్ ప్రకాష్‌నగర్ సెంటర్‌లో డివిజన్ మహిళలతో బుధవారం ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నేతలు పైడి శ్రీను, బోను వెంకాయమ్మ, తదితరులు పాల్గొన్నారు. అనంతరం పైపులరోడ్డు వద్ద ఎస్ కన్వెన్షన్‌లో జరిగిన క్షత్రియ ఆత్మీయ సమావేశంలో పాల్గొని ప్రసంగించారు.


మాట్లాడుతున్న బొండా ఉమా

● **టీడీపీలో చేరికలు**

64వ డివిజన్ కండ్రిక కాలనీకి చెందిన పలువురు టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా కండ్రిక సెంటర్‌లో బుధవారం బహిరంగ సభ జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బొండా ఉమా వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

టీడీపీ అధికారంలోకి రావడం ఖాయం: బొండా సిద్ధార్థ


టీడీపీ అమలు చేసే పథకాలు వివరిస్తున్న సిద్ధార్థ

సత్యనారాయణపురం: టీడీపీ అధికారంలోకి రావడం చారిత్రాత్మక అవసరమని టీడీపీ నాయకుడు బొండా సిద్ధార్థ అన్నారు. 31వ డివిజన్ ముత్యాలంపాడు దుర్గా సూపర్ మార్కెట్ వద్ద నుంచి బుధవారం సాయంత్రం బొండా ఉమా అన్న రావాలి సెంట్రల్ గెలవాలి కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న బొండా సిద్ధార్థ ఇంటింటికి వెళ్లి ప్రజలు పడుతున్న కష్టాలు అడిగి తెలుసుకొని ప్రజల భవిష్యత్తుకు టీడీపీ గ్యారెంటి అని చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్మోహనరెడ్డిని ఇంటికి పంపించాల్సిన అవసరం ఉందన్నారు. డివిజన్ అధ్యక్షుడు రామకృష్ణ, కె.దుర్గారావు, ప్రసాద్, జనసేన, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

శవరాజకీయాలను నమ్ముకున్న జగన్‌రెడ్డి

● టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి లుక్కా సాయిరామ్

విద్యాధరపురం, మార్చి 13 : సీఎం జగన్‌రెడ్డి శవరాజకీయాలను నమ్ముకున్నాడని టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి లుక్కా సాయి రామ్ ప్రసాద్ గౌడ్ విమర్శించారు. ఆటోనగర్‌లోని టీడీపీ జిల్లా కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

వారం రోజుల క్రితం తెనాలికి చెందిన గీతాంజలి ఆత్మహత్య గురించి ఆయన ప్రస్తావిస్తూ మహిళ రైల్వే ట్రాక్‌పై పడి చనిపోతే ఆమె కుటుంబానికి సీఎం రూ. 20 లక్షల పరిహారం ప్రకటించడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. జగన్‌రెడ్డి శవరాజకీయాలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదని, ఆమె మరణంపై దమ్ముంటే సీబీఐ విచారణ చేయించాలన్నారు. బొల్లా వెంకటేశ్వరరావు గౌడ్, పామర్తి కిషోర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

బుద్దా వెంకన్న, నాగుల్‌మీరాలకు సత్కారం

విద్యాధరపురం, మార్చి 13 : 42వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడిగా నియమితుడైన దుప్పల శివాజీ ముదిరాజ్ బుధవారం బుద్దా కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో బుద్దా వెంకన్నను, బీసీ ఫైనార్టీ నాయకుడు నాగుల్‌మీరాలను సత్కరించారు. తనను అధ్యక్షుడిగా నియమించినందుకు జిల్లా అధ్యక్షుడు నెట్టెం రఘురామ్‌తో పాటు ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. రానున్న ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపునకు తన వంతు కృషి చేస్తానన్నారు.

53వ డివిజన్‌లో కల్వర్టు పనులు ప్రారంభం

వన్‌టౌన్, మార్చి 13 : 53వ డివిజన్ కొరగంజి శేఖర్‌బాబు సెంటర్ వద్ద సుమారు ఐదు లక్షల రూపాయల వ్యయంతో తలపెట్టిన కల్వర్టు పనులను బుధవారం ప్రారంభించారు. కార్పొరేటర్ మహదేవు అప్పాజీరావు, కొరగంజి భానుబాబు, సురకత్తుల రాంబాబు, దొడ్ల సుధ, కాంట్రాక్టర్ రాయన ఆదిబాబు తదితరులు పాల్గొన్నారు.


పోలీసులు, పారామిలటరీ దళాల ఫ్లాగ్‌మార్చ్

ప్రజలు శాంతియుత వాతావరణంలో ఓటు వేసుకునేలా చర్యలు

వన్‌టౌన్, మార్చి 13: త్వరలో జరగనున్న ఎన్నికల్లో ప్రజలు నిర్భయంగా, శాంతియుత వాతావరణంలో ఓటు వేసుకునేలా పోలీసులు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నారని వెస్ట్ ఏసీపీ మురళీకృష్ణారెడ్డి అన్నారు. ఎన్నికల దృష్ట్యా ప్రజల్లో భరోసా కలిగించేందుకు బుధవారం వన్‌టౌన్‌లో పోలీసులు, పారామిలటరీ దళాలు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజలు ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకునేందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

టెన్త్ విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ


విద్యార్థులకు పరీక్షా సామగ్రి అందజేస్తున్న సీఐ, హెచ్‌ఎం

సత్యనారాయణపురం, మార్చి 13: స్థానిక ఏకేటీపీఎం పాఠశాలలో బుధవారం 1983-84బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో 310 మంది 10వ తరగతి విద్యార్థులకు పరీక్షా సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణపురం సీఐ ఎం. వెంకటనారాయణ మాట్లాడుతూ జీవితంలో విద్యార్థి దశ అతి ముఖ్యమని, ఈ దశలో తీసుకునే నిర్ణయాలే భవిష్యత్తును నిర్ణయిస్తాయన్నారు. హెచ్‌ఎం శ్రీనివాసరావు, ఇన్‌చార్జి హెచ్ ఎం ప్రభాకరరావు, ఎన్‌సీసీ ఉపాధ్యాయులు ప్రకాష్, 1983-83 పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

వాంబేకాలనీలో మినీ బస్‌స్టేషన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన

అజిత్‌సింగ్‌నగర్, మార్చి 13 : వాంబేకాలనీలో రూ. 2 కోట్ల వ్యయంతో చేపట్టిన మినీ బస్‌స్టేషన్ నిర్మాణ పనులకు బుధవారం ఎమ్మెల్యే మల్లాది విష్ణు భూమిపూజ చేశారు. ఎంపీ కేశినేని నాని, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా, మేయర్ భాగ్యలక్ష్మి, డిప్యూటీమేయర్ శైలజ, పాల్గొన్నారు.

ఆర్వోబీ వంతెన సర్వే పనుల పర్యవేక్షణ

గుణదల, మార్చి 13: గుణదల ప్రాంత ప్రజలు ఎంతో కాలంగా ఎదుర్కొంటున్న ట్రాఫిక్ సమస్యకు త్వరలోనే శాశ్వత పరిష్కారం లభించనుందని సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. గుణదల్లో నిర్మించ తలపెట్టిన ఆర్వోబీ వంతెన నిర్మాణ పనులకు బుధవారం రైల్వే అధికారులు సర్వే చేపట్టారని తెలిపారు. సర్వే పనులను సీనియర్ సెక్షన్ ఇంజనీర్ ఎస్.శ్రీనివాసరావుతో కలిసి మల్లాది విష్ణు పర్యవేక్షించారు. ఇప్పటికే రూ. 12.50 కోట్ల నిధులతో రాష్ట్ర ప్రభుత్వం ఆర్వోబీ వంతెనకు అవసరమైన భూసేకరణను పూర్తి చేసిందని తెలిపారు. జూన్‌లో పనులు ప్రారంభించడం జరుగుతుందని చెప్పారు. ఉద్దంటి సురేష్, కొండా మహేష్, ఆళ్ళ ప్రసాద్ రెడ్డి, నాగరాజు పాల్గొన్నారు.

కవయిత్రి మొల్లకు నివాళి

బస్‌స్టేషన్, మార్చి 13: గొప్ప కవయిత్రిగా మొల్ల పేరొందారని, రామాయణాన్ని చక్కని శైలిలో తెలుగులో రాశారని ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు అన్నారు. బుధవారం ఆర్టీసీ హౌస్‌లో జరిగిన మొల్ల జయంతి కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మొల్ల చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు సమర్పించిన అనంతరం ఆయన మాట్లాడుతూ, మొల్ల జీవిత వైశిష్ట్యాన్ని వివరించారు. ఈడీ కేఎస్ బ్రహ్మానందరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆపరేషన్స్ ఈడీ కోటేశ్వరరావు, ఎస్టాబ్లిష్‌మెంట్ ఈడీ రవివర్మ, సీపీవో రాఘవరెడ్డి, విజిలెన్స్ ఏడీ శోభామంజరి, వివిధ అసోసియేషన్ల ప్రతినిధులు, అధికారులు, సిబ్బంది, పలువురు పాల్గొన్నారు.

ఐరన్ యార్డులో అన్న క్యాంటీన్


అన్నదానం చేస్తున్న రాంబాబు, మాధవ

భవానీపురం, మార్చి 13 : టీడీపీ సీనియర్ నాయకుడు కేశినేని శివనాథ్ (చిన్ని) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మొబైల్ అన్న క్యాంటీన్ ద్వారా బుధవారం 43వ డివిజన్ ఐరన్ యార్డులో ముఠా కార్మికులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని డివిజన్ టీడీపీ అధ్యక్షుడిగా నియమితులైన మోరబోయిన రాంబాబు, తెలుగు యువత పశ్చిమ అధ్యక్షుడు ఆర్. మాధవలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేశినేని శివనాథ్‌ను ఎంపీగా గెలిపించుకోవాలని కార్మికులకు సూచించారు. ఐటీడీపీ కో-ఆర్డినేటర్ గూడేల మహేష్, అప్పన్న, కొరికాని సాయి, దినేష్, నరసింహారావు, కోనేటి అశోక్, కె.శంకర్, రాజు, రామాంజనేయులు, శ్రీను, టి.సుధా, వెంకట్రావు, ఏడుకొండలు పాల్గొన్నారు.


టీడీపీ విజయాన్ని కాంక్షిస్తూ సేవా కార్యక్రమాలు


నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న యలవర్తి శ్రీకాంత్

అజిత్‌సింగ్‌నగర్, మార్చి 13 : టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల సెంట్రల్ నియోజకవర్గం ఉమ్మడి అభ్యర్థి బొండా ఉమామహేశ్వరరావు విజయాన్ని కాంక్షిస్తూ యలవర్తి సునీల్ చౌదరి కస్తురిబాయి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం అజిత్‌సింగ్‌నగర్ ప్రాంతంలో పలు సేవా కార్యక్రమాలు జరిగాయి.

ట్రస్ట్ చైర్మన్ యలవర్తి శ్రీకాంత్ టీడీపీ నాయకులతో కలిసి అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న పలువురికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అలాగే వారి కుటుంబాల పోషణ నిమిత్తం నిత్యావసర సరుకులను అందజేశారు. టీడీపీ ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి చల్లగాలి అనిల్‌కుమార్, తంగిరాల కొండలరావు, వి. రాజేష్, వంశీ, జే. సాంబశివరావు, వినయ్, చంటి, కిరణ్ పాల్గొన్నారు.

బ్యాంకాక్‌లో యాక్షన్ స్టార్ట్



ధనుష్, నాగార్జున కాంబినేషన్‌లో రూపుదిద్దుకుంటున్న 'కుబేర' చిత్రం షెడ్యూల్ బ్యాంకాక్‌లో మొదలైంది. శేఖర్ కమ్ముల దర్శకత్వంలో సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్‌మోహన్‌రావు నిర్మిస్తున్నారు, ఇటీవల విడుదల చేసిన ఫస్ట్ లుక్‌కు అద్భుతమైన స్పందన వచ్చింది. ప్రస్తుతం బ్యాంకాక్‌లో నాగార్జున, ఇతర నటీనటులపై కొన్ని కీలక సన్నివేశాలు, యాక్షన్ పార్ట్ చిత్రీకరిస్తున్నారు. భారీ స్థాయిలో రూపొందుతున్న ఈ సినిమా షూటింగ్ ఇంతవరకూ ఎవరూ చూడని అద్భుత లోకేషన్స్‌లో జరుగుతుందని నిర్మాతలు చెప్పారు. రష్మిక కథానాయికగా నటిస్తున్నారు. సోనాలి నారంగ్ ఈ చిత్రానికి సమర్పకురాలు.

సినిమా చూస్తూ నవ్వుతూనే ఉన్నా

రాజమౌళి



'సాధారణంగా నాకు రోమ్ కామ్ సినిమాలు నచ్చవు. యాక్షన్, మాస్ చిత్రాలు కావాలి నాకు. కానీ 'ప్రేమలు' సినిమాను థియేటర్‌లో చూస్తున్నప్పుడు నవ్వుతూనే ఉన్నా. ఇది తప్పకుండా థియేటర్‌లోనే చూడాల్సిన చిత్రం' అన్నారు దర్శకుడు రాజమౌళి. కామెడీ, లవ్ అంశాలతో మలయాళంలో రూపొందిన చిత్రాన్ని ఆయన తనయుడు కార్తికేయ తెలుగు ప్రేక్షకులకు అందించారు. ఇటీవల విడుదలైన ఈ చిత్రానికి మంచి స్పందన వస్తోంది. ఈ సందర్భంగా మంగళవారం సాయంత్రం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో రాజమౌళి మాట్లాడారు. డిస్ట్రిబ్యూటర్‌గా మారిన కార్తికేయను ఆయన అభినందించారు. 'మలయాళంలో కంటే తెలుగులో డైలాగులు బాగున్నాయి. పరీక్షలు ఉన్నాయని ఈ సినిమా చూడడం మానకండి. చిత్రం చూస్తే ఇంకా రిలాక్స్ అయి బాగా చదువుతారు' అన్నారు దర్శకుడు అనిల్ రావిపూడి. కార్తికేయ మాట్లాడుతూ 'చాలా తక్కువ టైమ్‌లో ఈ సినిమాను తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకువచ్చాం. రచయిత ఆదిత్య , పాటల రచయిత కిట్టు . ఇలా మేమందరం కలసి వారం రోజుల్లోనే పూర్తి చేశాం' అని చెప్పారు. ఈ కార్యక్రమంలో మమిత, నస్లీన్, దర్శకుడు గిరీశ్, సంగీత దర్శకుడు కీరవాణి తదితరులు పాల్గొన్నారు.

హను-మాన్ టీమ్‌కు ప్రశంసలు



భారతీయ ఆధ్యాత్మిక సంప్రదాయాలను, వాటి నుంచి ఉద్భవించిన సూపర్ హీరోలను అద్భుతంగా చూపించి విజయం సాధించిన 'హను-మాన్' చిత్రం టీమ్‌ను కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రశంసించారు. పార్టీ సమావేశంలో పాల్గొనడం కోసం హైదరాబాద్ వచ్చిన అమిత్ షాను 'హను-మాన్' చిత్ర దర్శకుడు ప్రశాంత్ వర్మ, హీరో తేజ, నిర్మాత నిరంజన్ రెడ్డి కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు హనుమంతుడి విగ్రహాన్ని బహూకరించారు. ఈ సినిమాకు సీక్వెల్‌గా వస్తున్న 'జై హనుమాన్' కూడా విజయం సాధించాలని అమిత్ షా ఆకాంక్షించారు.

స్వచ్ఛమైన ప్రేమకథ లంబసింగి

నవీన్ గాంధీ



భరత్‌రాజ్ హీరోగా, దివి హీరోయిన్‌గా నటించిన 'లంబసింగి' చిత్రం ఈ నెల 15న విడుదల కానుంది. ఈ సందర్భంగా దర్శకుడు నవీన్ గాంధీ మీడియాతో మాట్లాడుతూ 'ఒక స్వచ్ఛమైన ప్రేమకథను సహజంగా చూపించాలని 'లంబసింగి' చిత్రం తీశాను. కొత్తవారయితేనే బాగుంటుందని నూతన నటీనటులతో రూపొందించాం. సినిమాలో ప్రతి పాత్ర రియలిస్టిక్‌గా ఉంటుంది. లంబసింగి అనే ఏజెన్సీ ప్రాంతంలో 50 రోజుల పాటు సింగిల్ షెడ్యూల్‌లో షూటింగ్ చేశాం. ఇలాంటి ప్రేమకథలకు సంగీతం ప్రధానం. అందుకే పాటలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని సంగీత దర్శకుడు ఆర్.ఆర్. ధ్రువన్‌తో చేయించాం. అన్ని పాటలు మంచి ఆదరణ పొందాయి' అని చెప్పారు. దర్శకుడు కల్యాణ్‌కృష్ణ సొంతంగా బేనర్ స్టార్ట్ చేసి కథలు వింటున్నారని తెలసి ఆయన్ని కలిశాననీ, తను చెప్పిన కథ ఆయనకు నచ్చిందనీ నవీన్ గాంధీ తెలిపారు. అయితే కరోనా కారణంగా షూటింగ్ ఆలస్యంగా మొదలైందని చెప్పారు.

ఫికర్ మత్ కరో అనిపించాలి

ఆర్. నారాయణమూర్తి



సాయిరామ్ శంకర్, యషా శివకుమార్, హెబ్బా పటేల్ హీరోహీరోయిన్లుగా నటించిన 'వెయ్ దరువెయ్' చిత్రం ఈ నెల 15న విడుదల కానుంది. నవీన్ రెడ్డి దర్శకత్వంలో దేవరాజ్ పోతూరు నిర్మించిన ఈ చిత్రం ప్రీ రిలీజ్ ఫంక్షన్ మంగళవారం రాత్రి జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న పీపుల్స్‌స్టార్ ఆర్.నారాయణమూర్తి, దర్శకుడు త్రినాథరావు నక్కిన బిగ్ టికెట్‌ను లాంచ్ చేశారు. ఈ సందర్భంగా నారాయణమూర్తి మాట్లాడుతూ 'ఈ సినిమాలో సాయిరామ్ శంకర్ 'ఫికర్ మత్ కరో' అనే డైలాగ్ చెబుతుంటారు. 'పుష్ప' సినిమాలో అల్లు అర్జున్ 'తగ్గేదే లా' అని ఎలా అందరితో అనిపించారో, ఈ 'వెయ్ దరువెయ్' సినిమాతో సాయిరామ్ శంకర్ అందరి నోట 'ఫికర్ మత్ కరో' అనిపించాలి. సినిమా పెద్ద హిట్ అయి, ఆయనకు 'పేరు తేవాలి' అని కోరారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆకాశ్ పూరి మాట్లాడుతూ ' మా బాబాయ్‌లోని ఎనర్జీ ఎక్కడా లేదు. 'బంపర్ ఆఫర్‌లో ఆ ఎనర్జీని చక్కగా చూపించారు. దానికి మించి ఈ సినిమాలో చూస్తారు' అన్నారు. 'దర్శకుడు నవీన్ కథ చెప్పగానే నచ్చింది. నా బాడీ లాంగ్వేజ్‌కు సూట్ అవుతూనే మంచి పాయింట్‌తో కథ రాసుకున్నారని అనిపించింది. నాకు కమ్ బ్యాక్ మూవీ అవుతుంది' అని చెప్పారు సాయిరామ్ శంకర్. దర్శకుడు నవీన్‌రెడ్డి మాట్లాడుతూ 'మా నిర్మాత సపోర్ట్‌తో 34 రోజుల్లోనే సినిమా పూర్తి చేశాం. సాయిరామ్ శంకర్ లేకపోతే ఈ సినిమా లేదు. మూడొందలకు పైగా థియేటర్లలో విడుదల చేస్తున్నాం' అని చెప్పారు. నిర్మాతగా తనకు ఇది రెండో చిత్రమనీ, ప్రేక్షకులు ఆదరించి, ఆశీర్వదించాలని నిర్మాత దేవరాజ్ కోరారు.

రాజావారు రాణిగారి పెళ్లిసందడి



రాజావారు రాణిగారు చిత్రంతో హీరో హీరోయిన్లుగా తెలుగు తెరకు పరిచయమైన కిరణ్ అబ్బవరం, రహస్య గోరక్ జంట నిజజీవితంలోనూ ఒక్కటవబోతోంది. ఆ సినిమా సమయంలోనే ప్రేమలో పడిన ఈ జంట త్వరలోనే పెళ్లిపీటలెక్కబోతోంది. హైదరాబాద్‌లోని ఓ రిసార్ట్‌లో బుధవారం వీరిద్దరి నిశ్చితార్థ కార్యక్రమం ఘనంగా జరిగింది. కొద్దిమంది కుటుంబ సభ్యులు, సన్నిహితుల సమక్షంలో ఉంగరాలు మార్చుకున్నారు. వీరి నిశ్చితార్థం వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఆగస్టులో వివాహం జరగనుందని సమాచారం.

కథానాయికకు కలిసొచ్చేనా!







టాలీవుడ్‌లో వరుస విజయాలతో కుదురుకొన్న కథానాయికలు కొందరు పరభాషా పరిశ్రమలపై దృష్టి సారించారు. ఇన్నాళ్లూ తెలుగు సినిమాలకు మాత్రమే ప్రాధాన్యం ఇచ్చిన వాళ్లు కాస్తా ఇప్పుడు తమిళ, కన్నడ, మలయాళ, హిందీ పరిశ్రమలను చుట్టొస్తున్నారు. ఇతర ఇండస్ట్రీల్లోనూ హీరోయిన్‌గా తమ అదృష్టాన్ని పరీక్షించు కుంటున్నారు.

మలయాళ ఎంట్రీ

ఇన్నాళ్లూ టాలీవుడ్‌లో తిరుగులేని కథానాయికగా తన ఆధిపత్యాన్ని కొనసాగిస్తూ వచ్చారు అనుష్క. 'బాహుబలి' చిత్రాల తర్వాత సినిమాలకు కాస్త గ్యాప్ ఇచ్చారు. 'మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి' చిత్రంతో ఘన విజయం అందుకొని తనకు తిరుగులేదని చాటారు. ప్రస్తుతం ఆమె క్రిష్ దర్శకత్వంలో ఓ చిత్రం చేస్తున్నారని టాక్. ఇది కాకుండా ఆమె ఇప్పటివరకూ మరో తెలుగు చిత్రం అంగీకరించ లేదు. కానీ తన కెరీర్‌లో తొలిసారి మలయాళంలో 'కథనార్' చిత్రం చేస్తున్నారు. సెట్స్‌లోకి అనుష్క అడుగుపెట్టారు. భారీ బడ్జెట్‌తో రెండు భాగాలుగా తెరకెక్కుతోంది. 14 భాషల్లో ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నట్లు యూనిట్ ప్రకటించింది. కేరళలో జరిగిన వాస్తవ సంఘటనల ఆధారంగా దర్శకుడు రోజిన్ థామస్ తెరకెక్కిస్తున్నారు.

బాలీవుడ్‌లో మిల్కీ బ్యూటీ జోరు

'చాంద్ సా రోషన్ చెహ్రా' అనే హిందీ చిత్రంతోనే తమన్నా హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చారు. ఆ తర్వాత మాత్రం దక్షిణాది చిత్రాలతో బిజీ అయ్యారు. ప్రస్తుతం తెలుగులో 'ఓదెల 2' చిత్రంలో నటిస్తున్నారు. తమన్నా మళ్లీ హిందీ చిత్రాలపై దృష్టి సారించారు. గతేడాది 'లస్ట్ స్టోరీస్ 2'తో తమన్నా వేడి పుట్టించారు. ప్రస్తుతం 'వేదా' చిత్రంలో నటిస్తున్నారు. అలాగే 'స్త్రీ 2' చిత్రం కోసం ఓ ప్రత్యేక గీతంలో ఆమె నర్తించారని బాలీవుడ్ టాక్. అలాగే నీరజ్‌పాండే దర్శకత్వంలో ఓ కథానాయిక ప్రాధాన్యం చిత్రం అంగీకరించారని తెలుస్తోంది.

పూజా మరో ప్రయత్నం

టాలీవుడ్‌లో భారీ డిమాండ్ ఉన్న కథానాయికగా కొనసాగుతున్న తరుణంలోనే హిందీలోకి రీ ఎంట్రీ ఇచ్చారు పూజాహెగ్డే. 'సర్కస్' చిత్రం నిరాశపరచగా, సల్మాన్‌ఖాన్ లాంటి సూపర్‌స్టార్‌తో 'కిసీకా భాయ్ కిసీకా జాన్' చేసినా విజయం మాత్రం దక్కలేదు. ఇటు తెలుగులోనూ ఆమె నటించిన సినిమాలు వరుసగా ఫ్లాప్ అయ్యాయి. 2020లో వచ్చిన 'అల వైకుంఠపురం' తర్వాత ఆమె ఖాతాలో హిట్ పడలేదు. తెలుగు పరిశ్రమ నుంచి పిలుపు వస్తున్నా పూజా మాత్రం పరభాషా చిత్రాలపైనే దృష్టిపెట్టారు. ప్రస్తుతం ఆమె బాలీవుడ్‌లో షాహిద్‌కపూర్ సరసన 'దేవా' చిత్రంలో నటిస్తున్నారు. అలాగే అహాన్ శెట్టి హీరోగా నటిస్తున్న 'సంకీ' చిత్రంలో నాయికగా అలరించనున్నారు. అద్నాన్ షేక్, యాసిర్ జా దర్శకత్వంలో సాజిద్ నడియాడ్‌వాలా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. అలాగే తమిళ దర్శకుడు అజయ్ జ్ఞానముత్తుతో పూజా ఓ చిత్రం చేయబోతున్నారని బలంగా వినిపిస్తోంది.

హిందీలో తొలి చిత్రం

తన చలాకీ నటనతో దక్షిణాదిన అభిమానగణాన్ని సంపాదించుకున్నారు సాయిపల్లవి. ఇప్పటివరకూ ఆమె తెలుగు, తమిళ, మలయాళ చిత్రాల్లోనే నటించారు. తెలుగులో 'విరాటపర్వం' తర్వాత ఆమె మరో చిత్రం అంగీకరించలేదు. హిందీ సినిమాలపైన ఫోకస్ పెట్టడమే దానికి కారణం. ఆమిర్‌ఖాన్ తనయుడు జునైద్ ఖాన్ హీరోగా తెరకెక్కుతోన్న చిత్రంలో సాయిపల్లవి కథానాయిక. ఇటీవలే ఈ చిత్రం జపాన్ షెడ్యూల్ పూర్తయింది. సునీల్‌పాండే దర్శకత్వంలో ఆమిర్‌ఖాన్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. అలాగే నితీశ్ తివారి దర్శకత్వంలో భారీ బడ్జెట్‌తో 'రామాయణం' చిత్రం తెరకెక్కుతోంది. ఇందులో రాముని పాత్రలో రణ్‌బీర్‌కపూర్, సీతమ్మ వారి పాత్రలో సాయిపల్లవి నటించనున్నారని సమాచారం.





మళ్లీ బాలీవుడ్‌కు

'మద్రాస్ కేఫ్' చిత్రంతో బాలీవుడ్‌లో కథానాయికగా ఎంట్రీ ఇచ్చారు రాశీ ఖన్నా. ఆ తర్వాత తెలుగు చిత్రాలపై దృష్టి పెట్టారు. ఇక్కడ వరుస సినిమాలు చేస్తూ వచ్చారు. చాలా గ్యాప్ తర్వాత ఆమె మరో హిందీ చిత్రంలో నటిస్తున్నారు. ఈ నెల 15న విడుదలవుతున్న 'యోధ' చిత్రంలో సిద్ధార్థ్ మల్హోత్రాకు జోడీగా రాశీ ఖన్నా నటించారు. 'యోధ'తో మళ్లీ బాలీవుడ్ పరిశ్రమకు వచ్చినందుకు ఆనందంగా ఉందన్నారు రాశి. ప్రస్తుతం తెలుగులో 'తెలుసుకదా' అనే చిత్రం చేస్తున్న రాశీ పలు బాలీవుడ్ ప్రాజెక్ట్‌ల్లోనూ భాగమవుతున్నారు. 'ది సబర్మతీ రిపోర్ట్', 'టీఎంఈ' తదితర చిత్రాలను రాశీ ఖన్నా అంగీకరించారు.

తెలుగుతో పాటు తమిళంలోనూ

ఇప్పటివరకూ బాలీవుడ్ చిత్రాల్లో మాత్రమే నటించిన జాన్వీకపూర్ తెలుగులో రెండు చిత్రాలకు పచ్చజెండా ఊపారు. ఎన్టీఆర్ సరసన నటిస్తున్న 'దేవర' సెట్స్‌పైన ఉండగా, బుచ్చిబాబు సానా దర్శకత్వంలో రామ్‌చరణ్ హీరోగా తెరకెక్కుతోన్న చిత్రంలో నటిస్తున్నారు. పనిలో పనిగా తమిళ చిత్రాలపైన జాన్వీ ఫోకస్ పెట్టినట్లు తెలుస్తోంది. సూర్య సరసన 'కర్ణ' అనే చిత్రంలో ఆమె నటిస్తున్నారని కోలీవుడ్ టాక్. రాకేశ్ ఓం ప్రకాశ్ మెహ్రా ఈ చిత్రానికి దర్శకుడు.

హై యాక్షన్ ప్యాక్డ్ మూవీ



శివకార్తికేయన్ హీరోగా ఏ.ఆర్. మురుగదాస్ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం షూటింగ్ రెండో షెడ్యూల్ మొదలైంది. చిత్రంలోని ప్రధాన తారాగణంపై కీలక సన్నివేశాలు చిత్రీకరిస్తున్నారు. శివకార్తికేయన్ కెరీర్‌లో ఇది బిగ్గెస్ట్ బడ్జెట్ చిత్రమనీ, ఇంతకు ముందు నటించిన చిత్రాలకు భిన్నంగా ఈ సినిమాలో ఆయన కనిపిస్తారనీ నిర్మాతలు చెప్పారు. కన్నడ నటి రుక్మిణి వసంత్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. పాన్ ఇండియా స్థాయిలో హై యాక్షన్ ప్యాక్డ్‌గా తయారవుతున్న ఈ చిత్రానికి అనిరుధ్ సంగీత దర్శకుడు. సుదీప్ ఎలామన్ సినిమాటోగ్రాఫర్.

యూత్ టీమ్‌తో ఫైటర్ రాజా



రామ్, మాయా కృష్ణన్ ప్రధాన పాత్రలు పోషించే 'ఫైటర్ రాజా' చిత్రం ఫస్ట్ లుక్‌ను హీరో శ్రీవిష్ణు లాంచ్ చేశారు. ప్రియదర్శి, రాహుల్ రామకృష్ణ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. చాలా రోజుల తర్వాత ఓ విభిన్నమైన పాత్ర పోషిస్తున్నట్లు తనికెళ్ల భరణి చెప్పారు. రియలిస్టిక్‌గా ఉంటూ యూత్‌ను ఆకట్టుకొనే చిత్రమిదని ఆయన తెలిపారు. నిర్మాతల్లో ఒకరైన దినేశ్ యాదవ్ బొల్లెబోయిన మాట్లాడుతూ 'యంగ్ టీమ్‌తో నిజాయితీగా ఈ చిత్రం తీస్తున్నాం. అందరినీ అలరించే సినిమా అవుతుంది. ఈ నెలలోనే టీజర్ విడుదల చేస్తాం' అని చెప్పారు. 'నా తొలి సినిమా 'పచ్చీస్' కొవిడ్ కారణంగా ఓటీటీలో విడుదలైంది. కానీ 'ఫైటర్ రాజా' థియేటర్లలో సందడి చేస్తుంది' అని హీరో రామ్ చెప్పారు. సినిమా అందరికీ నచ్చుతుందని దర్శకుడు కృష్ణప్రసాద్ చెప్పారు.

పతంగ్ పాట



పతంగుల పోటీ నేపథ్యంలో తెలుగులో తెరకెక్కిన తొలి క్రీడా నేపథ్య చిత్రం 'పతంగ్'. ప్రణీత్ ప్రత్తిపాటి దర్శకత్వంలో శేఖర్ అన్నే, సంపత్ మక, సురేశ్ కొత్తింటి నిర్మించారు. గాయకుడు ఎస్పీ చరణ్ కీలకపాత్ర పోషించారు. త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రం నుంచి 'హే హలో నమస్తే' అంటూ సాగే గీతాన్ని గీత రచయిత చంద్రబోస్, దర్శకుడు అనుదీప్ విడుదల చేశారు. చిత్రబృందానికి ఘన విజయం దక్కాలని చంద్రబోస్ ఆకాంక్షించారు. ఈ చిత్రానికి జోస్ జిమ్మీ సంగీతం ప్రధాన బలం అని నిర్మాతలు చెప్పారు.

కౌన్సెలింగ్

సర్వైకల్ కేన్సర్ ప్రాణాంతకమా?

డాక్టర్ సర్వైకల్ కేన్సర్‌ను ముందుగానే ఎలా పసిగట్టాలి? ఈ కేన్సర్ సోకకుండా ఏదైనా వ్యాక్సిన్ ఉందా?

- ఓ సోదరి, వరంగల్

కేన్సర్ అనగానే ఇక చావు దగ్గర పడిందనే నిర్థారణకొస్తాం. కానీ నిజానికి మహిళల్లో ఎక్కువగా కనిపించే రొమ్ము కేన్సర్‌తో పోలిస్తే, సర్వైకల్ కేన్సర్‌ను కనిపెట్టడం, చికిత్స చేయడం తేలిక.

లక్షణాలు

గర్భాశయ ముఖద్వార కేన్సర్ తొలి దశలో లక్షణాలేవీ కనిపించకపోవచ్చు. తర్వాతి దశల్లో లక్షణాలు ఎలా ఉంటాయంటే...

- నెలసరి మధ్యలో, నెలసరి తర్వాత, శారీరక కలయిక సందర్భంలో యోని నుంచి రక్తస్రావం కనిపిస్తుంది.
- నీరు, రక్తంతో కూడిన స్రావాలు కనిపిస్తాయి. ఎక్కువగా విడుదలయ్యే ఆ స్రావాల నుంచి దుర్వాసన వెలువడుతుంది.
- నడుము నొప్పి, అసౌకర్యం ఉంటుంది.

కారణాలు

గతంతో పోలిస్తే గర్భాశయ ముఖద్వార కేన్సర్ కేసులు ఈ మధ్య కాలంలో విపరీతంగా పెరుగుతున్నాయి. ఇందుకు పర్యావరణ మార్పులు, ఆహార, జీవనశైలి మార్పులు ప్రధాన కారణాలు. అయితే ఈ రకమైన కేన్సర్ సోకడానికి కచ్చితమైన కారణాన్ని కనిపెట్టలేకపోయినా, ఈ కేన్సర్ వృద్ధిలో హెచ్‌పివి (హ్యూమన్ పాపిలోమా వైరస్) పాత్ర ప్రధానంగా ఉంటున్నట్టు నిర్థారణ అయింది. అయితే ఈ వైరస్ సోకిన ప్రతి ఒక్కరూ, గర్భాశయ ముఖద్వార కేన్సర్‌కు గురి కాకపోయినా, కొందర్లో ఆ వైరల్ ఇన్‌ఫెక్షన్ సర్వైకల్ కేన్సర్‌గా వృద్ధి చెందుతోంది. ఇందుకు కారణం పర్యావరణ, జీవనశైలి, ఆహారశైలిల్లో చోటు చేసుకున్న మార్పులు అందుకు తోడవడమే! ఈ కారణాలతో పాటు సర్వైకల్ క్యాన్సర్‌కు మరికొన్ని కారణాలు దోహదపడతాయి. అవేంటంటే...

- **ఒకటికి మించి లైంగిక సంబంధాలు:** ఎన్ని ఎక్కువ లైంగిక సంబంధాలు కలిగి ఉంటే, హెచ్‌పివి ఇన్‌ఫెక్షన్ సోకే అవకాశాలు అంత ఎక్కువగా ఉంటాయి.
- **లైంగిక వ్యాధులు:** క్లమీడియా, గనేరియా, సిఫిలిస్, హెచ్ఐవి ఇన్‌ఫెక్షన్ హెచ్‌పివి ఇన్‌ఫెక్షన్ సోకే అవకాశాలను పెంచుతాయి.



పరీక్షలు కీలకం


- **పాప్‌స్మియర్ టెస్ట్:** ఈ పరీక్షతో సర్విక్స్‌లోని కణాలు, వాటిలో చోటు చేసుకుంటున్న మార్పులు, సర్వైకల్ కేన్సర్ దారితీసే అవకాశాలను కనిపెట్టవచ్చు. లైంగిక జీవితాన్ని కొనసాగిస్తున్న ప్రతి మహిళా ఈ పరీక్ష చేయించుకోవడం అవసరం. వరుసగా మూడేళ్ల పాటు పరీక్ష ఫలితం నెగటివ్ వస్తే, అప్పటి నుంచి ప్రతి మూడేళ్లకోసారి ఈ పరీక్ష చేయించుకుంటే సరిపోతుంది.
- **హెచ్‌పివి డిఎన్ఎ టెస్ట్:** లైంగిక జీవితాన్ని కొనసాగిస్తున్న ప్రతి మహిళా ఈ పరీక్ష చేయించుకోవడం అవసరం. ఫలితం నెగటివ్ వస్తే, అప్పటి నుంచి ఐదేళ్లకోసారి ఈ పరీక్ష చేయించుకుంటే సరిపోతుంది.

హెచ్‌పివి వ్యాక్సిన్

సర్వైకల్ క్యాన్సర్‌కు ప్రధాన కారణమైన హెచ్‌పివి వైరస్‌కు అడ్డుకట్ట వేసే వ్యాక్సిన్ ఇది. 9 ఏళ్లు మొదలు 45 ఏళ్ల లోపు మహిళలు ఈ వ్యాక్సిన్ వేయించుకోవచ్చు.

డాక్టర్ సచిన్ మర్ద,
ఆంకాలజిస్ట్, హైదరాబాద్

ఒక కుటుంబంలో ఒక డాక్టర్ ఉంటే ఎక్కువ. ఇద్దరు ఉంటే కొద్దిగా ఆశ్చర్యం. అదే ఏడుగురు ఉంటే... వారందరూ కలిసి ఒక సైన్యంలా ఆసుపత్రిని నడుపుతూ ఉంటే... కామినేని ఆసుపత్రిలో అంతే... హైదరాబాద్‌లోని తొలి తరం కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఒకటైన కామినేనిలో కీలకమైన స్థానాల్లో కుటుంబ సభ్యులు ఉండటం... ఏడుగురిలో ఐదుగురు మహిళలే కావటం ఒక విశేషం. ఒక ఆసుపత్రిని నడపటంలో ఉన్న కష్టనష్టాలు, వర్క్ లైఫ్ బ్యాలెన్స్... ఇలాంటి అనేక విశేషాలను వారు 'నవ్య'కు వివరించారు.



ప్రాణదాతల ఫ్యామిలీ

"మా మామగారు (కామినేని సూర్యనారాయణ) మెటలర్జిస్ట్. ఒకప్పుడు మాకు ఆయిల్ డ్రిల్లింగ్ పైప్స్ కంపెనీ ఉండేది. ఆ కంపెనీలో పనిచేసేవారికి నాణ్యమైన వైద్యం అందించాలనేది మా మామగారి కోరిక. అందుకోసం- ఆయన ప్రపంచంలో అనేక ఆసుపత్రులను సందర్శించి వాటిలో ఉండే మౌలిక సదుపాయాలను గమనించేవారు. నా భర్త (డాక్టర్ శశిధర్)ను మెడిసిన్ చదివించారు. ఆ సమయంలో నిజామ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్) అందరికీ ఒక ఆదర్శప్రాయమైన ఆసుపత్రిలా ఉండేది. మా కంపెనీలో పనిచేసే ఉద్యోగుల కోసం ఒక ఆసుపత్రిని నిర్మించాలని ఆయన అనుకొన్నారు. ఆ ఆసుపత్రిని కూడా నిమ్స్ స్థాయిలో ఉండేలా నిర్మించారు. అదే నార్కట్‌పల్లిలో ఉన్న కామినేని ఆసుపత్రి. మనుమలందరూ డాక్టర్స్ కావాలని ఆయన కోరిక. అందుకే మొత్తం ఏడుగురు పిల్లలు ఉంటే- అందులో ఐదుగురు మెడిసిన్ చదివారు. వారిలో నలుగురు అమ్మాయిలే! వారు ఇప్పుడు కామినేని ఆసుపత్రిని ముందుకు తీసుకువెళ్లటంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నారు.

ఆ రోజుల్లో..

మేము కొత్తగా ఆసుపత్రి ప్రారంభించిన సమయంలో విపరీతమైన పని ఒత్తిడి ఉండేది. గైనకాలజిస్ట్‌ను కాబట్టి- అర్థరాత్రిళ్లు కూడా ఆసుపత్రికి వెళ్లాల్సి వచ్చేది. ఇంట్లో పిల్లలను లాక్ చేసి- వెళ్లి వచ్చేదాన్ని. అంతే కాదు... మా ఆసుపత్రిలో చాలా కచ్చితమైన నియమాలను పాటించేవాళ్లం. పేషెంట్లు ఉన్నా లేకపోయినా- డాక్టర్లు ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల దాకా ఉండాల్సిందే! అలాగే... డాక్టర్లకు ఇచ్చే వేతనం - వారెంత మంది పేషెంట్లను చూసేవారనే విషయంపై ఆధారపడి ఉండేది కాదు. అందువల్ల అందరూ పేషెంట్లపై ఎక్కువ శ్రద్ధ పెట్టేవారు. ఇప్పుడు పరిస్థితులు మారిపోయాయి. అయినా మేము ఇంకా ఆనాటి విలువలను పాటించటానికి ప్రయత్నిస్తున్నాం. ప్రస్తుతం కామినేని గ్రూప్‌లో 3.156 బెడ్స్ ఉన్నాయి. ఒక నర్సింగ్ స్కూల్, మెడికల్ కాలేజీ, డెంటల్ కాలేజీ- ఇలా వైద్య విద్య, చికిత్సలకు సంబంధించిన అన్ని విభాగాల్లోను విస్తరించింది. ఇక్కడ ఇంకో విషయం కూడా చెప్పాలి. ఒకప్పుడు పేషెంట్లకు ఎలాంటి చికిత్స అందించాలనే విషయం- పరీక్షలపై ఆధారపడి ఉండేది కాదు. నేను చదువుకున్న రోజుల్లో అయితే మా టీచర్లు- పేషెంట్‌ను చూసి ఆమెకు ఉన్న వ్యాధి ఏమిటో చెప్పేసేవారు. ఇప్పటి జనరేషన్ వారు రిపోర్ట్స్‌పైనే ఆధారపడుతున్నారు. రిపోర్ట్స్‌కు డయాగ్నిస్ చేస్తున్నారు తప్ప పేషెంట్లకు కాదు. అయితే టెక్నాలజీని తక్కువ అంచనా వేయకూడదు. టెక్నాలజీ వల్ల డాక్టర్ల పని సులభం అవుతోంది. కానీ పూర్తిగా టెక్నాలజీపై ఆధారపడటం కూడా తప్పే!

> మద్దతు ఇచ్చే ఫ్యామిలీ ఉంటే వర్క్‌లైఫ్ బ్యాలెన్స్ అవుతుంది. నా భర్త, అత్తమామలు- నాకు ఎంతో మద్దతు ఇచ్చారు. అందుకే పిల్లలను కూడా విడిచిపెట్టి... లండన్ వెళ్లి చదువుకోగలిగాను. అన్ని బాధ్యతలూ నిర్వర్తించ గలుగుతున్నాను.

> పరీక్షలు ఎక్కువ రాయటం వెనక పేషెంట్ల పాత్ర కూడా ఉంది. కొందరు పరీక్షలు వద్దంటే ఒప్పుకోరు. సీటీ స్కాన్, ఎంఆర్ఐలు చేయమని అడుగుతూ ఉంటారు. అవసరం లేదంటే వినరు.

ఇంకా మారలేదు...

ఎవరైనా మహిళను - "మీకు ఏం కావాలి?" అని అడగండి. "నా కుటుంబం బావుండాలి" అంటుంది. అంతే తప్ప తన ఆరోగ్యం ముఖ్యం అనుకోదు. ఇది మన భారతీయ జీవన విధానంలో ఒక భాగమయిపోయింది. ఇంట్లో మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబమంతా ఆరోగ్యంగా ఉంటుంది. కానీ మహిళలకు కుటుంబంలోని ఇతర సభ్యులపైనే ఎక్కువ శ్రద్ధ ఉంటుంది. ఇది ఈనాటి మాట కాదు. సుమారు 20 సంవత్సరాల క్రితం ఉమ్మడి నల్గొండ జిల్లాలో మెడికల్ క్యాంపులు నిర్వహించేవాళ్లం. సర్వైకల్ క్యాన్సర్ స్క్రీనింగ్‌లు చేసేవాళ్లం. మన దేశంలో ఎక్కువ మంది మహిళలు ఈ క్యాన్సర్ బారినే పడతారు. చాలామందికి చివరి దశలో తెలుస్తుంది. అప్పటికే పరిస్థితి చేయిదాటిపోతుంది. అందువల్ల మహిళలకు స్క్రీనింగ్ చేసి- చికిత్సకు రమ్మని పిలిచేవాళ్లం. స్క్రీనింగ్ వరకు సరే... కానీ చికిత్సకు రావటానికి మాత్రం ఇష్టపడేవారు కారు. వెహికిల్ పంపినా వచ్చేవారు కాదు. ఎందుకంటే- మహిళలకు వారి ఆరోగ్యం కన్నా కుటుంబమే ముఖ్యం. నా ఉద్దేశంలో 60 దాటిన తర్వాత కొందరు మహిళల్లో - "నా జీవితం అయిపోయింది" అనే నిరాశ ఏర్పడుతుంది. దీనితో వారు తమ ఆరోగ్యాన్ని పట్టించుకోరు. కాబట్టి కుటుంబ సభ్యులే మహిళల ఆరోగ్యం గురించి పట్టించుకోవాలి. అప్పుడు కుటుంబంలోని వారందరూ మరింత సంతోషంగా ఉండగలుగుతారు.

> నా వృత్తి జీవితంలో ఇప్పటిదాకా అనవసరంగా నేను ఒక్క సిజేరియన్ కూడా చేయలేదు. డెలివరీకి వచ్చిన వారికి లేబర్ పెయిన్స్ వచ్చే దాకా ఆగమని చెబుతూ ఉంటా! మా అమ్మాయి మూడు రోజులు లేబర్ పెయిన్స్‌తో బాధపడింది.

- డాక్టర్ వసుంధర,
డైరక్టర్- కామినేని హాస్పటల్స్

"చిన్నప్పటి నుంచి అమ్మమ్మ- "చదువే నీ బలం. మేము ఇచ్చే డబ్బులు ఉండచ్చు.. పోవచ్చు. కానీ విద్య మాత్రం ఎక్కడికి పోదు. నీ కాళ్ల మీద నువ్వు నిలబడేలా చేస్తుంది" అని చెప్పేది. ఈ రోజుకు మేమందరం నమ్మే సూత్రమిది. మేమందరం- మా స్కూల్లో (శ్రీవిద్యా పీఠ్), మా కాలేజీ(కామినేని)లో చదువుకున్నాం. కానీ అమ్మ, నాన్న- ఎప్పుడూ మమ్మల్ని వేరుగా చూడలేదు. అందరి పిల్లల మాదిరిగానే మేము కూడా హాస్టల్‌లో ఉండేవాళ్లం. వాళ్లతో పాటు తినేవాళ్లం. కాలేజీకి వచ్చిన తర్వాత- నేను మేనేజిమెంట్ వైపు వెళ్దామనుకున్నా. కానీ తాతకి మాత్రం మేమందరం డాక్టర్లు అవ్వాలని ఉండేది. నేను కూడా మెడిసిన్ (ఆర్థో) చదివా. అమ్మ, నాన్న- చదువు విషయంలో చాలా స్ట్రిక్ట్‌గా ఉండేవారు. నాకు యూనివర్సిటీ గోల్డ్‌మెడల్ వచ్చినప్పుడు- వాళ్ల ఆనందం చెప్పక్కరలేదు. నేను కామినేని ఫ్యామిలీలో సభ్యురాలినే కావచ్చు. కానీ ఉద్యోగంలో కింద నుంచే ప్రారంభమయ్యాను. స్ట్రేటజిక్ మేనేజర్‌గా చేరాను. డిప్యూటీ సీఓఓ, సీఈఓ అయ్యాను. మా సిస్టర్స్ ఇద్దరూ రేడియాలజిస్ట్‌లు. వారు కూడా రెసిడెంట్స్‌గానే జాయిన్ అయ్యారు. నెమ్మనెమ్మదిగా ఎదుగుతున్నారు. సీనియర్స్‌కు గౌరవం ఇస్తారు. మేము, మా కజిన్స్.. అంతకన్నా మాకు వేరే ప్రపంచం ఉండదు.

ఆ నిబద్ధతతోనే...

ఆసుపత్రిని నడపటం అనేది అంత సులువైన విషయం కాదు. ఇక్కడ వచ్చే ప్రతి వ్యక్తికి ఒక కథ ఉంటుంది. ఆ కథ వెనక అనేక కష్టాలు ఉంటాయి. వాటిని అధిగమించటానికి మా దగ్గరకు వస్తాడు. అలాంటి వారికి భరోసా ఇవ్వాల్సిన బాధ్యత డాక్టర్లపై ఉంటుంది. ఆసుపత్రిపై ఉంటుంది. మా ఆసుపత్రిలో మేము ఆ విలువలను ఇప్పటికీ పాటిస్తున్నామని గర్వంగా చెప్పగలను. ఒక హోటల్‌ను తీసుకోండి. అది ఇంటికి ఎక్స్‌టెన్షన్. కేవలం ఆతిథ్యం ఇస్తే సరిపోతుంది. కానీ ఆసుపత్రి అలా కాదు. ఆసుపత్రిలో ఆతిథ్యంతో పాటుగా సేవ కూడా చేయాల్సి ఉంటుంది. ఈ విషయంలో నాన్న చాలా కఠినంగా ఉంటారు. వైద్య రంగంలో ఉన్నవారందరికీ ఆయన ఉన్నత నైతిక విలువల గురించి తెలుసు. ఎవరైనా డాక్టర్లు ఎక్కువ పరీక్షలు రాస్తే- అది ఆయన దృష్టికి వస్తే- "అన్ని పరీక్షలు అవసరమా? కాదా?" అనే విషయంపై రివ్యూ చేస్తారు. అంత నిబద్ధత ఉన్న మనిషి కాబట్టే ఈనాటికి మేము విలువలతో కూడిన వైద్యాన్ని అందించగలుగుతున్నాం.

- డాక్టర్ గాయత్రి
సీఈఓ, కామినేని హాస్పటల్స్ (ఎల్.బి.నగర్)



నలభైల్లో మళ్లీ ట్రాక్‌లోకి...

ఆరేళ్లలో ఎనభై నాలుగు మెడల్స్... అథ్లెట్‌గా మాలాంబికా మిశ్రా సాధించిన విజయాలివి. కానీ ఒకే ఒక్క ఓటమితో ఆమె క్రీడా జీవితానికి బ్రేక్ పడింది. పాతికేళ్ళ తరువాత బరిలోకి దిగిన ఆమె మళ్లీ పతకాల పంట పండిస్తున్నారు. నలభై నాలుగేళ్ళ ఒడిశా స్ప్రింటర్ మాలాంబిక సెకెండ్ ఇన్నింగ్స్ గురించి ఆమె మాటల్లోనే...

"విజయాలు, పతకాలు, అభినందనలు నాకు కొత్త కాదు. కానీ నా జీవితంలో ఆ ఘట్టం ముగిసిపోయి రెండున్నర దశాబ్దాలైపోయింది. ఇప్పుడు మళ్లీ విజయాలు సాధిస్తున్నప్పుడు... అంతా కొత్తగా ఉంది. జీవితాన్ని సరికొత్తగా ప్రారంభించిన అనుభూతి కలుగుతోంది. 'క్రీడలను ఎంతో ప్రేమించే, ఆస్వాదించే నేను ఇన్నేళ్ళు మైదానానికి ఎలా దూరమయ్యాను? అదంతా కలా?' అనిపిస్తోంది. నా స్వస్థలం ఒడిశాలోని భువనేశ్వర్. చదువుతోపాటు క్రీడలన్నా అమితమైన ఆసక్తి. అథ్లెటిక్స్‌లో చిన్న వయసునుంచే శిక్షణ తీసుకున్నాను. పాఠశాల స్థాయిలోనే అనేక పోటీల్లో పాల్గొనేదాన్ని. 1992 నుంచి 1998 మధ్య 100, 200 మీటర్ల కేటగిరీల్లో జరిగిన రాష్ట్ర, జాతీయ స్థాయి స్పోర్ట్స్ మీట్స్‌లో పోటీ పడ్డాను. సబ్ జూనియర్ కేటగిరీలో 32, జూనియర్ కేటగిరీలో 52 పతకాలు గెలిచాను. ఆ తరువాత... 1999లో ఇంఫాల్‌లో నిర్వహించిన 30వ నేషనల్ గేమ్స్‌లో... 4-100 రిలే ఈవెంట్‌లో మాత్రం ఓటమి ఎదురయింది. ఎన్ని విజయాలు సాధించినా... ఒక్కోసారి ఒక ఘోర పరాజయం ఎంతో నిరాశ కలిగిస్తుంది. నా విషయంలోనూ అదే జరిగింది. నేను జాతీయ జట్టుకు ఎంపిక కావడం కష్టమైపోయింది. దాంతో చదువు మీద దృష్టి కేంద్రీకరించాను. ఆ తరువాత రాష్ట్ర ప్రభుత్వ అనుబంధ సంస్థ అయిన ఓఎంఫెడ్‌లో ఉద్యోగం వచ్చింది. రెండేళ్లకే పెళ్ళయింది, ఉద్యోగ, కుటుంబ బాధ్యతల్లో పూర్తిగా మునిగిపోయాను. సీనియర్ కేటగిరీలో ఒక్క పతకమైనా సాధించలేకపోయాననే ఆవేదన మాత్రం ఎప్పుడూ వెంటాడుతూనే ఉండేది. అలా రెండు దశాబ్దాలకు పైగా గడిచిపోయాయి. మళ్ళీ నేను స్ప్రింటర్‌గా బరిలోకి దిగుతానని ఎప్పుడూ ఊహించలేదు. కానీ దైవ నిర్ణయం మరోలా ఉంది.

తేలిగ్గా తీసిపారేశారు...

2000లో... కొవిడ్ మహమ్మారి కారణంగా అన్ని వ్యవస్థలు స్తంభించిపోయాయి. లాక్‌డౌన్ వల్ల అందరిలాగానే మా కుటుంబం కూడా ఇంటికే పరిమితమైపోయింది. ఆరోగ్యాన్ని కాపాడుకోవాలనే స్పృహ కూడా ప్రజల్లో బాగా పెరిగిన సందర్భం అది. చేతినిండా సమయం ఉండడంతో... వ్యాయామాలు మొదలెట్టాను. అప్పుడే స్పోర్ట్స్ ఈవెంట్స్‌లో పాల్గొనాలనే కోరిక కలిగింది. అయితే నలభయ్యేళ్ళు దాటిన తరువాత పోటీల్లో పాల్గొనడం అంత సులువేం కాదు. ప్రత్యేకించి మహిళకు శారీరకంగా సమస్యలు తలెత్తే వయసది. గాయాల బారిన పడే ప్రమాదం కూడా ఎక్కువే. ఇవన్నీ పరిగణనలోకి తీసుకొని ప్రాక్టీస్ చేశాను. మానసికంగా నన్ను నేను సిద్ధం చేసుకున్నాను. క్రీడాకారిణిగా రెండో ఇన్నింగ్స్ కోసం నేను చేస్తున్న ప్రయత్నాలను కొందరు మెచ్చుకుంటే... మరికొందరు తేలిగ్గా తీసిపారేశారు. "కోచ్‌గానో, కామెంటరేటర్‌గానో ఉండాల్సిన వయసు నీది. మళ్లీ పోటీల్లో పాల్గొనడం అంత సులువనుకుంటున్నావా?" అన్నారు. అవేవీ నేను పట్టించుకోలేదు. నా భర్త, మా అబ్బాయి, అత్తమామల ప్రోత్సాహంతో అథ్లెట్‌గా నా కెరీర్‌ను పునఃప్రారంభించాలని గట్టిగా నిర్ణయించుకున్నాను. 40 ప్లస్ అథ్లెట్లకు ఉండే ఆప్షన్ వెటరన్ కేటగిరీ మాత్రమే. దాని కోసం పోటీల కోసం రోజూ జిమ్‌కు వెళ్ళి వ్యాయామాలు చేశాను నిత్యం పరుగు ప్రాక్టీస్ చేశాను. శారీరకంగా కొన్ని ఇబ్బందులు ఎదురైనా వాటన్నిటినీ దృఢసంకల్పంతో అధిగమించాను. ఎలాగైనా పతకం గెలవాలన్న పట్టుదలతో... ఇటీవల గోవాలో జరిగిన 'నేషనల్ మాస్టర్స్ గేమ్స్'లో పాల్గొన్నాను. నాలుగొందల మీటర్ల విభాగంలో వెండి, 4 ప్లస్ 100 రిలే రేస్‌లో బంగారు పతకాలు సాధించాను. అవి చాలా ఉద్వేగభరితమైన క్షణాలు. ఎందుకంటే... ఒడిశా రాష్ట్రం కోసం సీనియర్ నేషనల్ మెడల్‌ను, దేశం కోసం అంతర్జాతీయ పతకాన్ని సాధించాలనేది నా ఒకప్పటి కల. అది తీరలేదు.. నా రెండో ఇన్నింగ్స్‌లో ... వెటరన్ విభాగంలోనైనా ఇంటర్నేషనల్ మెడల్‌ను గెలవాలన్నది నా లక్ష్యం. దాన్ని నెరవేర్చుకోవడానికి... ఈసారి తగ్గేది లేదు."

ఆస్కార్ తప్పినా, ఆదరణ దక్కింది

న్యూస్ మేకర్



పేద రైతు రంజిత్, సామూహిక అత్యాచారానికి గురైన అతని కూతురు, 13 ఏళ్ల మైనర్, కలిసి సాగించిన సాహసోపేతమైన న్యాయ పోరాటం 'టు కిల్ ఎ టైగర్' డాక్యుమెంటరీ, ఆస్కార్‌కు నామినేట్ అయి, అవార్డును గెలుచుకోలేకపోయినప్పటికీ, ప్రపంచవ్యాప్త ప్రశంసలను కూడగట్టుకుంటోంది. జార్ఖండ్‌లోని మారుమూల గ్రామంలో చోటుచేసుకున్న ఆ సంఘటనతో పాటు, మహిళలపై ప్రతి 20 నిమిషాలకు బలాత్కారం జరుగుతున్న భారతదేశ దుస్థితినీ, బాధిత కుటుంబ దయనీయ పరిస్థితినీ, మారుమూల గ్రామాల్లోని సామాజిక వెనకబాటుతనాన్నీ డాక్యుమెంటరీగా రూపొందించిన టు కిల్ ఎ టైగర్ రచయిత, దర్శకురాలు నిషా పహూజా గురించిన విశేషాలు...

ఎవరూ పులిని ఒంటరిగా చంపలేరు. ఆడపిల్లల మీద అఘాయిత్యాలకు పాల్పడడం కోసం పొంచి ఉండే పులులను అంతం చేయడం కష్టమే! అలాగని సామాజిక బహిష్కరణకు భయపడి, వెనక్కి తగ్గితే, బాధితురాలికి న్యాయం జరిగేదెలా? 13 ఏళ్ల కూతురి మీద అఘాయిత్యం చేసిన ముగ్గురు యువకులతో 14 నెలల పాటు న్యాయపోరాటం చేసి, పాతికేళ్ల జైలు శిక్ష పడేలా చేసి, ఒంటరిగా పులిని ఎదుర్కోవడమెలాగో నేర్పించిన ఒక తండ్రిగా రంజిత్ కనబరిచిన ధైర్యాన్ని, 13 ఏళ్ల బాధితురాలు కిరణ్ తెగువనూ ఎలాంటి కృత్రిమత్వానికీ తావు లేకుండా పారదర్శకంగా చిత్రీకరించింది దర్శకురాలు నిషా పహూజా. ఆడపిల్లల మీద అత్యాచారాలకు తెగబడే పులులను ఎదుర్కోవడం ఒకింత కష్టమే! కానీ 'పులిని ఒంటరిగా ఎలా చంపవచ్చో చూపిస్తాను' అనే మాటలను డాక్యుమెంటరీ చివర్లో రంజిత్ చేత చెప్పించడం ద్వారా మైనర్ బాధితుల తండ్రులు ప్రేరణ పొందే ప్రయత్నం చేసిందావిడ.

పులిని చంపారిలా....

జార్ఖండ్, బేరో జిల్లాలోని ఒక మారుమూల గ్రామంలో నివసించే రైతు రంజిత్ ప్రథమ సంతానం 13 ఏళ్ల కిరణ్. ఒక పెళ్లి వేడుకలో ఆ అమ్మాయిని ముగ్గురు యువకులు అడవిలోకి లాక్కుని వెళ్లి సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. ఈ సంఘటన 2017లో చోటు చేసుకుంది. బాధితురాలిని, అత్యాచారానికి పాల్పడిన వ్యక్తికి ఇచ్చి పెళ్లి జరిపించడం ఆ గ్రామ ఆనవాయితీ. గ్రామం పరువు ప్రతిష్ఠలను కాపాడుకోవడం, గ్రామ పెద్దతో కలిసి ఉమ్మడి నిర్ణయాలు తీసుకోవడం ఆ గ్రామ సంప్రదాయం. కానీ వాళ్ల నిర్ణయానికి తలొగ్గకుండా, అత్యాచారానికి గురైన బాధితులకు సహాయసహకారాలు అందించే స్వచ్ఛంద సంస్థ సహకారంతో కూతురి కోసం న్యాయ పోరాటం చేశాడు రంజిత్. ఒక వైపు గ్రామీణులు, ఊరి పెద్దల ఒత్తిళ్లు, బెదిరింపులు, మరొక వైపు కన్న కూతురికి న్యాయం చేసి తీరాలనే పట్టుదలల మధ్య నలిగిపోతూనే, చివరి వరకూ కోర్టు వాయిదాలకు హాజరవుతూ వచ్చిన రంజిత్, చివర్లో కూతురికి ధైర్యాన్ని నూరి పోసి, కోర్టులో తడబడకుండా సాక్ష్యం చెప్పగలిగేలా శిక్షణ ఇచ్చి, నేరస్థులకు శిక్ష పడేలా చేశాడు.

> దర్శకురాలు నిషా పహూజా ఢిల్లీలో పుట్టింది. 1970లో తల్లితండ్రులతో పాటు కెనడాకు వలస వెళ్లింది. యూనివర్శిటీ ఆఫ్ టొరాంటోలో ఇంగ్లీషు లిటరేచర్ చదివిన నిషా, మొదట్లో సిబిసిలో రీసెర్చర్‌గా పని చేసింది. ఆ తర్వాత కెనడియన్ సినీ నిర్మాతలైన జాన్ వాకర్, అలీ ఖజీమిలతో చేతులు కలిపి, చిత్రనిర్మాణ రంగంలోకి ప్రవేశించింది.

అవార్డుల పరంపర

దుర్ఘటన చోటు చేసుకున్నప్పటి నుంచి కోర్టు తీర్పు వెలువడే వరకూ ఏళ్ల తరబడి ఆ కుటుంబం వెన్నంటి ఉండి, వాళ్ల భావోద్వేగాలనూ, భయాందోళనలనూ కెమెరాలో బంధించి వీక్షకుల మనసులను కదలించే డాక్యుమెంటరీని రూపొందించగలిగింది దర్శకురాలు నిషా పహూజా. ఢిల్లీలో పుట్టిన నిషా 1970లో తల్లి తండ్రులతో పాటు కెనడాకు వలస వెళ్లింది. యూనివర్శిటీ ఆఫ్ టొరాంటోలో ఇంగ్లీషు లిటరేచర్ చదివిన నిషా, మొదట్లో సిబిసిలో రీసెర్చర్‌గా పని చేసింది. ఆ తర్వాత కెనడియన్ సినీ నిర్మాతలైన జాన్ వాకర్, అలీ ఖజీమిలతో చేతులు కలిపి, చిత్రనిర్మాణ రంగంలోకి ప్రవేశించింది. 2012లో ఆవిడ రూపొందించిన 'ది వరల్డ్ బిఫోర్ హర్' అనే డాక్యుమెంటరీ ట్రిబెకా ఫిల్మ్ ఫెస్టివల్‌లో బెస్ట్ డాక్యుమెంటరీ ఫీచర్ అండ్ జ్యూరీ అవార్డు విన్నర్‌గా ఎంపికవడంతో పాటు, బెస్ట్ కెనడియన్ డాక్యుమెంటరీగా కూడా గుర్తింపు పొందింది. వజ్రాల తయారీ వెనకున్న వాస్తవాలతో కూడిన డైమండ్ రోడ్ అనే సిరీస్ కూడా నిషాకు మంచి గుర్తింపును తెచ్చి పెట్టింది. తాజాగా నెట్‌ఫ్లిక్స్‌లో విడుదలై సంచలనం సృష్టిస్తున్న టు కిల్ ఎ టైగర్ డాక్యుమెంటరీలో బాధితురాలి గుర్తింపును బయల్పరడం గురించి వెల్లువెత్తిన విమర్శలకు స్పందిస్తూ... '13 ఏళ్ల బాధితురాలి ఐడెంటిటీని బయల్పరచకూడదనే ఉద్దేశంతో, ముఖాన్ని మార్ఫ్ చేద్దామని నిర్ణయించుకున్నాను. కానీ డాక్యుమెంటరీ రిలీజ్‌కు ముందు కిరణ్‌కు చూపించినప్పుడు, తన ముఖాన్ని దాచుకోవలసిన తప్పు తాను చేయలేదనీ, ముఖాన్ని చూపించడానికి తనకెలాంటి అభ్యంతరం లేదనీ అనడంతో, ఆ అమ్మాయిని యధాతథంగా చూపించాను' అని వివరణ ఇచ్చింది. ఈ డాక్యుమెంటరీలో కనిపించిన బాధితురాలి వయసు ఇప్పుడు 18 ఏళ్లు. తన లాంటి బాధితులకు న్యాయం జరిగేలా పోరాడడం కోసం, పోలీసు అధికారిగా ఎదగాలనే లక్ష్యంతో, కిరణ్ ఇప్పుడు స్వగ్రామానికి దూరంగా ఉన్నత విద్యను అభ్యసిస్తోంది.

స్పోర్ట్స్

విజయవాడ ● గురువారం 14 మార్చి 2024

ధనాధన్ పండుగకు రంగం సిద్ధమైంది. వేసవి వినోదంలో విశ్వవ్యాప్తంగా అత్యుత్తమ క్రీడా సంబరంగా నిలిచే ఇండియన్ ప్రీమియర్ లీగ్ వచ్చేస్తోంది. ప్రపంచంలోని క్రికెటర్లంతా ఒక్కచోట చేరి సందడి చేసే ఐపీఎల్ మరో ఎనిమిది రోజుల్లో మొదలవనుంది. ఈ మెగా లీగ్‌లో సత్తా చాటేందుకు ఆయా జట్లు ఇప్పటికే తమ అస్త్రాలకు పదును పెడుతున్నాయి. టైటిలే లక్ష్యంగా ఆటగాళ్లంతా కఠోరమైన ప్రాక్టీస్ సెషన్స్‌లో మునిగితేలుతూ, ప్రత్యర్థి జట్ల బలాబలాలపై వ్యూహరచనలు చేస్తూ లీగ్‌కు సన్నద్ధమవుతున్నారు.

ఐపీఎల్ 8 రోజుల్లో..

వేసవి వినోదం.. ధనాధన్‌కు సిద్ధం



ఆ'పాత' స్టయిల్లో..

ఐపీఎల్ అనగానే అభిమానులకు గుర్తొచ్చేది మహేంద్ర సింగ్ ధోనీ. లీగ్‌లో అత్యంత పాపులర్ జట్టు అయిన చెన్నై సూపర్‌కింగ్స్‌కు సారథి. ఈసారి మహీని కొత్త పాత్రలో చూడబోతున్నారంటూ ఇటీవల ఓ సంచలన పోస్ట్ సోషల్ మీడియాలో హల్‌చల్ చేసింది. అంటే.. ఈమారు ధోనీ మైదానంలో ఆటగాడిగా గాకుండా జట్టుకు మెంటార్‌గా బరిలోకి దిగనున్నాడా? ఇక మహీ విన్యాసాలు చూడలేమా? అంటూ అనేకమంది అభిమానులు ఆ పోస్ట్‌తో గందరగోళానికి గురయ్యారు. ఎలాంటి పాత్రలో కనిపిస్తాడన్న విషయంపై ఇంకా స్పష్టత రాకపోయినా..ధోనీ మాత్రం ఇప్పటికే సీఎస్‌కే జట్టుతో కలసిపోయాడు. అయితే, ప్రతిసారీ తనదైన హెయిర్ స్టైల్స్‌తో ప్రయోగాలు చేసే ధోనీ మునుపటి తరహాలో అభిమానులను కనువిందు చేయనున్నాడు. తాను అంతర్జాతీయ క్రికెట్ ఆరంభించినప్పుడు పొడవైన జుత్తుతో కనిపించి అప్పట్లో అందరిచూపును తనవైపు తిప్పుకొన్న ధోనీ.. ఈ సీజన్‌లో కూడా అలాగే కనిపించనున్నాడు. పొడవాటి జుట్టుతో తలకు ఎర్రటి బందనా కట్టుకొని మహీ ప్రాక్టీస్ చేస్తున్న ఫొటోను సీఎస్‌కే సోషల్ మీడియాలో పోస్టు చేసింది. దీన్ని చూసిన అభిమానులు పాత రోజులను గుర్తు చేసుకొంటూ సంబరపడుతున్నారు.

అన్ని మ్యాచ్‌లకూ అందుబాటులో..



బెయిర్‌స్టో

ఈ సీజన్ ఐపీఎల్ మొత్తానికి ఇంగ్లండ్, పంజాబ్ కింగ్స్ ఆటగాడు బెయిర్‌స్టో అందుబాటులో ఉండనున్నాడు. భారత్‌తో ఐదు టెస్టుల సుదీర్ఘ సిరీస్ ఇటీవలే ముగియడంతో.. ఇంగ్లండ్ ఆటగాళ్లందరూ స్వదేశానికి వెళ్లారు. అయితే, ధర్మశాలలో జరిగిన ఆఖరి టెస్టు సందర్భంగా.. ఐపీఎల్‌లో ఆడే క్రికెటర్లపై ఇంగ్లిష్ బోర్డుతో బీసీసీఐ అధికారులు చర్చించారు. వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా స్టోక్స్, రూట్, మార్క్ ఉడ్ మెగా లీగ్‌కు పూర్తిగా దూరమయ్యారు. కానీ, బెయిర్‌స్టో సీజన్ మొత్తానికి అందుబాటులో ఉండనున్నాడు. అతడు ఈ నెల 18 లేదా 19న భారత్‌కు వస్తాడని ఐపీఎల్ వర్గాలు తెలిపాయి. కాగా, బ్యాటింగ్ కన్సల్టెంట్‌గా ఉన్న వసీమ్ జాఫర్‌ను తప్పించిన కింగ్స్.. ఆ బాధ్యతలను క్రికెట్ డైరెక్టర్‌గా నియమితుడైన బంగర్‌కు అప్పగించనుంది.

వైజాగ్‌లో పంత్ బృందం సాధన



రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కోలుకొన్న రిషభ్ పంత్.. 14 నెలల తర్వాత మళ్లీ మైదానంలోకి అడుగు పెట్టనున్నాడు. ఈనెల 22 నుంచి జరిగే ఐపీఎల్‌లో ఆడేలా పంత్‌కు బీసీసీఐ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన సంగతి తెలిసిందే. దీంతో పంత్ తన జట్టు ఢిల్లీ క్యాపిటల్స్‌తో కలిసి విశాఖపట్నం స్టేడియంలో సన్నాహకాలు మొదలుపెట్టాడు. ఈసారి ఐపీఎల్‌లో తొలి దశ షెడ్యూల్‌లో భాగంగా వైజాగ్‌ను తన హోంగ్రౌండ్‌గా ఢిల్లీ ఎంచుకున్న సంగతి తెలిసిందే. దీంతో మంగళవారమే వైజాగ్ చేరుకున్న పంత్.. జట్టు ఆటగాళ్లు ఇషాంత్ శర్మ, సుమిత్, కుమార్ కుశాగ్రతో కలిసి ఇక్కడి స్టేడియంలో బుధవారం ప్రాక్టీస్ చేశాడు. ఇన్నాళ్లకు ఇలా బ్యాట్ పడుతుండడంతో.. తాను మళ్లీ అరంగేట్రం చేస్తున్నానన్న భావన కలుగుతుందని ఈ సందర్భంగా పంత్ అన్నాడు. వైజాగ్ స్టేడియంలో ఈనెల 31న చెన్నైతో, వచ్చే నెల 3న కోల్‌కతాతో ఢిల్లీ మ్యాచ్‌లు ఆడనుంది.

ఐపీఎల్ నుంచి బ్రూక్ అవుట్

న్యూఢిల్లీ: ఐపీఎల్ ఆరంభానికి ముందు ఢిల్లీ జట్టుకు గట్టి షాక్ తగిలింది. ఆ జట్టు స్టార్ ఆటగాడు, యువ బ్యాటర్ హ్యారీ బ్రూక్ వ్యక్తిగత కారణాల రీత్యా లీగ్ నుంచి తప్పుకొంటున్నట్టు ప్రకటించాడు. గతేడాది వేలంలో ఏకంగా రూ. 13.23 కోట్లు వెచ్చించి బ్రూక్‌ను సన్‌రైజర్స్ కొనుక్కుంది. అయితే, 11 మ్యాచుల్లో 190 పరుగులే చేయడంతో అతడిని ఈసారి సన్‌రైజర్స్ వదులుకొంది. దీంతో వేలంలోకి వచ్చిన బ్రూక్‌ను ఈసారి ఢిల్లీ జట్టు రూ. 4 కోట్లకు తీసుకుంది. 'తన కెరీర్ ఎదుగుదలలో కీలకపాత్ర పోషించిన బామ్మ గతనెలలో చనిపోయింది. ఈ విషాదకర సమయంలో నేను కుటుంబంతో గడపడం ఎంతో ముఖ్యం. అందుకే ఐపీఎల్‌లో ఆడడం లేదు' అని 25 ఏళ్ల బ్రూక్ తెలిపాడు.

ఫైనల్లో ఢిల్లీ

● షఫాలీ అదిరే షో
● 7 వికెట్లతో గుజరాత్ చిత్తు



షఫాలీ వర్మ (71)

న్యూఢిల్లీ: డాషింగ్ బ్యాటర్ షఫాలీ వర్మ (37 బంతుల్లో 7 ఫోర్లు, 5 సిక్స్‌లతో 71) శివాలెత్తడంతో.. లీగ్ దశను అగ్రస్థానంతో ముగించిన ఢిల్లీ క్యాపిటల్స్ నేరుగా ఫైనల్‌కు దూసుకెళ్లింది. డబ్ల్యూపీఎల్‌లో బుధవారం జరిగిన ఆఖరి లీగ్ మ్యాచ్‌లో ఢిల్లీ 7 వికెట్ల తేడాతో గుజరాత్ జెయింట్స్‌ను చిత్తు చేసింది. తొలుత గుజరాత్ 20 ఓవర్లలో 126/9 స్కోరు చేసింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు ఎంచుకొన్న జెయింట్స్ 50/5తో పీకల్లోతు కష్టాల్లో పడింది. ఈ దశలో భారతి ఫుల్మాలి (42), కేథరిన్ బ్రైస్ (28 నాటౌట్) ఆరో వికెట్‌కు 68 పరుగుల భాగస్వామ్యంతో జట్టుకు గౌరవప్రద స్కోరు అందించారు. కాప్, శిఖా పాండే, మిన్నూ మణి తలో 2 వికెట్లు పడగొట్టారు.

ఎడాపెడా బాదుడే..: గుజరాత్ బౌలర్లను షఫాలీ ఉతికి ఆరేయడంతో.. ఛేదనలో ఢిల్లీ 13.1 ఓవర్లలో 3 వికెట్లకు 129 పరుగులు చేసి నెగ్గింది. 4వ ఓవర్‌లో లానింగ్ (18) రనౌట్ కాగా.. క్యాప్సీ (0)ని తనూజ క్యాచవుట్ చేసింది. కానీ, షఫాలీ దూకుడుగా ఆడగా.. జెమీమా రోడ్రిగ్స్ (38 నాటౌట్) ఆమెకు చక్కని సహకారం అందించింది. వీరిద్దరూ మూడో వికెట్‌కు 55 బంతుల్లో 94 పరుగులు జోడించడంతో.. ఢిల్లీ అలవోకగా నెగ్గింది. విజయానికి 2 పరుగులు కావాల్సి ఉండగా.. వర్మను తనూజ అవుట్ చేసినా.. రోడ్రిగ్స్ బౌండ్రీతో మ్యాచ్‌ను ఫినిష్ చేసింది.

సంక్షిప్త స్కోర్లు

గుజరాత్: 20 ఓవర్లలో 126/9 (భారతి 42, బ్రైస్ 28 నాటౌట్; కాప్ 2/17, మణి 2/9).

ఢిల్లీ: 13.1 ఓవర్లలో 129/3 (షఫాలీ 71, జెమీమా 38 నాటౌట్; తనూజ 2/20).



మిన్నూ మణి (2-0-9-2)

రేపటి ఎలిమినేటర్‌లో ముంబై x బెంగళూరు

లీగ్ దశలో ఆడిన 8 మ్యాచ్‌ల్లో 6 నెగ్గిన ఢిల్లీ.. మొత్తం 12 పాయింట్లతో టేబుల్ టాపర్‌గా నిలిచింది. 10 పాయింట్లతో ముంబై రెండో స్థానాన్ని, 8 పాయింట్లతో బెంగళూరు మూడో స్థానాన్ని ఖరారు చేసుకొన్నాయి. నాలుగు, ఐదు స్థానాల్లో నిలిచిన యూపీ వారియర్స్, గుజరాత్ జెయింట్స్ టోర్నీ నుంచి అవుటయ్యాయి. ప్లేఆఫ్స్ రూల్స్ ప్రకారం టేబుల్ టాపర్ ఢిల్లీ నేరుగా టైటిల్ పోరుకు అర్హత సాధించగా.. తర్వాతి స్థానాల్లో నిలిచిన ముంబై, బెంగళూరు జట్లు శుక్రవారం జరిగే ఎలిమినేటర్‌లో తలపడనున్నాయి. ఇందులో నెగ్గిన టీమ్.. ఆదివారం ఫైనల్లో ఢిల్లీని ఢీకొననుంది.

బుమ్రాను దాటి.. టాప్‌లోకి



టెస్టుల్లో నెం.1 బౌలర్‌గా అశ్విన్

మళ్లీ టాప్‌టెన్‌లోకి రోహిత్

దుబాయ్: ఇంగ్లండ్‌తో ధర్మశాల మ్యాచ్‌లో తొమ్మిది వికెట్లు పడగొట్టి తన వందో టెస్టును చిరస్మరణీయం చేసుకున్న టీమిండియా స్టార్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ ర్యాంకింగ్స్‌లో టాప్ లేపాడు. ఐసీసీ బుధవారం ప్రకటించిన టెస్టు ర్యాంకింగ్స్ బౌలర్ల జాబితాలో సహచరుడు బుమ్రాను వెనక్కినెట్టి నెంబర్‌వన్ స్థానాన్ని కైవసం చేసుకున్నాడు. 870 పాయింట్లతో అగ్రపీఠాన నిలిచిన అశ్విన్.. టెస్టులో టాప్ ర్యాంక్‌ను అందుకోవడం ఇది ఆరోసారి కావడం విశేషం. ఇక, ఇప్పటిదాకా టాప్‌గా ఉన్న బుమ్రా.. 847 పాయింట్లతో ఆసీస్ బౌలర్ హాజెల్‌వుడ్‌తో కలిసి రెండోస్థానాన్ని పంచుకున్నాడు. రబాడ 4, కమిన్స్ 5వ ర్యాంకులో ఉన్నారు. కుల్దీప్ యాదవ్ ఏకంగా 15 స్థానాలు మెరుగై 16వ ర్యాంక్‌లో నిలిచాడు. టీమిండియా సారథి రోహిత్ శర్మ బ్యాటర్ల జాబితాలో ఐదు స్థానాలు ఎగబాకి 6వ ర్యాంక్‌కు చేరి మళ్లీ టాప్‌టెన్‌లోకి వచ్చాడు. యశస్వీ జైస్వాల్ రెండుస్థానాలు మెరుగై 8వ, గిల్ 20వ ర్యాంకుల్లో ఉన్నారు. కేన్ విలియమ్సన్ నెం.1 బ్యాటర్‌గా కొనసాగుతున్నాడు. ఆల్‌రౌండర్లలో జడేజా టాప్, అశ్విన్ 2వ ర్యాంక్‌లను నిలబెట్టుకోగా, అక్షర్ పటేల్ 6వ స్థానానికి పడిపోయాడు.

మనీశ్‌కు 2 రజతాలు

» పారా షూటింగ్ వరల్డ్‌కప్

న్యూఢిల్లీ: పారా షూటింగ్ వరల్డ్‌కప్‌లో భారత స్టార్ మనీశ్ నర్వాల్ రెండు పతకాలతో మెరిశాడు. 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ (ఎస్‌హెచ్1) ఈవెంట్‌లో వ్యక్తిగత, టీమ్ విభాగాల్లో రజతాలు సాధించాడు. వ్యక్తిగత విభాగంలో 236.7 పాయింట్లు స్కోరు చేసి రెండోస్థానంలో నిలిచిన మనీశ్.. సహచరులు రుద్రాంశ్, సంజీవ్ గిరితో కలిసి టీమ్ ఈవెంట్‌లో ద్వితీయస్థానం దక్కించుకొని రెండో పతకాన్ని ఖాతాలో వేసుకున్నాడు. ఇక, మహిళల 10 మీ. ఎయిర్ పిస్టల్ (ఎస్‌హెచ్1) వ్యక్తిగత విభాగంలో భారత షూటర్ రుబీనా ఫ్రాన్సిస్ మూడోస్థానంతో కాంస్య పతకం అందుకుంది.

లక్ష్యసేన్ ముందంజ

● రెండో రౌండ్‌కు అశ్విని-తనీషా జోడీ
● ప్రియాన్షు ఇంటికి ● ఆల్ ఇంగ్లండ్ ఓపెన్

బర్మింగ్‌హామ్: ఆల్ ఇంగ్లండ్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ రెండోరోజు పోటీల్లో భారత షట్లర్లకు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. స్టార్ షట్లర్ లక్ష్యసేన్, అశ్విని-తనీషా జోడీ శుభారంభం చేయగా, యువ షట్లర్ ప్రియాన్షు రజావత్ ఇంటిముఖం పట్టాడు. బుధవారం జరిగిన పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో లక్ష్యసేన్ 21-14, 21-14తో మాగ్నస్ జోహన్నెసెన్ (డెన్మార్క్)పై గెలిచాడు. మరో మ్యాచ్‌లో ప్రియాన్షు 19-21, 21-11, 9-21తో చికో వార్డోయో (ఇండోనేసియా) చేతిలో ఓడాడు. మహిళల డబుల్స్‌లో అశ్విని పొన్నప్ప-తనీషా క్యాస్ట్రో జోడీ 21-13, 21-18తో యెంగ్ టింగ్-యెంగ్ పుయి లామ్ (హాంగ్‌కాంగ్)పై నెగ్గి ముందంజ వేసింది.

పోరాడుతున్న విదర్భ

రెండో ఇన్నింగ్స్‌లో 248/5

విజయానికి 5 వికెట్ల దూరంలో ముంబై



కరుణ్ నాయర్ (74)

ముంబై: బ్యాటింగ్‌కు కష్టంగా మారిన పిచ్‌పై కరుణ్ నాయర్ (74), కెప్టెన్ అక్షయ్ వాడ్కర్ (56 బ్యాటింగ్) అర్ధ శతకాలు నమోదు చేయడంతో.. ముంబైతో రంజీ ఫైనల్లో విదర్భ పోరాడుతోంది. 538 పరుగుల లక్ష్య ఛేదనలో భాగంగా నాలుగో రోజైన బుధవారం ఓవర్‌నైట్ స్కోరు 10/0తో రెండో ఇన్నింగ్స్‌ను కొనసాగించిన విదర్భ ఆట ముగిసేసరికి 5 వికెట్లకు 248 పరుగులు చేసింది. అక్షయ్‌తోపాటు హర్ష్ దూబే (11) క్రీజులో ఉన్నాడు. ఆఖరిరోజు విజయానికి విదర్భకు 290 పరుగులు కావాల్సి ఉండగా.. ముంబై 5 వికెట్ల దూరంలో ఉంది. అథర్వ (32), అమన్ (32), ధ్రువ్ (28) ఎక్కువసేపు క్రీజులో నిలవలేక పోయారు. 133/4తో ఇబ్బందుల్లో పడిన సమయంలో నాయర్, అక్షయ్ ఐదో వికెట్‌కు 90 పరుగుల భాగస్వామ్యాన్ని నిర్మించారు. అయితే, కరుణ్‌ను ముషీర్ అవుట్ చేయడంతో.. ముంబై మ్యాచ్‌పై పట్టుబిగించింది. తనుష్, ముషీర్ చెరో 2 వికెట్లు తీశారు. వికెట్ స్పిన్నర్లకు సహకరిస్తున్న తీరు చూస్తుంటే ముంబై 42వసారి రంజీ విజేతగా నిలిచే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తుండగా.. విదర్భ నెగ్గాలంటే అద్భుతం జరగాల్సిందే. ముంబై 224, 418 స్కోర్లు చేయగా.. తొలి ఇన్నింగ్స్‌లో విదర్భ 105 రన్స్‌కు కుప్పకూలింది.

బిజినెస్

మార్కెట్‌పై 'బేర్' పంజా

రూ.14 లక్షల కోట్లు ఫట్.. సెన్సెక్స్ 906 పాయింట్లు డౌన్

» 22,000 కిందికి జారిన నిఫ్టీ

» చిన్న, మధ్య స్థాయి సూచీల భారీ పతనం

ముంబై: బేర్ దెబ్బకు షేరు బేజారైంది. బుధవారం మధ్యాహ్నం నుంచి మదుపరులు అమ్మకాలను హోరెత్తించడంతో సూచీలన్నీ కుప్పకూలాయి. ఒకదశలో సెన్సెక్స్ 1,152 పాయింట్లకు పైగా పతనమై 72,515.71 వద్ద ఇంట్రాడే కనిష్ఠాన్ని నమోదు చేసింది. చివరికి 906.07 పాయింట్ల నష్టంతో 72,761.89 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 338 పాయింట్లు క్షీణించి 21,997.70 వద్దకు జారుకుంది. చిన్న, మధ్య స్థాయి కంపెనీల షేర్లు చితికిపోయాయి. బీఎస్ఈ స్మాల్‌క్యాప్ సూచీ ఏకంగా 5.11 శాతం, మిడ్‌క్యాప్ ఇండెక్స్ 4.20 శాతం నష్టాన్ని చవిచూశాయి. క్రితం రెండు సెషన్లలోనూ భారీగా నష్టపోయిన బీఎస్ఈ ఎస్ఎంఈ ఐపీఓ సూచీ మరో 5.53 శాతం పతనమైంది. అన్ని రంగాల సూచీలూ నేలచూపులు చూశాయి. యుటిలిటీస్ ఇండెక్స్ ఏకంగా 7.21 శాతం నష్టపోగా.. మెటల్ 5.75 శాతం, సర్వీసెస్ 5.71 శాతం, టెలికాం 5.45 శాతం, ఆయిల్ అండ్ గ్యాస్ 5.16 శాతం క్షీణించాయి. కమోడిటీస్, ఇండస్ట్రియల్స్ సూచీలు 4 శాతానికి పైగా తగ్గాయి.



భారీ క్షీణత ఫలితంగా రూ.13.47 లక్షల కోట్ల మార్కెట్ సంపద ఆవిరైంది. దాంతో బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ సంపద రూ.372.16 లక్షల కోట్లకు (4.49 లక్షల కోట్ల డాలర్లు) పడిపోయింది. గడిచిన మూడు ట్రేడింగ్ సెషన్లలో సంపద రూ.20 లక్షల కోట్లకు పైగా తరిగిపోయింది.

మార్కెట్ పతనానికి కారణాలేంటి..?

అంతర్జాతీయ మార్కెట్ల ధోరణి సానుకూలంగా ఉన్నప్పటికీ, చిన్న మధ్య స్థాయి కంపెనీల షేర్లలో రిస్క్-రిటర్న్ నిష్పత్తి ప్రతికూలంగా మారడంతోపాటు ఈ సెగ్మెంట్లో చాలా కంపెనీల షేర్లు అధిక ధరల వద్ద ట్రేడవుతుండటం మార్కెట్ పతనానికి ప్రధాన కారణమైందని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ అన్నారు.

గత నవంబరు నుంచి కొనసాగుతున్న ర్యాలీ కారణంగా చాలా షేర్లు ప్రీమియం ధరల వద్ద ట్రేడవుతున్నాయి. మార్కెట్‌ను మరింత ముందుకు నడిపించే సానుకూలాంశాలు లోపించడం, అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీరేట్లను తగ్గించే ప్రక్రియ అంచనాల కంటే జాప్యం కావచ్చన్న ఆందోళనల నేపథ్యంలో విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు మళ్లీ పెట్టుబడులను వెనక్కి తీసుకుంటున్నారు. దీనికి తోడు మంగళవారం విడుదలైన రిటైల్ ద్రవ్యోల్బణం, పారిశ్రామికోత్పత్తి గణాంకాలు నిరాశాజనకంగా ఉండటం కూడా ట్రేడింగ్ సెంటిమెంట్‌ను పూర్తి ప్రతికూలంగా మార్చినట్టు విశ్లేషకులు అన్నారు.

మహాదేవ్ బెట్టింగ్ యాప్ కేసును దర్యాప్తు చేస్తున్న ఈడీకి స్మాల్‌క్యాప్ షేర్లలో బబుల్‌కు లింక్ దొరికింది. ఈ కేసులో దుబాయ్ కేంద్రంగా హవాలా కార్యకలపాలు నిర్వహిస్తున్న హరిశంకర్ టిబ్రేవాలాకు చెందిన డీమ్యాట్ అకౌంట్లలోని రూ.1,100 కోట్ల విలువైన షేర్లను ఈడీ జప్తు చేసింది. టిబ్రేవాలా, అతని కంపెనీలు 30కి పైగా కంపెనీల్లో పెట్టుబడులు పెట్టారు. ఈడీ చర్యల నేపథ్యంలో ఈ కంపెనీల షేర్లన్నీ భారీగా పతనమవవడం కూడా మార్కెట్ నష్టాలకు ఓ కారణమైంది.

గడిచిన మూడు రోజుల్లో ఎస్ఎంఈ సూచీల నష్టం(%)

వారం	స్మాల్‌క్యాప్	మిడ్‌క్యాప్	ఎస్ఎంఈ ఐపీఓ
సోమ	2.01	0.24	3.28
మంగళ	2.11	1.31	4.67
బుధ	5.11	4.20	5.53
మొత్తం	9.23	5.75	13.48

ఐటీసీలో 3.5 శాతం వాటా విక్రయించిన బీఏటీ

ఎఫ్ఎంసీజీ నుంచి హోటళ్ల వరకు పలు వ్యాపారాల్లోకి విస్తరించిన ఐటీసీ లిమిటెడ్‌లో 3.5 శాతం వాటాకు సమానమైన 43.68 కోట్ల షేర్లను బ్రిటిష్ అమెరికన్ టొబాకో (బీఏటీ) పీఎల్‌సీ రూ.17,485 కోట్లకు విక్రయించింది. ఓపెన్ మార్కెట్లో బ్లాక్‌డీల్స్ ద్వారా ఈ వాటా విక్రయం జరిగింది. మొత్తం 48 విడతల్లో జరిగిన ఈ లావాదేవీలో ఒక్కోషేరును సగటున రూ.400.25కు విక్రయించింది. ఐటీసీలో బీఏటీ అతి పెద్ద వాటాదారు. ఈ లావాదేవీ తర్వాత ఐటీసీలో బీఏటీ 29 శాతం నుంచి 25.5 శాతానికి తగ్గింది.

చిన్న షేర్లపై బుచ్ ఎఫెక్ట్!

సెబీ చైర్‌పర్సన్ మాధవి పురి బుచ్ సోమవారం ఓ సదస్సులో పాల్గొన్న సందర్భంగా చిన్న, మధ్య తరహా సంస్థల (ఎస్ఎంఈ) షేర్ల ధరల్లో అవకతవకలు జరుగుతున్నట్లు సంకేతాలందాయని చేసిన వ్యాఖ్యలు స్మాల్, మిడ్‌క్యాప్ షేర్లలో భారీ అమ్మకాలకు తెరలేపాయి. బుచ్ వ్యాఖ్యల నేపథ్యంలో గడిచిన మూడు ట్రేడింగ్ సెషన్లలో ఎస్ఎంఈ షేర్లు తీవ్ర అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. తాజా ట్రేడింగ్ సెషన్‌లో తరిగిపోయిన దాదాపు రూ.14 లక్షల కోట్ల సంపదలో రూ.6 లక్షల కోట్ల నష్టానికి ఎస్ఎంఈ షేర్లలో అమ్మకాలే కారణం.

అదానీ గ్రూప్‌నకు రూ.1.12 లక్షల కోట్ల నష్టం

అదానీ గ్రూప్‌లోని 10 లిస్టెడ్ కంపెనీల షేర్లు బుధవారం నష్టపోయాయి. బీఎస్ఈలో అదానీ టోటల్ గ్యాస్ 9.50 శాతం, అదానీ గ్రీన్ ఎనర్జీ 9.07 శాతం, అదానీ ఎనర్జీ సొల్యూషన్స్ 8.54 శాతం, ఎన్‌డీటీవీ 7.92 శాతం, అదానీ పోర్ట్స్ 6.97 శాతం, అదానీ ఎంటర్‌ప్రైజెస్ 6.91 శాతం, ఏసీసీ 6.87 శాతం, అదానీ పవర్ 4.99 శాతం, అంబుజా సిమెంట్స్ 4.58 శాతం, అదానీ విల్మార్ 4.25 శాతం క్షీణించాయి. దాంతో గ్రూప్ మార్కెట్ క్యాపిటలైజేషన్ ఒక్కరోజులోనే రూ.1.12 లక్షల కోట్లకు పైగా తరిగిపోయింది.

ఐపీఓ అప్‌డేట్స్

రీసైకిల్డ్, వర్జిన్ ప్లాస్టిక్ ఉత్పత్తుల తయారీ సంస్థ రుంగ్టా గ్రీన్‌టెక్ లిమిటెడ్ ఐపీఓకు అనుమతి కోరుతూ ప్రాథమిక ముసాయిదా పత్రాలను సమర్పించింది. ఐపీఓలో భాగంగా కంపెనీ ఒక్కొక్కటీ రూ.10 ముఖ విలువ కలిగిన 38 లక్షల తాజా ఈక్విటీ షేర్లను జారీ చేయనున్నట్లు కంపెనీ తెలిపింది. పబ్లిక్ ఇష్యూ ద్వారా కంపెనీ ఎన్ఎస్ఈ ఎమర్జ్ ప్లాట్‌ఫామ్‌లో లిస్ట్ కావాలనుకుంటోంది.

పాపులర్ వెహికిల్స్ ఐపీఓ రెండో రోజు ముగిసేసరికి, ఇష్యూ సైజులో 45 శాతానికి సమానమైన షేర్ల కొనుగోలుకు బిడ్లు లభించాయి.

శామీర్‌పేట్ సమీపంలో హెరిటేజ్ యూహెచ్‌టీ ప్లాంట్

హైదరాబాద్: పాలు, పాల సంబంధిత ఉత్పత్తుల తయారీలోని హెరిటేజ్ ఫుడ్స్ లిమిటెడ్ శామీర్‌పేట్ మండలంలోని సంపన్‌బోల్ గ్రామంలో కొత్త అల్ట్రా హై టెంపరేచర్ (యూహెచ్‌టీ) మిల్క్ ప్లాంట్‌ను ప్రారంభించింది. ఈ కొత్త ప్లాంట్‌లో యూహెచ్‌టీ పాలతో పాటు మిల్క్‌షేక్‌లు, ఫ్లేవర్డ్ లస్సీ, రిచ్ కోల్డ్ కాఫీ, తాజా మజ్జిగ వంటివి తయారుచేయనున్నట్టు పేర్కొంది. ఈ ప్లాంట్‌లో ప్రవేశపెట్టిన అత్యాధునిక సిగ్ ప్యాకేజింగ్ టెక్నాలజీతో మారుతున్న మార్కెట్ ధోరణులకు అనుగుణంగా వేగంగా ఉత్పత్తులు అందించగలుగుతామని తెలిపింది.

ఎయిర్‌బస్‌తో సైయెంట్ ఒప్పందం

హైదరాబాద్: ఎయిర్‌బస్ సంస్థతో క్యాబిన్, కార్గో ఇంజనీరింగ్‌కు సంబంధించి ఒక ఒప్పందంపై సంతకాలు చేసినట్టు హైదరాబాద్‌కు చెందిన సైయెంట్ కంపెనీ ప్రకటించింది. ఈ ఒప్పందం అనంతరం ఎయిర్‌బస్ కంపెనీ తన ఇంటెలిజెంట్ కోర్ మేనేజ్‌మెంట్ ప్లాట్‌ఫారం (ఐసీఎంపీ) తయారీలో భాగస్వామిగా సైయెంట్‌ను ఎంపిక చేసుకుంది. తమ సామర్థ్యాలను గుర్తించి భవిష్యత్ టెక్నాలజీ అభివృద్ధి కార్యక్రమంలో తమను భాగస్వామిగా చేర్చుకున్నందుకు సైయెంట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, సీఈఓ కార్తికేయన్ నటరాజన్ ఎయిర్‌బస్‌కు ధన్యవాదాలు తెలిపారు.

విద్యుత్ మొబిలిటీ ప్రోత్సాహానికి కొత్త పథకం

న్యూఢిల్లీ: దేశంలో విద్యుత్ వాహనాల ప్రోత్సాహానికి భారీ పరిశ్రమల మంత్రిత్వ శాఖ ఒక కొత్త పథకాన్ని ప్రారంభించింది. ఏప్రిల్ 1వ తేదీ నుంచి నాలుగు నెలల కాలానికి ఈ పథకానికి రూ.500 కోట్ల మూలధన నిధులను ప్రకటించింది. ఇది టూ వీలర్లు, త్రీవీలర్లకు వర్తిస్తుంది. ప్రస్తుతం అమలులో ఉన్న ఫేమ్ 2 పథకం గడువు మార్చి 31వ తేదీతో ముగియనుంది. కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి మహేంద్రనాథ్ పాండే ఇ-మొబిలిటీ ప్రమోషన్ స్కీమ్ 2024ని ప్రకటిస్తూ ఇది నాలుగు నెలల పాటు అంటే జూలై నెలాఖరు వరకు అమలులో ఉంటుందని చెప్పారు.

బైజూస్ ఆడిటర్లది నిర్లక్ష్యమే: ఐసీఏఐ

ముంబై: బైజూస్ ఆడిటర్లు నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు తమ తనిఖీల్లో తేలిందని చార్టర్డ్ అకౌంటెంట్ల సర్వోన్నత మండలి ఐసీఏఐ ప్రెసిడెంట్ రంజీత్ కుమార్ అగర్వాల్ అన్నారు. ఆ ఆడిటర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని ఫైనాన్షియల్ రిపోర్టింగ్ రివ్యూ బోర్డ్‌కి (ఎఫ్ఆర్ఆర్‌బీ) సిఫారసు చేసినట్లు ఆయన తెలిపారు. డిజిటల్ చెల్లింపుల సంస్థ పేటీఎం పద్దులను సైతం ఐసీఏఐ తనిఖీ చేయనున్నట్లు అగర్వాల్ వెల్లడించారు. చాలా కాలం పాటు బైజూస్ ఆడిటర్‌గా డెలాయిట్ వ్యవహరించింది.

బంగారం రుణాలను సమీక్షించండి

పీఎస్‌బీలకు ప్రభుత్వ ఆదేశం

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ బ్యాంకుల (పీఎస్‌బీ) గోల్డ్ లోన్ల పైనా ప్రభుత్వం దృష్టి పెట్టింది. 2022 జనవరి 1 నుంచి ఈ ఏడాది జనవరి నెలాఖరు వరకు మంజూరు చేసిన బంగారం రుణాలపై సమగ్ర సమీక్ష జరపాలని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ పీఎస్‌బీలను కోరింది. కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖకు చెందిన ఆర్థిక సేవల విభాగం (డీఎఫ్ఎస్) దీనికి సంబంధించి పీఎస్‌బీల చీఫ్‌లకు ఒక లేఖ రాసింది. డీఎఫ్ఎస్ కార్యదర్శి వివేక్ జోషి ఈ విషయం వెల్లడించారు. బంగారం రుణాలకు సంబంధించి వసూలు చేసే ఫీజులు, వడ్డీరేటుతో పాటు, ఈ లోన్ల క్లోజింగ్‌కు సంబంధించి ఏవైనా లోపాలుంటే, వెంటనే వాటిని సరిదిద్దుకోవాలని డీఎఫ్ఎస్ ఆ లేఖలో పీఎస్‌బీలను కోరింది.



ఎందుకంటే?

కొన్ని పీఎస్‌బీలు చాలినంత బంగారం హామీ లేకుండానే కొంత మందికి పెద్ద మొత్తంలో గోల్డ్ లోన్లు ఇవ్వడంతో పాటు, ఫీజుల వసూలు, నగదు రూపంలో లోన్ చెల్లించేటపుడు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నట్టు ఇటీవల ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇవే ఆరోపణలపై ఆర్‌బీఐ ఇటీవల ఐఐఎఫ్ఎల్ ఫైనాన్స్ కంపెనీ గోల్డ్ లోన్లపై నిషేధం విధించింది. దీంతో పీఎస్‌బీల గోల్డ్ లోన్ల పైనా ప్రభుత్వం దృష్టి పెట్టిందని భావిస్తున్నారు.

మన స్టాక్ మార్కెట్ గాలి బుడగ కాదు



ఉదయ్ కోటక్

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్ ప్రస్తుతం పెద్ద గాలి బుడగలా మారిందన్న భయాలను ప్రముఖ బ్యాంకర్ ఉదయ్ కోటక్ కొట్టి వేశారు. కొన్ని కంపెనీల షేర్లు మాత్రం, ఫండమెంటల్స్‌తో సంబంధం లేకుండా పెరిగి, కొద్దిపాటి గాలి బుడగల్లా కనిపిస్తున్నాయన్నారు. అలా అని మన మార్కెట్ సెబీ వంటి నియంత్రణ సంస్థల చెయ్యి దాటి పోయిందని చెప్పలేమన్నారు. సెబీ నిర్వహించిన ఒక సదస్సులో కోటక్ ఈ వ్యాఖ్యలు చేశారు.

మదుపరుల వైఖరి మారాలి: తక్షణ లాభాల ఆశతో రిటైల్ మదుపరుల్లో కొంత మంది నష్ట భయం ఎక్కువగా ఉండే, ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్ (ఎఫ్ అండ్ ఓ) ట్రేడింగ్‌లోకి దిగడంపై కేంద్ర ప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదారు (సీఈఏ) వి.అనంత నాగేశ్వరన్ ఆందోళన వ్యక్తం చేశారు. సుస్థిర ఆర్థికాభివృద్ధి, మూలధన సృష్టికి కూడా ఈ ధోరణి పెద్ద ప్రమాదమన్నారు. ఎఫ్ అండ్ ఓ సెగ్మెంట్‌లో జరిగే లావాదేవీల్లో 90 శాతం మంది మదుపరులు నష్టపోతున్నట్టు సెబీ అధ్యయనంలో తేలినా, రిటైల్ మదుపరులు ఆ సెగ్మెంట్‌లోకి వెళ్లడంపై కూడా ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	65,840 ▼	60,350 ▼	78,500 ▼
ముంబై	65,340 ▼	59,850 ▼	72,470 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

13వ తేదీ		విజయవాడ	433
హైదరాబాద్	410	విశాఖపట్నం	450
14వ తేదీ		వరంగల్	412
చిత్తూరు	483	డజను గుడ్లు రూ.72	
గోదావరి	433		

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	114	గోదావరి	106
వరంగల్	114	విజయవాడ	106
కరీంనగర్	114	గుంటూరు	111
మహబూబ్‌నగర్	114	ఒంగోలు	111
కర్నూలు	114	చిత్తూరు	108
విశాఖపట్నం	103		

మరో 10 స్థానాలకు జనసేన అభ్యర్థులు ఖరారు!

- రాజోలు నుంచి రిటైర్డ్ ఐఏఎస్ వరప్రసాద్
- పెందుర్తిలో పంచకర్ల, యలమంచిలిలో సుందరాపు
- విశాఖ దక్షిణం నుంచి వంశీకృష్ణ యాదవ్
- భీమవరానికి అంజిబాబు, గూడెం బరిలో బొలిశెట్టి
- తిరుపతి టికెట్ ఆరణి శ్రీనివాసులుకే



పారిశ్రామికవేత్త గంటా నరహరిని జనసేనలోకి ఆహ్వానిస్తున్న పవన్ కల్యాణ్

అమరావతి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): జనసేన పోటీ చేసే మరో 10 స్థానాలకు అభ్యర్థులు దాదాపు ఖరారయ్యారు. ఆ పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకూ జిల్లాల వారిగా పోటీ చేసే అభ్యర్థులను పిలిపించుకుని మాట్లాడారు. ప్రతి ఒక్కరితో వ్యక్తిగతంగా చర్చించారు. ఆర్థిక స్థితిగతులు, నియోజకవర్గంలో పరిస్థితి, ఇతర వివరాలు తెలుసుకున్నారు. నియోజకవర్గాల్లో పనిచేసుకోవాలని సూచించారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా రాజోలు (ఎస్సీ)లో మాజీ ఐఏఎస్ అధికారి వరప్రసాద్ పేరు ఖరారైంది. విశాఖ దక్షిణం నుంచి వంశీ కృష్ణ యాదవ్, పెందుర్తిలో పంచకర్ల రమేశ్‌బాబు, యలమంచిలిలో సుందరాపు విజయ్‌కుమార్ అభ్యర్థిత్వాలను ఆమోదించినట్లు సమాచారం. ఉంగుటూరు నుంచి ధర్మరాజు, తాడేపల్లిగూడెం-బొలిశెట్టి శ్రీనివాస్, భీమవరం-పులపర్తి రామాంజనేయులు, నరసాపురంలో బొమ్మిడి నాయకర్‌లను ఖరారు చేశారు. పిఠాపురంలో పవన్ పోటీ ఖాయమే. తిరుపతి సీటుపై ఆయన బాగా తర్జనభర్జన పడ్డారు. చివరకు ఇటీవల జనసేనలో చేరిన వైసీపీ ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు వైపు పవన్ మొగ్గుచూపారు.

అరాచక పార్టీతో పోరాటం

(మొదటి పేజీ తరువాయి)

వ్యూహాత్మకంగా ముందుకు వెళ్లాలి. టీడీపీ, బీజేపీ నాయకులు, శ్రేణులతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకోవాలి. ప్రతి దశలోనూ అభ్యర్థులు, నాయకులు, శ్రేణులు అప్రమత్తంగా అడుగులు వేయాలి. ఏ విధమైన ఒత్తిళ్లు వచ్చినా తక్షణమే పార్టీ కేంద్ర కార్యాలయం దృష్టికి తీసుకురావాలి' అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎన్నికల నియమావళి, నామినేషన్ దాఖలు నుంచి పోలింగ్ వరకూ ఉండే వివిధ దశలు, నియమ నిబంధనలు, పొందాల్సిన అనుమతులను తెలియచేసే పత్రాలను అందించారు. అధినేతను కలిసిన వారిలో కందుల దుర్గేశ్, పంతం నానాజీ, బత్తుల బలరామకృష్ణ, లోకం మాధవి, పులపర్తి రామాంజనేయులు, బొమ్మిడి నాయకర్, బొలిశెట్టి శ్రీనివాస్, పత్సమట్ల ధర్మరాజు, దేవ వరప్రసాద్, పంచకర్ల రమేశ్ బాబు, వంశీకృష్ణ యాదవ్, సుందరపు విజయ్‌కుమార్, ఆరణి శ్రీనివాసులు ఉన్నారు.


ఉమ్మడి ప్రభుత్వంలో విద్య, వైద్యానికి ప్రాధాన్యం: నాగబాబు

'విద్య, వైద్యం, ఉపాధి అనేవి జనసేన పార్టీకి అత్యంత ప్రధానమైనవి. సామాన్యులకు నిత్యం అవసరమయ్యే ఈ మూడు అంశాలను అధికారంలో ఉన్న పార్టీ గాలికి వదిలేసింది' అని జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి కే నాగబాబు ఆరోపించారు. ఈ మధ్య కాలంలో ప్రమాదానికి గురై మరణించిన 62 మంది క్రియాశీలక సభ్యుల కుటుంబాలకు ఆయన చెక్కులు పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరికి రూ.5 లక్షల చొప్పున రూ.3.10 కోట్ల విలువైన బీమా చెక్కులు కార్యకర్తల కుటుంబాలకు ఆయన అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 'జనసేన పార్టీకి ఎలాంటి అధికారం లేకపోయినా పార్టీ కార్యకర్తలకు అధినేత పవన్ భరోసా ఇస్తున్నారు. పార్టీ కోసం కష్టపడిన జనసైనికులు, వీర మహిళలకు భరోసా ఇచ్చేలా క్రియాశీలక బీమా పథకం జనసేన పార్టీ తీసుకొచ్చింది. ఇప్పటి వరకూ 255 మందికి పైగా బీమా చెక్కులను అందించాం. రాబోయే ఉమ్మడి ప్రభుత్వంలో విద్య, వైద్యానికి పెద్దపీట వేసేలా ప్రణాళికలు ఉంటాయి. ఈ ప్రభుత్వం పతనమైన తర్వాత రాష్ట్రానికి నవశకం రాబోతుంది' అని పేర్కొన్నారు.

నైట్ 'హోదా'పైనే తగాదా!

- అందరినీ జైల్లో పెట్టి తాను ఎవరూ లేని ఏకాకినని నమ్మించాలని జగన్ చూస్తున్నాడు. బుడిబుడి రాగాలు తీస్తూ సానుభూతి సంపాదించుకోవాలని ప్రయత్నిస్తున్నాడు. తప్పుడు పనులన్నీ చేసి ధర్మపన్నాలు చెబుతున్నాడు.
- రాష్ట్రంలో ప్రభుత్వం మార్పు అనివార్యం. ప్రజలు ఇప్పటికే ఒక నిర్ణయానికి వచ్చేశారు. ఈ ప్రభుత్వం హింస, దౌర్జన్యం అక్రమాలతో గెలవాలని చూస్తోంది. దానిని యువత అడ్డుకోవాలి.
- వైసీపీని గెలిపించి ప్రజలు మోసపోయారు. రైతులు, యువత, కార్మికులు, ఉద్యోగులు, మహిళలు సహా అన్ని వర్గాలూ నష్టపోయాయి. ఈ పరిస్థితులు మారాలి. జనం గెలవాలి. అది జరగాలంటే వైసీపీ ఓడాలి.

\- చంద్రబాబు



(మొదటి పేజీ తరువాయి)

పెట్టుకున్నామన్నారు. ఇది రాష్ట్రం కోసం కుదిరిన పొత్తు తప్ప వ్యక్తుల కోసమో, పదవుల కోసమో కుదిరింది కాదని చెప్పారు. కేంద్రంలో బీజేపీ పదేళ్లుగా అధికారంలో ఉందని.. మళ్లీ అక్కడ ఆ పార్టీయే వస్తుందని అంటున్నారని తెలిపారు. వైసీపీ దెబ్బకు రాష్ట్రం 30 ఏళ్లు వెనక్కి పోయిందని.. మళ్లీ ముందుకు రావాలంటే కేంద్రం సహకారం అవసరమన్నారు. బీజేపీ లేకుండా తాను గెలిచిన తర్వాతైనా వారి సహకారం అవసరమని తెలిపారు. 'ప్రతి పక్షం విడివిడిగా పోటీ చేస్తే ఓట్లు చీలిపోయి తాను గెలుస్తానని జగన్ ఆశ. దాని కోసం ఆయన చేయని ప్రయత్నం లేదు. తక్కువ సీట్లకు ఒప్పుకొంటున్నారని జనసేన, బీజేపీ పార్టీలను రెచ్చగొట్టాలని చూశారు. పరోక్షంగా వాటిపై ఒత్తిడి తేవాలని చూశారు. వైసీపీ విముక్త రాష్ట్రం సాధిస్తానని ప్రకటించిన పవన్ ఆ మాట నిలుపుకోవడం కోసం పొత్తులో కొంత తగ్గారు. మేం ఎవరం అహాలకు పోలేదు. 14 ఏళ్లుగా ముఖ్యమంత్రిగా చేశానని నేను బింకంతో కూర్చోలేదు. ప్రజల కోసం అందరం తగ్గాం. టీడీపీకి పొత్తులు కొత్త కాదు. వాజపేయి హయాంలోనే ఎన్డీయేలో ఉన్నాం' అని చెప్పారు.

పొత్తుపై ప్రశ్నలు వద్దు..

పొత్తు ఎందుకని అనుకోవద్దని.. దానిపై ప్రశ్నలు మానాలని చంద్రబాబు టీడీపీ శ్రేణులకు హితవు చెప్పారు. రాష్ట్ర హితం కోసం కలిశామని.. ఈ మూడు పార్టీల్లో ఒకరు ఎక్కువ, మరొకరు తక్కువా కాదన్నారు. అందరికీ సీట్లు రావని.. కేంద్రంలో, ఇక్కడా కొన్ని నామినేటెడ్ పదవులు ఉంటాయని.. వాటిలో కొందరికి అవకాశాలు వస్తాయని చెప్పారు. 'వైసీపీ మళ్లీ గెలిస్తే ఈ రాష్ట్రం వదిలిపోవాలని కొందరు అనుకుంటున్నారు. వారిలో అంత అభద్రత నెలకొంది. అటువంటి పరిస్థితులను రూపుమాపి.. మంచి వాతావరణాన్ని నెలకొల్పడానికే ఈ పొత్తులు. దీనిని అందరూ గుర్తించాలి' అని కోరారు. ఇంకా ఏమన్నారంటే..

ఈ ఐదేళ్లలో రూపాయి తేలేదు..

బీజేపీతో ఉన్నప్పుడు అది తప్ప రాష్ట్రానికి అన్నీ తెచ్చాం. 11 కేంద్ర ప్రభుత్వ విద్యాసంస్థలు తెచ్చాం. ఎయిమ్స్ కూడా ఆ సమయంలో తెచ్చిందే. వైసీపీ ప్రభుత్వం దానికి కనీసం నీళ్లు కూడా ఇవ్వలేకపోయింది. గిరిజన విశ్వవిద్యాలయం తెస్తే దానిని నిలిపివేశారు. ఎన్నో చోట్ల రైల్వే ఫ్లైఓవర్లు తెచ్చాం. ఉపాధి హామీ పథకం కింద 24 వేల కిలోమీటర్ల సిమెంట్ రోడ్లు వేశాం. అమరావతి రాజధాని కోసం కేంద్రం రూ. రెండున్నర వేల కోట్లు ఇచ్చింది. వెనుకబడిన జిల్లాల కోసం రూ.1,150 కోట్లు తెచ్చాం. ఇప్పుడు రూపాయి కూడా తేలేకపోయారు. రైల్వే జోన్ భవనాల నిర్మాణానికి జగన్ ప్రభుత్వం కనీసం భూమి కూడా ఇవ్వలేదు. ప్రజలను మభ్యపెట్టడానికి ఢిల్లీ చుట్టూ తిరుగుతున్నారు. అమరావతే రాష్ట్ర రాజధాని అని బీజేపీ కూడా చెప్పింది. రాజధానికి భూములు ఇచ్చిన రైతులకు క్యాపిటల్ గెయిన్ ట్యాక్స్ నుంచి మినహాయింపు కూడా ఇచ్చింది. ఈ సైకో మూడు రాజధానుల పేరుతో సమస్య సృష్టించాడు. కేంద్రం కూడా ఏమీ చేయలేకపోయింది. మనం పెట్టే ఒత్తిడిని బట్టి ఢిల్లీలో పనులు అవుతుంటాయి. ఢిల్లీలో ఉన్నవారికి నచ్చజెప్పాలి. విశాఖ ఉక్కును గతంలో కేంద్రానికి చెప్పి ఆదుకున్నాం. వీళ్లు అటువంటి ప్రయత్నమేదీ చేయలేదు. చేతులు కట్టుకుని కూర్చున్నారు. వివిధ పథకాల కింద కేంద్రం నిధులిచ్చినా వాడుకునే పరిస్థితి లేదు. తిట్లు, బూతులతో విరుచుకుపడడం తప్ప చేసిందేమీ లేదు. నష్టపోయిన రాష్ట్రాన్ని తిరిగి నిలబెట్టడం ఒక్కటే మా ముందున్న ఎజెండా. నిర్ణయాలన్నీ ఆ కోణంలోనే తీసుకున్నాం.

రూ.ఆరున్నర కోట్లకు పేట టికెట్

వైసీపీలో టికెట్లను కోట్ల రూపాయలకు అమ్ముకున్నారని ఇప్పుడు బయటకు వస్తోంది. ఓ మంత్రిని చిలకలూరిపేట నుంచి మరో చోటకు బదిలీ చేశారు. అక్కడ రాజేశ్ అనే నాయకుడిని దించారు. ఆయనకు టికెట్ ఇచ్చినందుకు ఆ మంత్రి రూ.ఆరున్నర కోట్లు వసూలు చేశారు. మధ్యలో బ్రోకర్ సజ్జల సెటిల్మెంట్ చేసి రూ.3 కోట్లు ఇప్పించాడు. ఈ విషయం రాజేశ్ స్వయంగా బహిరంగంగా చెప్పాడు. ఏమిటీ రాజకీయాలు? రాష్ట్రాన్ని దయనీయ స్థితికి దిగజార్చారు. జనం రోడ్డెక్కి ప్రశ్నించాలి. చైతన్యం రాకపోతే రౌడీలు, గూండాలు రాజ్యమేలతారు.

ఆడపిల్లలకు అండగా..!

- వారి 'కలలకు రెక్కలు'.. టీడీపీ కొత్త హామీ

అమరావతి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ఆడపిల్లల ఉన్నత చదువుల కోసం తెలుగుదేశం పార్టీ సరికొత్త పథకానికి రూపకల్పన చేసింది. టీడీపీ అధికారంలోకి వస్తే.. యువతులు విదేశాలకు వెళ్లి చదువుకోవడంతో పాటు ఏ కోర్సు చేసినా అందుకయ్యే ఖర్చుకు ప్రభుత్వమే గ్యారెంటీగా ఉండి బ్యాంకు నుంచి రుణంగా ఇప్పిస్తుందని, వడ్డీని కూడా పూర్తిగా ప్రభుత్వమే భరిస్తుందని ఆ పార్టీ అధినేత చంద్రబాబు ప్రకటించారు. ఈ పథకానికి 'కలలకు రెక్కలు' అని పేరు పెట్టారు. దీని కింద లబ్ధి పొందే వారి సంఖ్యపై పరిమితి లేదని, ఎన్ని లక్షల మంది ఆడపిల్లలు ముందుకొచ్చినా అందరికీ దీనిని వర్తింపజేస్తామని మాజీ సీఎం తెలిపారు. ఈ పథకం కింద సాయం కావాలనుకునే విద్యార్థినుల రిజిస్ట్రేషన్‌ను బుధవారం ఇక్కడ ఉండవల్లిలోని తన నివాసంలో ఆయన ప్రారంభించారు. 'కలలకు రెక్కలు. కామ్' పేరుతో ప్రత్యేక వెబ్‌సైట్‌ను దీని కోసం ఏర్పాటు చేశారు. ఇందులో ఇప్పటికి పన్నెండు వేల మంది విద్యార్థినులు నమోదు చేసుకున్నారని, దీనికి వస్తున్న ఆదరణకు ఇది నిదర్శనమని ఆయన చెప్పారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ సహా ఇతర ప్రభుత్వ పథకాలకు ఇది అదనమని, ఆ పథకాలు వర్తించే అవకాశం లేనిచోట దీనిని ఉపయోగించుకోవచ్చని తెలిపారు. 'సాధారణంగా ప్రభుత్వ పథకాలకు కొన్ని పరిమితులు ఉంటాయి. అపరిమితంగా సాయం చేయలేం. అయితే తాజా స్కీంకు అటువంటి పరిమితులు లేవు. కొన్ని కోర్సులకు ఫీజుల పథకం వర్తించదు. ఒక కోర్సు చదివిన తర్వాత అందులో మరింత జ్ఞానం సంపాదించడానికి మరికొన్ని కోర్సులు చేయాల్సి వస్తుంది. వాటన్నిటికీ ఈ పథకం ఉపయోగపడుతుంది. దీనికింద ఎన్ని వేల కోట్లయినా ఖర్చు చేస్తాం' అని ఆయన వివరించారు. ఆడ పిల్లలను బాగా చదివించి ఉపాధి అవకాశాలు కల్పిస్తే కుటుంబాలతోపాటు సమాజం కూడా ముందుకు వెళ్తుందన్నారు. '40 ఏళ్ల కిందట ఎన్టీఆర్ తొలిసారి మహిళలకు ఆస్తిలో సమాన హక్కు కల్పించారు. మహిళల్లో నాయకత్వం పెంపొందించడానికి స్థానిక సంస్థల ఎన్నికల్లో వారికి రిజర్వేషన్లు కల్పించారు. ఇప్పుడు దేశవ్యాప్తంగా మహిళలకు ఏభై శాతం రిజర్వేషన్లు రావడానికి ఎన్టీఆర్ చొరవ కారణం. నేను ముఖ్యమంత్రి అయిన తర్వాత చదువుల్లో, ఉద్యోగాల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించాను. దానివల్ల విద్యా సంస్థల్లో, ఉద్యోగాల్లో మహిళలు పెరిగారు. పేద కుటుంబాల్లో మహిళలు వారి కాళ్లపై వారు నిలబడటానికి డ్వాక్రా ఉద్యమాన్ని పెంపొందించాం. ఐటీకి ప్రోత్సాహం పెంచి ఐటీలో ఉద్యోగాలు బాగా దొరికే వాతావరణం కల్పించిన తర్వాత ఆడపిల్లలు అందులో బాగా రాణిస్తున్నారు. మంచి ఉద్యోగం ఉంటే కట్నం అడగడం లేదు. ఆడపిల్లలు తమ భర్తను తాము ఎంచుకునే పరిస్థితులు దీనివల్ల వచ్చాయి. విదేశాల్లో అవకాశాలు ఇంకా పెరిగాయి. మంచి విద్యా సంస్థల్లో చదువుకుంటే ఇంకా మంచి ఉద్యోగాలు వస్తున్నాయి. అందుకే వారికి బాగా చదువుకోవడానికి సాయం చేసేందుకు ఒక పథకం ఉంటే బాగుంటుందని దీనిని తీసుకొచ్చాం' అని తెలిపారు. కార్యక్రమంలో విజయవాడకు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ భావన మాట్లాడారు. 'నేను ఒక సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఇంటి దగ్గర నుంచి పనిచేస్తున్నాను. మేం కొత్త విషయాలు నేర్చుకోవడానికి సర్టిఫికేషన్ కోర్సులు చేయాలి. వాటికి మా జీతం నుంచి చెల్లించాలి. ఖర్చు ఎందుకని వదిలేస్తుంటాం. ఇప్పుడు టీడీపీ పెట్టిన పథకంతో వాటిని పూర్తిచేయడానికి అవకాశం వస్తోంది. ఇది మంచి ఆలోచన' అని అన్నారు.

నేడు టీడీపీ అభ్యర్థుల రెండో జాబితా

- 25 మంది పేర్లు ప్రకటించే అవకాశం
- 10 మంది లోక్‌సభ పోటీదారులు కూడా.. చంద్రబాబుతో ఆశావహుల భేటీలు

అమరావతి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేసే తన అభ్యర్థుల రెండో జాబితాను టీడీపీ గురువారం విడుదల చేయనుంది. ఈ విషయాన్ని ఆ పార్టీ అధినేత చంద్రబాబు బుధవారమిక్కడ ధ్రువీకరించారు. అందులో సుమారు పాతిక మంది అసెంబ్లీ అభ్యర్థుల పేర్లతో పాటు 10 మంది ఎంపీ అభ్యర్థుల పేర్లు కూడా ఉంటాయని తెలిసింది. కొద్ది రోజుల క్రితం టీడీపీ 94 మందితో తన తొలి జాబితా విడుదల చేసింది. పొత్తులో భాగంగా జనసేన, బీజేపీలకు 31 స్థానాలను కేటాయించిన ఆ పార్టీ 144 సీట్లలో బరిలోకి దిగనుంది. తొలి జాబితా పోను ఇంకా 50 సీట్లలో అభ్యర్థులను ప్రకటించాల్సి ఉంది. మరోవైపు.. టీడీపీ టికెట్లను ఆశిస్తున్న పలువురు నేతలు బుధవారమిక్కడ చంద్రబాబును కలిశారు. విశాఖ జిల్లా భీమిలి సీటు ఆశిస్తున్న మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు.. తన వియ్యంకుడు, మాజీ మంత్రి పొంగూరు నారాయణతోపాటు టీడీపీ అధినేతను కలిశారు. గంటాను చీపురుపల్లిలో పోటీ చేయించాలని చంద్రబాబు యోచిస్తున్నారని ప్రచారం జరుగుతున్న సంగతి తెలిసిందే. నెల్లూరు టీడీపీ ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి కూడా చంద్రబాబును కలిసి.. కోవూరు అసెంబ్లీ అభ్యర్థి ఎంపికపై చర్చించినట్లు చెబుతున్నారు. కడప జిల్లా జమ్మలమడుగు ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి, బద్వేలు(ఎస్సీ) ఇన్‌చార్జి రితేశ్ రెడ్డి, ప్రొద్దుటూరు ఇన్‌చార్జి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి కూడా పొద్దుపోయాక చంద్రబాబును కలిసి మాట్లాడారు. తమ సీట్లలో నెలకొన్న సమస్యల గురించి వారు మాట్లాడారు. జమ్మలమడుగు, బద్వేలు పొత్తులో బీజేపీకి పోవడంతో దానిపై మాట్లాడేందుకు ఆ నియోజకవర్గాల నేతలు వచ్చారు. వారి వెంట పొలిట్‌బ్యూరో సభ్యుడు రెడ్డప్పగారి శ్రీనివాసరెడ్డి కూడా ఉన్నారు.

ఎల్లుండి టీడీపీలోకి మాగుంట

- ఉండవల్లిలో చంద్రబాబు సమక్షంలో చేరిక
- 'అద్దంకి' గరటయ్య, కృష్ణచైతన్య కూడా

ఒంగోలు మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు ఎంపీ, ఇటీవల వైసీపీకి రాజీనామా చేసిన మాగుంట శ్రీనివాసులరెడ్డి శనివారం (ఈనెల 16న) తెలుగుదేశం పార్టీలో చేరనున్నారు. తన కుమారుడు రాఘవరెడ్డి, అనుచరులతోపాటు ఆ రోజున సాయంత్రం 4 గంటలకు ఉండవల్లిలో పార్టీ అధినేత చంద్రబాబు సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకుంటారు. రాఘవరెడ్డికి ఇప్పటికే టీడీపీ లోక్‌సభ అభ్యర్థిత్వం ఖరారైందని అంటున్నారు. అలాగే ప్రకాశం జిల్లా సీనియర్ నాయకుడు, అద్దంకి మాజీ ఎమ్మెల్యే బాచిన చెంచుగరటయ్య, ఆయన తనయుడు, శాప్ నెట్ చైర్మన్ కృష్ణచైతన్య కూడా 16వ తేదీన ఉండవల్లిలో టీడీపీలో చేరనున్నారు. కృష్ణచైతన్య కూడా ఇటీవల వైసీపీ నుంచి బయటకు వచ్చారు. ఒంగోలు లోక్‌సభ స్థానం నుంచి 1991 నుంచి మాగుంట కుటుంబం పోటీ చేస్తూ ప్రకాశం జిల్లా రాజకీయాల్లో కీలకంగా వ్యవహరిస్తోంది. గత ఎన్నికల్లో మాగుంట వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందగా ఈ సారి వైసీపీ టికెట్ నిరాకరించారు. వ్యక్తిగతంగా కూడా మాగుంట పట్ల సీఎం జగన్ తీవ్ర అవమానకరంగా వ్యవహరించారన్న అభిప్రాయం రాజకీయ వర్గాల్లో ఉంది. ఈ నేపథ్యంలో గత నెల 28న మాగుంట వైసీపీకి రాజీనామా చేయడంతోపాటు ఈ సారి ఎన్నికల్లో తన కుమారుడు రాఘవరెడ్డి పోటీ చేస్తాడని ప్రకటించారు.



చిలకలూరిపేటలో ఉమ్మడి బహిరంగ సభ స్థలంలో భూమిపూజ చేస్తున్న టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు

చిలకలూరిపేట సభతో భవిష్యత్‌కు దశ-దిశ!

- జగన్ అరాచక పాలనను అంతమొందిస్తాం
- టీడీపీ-జనసేన-బీజేపీ నేతల ప్రకటన
- బొప్పూడి వద్ద హైవే పక్కనే సభ
- పనులకు శ్రీకారం చుట్టిన కూటమి నేతలు

చిలకలూరిపేట, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హితం.. అభివృద్ధి కోసం.. జగన్మోహన్‌రెడ్డి అరాచకపాలనను అంతమొందించి.. 5 కోట్ల మంది ప్రజల ఆశలు, ఆకాంక్షలను నెరవేర్చే లక్ష్యంతో తామంతా ఏకతాటిపైకి వచ్చినట్లు తెలుగుదేశం-జనసేన-బీజేపీ నేతలు అన్నారు. తమ కూటమి రాష్ట్ర రాజకీయాల్లో సరికొత్త అధ్యాయాన్ని లిఖించబోతోందని అన్నారు. పల్నాడు జిల్లా చిలకలూరిపేట సమీపంలోని బొప్పూడి వద్ద ఆదివారం నిర్వహించే భారీ బహిరంగసభ ఆంధ్రప్రదేశ్ ప్రజల భవిష్యత్ దశ, దిశ నిర్దేశించబోతోందని తెలిపారు. ఈ సభ కోసం 200 ఎకరాల్లో నిర్మించనున్న సభా ప్రాంగణం వద్ద టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ బుధవారం ఉదయం 9.32 గంటలకు భూమిపూజ చేసి ఏర్పాట్లకు శ్రీకారంచుట్టారు. ప్రాంగణం వద్ద పనులను లోకేశ్ ప్రారంభించారు. పొత్తు కుదిరిన అనంతరం నిర్వహిస్తున్న ప్రథమ సభ కావడంతో మూడు పార్టీలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి. 2014లో కూడా మూడుపార్టీలు కలిసి ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచే ఎన్నికల ప్రచారం ప్రారంభించి, విజయ దుందుభి మోగించాయి. అదే సెంటిమెంట్‌తో ఇప్పుడు కూడా ఉమ్మడి గుంటూరు గడ్డపై నుంచి ఎన్నికల సమరశంఖం పూరించనున్నాయి. ప్రధాని మోదీ, టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేనాని పవన్ కల్యాణ్ హాజరుకాబోతున్న సభకు రాష్ట్రం నలుమూలల నుంచి లక్షలాది మంది ప్రజలు తరలిరానున్న నేపథ్యంలో లోకేశ్ నేతృత్వంలో మూడు పార్టీల ముఖ్యనేతలు వివిధ కమిటీలతో సమావేశమయ్యారు. సభ ఏర్పాట్లపై చర్చించారు. భారీ బహిరంగ సభకు హాజరయ్యే లక్షలాది మందికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు, మాజీ మంత్రులు ప్రత్తిపాటి పుల్లారావు, కన్నా లక్ష్మీనారాయణ, ఆలపాటి రాజేంద్రప్రసాద్, నక్కా ఆనందబాబు, జాతీయ అధికారప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిరాం.. బీజేపీ నేతలు పాతూరి నాగభూషణం, యడ్లపాటి రఘునాథబాబు, వల్లూరి జయప్రకాశ్, లంకా దినకర్, శ్రీమన్నారాయణ.. జనసేన కార్యక్రమాల నిర్వహణ విభాగం కన్వీనర్ కళ్యాణం శివశ్రీనివాస్, ఉమ్మడి కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాల అధ్యక్షులు బండ్రెడ్డి రామకృష్ణ, గాదె వెంకటేశ్వరరావు, షేక్ రియాజ్, టీడీపీ ఎమ్మెల్యేలు గొట్టిపాటి రవికుమార్, నిమ్మల రామానాయుడు, అనగాని సత్యప్రసాద్, మంతెన రామరాజు, పార్టీ సీనియర్ నేతలు జీవీ ఆంజనేయులు, పెందుర్తి వెంకటేశ్, సత్యనారాయణరాజు పాల్గొన్నారు.

కూకటివేళ్లతో పెకలిస్తాం: పుల్లారావు

ప్రత్తిపాటి పుల్లారావు మాట్లాడుతూ.. జగన్ అరాచక ప్రభుత్వాన్ని టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి కూకటివేళ్లతో పెకలించి వేస్తుందన్నారు. కాగా, చిలకలూరిపేట బహిరంగ సభకు మూడు పార్టీల నేతలతో ఆహ్వాన కమిటీని ప్రకటించారు.

ఉమ్మడి మేనిఫెస్టో విడుదల వాయిదా

అమరావతి, మార్చి 13(ఆంధ్రజ్యోతి): టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల ఉమ్మడి మేనిఫెస్టో విడుదల వాయిదా పడింది. ఈ నెల 17న చిలకలూరిపేట సభలో దీనిని విడుదల చేయాలని టీడీపీ, జనసేన పార్టీలు మొదట అనుకొన్నాయి. ఆ తర్వాత పొత్తులోకి బీజేపీ వచ్చి చేరింది. చిలకలూరిపేట సభకు ప్రధాని నరేంద్ర మోదీ హాజరు కావాలని నిర్ణయించుకొన్నారు. ప్రధాని పాల్గొనే సభలో మేనిఫెస్టో విడుదల చేస్తే దాని ప్రాధాన్యం తగ్గుతుందన్న అభిప్రాయంతో వాయిదా నిర్ణయం తీసుకొన్నారు.

బీజేపీలో 9 సీట్లు కొలిక్కి!

- వాటిలో చాలావాటికి అభ్యర్థులూ ఖరారు
- అనపర్తి/పి.గన్నవరం నడుమ ఊగిసలాట
- నేడు అధికారికంగా జాబితా విడుదల?

అమరావతి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మనకు ఏ సీటు ఖరారైంది.. ఎవరు పోటీలో ఉంటారు.. రాష్ట్ర బీజేపీ శ్రేణుల్లో ఏ నోట విన్నా ఇదే చర్చ. టీడీపీ-జనసేనతో పొత్తులో భాగంగా ఆ పార్టీకి పది అసెంబ్లీ, ఆరు లోక్‌సభ స్థానాలు దక్కిన సంగతి తెలిసిందే. ఆ పది అసెంబ్లీ స్థానాలు ఏమిటి.. వాటికి అభ్యర్థులెవరన్న దానిపై కమలనాథుల కసరత్తు కొలిక్కి వచ్చినట్లు సమాచారం. గురువారం అభ్యర్థుల జాబితాను అధికారికంగా ప్రకటిస్తామని బీజేపీ ఉన్నతస్థాయి వర్గాలు తెలిపాయి. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. ఆ పార్టీకి రాయలసీమలో ఆదోని, ధర్మవరం, జమ్మలమడుగు, బద్వేలు (ఎస్సీ).. కోస్తాలో విజయవాడ పశ్చిమ, కైకలూరు, అనపర్తి/పి.గన్నవరం.. ఉత్తరాంధ్రలో శ్రీకాకుళం, పాడేరు(ఎస్టీ), విశాఖ ఉత్తరం ఖరారయ్యాయి. వీటిలో ధర్మవరం నుంచి వరదాపురం సూరి, ఆదోనిలో డాక్టర్ పార్థసారథి బరిలో ఉండే అవకాశాలు కనిపిస్తున్నాయి. జమ్మలమడుగు నుంచి మాజీ మంత్రి ఆదినారాయణ రెడ్డి పేరు ఒక్కటే వినిపిస్తున్నా ఆయన కుటుంబ సభ్యులే వ్యతిరేకిస్తుండడం మైనస్‌గా మారింది. బద్వేలులో గతంలో పోటీ చేసిన జ్యోతి.. అదే జిల్లాకు చెందిన రాజ్యసభ సభ్యుడి ఆశీర్వాదంతో బరిలో దిగొచ్చని తెలుస్తోంది. ఏలూరు జిల్లా కైకలూరు నుంచి మాజీ మంత్రి కామినేని శ్రీనివాస్ ఒక్కరి పేరు మాత్రమే వినిపిస్తున్నా ఆయన వయసు రీత్యా జిల్లా పార్టీలో కీలక పదవిలో ఉండే బీసీ నాయకుడిని ఇక్కడి నుంచి బరిలో దించవచ్చని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. విజయవాడ పశ్చిమ నుంచి జిల్లా బీజేపీ అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్ పేరు వినిపిస్తోంది. నగర మాజీ అధ్యక్షుడు బబ్బూరి శ్రీరామ్ కూడా ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. అడ్డూరి ఆర్థికంగా బలంగా లేకున్నా ఆర్యవైశ్య సామాజికవర్గం ఆయన్ను అక్కున చేర్చుకునే అవకాశం ఉందని పార్టీలో వినిపిస్తోంది. పాడేరు నుంచి ఎస్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఉమామహేశ్వరరావు, విశాఖ ఉత్తరంలో విష్ణుకుమార్‌రాజు పేర్లు దాదాపు ఖరారయ్యాయి. శ్రీకాకుళం నుంచి బీసీ వర్గానికి చెందిన పైడి వేణుగోపాల్ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. బీజేపీకి అనపర్తి ఇచ్చేందుకు టీడీపీ సిద్ధమైనా.. పి.గన్నవరం వైపే ఆ పార్టీ ఎక్కువగా మొగ్గు చూపుతోంది. ఆ సీటు దక్కితే మాజీ ఎమ్మెల్యే అయ్యాజీ వేమాను బరిలో దించే అవకాశం ఉంది. ఈ రెండింటిలో ఏది తీసుకోవాలా అని బీజేపీ ఊగిసలాటలో ఉంది.

మా పెద్దిరెడ్డిపైనే పోస్టులు పెడతావా?

- నిన్ను చంపితే అడిగే దిక్కెవరు!
- పుంగనూరులో వైసీపీ దౌర్జన్యకాండ
- బీజేపీ నేతపై మూకుమ్మడి దాడి
- ఫిర్యాదు తీసుకోని ఎస్ఐ



పోలీసు స్టేషన్ ముందు మీడియాతో మాట్లాడుతున్న బాధితుడు ప్రేమ్‌కుమార్

పుంగనూరు, మార్చి 13: 'మా పెద్దాయన(మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి)పైనే సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెడతావా? మంత్రిని ప్రశ్నించే స్థాయి నీకెక్కడిది? నిన్ను చంపితే అడిగే దిక్కెవరు? మీ బీజేపీ ఏమైనా నీకు సపోర్టుగా వస్తుందా?' అంటూ దుర్భాషలాడుతూ చిత్తూరు జిల్లా పుంగనూరు అసెంబ్లీ నియోజకవర్గ కో-కన్వీనర్, అడ్వకేటు పూల ప్రేమ్‌కుమార్‌పై వైసీపీ నాయకులు దాడికి పాల్పడ్డారు. అయితే, దీనిపై ఫిర్యాదు స్వీకరించేందుకు పోలీసులు నిరాకరించారు. బాధితుడు ప్రేమ్‌కుమార్ బుధవారం పోలీసు స్టేషన్ ముందు ఆ వివరాలను మీడియాకు వెల్లడించారు. 'పుంగనూరు మున్సిపల్ కార్యాలయానికి వ్యక్తిగత పనిపై వెళ్లి వస్తున్నా. చైర్మన్ గది ఎదురుగా కారిడార్‌లో వైసీపీ నేత, రాష్ట్ర జానపదకళల అకాడమీ చైర్మన్ కొండేటి నాగభూషణం, కార్పొరేషన్ చైర్మన్ అలీంబాషా, కౌన్సిలర్లు, వారి అనుచరులు నన్ను ఆపారు. నీ పార్టీ ఎక్కడ ఉందిరా! నిన్ను చంపితే ఎవరు వస్తారు? నా వార్డులో నీకేమి పని అంటూ దూషిస్తూ 30 మంది నాపై మూకుమ్మడిగా దాడి చేశారు. షర్టు చింపి, మొబైల్ లాక్కొని కొట్టి, మెడపట్టి బయటకు నెట్టేశారు. వారినుంచి నాకు ప్రాణపాయం ఉంది. ఎస్ఐ సుబ్బారెడ్డి ఫిర్యాదు తీసుకుని రశీదు ఇవ్వకుండా నాపైనే ఆగ్రహం వ్యక్తం చేశారు. పుంగనూరులో ప్రజాస్వామ్యం అమలు కావడంలేదు' అంటూ ప్రేమ్‌కుమార్ ఆవేదన వ్యక్తంచేశారు. గతంలో తప్పుడు కేసు పెట్టి తనను జైలుకు పంపారని, స్థానిక ఎన్నికల్లో పులిచెర్లలో తల పగులగొట్టారని తెలిపారు. దాడికి సంబంధించి రాష్ట్ర, కేంద్రపార్టీ కార్యాలయాలు, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశానని తెలిపారు.

శిలాఫలకాలకూ వైసీపీ రంగు!



మురళీనగర్ (విశాఖపట్నం), మార్చి 13: ఇలాంటి శిలాఫలకాన్ని ఎక్కడైనా చూశారా? ఎవరికీ తట్టని, ఊహకే అందని ఆలోచనలు వైసీపీ నేతలకు వస్తున్నాయి. విశాఖను తామే సుందరంగా మారుస్తున్నామనే స్థాయిలో వైసీపీ నేతలు ప్రచారం చేస్తున్నారు. ఈ కోవలోనే శిలాఫలకాలను పార్టీ జెండా దిమ్మలను మించిపోయేలా తీర్చిదిద్దుతున్నారు. ఉత్తర నియోజకవర్గ పరిధిలోని జీవీఎంసీ 51వ వార్డులో గల ఆర్‌అండ్‌బీ జంక్షన్ మర్రిపాలెం ఉడా కాలనీ ప్రవేశ మార్గం వద్ద ఇలాంటి శిలాఫలకం ఒకటి దర్శనమిస్తోంది. ఇటీవల ఈ రోడ్డు మధ్యనున్న డివైడర్ వెడల్పును (కేవలం 400 మీటర్ల మేర) కుదించే పనులు చేపట్టారు. ఇవి పూర్తై సుమారు ఐదు నెలలు దాటగా, తాజాగా ఇక్కడ శిలాఫలకాన్ని ఏర్పాటుచేశారు. దానిపై వైసీపీ ఎన్నికల గుర్తు ఫ్యాన్ ముద్రించారు. చిత్రమేమిటంటే ఈ రోడ్డులోని పాత డివైడర్‌ను తొలగించిన సందర్భంలో పచ్చని చెట్లను నరికేశారు. తాజాగా నిర్మించిన డివైడర్ చెత్తతో నిండిపోయింది.


మీ బలప్రదర్శన మా ముందొద్దు!

- ఆదిలోనే ముద్రగడకు మరో అవమానం
- భారీగా జనాలు వస్తే సీఎం భద్రతకు ఇబ్బందులంటూ కాపు నేతకు సమాచారం
- తానొక్కడినే వెళ్లి నేడు వైసీపీలో చేరాలని నిర్ణయం

కాకినాడ, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): 'మీ బల ప్రదర్శనలు మా ముందు వద్దు' అని కాపు ఉద్యమనేత ముద్రగడ పద్మనాభానికి వైసీపీ అధిష్ఠానం తేల్చి చెప్పేసింది. వందల కార్లలో, వేల మంది అభిమానులతో వైసీపీలో చేరేందుకు సిద్ధమైన ఆయనను 'ఒంటరి'గా రావాలంటూ సుతిమెత్తగా హెచ్చరించింది. దీంతో అన్నీ సిద్ధం చేసుకుని, ఎంతోమందిని ఆహ్వానించి అట్టహాసంగా కిర్లంపూడి నుంచి గురువారం ఉదయం తాడేపల్లికి బయలుదేరాలని భావించిన ముద్రగడ జావగారిపోయారు. తనను క్షమించాలంటూ అభిమానులకు ఆయన లేఖ రాసి, తాను ఒక్కడినే వెళ్లి పార్టీ కండువా కప్పుకొంటానని పేర్కొన్నారు. ఏం జరిగిందంటే...గురువారం తాడేపల్లిలో జగన్ సమక్షంలో చేరడానికి రావాలని ముద్రగడ పద్మనాభాన్ని వైసీపీ అధిష్ఠానం ఆహ్వానించింది. కాకినాడ జిల్లా కిర్లంపూడిలోని స్వగృహం నుంచి తాడేపల్లికి బయలుదేరడానికి ముద్రగడ భారీ ఏర్పాట్లు చేసుకున్నారు. వైసీపీలో చేరుతున్న తన వెంట ప్రయాణించడానికి అందరూ రావాలని పిలుపునివ్వడంతో పలువురు అనుచరులు పదుల సంఖ్యలో కార్లు అద్దెకు తీసుకున్నారు. ఈలోపు ముద్రగడ గురువారం అందరూ షాక్ అయ్యేలా మరో బహిరంగ లేఖ విడుదల చేశారు. భారీ సంఖ్యలో అభిమానులు వస్తే సీఎం జగన్‌కు భద్రతా పరమైన ఇబ్బంది తలెత్తే అవకాశముందని లేఖలో పేర్కొన్నారు. దీంతో తాడేపల్లికి అంతా తరలివెళ్లే కార్యక్రమం రద్దు చేసుకున్నట్లు లేఖలో పేర్కొన్నారు. నిరుత్సాహపర్చినందుకు క్షమాపణ కోరుతున్నట్లు వివరించారు. ఈ నెల 15 లేదా 16 తేదీల్లో తానొక్కడే వెళ్లి వైసీపీలో చేరుతానన్నారు. అయితే, జగన్ ఎదుట భారీ బల ప్రదర్శనకు ముద్రగడ సిద్ధం కావడం ఆయనకు నచ్చకే భద్రతా కారణాలను సాకుగా చూపించినట్లు ముద్రగడ అనుచరులు భావిస్తున్నారు.

హోదాపై నోరు మూతబడిందేం?

- కేంద్రాన్ని ఎందుకు ప్రశ్నించట్లేదు
- జగన్ సమాధానం చెప్పాల్సిందే : షర్మిల
- ఢిల్లీలో కాంగ్రెస్ స్క్రీనింగ్ కమిటీ భేటీ



న్యూఢిల్లీ, మార్చి 13(ఆంధ్రజ్యోతి): "25 మంది ఎంపీలను ఇస్తే రాష్ట్రానికి ప్రత్యేక హోదా తెస్తానన్న జగన్.. కేంద్రాన్ని ఎందుకు ప్రశ్నించడం లేదు. హోదాపై ఎందుకు మౌనంగా ఉన్నారు?" అని ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల నిలదీశారు. ప్రత్యేక హోదాపై సీఎం జగన్ సమాధానం చెపాల్సిందేనన్నారు. గతంలో ప్రత్యేక హోదా మీద మాట్లాడిన సీఎం జగన్ ఇప్పుడు ఎందుకు నోరెత్తడం లేదని ప్రశ్నించారు. ప్రత్యేక హోదాపై జగన్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రత్యేక హోదా, పోలవరం, రాజధాని అంశాలపై కాంగ్రెస్ పార్టీ బలంగా నిలబడుతుందని షర్మిల తెలిపారు. ఈ మేరకు ఢిల్లీలో బుధవారం ఆమె మీడియాతో మాట్లాడారు. వచ్చే అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికలకు సంబంధించి ఏపీలో కాంగ్రెస్ తరపున పోటీ చేసే అభ్యర్థుల ఎంపిక పూర్తి పారదర్శకంగా జరుగుతుందన్నారు. ఎన్నికల్లో పోటీ చేస్తామంటూ 1500 మంది నుంచి దరఖాస్తులు రావడం రాష్ట్రంలో కాంగ్రెస్ బలంగా ఉందనడానికి నిదర్శనమని తెలిపారు. ఎన్నికల్లో పార్టీ ఆదేశిస్తే ఎవరైనా ఎక్కడి నుంచైనా పోటీ చేయాల్సిందేనని చెప్పారు. పార్టీ గెలుపు కోసం నేతలు సైనికులుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. సీపీఎం, సీపీఐతో చర్చలు జరుపుతున్నామని, అందరినీ కలుపుకొని పోతామన్నారు.

సుదీర్ఘ చర్చలు

ఏపీ అసెంబ్లీ ఎన్నికల్లో 175 సీట్లలో పోటీ చేసే అభ్యర్థులపై కాంగ్రెస్ పార్టీ ఏపీ స్క్రీనింగ్ కమిటీ చర్చించింది. కలిసి వచ్చే పార్టీలతో పొత్తులు పెట్టుకునే అంశాలపైనా దృష్టి సారించింది. గత ఎన్నికల్లో సాధించిన ఓటు బ్యాంకును ఈసారి డబుల్ డిజిట్ దాటించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఎన్నికల బరిలో బలమైన అభ్యర్థులను నిలిపి సాధ్యమైనన్ని సీట్లలో గెలిచే దిశగా అడుగులు వేయాలని భావిస్తోంది. స్క్రీనింగ్ కమిటీ చైర్మన్ మధుసూదన్ మిస్త్రీ నేతృత్వంలో జరిగిన ఈ భేటీలో వైస్ చైర్మన్ సూరజ్ హెగ్డే, ఏపీ వ్యవహారాల ఇంచార్జ్ మాణిక్కం ఠాగూర్, ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల, రఘువీరారెడ్డి, కొప్పుల రాజు తదితరులు పాల్గొన్నారు.

బదిలీల స్కామ్ 50 కోట్లు

- భారీ స్థాయిలో టీచర్ల అక్రమ బదిలీలు
- క్షేత్రస్థాయి నుంచే వసూళ్లు ప్రారంభం
- మొదట ప్రజాప్రతినిధుల సిఫారసులు
- ఆ తర్వాత పైస్థాయిలో కదిలిన ఫైళ్లు
- రెండు చోట్లా సమర్పించుకున్న టీచర్లు
- రెండు జిల్లాల డీఈవోలపై దౌర్జన్యం
- చివరికి కమిషనరేట్ నుంచి ప్రక్రియ
- అక్రమ బదిలీల ఆర్డర్లు విడుదల

అమరావతి, మార్చి 13(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల బదిలీల్లో భారీ అక్రమాలు వెలుగు చూశాయి. ఉపాధ్యాయులను ఒక చోట నుంచి మరో చోటకు బదిలీ చేసేందుకు ఏకంగా రూ.50 కోట్లను అధికార పార్టీ నేతలు మెక్కేశారు. సుమారు 1200 మంది ఉపాధ్యాయుల అక్రమ బదిలీలకు సంబంధించిన ఆర్డర్లను తాజాగా పాఠశాల విద్యాశాఖ జిల్లాలకు పంపింది. అయితే, ఆరోపణల నేపథ్యంలో డీఈవోలు వాటిని వెంటనే బయటపెట్టకుండా జాగ్రత్త పడుతున్నారు. కాగా, తాజాగా వసూలు చేసిన రూ.50 కోట్లు అధికార పార్టీకి చెందిన కీలక నేత తన నియోజకవర్గంలో పంపకాలకు ఉపయోగించబోతున్నారన్న ప్రచారం జరుగుతోంది. కేవలం ఎన్నికల ఖర్చుల కోసమే అక్రమ బదిలీలకు ఆయన ద్వారాలు తెరిచారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. పైస్థాయిలో కీలక నేత, అధికారుల వసూళ్లతో పాటు.. క్షేత్రస్థాయిలో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధుల వద్ద సిఫారసు లేఖలకు కూడా ముడుపులు సమర్పించుకున్న విషయం వెలుగులోకి వచ్చింది.

సిఫారసు లేఖలకూ పిండేశారు

గతేడాది టీచర్ల సాధారణ బదిలీలు జరిగిన వెంటనే కోరుకున్న స్థానాలు దక్కని టీచర్లు వెంటనే పైరవీలు మొదలుపెట్టారు. దీనికిగాను మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికార పార్టీలోని కీలక నేతల వద్దకు వెళ్లి సిఫారసు లేఖలు తెచ్చుకున్నారు. ఇక్కడి నుంచే వసూళ్లు మొదలుపెట్టినట్లు తెలిసింది. కేవలం సిఫారసు లేఖలు ఇచ్చినందుకు ఒక్కో లేఖకు రూ.50 వేల నుంచి రూ.లక్ష తీసుకున్నారని సమాచారం. అయితే, అవన్నీ తమకు సంబంధం లేదని, తమ పీఏలు తీసుకున్నారేమో తెలియదంటూ లేఖలు ఇచ్చిన ప్రజాప్రతినిధులు చెబుతున్నారు. కానీ, పీఏల పేరుతో నేరుగా ప్రజాప్రతినిధులే సిఫారసుల వ్యాపారం చేసినట్లు తెలుస్తోంది. ఒక్కో ఎమ్మెల్యే సగటున పది మంది ఉపాధ్యాయుల బదిలీకి సిఫారసు చేశారని, తద్వారా రూ.10 లక్షల వరకు అందుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. రాయలసీమలో ముఖ్యంగా చిత్తూరులో 'పెద్ద' నేతగా పేరున్న ఓ మంత్రి ఏకంగా 200 లేఖలు ఇచ్చారు. సీఎంకు అత్యంత సన్నిహితుడైన రాయలసీమ ఎంపీ 200 లేఖలు, ప్రకాశం జిల్లాలో అసంతృప్తవాదిగా పేరున్న ఓ అధికార పార్టీ నేత 200 లేఖలు ఇచ్చారు. రాయలసీమలో పాణ్యం, శ్రీశైలం, ఆళ్లగడ్డ ప్రాంతాల నుంచి భారీగా సిఫారలు లేఖలు పాఠశాల విద్యాశాఖకు వచ్చాయి. గుంటూరు జిల్లాలోని ఓ ఎమ్మెల్సీ అనంతపురం, కడప, చిత్తూరు జిల్లాల టీచర్లకు భారీగా లేఖలు ఇచ్చారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో కేవలం ఒకే ఒక్క సీనియర్ మంత్రి కనుసన్నల్లో సిఫారసులు నడిచాయి.

సీఎంవో పేరుతోనూ బదిలీలు

టీచర్ల అక్రమ బదిలీల్లో వసూళ్లకు ప్రధాన కేంద్రం కీలక నేత కార్యాలయమే అయినా, సిఫారసులు అన్ని వైపుల నుంచీ అందాయి. ప్రభుత్వంలో అన్నీ తానే అన్నట్టుగా వ్యవహరించే ఓ సలహాదారు ఇష్టానుసారంగా సిఫారసు లేఖలు ఇచ్చారని తెలిసింది. ఇక సీఎంవోలోని కొందరు అధికారులు ఇదే పంథా కొనసాగించారు. సీఎంవో బదిలీల పేరుతో గతంలోనే 130 మందిని అక్రమంగా బదిలీ చేయగా, ఇప్పుడు కొనసాగింపుగా మరో 1200 మందిని చేశారు. చివరికి ఓ గ్రామ సర్పంచ్ సిఫారసు లేఖను కూడా టీచర్ బదిలీకి రిఫరెన్స్‌గా పెట్టారు. పలుకుబడి ఉంటే ఏదైనా చేయొచ్చు అన్నట్టుగా గతంలో ఎప్పుడూ చూడని విధంగా వెయ్యి మందికి పైగా టీచర్లకు అక్రమ బదిలీలు చేశారు.

డీఈవోలనే భయపెట్టారు

ఈ సిఫారసు బదిలీలు చేయడం తమవల్ల కాదంటూ రెండు జిల్లాల డీఈవోలు ఏకంగా పాఠశాల విద్యాశాఖ కమిషనరేట్‌కు వచ్చి గగ్గోలు పెట్టే స్థాయిలో ఈ అక్రమాల వ్యవహారం కొనసాగింది. ఇద్దరు రాయలసీమ జిల్లాల డీఈవోలు తమపై ఒత్తిడి పెరుగుతోందని, ఒక్క ఖాళీకి పది లేఖలు ఇస్తున్నారని, ప్రజాప్రతినిధుల దౌర్జన్యం భరించలేకపోతున్నామంటూ గగ్గోలు పెట్టారు. మూడు నెలల కిందట ఈ ఘటనలు జరగ్గా, ఇక లాభం లేదనుకుని మొత్తం లేఖలను కమిషనరేట్‌కు తెప్పించుకుని పైస్థాయి నుంచే బదిలీలు చేసేశారు. ఈ క్రమంలో పైస్థాయిలో కీలక నేత పీఏ అడ్డగోలుగా వసూళ్లు చేశారు. ఎలాగూ ఇంతదూరం వచ్చాం కదా అనుకున్నారో ఏమోగానీ పైస్థాయిలో అడిగినంత ఇచ్చి ఉపాధ్యాయులు బదిలీ ఆదేశాలు తీసుకున్నారు.

ఇదీ వసూళ్ల లెక్క

బదిలీలు కోరిన టీచర్లలో ఒక్కొక్కరి నుంచి రూ.5 లక్షలు తగ్గకుండా వసూలు చేశారు. మొదట 1400 మంది పేర్లను పరిశీలించగా, చివరికి 1200 మందికి ఆర్డర్లు ఇచ్చేశారు. ఇందులో అతి తక్కువ మందికి మాత్రమే పలు కారణాలతో నగదు లేకుండా బదిలీ చేశారు. దాదాపు 1100 మంది ముడుపులు సమర్పించుకున్నారు. వీరిలో కొందరు తక్కువ ఇచ్చినా మొత్తంగా కలిపి కనీసం రూ.50 కోట్లు వసూలు చేసినట్లు పాఠశాల విద్యాశాఖలో బహిరంగంగానే చర్చించుకుంటున్నారు.

ఉపాధ్యాయ సంఘాల జోక్యం

ఉపాధ్యాయుల సమస్యలపై పోరాటం చేస్తున్నామని చెప్పుకొనే కొన్ని ఉపాధ్యాయ సంఘాల నేతలూ అక్రమ బదిలీల్లో తల దూర్చారని సమాచారం. నేరుగా వారి పేరుతో కాకుండా స్థానిక ప్రజాప్రతినిధులతో లేఖలు తీసుకుని, వాటిని కమిషనరేట్‌లో ఇచ్చి బదిలీలు చేయించుకున్నారు. ముఖ్యంగా తెలంగాణలో బలంగా ఉండే, రాష్ట్రంలో టీచర్ల బలం లేని ఓ సంఘం నేతలు 50 మందికి పైగా బదిలీలు చేయించినట్లు తెలిసింది. మరో సంఘం నేతలు కూడా కొద్ది మందికి బదిలీలు చేయించారు. ఇక తమ సంఘమే అధికార పార్టీకి చెందినది చెప్పుకొనే సంఘం నేతలు కూడా బదిలీలు చేయించారు. ఈ క్రమంలో టీచర్ల నుంచి మరికొంత వసూలు చేసి ఆ సంఘాల నేతలు జేబులు నింపుకొన్నారని తెలుస్తోంది.

హింస, రీ పోలింగ్ ఉండొద్దు..

వచ్చే ఎన్నికల్లో ఇదే లక్ష్యం: మీనా



అమరావతి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో హింసకు తావులేకుండా, రీ పోలింగ్‌కు అవకాశం లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా జిల్లాల అధికారులను ఆదేశించారు. తదనుగుణంగా ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. అమరావతి సచివాలయం నుంచి బుధవారం ఆయన అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు, ఎస్పీలు, పోలీస్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎన్నికల సన్నద్ధతకు తీసుకుంటున్న చర్యలపై సమీక్షించారు. ఈ సందర్భంగా మీనా మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో జీరో వయొలెన్స్, నో రీపోలింగ్ అనేవి ప్రధాన లక్ష్యాలుగా పెట్టుకుని పనిచేయాలని కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశించిన విషయాన్ని గుర్తుచేశారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు (ఈవీఎం) చక్కగా పనిచేసేలా చూసుకోవాలని సూచించారు. త్వరలో ఎన్నికల షెడ్యూల్ ప్రకటించనున్న నేపథ్యంలో దానికి ముందు, తర్వాత జిల్లాల అధికారులు తీసుకోవాల్సిన చర్యలను మీనా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఓటర్లను ఆకర్షించేందుకు పలు పార్టీలు నగదు, బహుమతులను విరివిగా పంపిణీ చేస్తున్నట్లు వార్తలు వెలువడుతున్నాయని, పలు ఫిర్యాదులు కూడా వస్తున్నాయని, వాటిపై సమగ్ర విచారణ జరిపి సంబంధిత నివేదికలను తమకు వెంటనే పంపాలని ఆదేశించారు.

అడ్డగోలు బదిలీలు ఆపాలి: ఏపీటీఎఫ్

అమరావతి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు పోరాడి సాధించుకున్న కౌన్సెలింగ్ విధానానికి తూట్లు పొడుస్తూ అన్ని జిల్లాల్లో ఉపాధ్యాయులకు 'నగదు' బదిలీలు, సిఫార్సు బదిలీలు నిర్వహించడానికి పూనుకోవడం సిగ్గుచేటని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) తీవ్రంగా ఖండించింది. తక్షణమే ఈ అడ్డగోలు బదిలీల ప్రక్రియను నిలిపివేయాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చెన్నుపాటి మంజుల, కె.భానుమూర్తి బుధవారం డిమాండ్ చేశారు.

సీఎంవోలో రోజా పంచాయితీ!

నగరి అసమ్మతి నేతలపై మంత్రి ఫిర్యాదు

అమరావతి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): సొంత నియోజకవర్గంలో వైసీపీ అసమ్మతి నేతలు మంత్రి రోజాకు చుక్కలు చూపిస్తున్నారు. ఆమెకు టికెట్ ఇవ్వొద్దని పెద్దఎత్తున ఆందోళనలు చేస్తున్నారు. ఇస్తే గెలిపించేది లేదని తీర్మానిస్తున్నారు. ఇటీవల ఏకంగా ఆమెపై అవినీతి ఆరోపణలే చేశారు. దీంతో ఆత్మరక్షణలో పడిన రోజా.. బుధవారం తాడేపల్లి సీఎం క్యాంపు కార్యాలయానికి వచ్చారు. అసమ్మతి నేతలను కట్టడి చేయాలని ప్రభుత్వ పెద్దలను కోరారని వైసీపీ వర్గాలు చెబుతున్నాయి. ఇంకోవైపు.. బుధవారం కొందరు నేతలు తాడేపల్లికి వచ్చారు. వీరిలో తెనాలి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్, మంత్రులు అంబటి రాంబాబు, బొత్స సత్యనారాయణ, ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, నరసరావుపేట ఎంపీ అభ్యర్థి పి.అనిల్‌కుమార్ యాదవ్, తోట త్రిమూర్తులు, కొడాలి నాని, అదీప్ రాజ్ ఉన్నారు.

కొణిజేడు ఇనుప ఖనిజం

జిందాల్‌కే..

(మొదటి పేజీ తరువాయి)



సంస్థ (ఏపీఎండీసీ) గుట్టుగా ఉంచింది. త్వరలో జేవీ (జాయింట్ వెంచర్) పార్టనర్‌గా జిందాల్ గ్రూప్‌తో ఏపీఎండీసీ లిఖితపూర్వక ఒప్పందం కుదుర్చుకోనుంది. అయితే, ఈ టెండర్ జిందాల్‌కే ఇవ్వనున్నారని సరిగ్గా 18 రోజుల క్రితమే 'ఆంధ్రజ్యోతి' చెప్పింది. భాగస్వామిగా ఉండే ప్రైవేటు కంపెనీకి ఊహించని లబ్ధి చేకూర్చేందుకే ప్రైవేటు వాటా 89శాతం ఖరారు చేశారని, ఇది జిందాల్ కోసమే సిద్ధం చేసిన టెండర్‌లా ఉందని ఫిబ్రవరి 25న 'ఆంధ్రజ్యోతి' వార్తను ప్రచురించింది. 'ఆంధ్రజ్యోతి' అబద్ధాలు రాస్తోందని, టెండర్‌కు ముందే ఫలానా కంపెనీకి ఇవ్వబోతున్నారని హేతుబద్ధత లేకుండా రాస్తున్నారని ప్రభుత్వవర్గాలు బురదచల్లే ప్రయత్నం చేశాయి. కానీ చివరకు 'ఆంధ్రజ్యోతి' చెప్పిందే నిజమైంది. జిందాల్ కంపెనీయే ప్రభుత్వం నిర్దేశించిన జేవీ రేసులో నిలిచింది.

ఇదీ ప్రాజెక్టు....

ప్రకాశం జిల్లా కొణిజేడులోని మర్లపాడు ప్రాంతంలో 1,307 ఎకరాల్లో ఐరన్ ఓర్ నిక్షేపాలు ఉన్నాయి. ఖనిజాభివృద్ధి సంస్థ నేరుగా మైనింగ్ చేయలేదు కాబట్టి ప్రైవేటు భాగస్వామిని ఎంపిక చేసి దానికే తవ్వకం, ప్రాసెసింగ్(బెనిఫికేషన్) ప్లాంటు ఏర్పాటు, అమ్మకం బాధ్యతలు అప్పగించాలనుకుంది. దీనికోసం ప్రైవేటు సంస్థతో కలిసి జాయింట్ వెంచర్ కంపెనీ ఏర్పాటుచేయనుంది. అంటే రెండు కలిపి ఓ సంస్థను రిజిస్టర్ చేసి దాని పేరిట మైనింగ్ చేస్తాయి. భాగస్వామి ఎంపిక కోసం గత నెల 22న ఎండీసీ టెండర్ నోటిఫికేషన్ ఇచ్చింది. విశ్వసనీయ సమాచారం ప్రకారం, రెండు కంపెనీలే బిడ్డింగ్‌లో పాల్గొన్నాయి. అందులో జిందాల్ గ్రూప్ 'జేఎస్‌డబ్ల్యూనే ఏ1 బిడ్డర్‌గా నిలిచింది. దానికే టెండర్ కట్టబెట్టారు. అయితే, జిందాల్ ఎంత ధర కోట్ చేసింది, బిడ్ వేసిన మరో కంపెనీ ఏమిటన్న వివరాలను సర్కారు రహస్యంగా ఉంచింది. ఇక్కడి ముడిఖనిజంలో ఎక్కువగా అయస్కాంత ఆధారిత విలువ ఉంది. దాన్ని తవ్వితీసి, ప్రాసెస్ చేసి హైగ్రేడ్ ముడి ఇనుముగా మార్చాలి. ఈ బాధ్యత జేవీ భాగస్వామిగా జిందాల్ గ్రూప్ చేయనుంది. కాంట్రాక్టు పరిధిలో ఐదు మిలియన్ టన్నుల ఖనిజం తవ్వితీయాల్సి ఉంటుంది. ఏటా 1.5 లక్షల టన్నుల ఐరన్‌ఓర్ బెనిఫికేషన్ ప్లాంటును నిర్వహించాలి.

జిందాల్‌కు పెద్దపీట...

ముడి ఇనుప ఖనిజం నిక్షేపాలు ఏపీఎండీసీ పేరిట ఉన్నాయి. ఆ సంస్థ వ్యాపారం చేయాలనుకుంటే తన లాభం చూసుకోవాలి. ఇదే విధానమని ఎంఎండీఆర్ చట్టం-1956 చెబుతోంది. ఎండీసీ మైనింగ్ చేయలేకపోయినా, ప్రైవేటు కంపెనీతో జాయింట్ వెంచర్ కంపెనీ ఏర్పాటు చేయాలనుకున్నా ఎండీసీకి 75 శాతం మేర వాటా ఉండాలని ఆ చట్టం చెబుతోంది. అంటే, ప్రభుత్వ ప్రయోజనాలే పరమావధిగా ఆ చట్టం ఉంది. ప్రైవేటు కంపెనీలకు అయాచిత లబ్ధి చేకూర్చడంలో జగన్ సర్కారు అతి ఉత్సాహంగా ఉంది. మరి కొద్దిరోజుల్లో ఎన్నికల కోడ్ రాబోతుందనగా హడావుడిగా టెండర్ పిలిచి జిందాల్‌కే కాంట్రాక్టు కట్టబెట్టాలని భావించింది. ఆ డాక్యుమెంట్‌ను, ఆ తర్వాతి పరిణామాలను పరిశీలిస్తే అర్థమవుతున్నది ఇదే. గనుల లీజులున్న ఎండీసీకి 11 శాతం వాటా, ప్రైవేటు సంస్థకు 89 శాతా వాటా ఉండేలా జాయింట్ వెంచర్ ప్లాన్‌ను సిద్ధం చే శారంటేనే దీని వెనుక ఉన్న గోల్‌మాల్ కుట్ర స్పష్టమవుతోంది. నిజానికి ఎంఎండీఆర్ చట్టం-1956 ప్రకారం జాయింట్ వెంచర్ విధానంలో ఏపీఎండీసీకి 75 శాతంపైనే వాటా ఉండాలి. అదీ కుదరకపోతే 50 శాతం వాటా అయినా ఉండాలి. గతంలో వైఎస్. రాజశేఖర రెడ్డి హయాంలో తొలి సారి కాంట్రాక్టు ఒప్పందం కుదిరినపుడు ఏపీఎండీసీకి 51 శాతం వాటా నిర్ధారించారు. ఎండీసీ వాటాను తక్కువ చేశారంటూ అప్పట్లోనే తీవ్ర విమర్శలు వచ్చాయి. ఇప్పుడు ఆయన తనయుడు జగన్‌రెడ్డి పాలనలో ఏపీఎండీసీకి 11 శాతం వాటా చాలని టెండర్ రూల్స్‌ను తయారు చేశారు. నిజానికి ఈ టెండర్ నోటిఫికేషన్ ఇవ్వడానికి కొద్దిరోజుల ముందే కొణిజేడు ఐరన్‌ఓర్ జేవీగా జిందాల్ రాబోతుందని గనుల శాఖ వర్గాల్లో ప్రచారం జరిగింది నిప్పులేనిదే పొగరాదు కదా... ఇప్పుడు అదే నిజమైంది. టెండర్లలో జిందాల్‌యే తొలిస్థానంలో నిలిచి బిడ్ దక్కించుకుంది. తను 11 శాతం వాటాతో నష్టపోయిన ఫర్వాలేదుకానీ టెండర్ దక్కించుకునే సంస్థ ఎట్టిపరిస్థితుల్లోనూ లాభాల్లో దూసుకెళ్లాలని జగన్ సర్కారు భావించింది. గనుల శాఖ ఆచరించింది.

లాభం అంతా జిందాల్‌కే..

ప్రస్తుతం మార్కెట్‌లో 58-60 నాణ్యత ఉన్న టన్ను ఐరన్ ఓర్ ధర రూ.4,083 ఉంటే, అందులో 11శాతం వాటాగా ఎండీసీకి రూ. 449.13 దక్కనుంది. జిందాల్‌కు 89 శాతం వాటాగా రూ. 3633.87 వెళ్లనుంది. ఇలా చూస్తే, కొణిజేడులో వెలికితీసే ఐదు మిలియన్ టన్నుల (50 లక్షల టన్నుల)కు గాను 11 శాతం కింద ఎండీసీకి దక్కేది 224.56 కోట్లు. జిందాల్‌కు 89 శాతం వాటా కింద వెళ్లేది ఎంతో తెలుసా? 1,816.93 కోట్ల పైనే. ఇది 2003 నాటి ధరల ప్రకారం గనుల శాఖ రూపొందించిన అంచనా మాత్రమే. కానీ ఏటేటా పెరిగే ధరల వల్ల జిందాల్ వాటా ప్రకారం వచ్చే లాభాలు కూడా భారీగానే ఉంటాయి. జిందాల్‌కు వేలకోట్ల లాభాలు తెచ్చిపెట్టేలా ఈ టెండర్‌ను డిజైన్ చేసిన పెద్దమనిషి, ప్రభుత్వ ప్రయోజనాలను పాతరవేశారని స్పష్టమవుతోంది. ముఖ్యమంత్రి జగన్ ప్రమేయం, భాగస్వామ్యం లేకుండా అధికారుల స్థాయిలో ఇంతపెద్ద నిర్ణయాలు తీసుకుంటారా? ఇది అయ్యేపనేనా? అని సీనియర్ అధికారులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

దుర్గమ్మకు కానుకగా బంగారు చైన్

వన్‌టౌన్, మార్చి 13: కనకదుర్గమ్మ అలంకరణ నిమిత్తం బుధవారం హైదరాబాద్‌కు చెందిన భాష్యం ప్రవీణ్, లావణ్య దంపతులు 35 గ్రాముల బంగారు చైన్, మంగళసూత్రాలను కానుకగా సమర్పించారు. ఏఈవో రమేష్‌బాబు ద్వారా ఈ కానుకను అందజేశారు. అమ్మవారి దర్శనానంతరం ప్రసాదం, శేషవస్త్రం, ఆశీస్సులు అందజేశారు.

నిత్యాన్నదానానికి విరాళం

అనకాపల్లి పెరుమాళ్ల వీధికి చెందిన శ్రీనాధు శ్రీనివాసరావు దంపతులు బుధవారం ఆలయ కమిటీ ప్రత్యేక ఆహ్వానితుడు జక్కిరెడ్డి ప్రభాకరరెడ్డి ద్వారా రూ 1,01,002 విరాళం అందజేశారు. అమ్మవారి దర్శనానంతరం ప్రసాదం, శేషవస్త్రం, ఆశీస్సులు అందజేశారు.

దుర్గమ్మను దర్శించుకున్న శివస్వామి

ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మను తాళ్లాయపాలెం శైవక్షేత్రం పీఠాధిపతి శివస్వామి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ మర్యాదలు అందజేసి అమ్మవారి దర్శనానంతరం ఆయనకు ప్రసాదం శేషవస్త్రం, ఆశీస్సులు అందజేశారు.



కమిటీ సభ్యుల సమావేశంలో మాట్లాడుతున్న బుద్దా వెంకన్న, చిత్రంలో నాగుల్‌మీరా

పార్టీ అధిష్ఠానం నిర్ణయాలను అమలు చేయాలి

● టీడీపీ ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న.

వన్‌టౌన్, మార్చి 13: టీడీపీ అధిష్టానం నిర్ణయాలను అమలు చేయాలని పశ్చిమ నియోజకవర్గంలోని 16 డివిజన్లకు నియమితులైన అధ్యక్షులకు టీడీపీ ఉత్తరాంధ్ర ఇన్‌చార్జి, పార్టీ ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న. బీసీ మైనార్టీ నేత, టీడీపీ అధికార ప్రతినిధి నాగుల్‌మీరా సూచించారు. మరో ఆరు డివిజన్ల పాత అధ్యక్షులు బుధవారం బుద్దా వెంకన్నతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారిద్దరు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో విజయవాడ పశ్చిమ అభ్యర్థిని, ఎంపీ అభ్యర్థి కేశినేని శివనాథ్ (చిన్ని)ని భారీ మెజార్టీతో గెలిపించేందుకు కృషి చేయాలన్నారు. అధిష్ఠానం ఆదేశాల మేరకు పార్టీ పటిష్టతకు కృషి చేయాలన్నారు.



టీఎన్‌టీయూసీ కరపత్రాన్ని ఆవిష్కరించిన కేశినేని శివనాథ్ (చిన్ని), చిత్రంలో గొట్టిముక్కల రఘురామరాజు, తదితరులు

కార్మికద్రోహి జగన్‌రెడ్డిని ఇంటికి పంపాలి

● టీడీపీ సీనియర్ నేత కేశినేని శివనాథ్

విద్యాధరపురం, మార్చి 13: కార్మికద్రోహి జగన్‌రెడ్డిని కార్మికులంతా కలిసి రానున్న ఎన్నికల్లో ఇంటికి సాగనంపాలని టీడీపీ సీనియర్ నేత, కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. బుధవారం గురునానక్ కాలనీలోని ఎన్టీఆర్ భవన్‌లో జరిగిన సమావేశంలో కార్మిక బాంధవుడు చంద్రబాబునాయుడు-కార్మిక ద్రోహి జగన్ పేరిట టీఎన్‌టీయూసీ ప్రచురించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగన్ రెడ్డి చేసిన నమ్మక ద్రోహాన్ని తిప్పికొట్టేందుకు కార్మికులంతా ఏకం కావాలన్నారు. చంద్రబాబు సీఎంగా ఉండగా కార్మికులందరికీ చేతినిండా పని ఉండేదన్నారు. ఉచిత ఇసుక విధానం వల్ల పనులు ఎక్కువగా ఉండేవన్నారు. జగన్ రెడ్డి వచ్చాక ఉపాధి రంగం దెబ్బతిందన్నారు. గొట్టిముక్కల రఘురామరాజు, నూతక్కి రాము, మాధవ్, లింగంపల్లి మోహనరావు, డి రమేష్, పెద్దిరాజు, పాల కేశవ, ఎన్ వెంకటేశ్వర్లు, కే సైదులు పాల్గొన్నారు.



ధర్నాలో పాల్గొన్న కాంట్రాక్టు నర్సులు

కాంట్రాక్టు నర్సులను రెగ్యులర్ చేయండి

● బహుజన ఎంప్లాయిస్ ఫెడరేషన్ అధ్యక్షుడు జగదీష్

ధర్నాచౌక్, మార్చి 13: రాజ్యాంగంలో పొందుపరచినట్టు సమాన పని కి సమాన వేతనం అందించాలని బహుజన ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నూతలపాటి జగదీష్ డిమాండ్ చేశారు. తమ సమస్యల పరిష్కారానికి ఏపీ నర్సెస్ స్ట్రగుల్ కమిటీ ఆధ్వర్యంలో కాంట్రాక్టు నర్సులు స్థానిక ధర్నాచౌక్‌లో బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ దీక్షలో పాల్గొని సంఘీభావం తెలిపిన జగదీష్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా పనిచేస్తున్న (డీఎంఈ, ఏపీవీవీపీ, డీపీహెచ్, ఎన్‌హెచ్‌ఎం) కాంట్రాక్టు స్టాఫ్ నర్సులను తక్షణమే రెగ్యులర్ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పలువురు నర్సులు మాట్లాడుతూ ప్రైవేట్ ఆసుపత్రిలో పనిచేస్తున్న స్టాఫ్ నర్సులకున్న ఉద్యోగ భద్రత తమకు లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కొవిడ్ సమయంలో ప్రాణాలు పణంగా పెట్టి సేవలందించామని ఫ్రంట్‌లైన్ వారియర్స్ అంటూ తమపై పూలు చల్లి వదిలేశారన్నారు. వేతనాలు మాత్రం చెల్లించటం లేదని వాపోయారు. కమిటీ రాష్ట్ర కో-ఆర్డినేటర్లు స్వచ్ఛంద ప్రసాద్, వేద, వినోద్, చిన్నారి, దయామణి, కోటి, వాసుతో పాటు అధిక సంఖ్యలో నర్సులు పాల్గొన్నారు.

బ్యానర్ల గొడవతో టవర్ ఎక్కిన జనసేన కార్యకర్త

● గంటసేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం



టవర్ ఎక్కి నిరసన తెలుపుతున్న కోటేశ్వరరావు

మొగల్రాజపురం/గుణదల, మార్చి 13: జనసేన ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని కడుతున్న బ్యానర్ల విషయంలో రేగిన గొడవకు నిరసనగా హైటెన్షన్ విద్యుత్ టవర్ ఎక్కి జనసేన కార్యకర్త కోటేశ్వరరావు నిరసనకు దిగాడు. మంగళవారం రాత్రి 6వ డివిజన్ రావిచెట్టు సెంటర్‌లో జనసేన బ్యానర్లు, జెండాలు కట్టే విషయంలో స్థానికంగా ఉండే వైసీపీ కార్యకర్తకు కోటేశ్వరరావుకు మాటామాట పెరిగి గొడవకు దారితీసింది. తరువాత కొందరు వైసీపీ కుర్రాళ్లు కోటేశ్వరరావు ఇంటిపైకి వెళ్లి ఇంట్లోవాళ్లను దుర్భాషలాడుతూ గొడవకు దిగారు. దీంతో బుధవారం ఉదయం కోటేశ్వరరావు 7వ డివిజన్ పరిధిలో మధురానగర్ ప్రవీణ్ కార్డియాక్ సెంటర్ వద్ద ఉన్న విద్యుత్ స్తంభం ఎక్కి నిరసన తెలిపాడు. పేదలకు పట్టాలు, టిడ్కో ఇళ్లు వెంటనే కేటాయించాలని ప్లకార్డులు పట్టుకున్నాడు. మాచవరం పోలీసులు ఘటనాస్థలానికి వచ్చి కోటేశ్వరరావును అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. వైసీపీ నేతలు కూడా స్టేషన్‌కు వెళ్లారు. దీంతో ఇరువర్గాల నుంచి జరిగింది తెలుసుకుని బైండోవర్ చేసి పంపించారు.

బీజేపీకి 370కి పైగా సీట్లు రావాలి

● దుర్గమ్మను కోరుతూ విజయశంఖారావం ● దుర్గగుడి నుంచి యాత్ర ప్రారంభించిన తాళ్లాయపాలెం శివస్వామి



దుర్గమ్మను దర్శించుకుని యాత్రను ప్రారంభిస్తున్న తాళ్లాయపాలెం శివస్వామి

వన్‌టౌన్, మార్చి 13: వచ్చే ఎన్నికల్లో బీజేపీకి 370కి పైగా లోక్‌సభ సీట్లు రావాలని కోరుతూ విజయశంఖారావం యాత్ర చేస్తున్నట్టు తాళ్లాయపాలెం శివస్వామి చెప్పారు. దుధవారం దుర్గమ్మ దర్శనం చేసుకుని యాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో దేవాలయాలకు పూర్వవైభవం రావాలంటే బీజేపీతో కూడిన ఉమ్మడి శక్తి అధికారంలోకి రావాలన్నారు. అయోధ్యలో బాల రాముని ప్రతిష్ఠాపన తరువాత హిందువులందరూ ఏకతాటిపై ఉన్నామని లోకానికి చాటి చెప్పామన్నారు. 2014, 2019లో మాదిరే కేంద్రంలో బీజేపీకి అఖండ మెజారిటీ ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. మొదటి దశలో బుధవారం దుర్గమ్మను, మంగళగిరిలో లక్ష్మీనరసింహస్వామి, అమరావతిలో అమరలింగేశ్వరస్వామిని దర్శించుకుని వినతులు సమర్పిస్తామన్నారు. రాష్ట్రంలో రూ.5వేలిస్తేనేగాని ఆలయాల్లో దేవుడి వద్దకు వెళ్లలేని పరిస్థితి ఉందని రూ. 10 వేలిస్తేనేగాని వెంకన్న దర్శనం లభించని పరిస్థితి ఉందని విమర్శించారు. రాజధాని అమరావతి నిర్మాణం జరగాలని, పారిశ్రామికంగా రాష్ట్రం ఎదగాలని కోరారు. రాష్ట్రంలో మద్యం ఏరులై పారుతోందని, 200 కొండలపై శిలువలను ఏర్పాటు చేశారన్నారు. 25వేల చర్చిలు ప్రారంభమయ్యాయన్నారు. ప్రస్తుత ప్రభుత్వం మత రాజ్యంగా, మత ప్రభుత్వంగా ముందుకు వెళ్లిందన్నారు. హిందువుల మనోభావాలను గౌరవించే ప్రభుత్వం రావాలని బీజేపీ-టీడీపీ-జనసేన కూటమి ప్రభుత్వం సమన్యాయం పాటిస్తుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. కూటమిలోని అభ్యర్థులందరూ గెలవాలని కోరుతూ విజయశంఖారావం పూరిస్తున్నామన్నారు. ఒక ప్రశ్నకు సమాధానంగా అమ్మదయ ఉంటే అన్నీ ఉన్నట్లేనని, దేశ ప్రయోజనాలకు, దేశ పరిరక్షణ కోసం రాజకీయ వారధిపై ప్రయాణించేందుకు తాను సిద్ధమేనన్నారు. బీజేపీకి తాను మద్దతిఇస్తానన్నారు.

4 గంటల్లోనే స్నాచర్‌ను పట్టుకున్న పోలీసులు

సత్యనారాయణపురం, మార్చి 13: రాత్రి సమయం, తెల్లవారుజామున ఒంటరిగా బయటకు వచ్చే మహిళల నగల విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని డీసీపీ హరికృష్ణ అన్నారు. సత్యనారాయణపురం పోలీసు స్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగిన చైన్ స్నాచింగ్ వివరాలను తెలిపారు. సత్యనారాయణపురం శివరావువీధిలో నివసించే పోలూరి దుర్గాభవానీ (53) మంగళవారం రాత్రి టిఫిన్ తెచ్చుకునేందుకు బయటికి వెళ్లి వచ్చింది. తీరా ఇంటి లోపలికి అడుగు పెడుతుండగా వెనక నుంచి గుర్తు తెలియని వ్యక్తి వచ్చి మెడలోని 18గ్రాముల బంగారపు నాంతాడు తెంచుకుని పారిపోయాడు. తేరుకొని అరిచేలోపే సమీపంలో పార్కు చేసి ఉన్న ఆటోలో పారిపోయాడు. వెంటనే ఆమె సత్యనారాయణపురం పోలీసులకు ఫిర్యాదు చేసింది. డీసీపీ హరికృష్ణ, నార్త్ ఏసీపీ డి.ప్రసాద్ పర్యవేక్షణలో సీఐ వెంకటనారాయణ బృందాలుగా ఏర్పడి నిందితుడి కోసం గాలించారు. న్యూఆర్‌ఆర్ పేటకు చెందిన బెజ్జం చందు దొంగిలించిన నాంతాడుతో కాశేశ్వరరావు మార్కెట్‌లో ఉన్నాడని సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి వెళ్లి అతడిని అదుపులోకి తీసుకొని తమస్టైల్‌లో విచారించగా స్నాచింగ్ చేసింది అతడేనని తేలింది. పోలీసులు అతడి నుంచి నాంతాడును స్వాధీనం చేసుకున్నారు. చోరీ జరిగిన 4 గంటల్లోనే నిందితుడిని పట్టుకుని, ఆటోను స్వాధీనం చేసుకున్న సత్యనారాయణపురం సీఐ, సిబ్బందిని సీపీ కాంతిరాణా, డీసీపీ హరికృష్ణ అభినందించారు. నార్త్ ఏసీపీ డి. ప్రసాద్, సీఐ వెంకట నారాయణ పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే దేశభక్తి అలవర్చుకోవాలి

వన్‌టౌన్, మార్చి 13: విద్యార్థి దశ నుంచే దేశభక్తిని అలవర్చుకోవాలని ఎస్‌కేపీవీవీ హిందూ హైస్కూల్ కార్యదర్శి కేఎల్‌వీ మోహనరావు అన్నారు. హిందూ హైస్కూల్ 8వ ఆంధ్ర వింగ్ ఎన్‌సీసీ వింగ్ 70వ వసంతంలోకి అడుగు పెడుతున్న దృష్ట్యా బుధవారం వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన తొలుత ప్రధానోపాధ్యాయుడు కంచర్ల శ్రీనివాసరావు, సహాయ ప్రధానోపాధ్యాయుడు శ్రీరామ్ ఇందిరతో కలిసి ఎన్‌సీసీ విద్యార్థుల మార్చ్‌ఫాస్ట్‌ను తిలకించి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ 1957లో ఎన్‌సీసీ అమలులోకి వచ్చినా హిందూ హైస్కూల్‌లో అంతకుముందు ఏడేళ్ల ముందు నుంచి అంటే 1950లోనే ఆవిర్భవించిందని, బహూశ దేశంలోనే తమ హైస్కూల్ ఎన్‌సీసీని ప్రవేశపెట్టిన మొదటిదయి ఉండొచ్చన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు చిత్రించిన ఫొటోలను 27మంది ఉపాధ్యాయులకు జ్ఞాపికలుగా అందజేశారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఎన్‌సీసీ ప్రథమ అధికారి బ్రహ్మేశ్వరరావు నిర్వహించగా, వ్యాఖ్యాతగా తెలుగు ఉపాధ్యాయుడు డాక్టర్ ఎస్ వెంకటేశ్వరరావు వ్యవహరించారు. ఉపాధ్యాయుల ప్రతినిధి చిట్టా రాజశేఖర్, జే అనందకుమార్, కే శ్రీనివాస్, జి పురుషోత్తం, యూ వెంకటేశ్వరరావు, ఎం సువర్ణకుమార్, డీడీకే రంగమణి, వి అరుణకుమారి, కే కృష్ణ పాల్గొన్నారు.



ఎన్‌సీసీ విద్యార్థుల మార్చ్ ఫాస్ట్

కారు ఢీకొని వ్యక్తి మృతి

జి.కొండూరు, మార్చి 13: మరో అరగంటలో ఇంటికెళ్లి కుటుంబంతో గడుపుదాం అనుకుంటున్న ఆవ్యక్తిని కారు రూపంలో వచ్చిన మృత్యువు కబళించి వేసింది. ఇబ్రహీంపట్నం-చత్తీష్‌గఢ్ జాతీయ రహదారిపై బుధవారం కుంటముక్కల సమీపంలో ఈ ఘటన జరిగింది. ఎ.కొండూరు మండలం రామచంద్రాపురం గ్రామానికి చెందిన తుళ్లూరి వెంకటేశ్వరరావు (55) కొన్ని రోజులుగా కుంటముక్కల సమీపంలో జాతీయ రహదారి పక్కన తాటి ముంజలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈక్రమంలో బుధవారం సాయంత్రం తాటి ముంజలు అమ్మకొని తిరిగి ఇంటికి మోటారు బైక్‌పై వెళ్లేందుకు సిద్ధ పడుతుండగా మైలవరం నుంచి విజయవాడ వైపు వెళుతున్న ఒక కారు అతివేగంగా రాంగ్ రూట్‌లో వచ్చి బైక్‌ను ఢీ కొట్టింది. దీంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు.

సమాజానికి సరైన మార్గనిర్దేనం చేయాలి

● రచయిత డాక్టర్ దోనేపూడి

విజయవాడ కల్చరల్, మార్చి 13: ఆధునిక పోకడలతో పరుగులు తీస్తున్న సమాజానికి సరైన మార్గనిర్దేశనం చేయటం సాహిత్యకారుల, రచయితల బాధ్యతని రచయిత డాక్టర్ దోనేపూడి రామంజనేయ శర్మ హితవు పలికారు. ఆంధ్ర లయోలా కళాశాలలో తెలుగు సాహిత్యం సామాజిక స్పృహ అనే అంశంపై బుధవారం జాతీయ సదస్సు నిర్వహించారు. కళాశాల సీనియర్ తెలుగు అధ్యాపకులు ఆచార్య ఆర్ రవీంద్రబోస్ అధ్యక్షుడిగా వ్యవహరించారు. ప్రిన్సిపల్ ఫాదర్ డాక్టర్ జీఏ పీ కిషోర్ ఎస్‌జే మాట్లాడుతూ సాహిత్యం ద్వారా సమాజంలో నిద్రాణమై ఉన్న చైతన్యాన్ని జాగృతం చేయాలని సభ్యులను, విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. అనంతరం డాక్టర్ టి.జాన్‌కిరణ్‌బాబు, ఆచార్య డాక్టర్ గుమ్మా సాంబశివరావు మాట్లాడారు. అనేకమంది పరిశోధన విద్యార్థులు రాష్ట్రం నలుమూలల నుంచి వి విధ విద్యాసంస్థలకు చెందిన ఆచార్యులు, ఉపాధ్యాయులు దాదాపుగా 53 పరిశోధన పత్రాలను సమర్పించారు. కళాశాల తెలుగు విభాగాధిపతి డాక్టర్ కోలా శేఖ ర్, తెలుగు శాఖ సీనియర్ అధ్యాపకులు డాక్టర్ డి.కృపారావు, సంస్కృతాధ్యాపకులు బి.వెంకటేశ్వరరావు, హిందీ అధ్యాపకురాలు స్నేహల విమల్ శుక్లా పాల్గొన్నారు.

మొల్లమాంబ జీవితం స్ఫూర్తిదాయకం: కలెక్టర్

కృష్ణలంక, మార్చి 13: తెలుగు కవయిత్రి ఆతుకూరి మొల్లమాంబ (మొల్ల) తెలుగు సాహిత్యానికి చేసిన సేవలు, సాహిత్య విలువలు విశిష్టమైనవని కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. 16వ శతాబ్దపు తెలుగు కవయిత్రి మొల్లమాంబ జయంతి సందర్భంగా బుధవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని ఆమె చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా తెలుగు సాహిత్య రంగానికి మొల్లమాంబ చేసిన సేవలు, తేట తెలుగు పద్య కావ్యం మొల్ల రామాయణం, ఆమె వర్ణనా మాధుర్యం స్మరించుకొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మొల్లమాంబ జయంతిని అధికారికంగా నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ పేర్కొన్నారు. కేఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, ఇన్‌చార్జి బీసీ సంక్షేమ అధికారి కిరణ్మయి, బీసీ సంక్షేమ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణం, జీవవైవిధ్య పరిరక్షణ మన బాధ్యత



సేవ్ స్పారో ఆర్ట్ కాంటెస్ట్ పోస్టరును ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు

కృష్ణలంక: పర్యావరణం, జీవవైవిధ్య పరిరక్షణ మనందరి బాధ్యతని జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. నగరానికి చెందిన చిత్రకారుడు స్ఫూర్తి శ్రీనివాస్ 'పిచ్చుకను చేసుకొందామా మచ్చిక' అనే నినాదంతో ఫోరం ఫర్ ఆర్టిస్ట్స్ జాషువా సాంస్కృతిక వేదిక సంస్థల సహకారంతో జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్న సేవ్ స్పారో ఆర్ట్ కాంటెస్ట్ పోస్టర్‌ను కలెక్టర్ ఢిల్లీరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పిచ్చుకల మనుగడకు కొన్నేళ్లుగా స్ఫూర్తి శ్రీనివాస్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. బర్డ్ హౌస్‌లు ఏర్పాటు, ఆర్ట్ కాంటెస్ట్, ప్రదర్శనలతో అవగాహన సదస్సులు నిర్వహించడం మంచి పరిణామమన్నారు. మార్చి 20న ప్రపంచ పిచ్చుకల దినోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న ఈ సేవ్ స్పారో నేషనల్ లెవల్ ఆర్ట్ కాంటెస్ట్‌లో విద్యార్థులు, చిత్రకారులు పాల్గొనాలన్నారు. జాషువా సాంస్కృతిక వేదిక ప్రధాన కార్యదర్శి గుండు నారాయణరావు, ఫోరం ఫర్ ఆర్టిస్ట్ ఉమెన్ వింగ్ ఇన్‌చార్జి సంధ్యారాణి, వర్కింగ్ కమిటీ మెంబర్ శ్రావణ్‌కుమార్, బృంద సభ్యులు లక్ష్మీ ప్రియాంక, చందు పాల్గొన్నారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి వరప్రసాద్

● ప్రముఖ సినీ రచయిత బుర్ర సాయి మాధవ్



సుప్రీంకోర్టు న్యాయవాది వరప్రసాద్‌ను స్వర్ణకంకణంతో సత్కరిస్తున్న రమా సత్యనారాయణ, బుర్ర సాయిమాధవ్, ఏపీ రమణ తదితరులు

విజయవాడ కల్చరల్, మార్చి 13: సుప్రీం కోర్టు న్యాయవాదిగా పనిచేస్తున్న డాక్టర్ జీవీఎస్‌ఆర్ ఎస్‌ఎస్ వరప్రసాద్ బహుముఖ ప్రజ్ఞాశాలి అని ప్రముఖ సినీ రచయిత బుర్ర సాయి మాధవ్ అన్నారు. మహానటి సావిత్రి కళాపీఠం ఆధ్వర్యంలో నగరంలోని గాంధీనగర్ వెలిదండ్ల హనుమంతరాయ గ్రంథాలయంలో బుధవారం న్యాయవాది వరప్రసాద్‌కు స్వర్ణకంకణ ప్రదానం జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు.

ఆదర్శవంతమైన జీవితాన్ని గడుపుతున్న గొప్ప స్నేహశీలి, న్యాయవాది వరప్రసాద్ అన్నారు. శాతవాహన కళాశాల కరస్పాండెంట్ నిడుమోలు రమా సత్యనారాయణ మాట్లాడుతూ ఆధ్యాత్మిక రంగంలో అవధూత సంలక్షణాలు కలిగిన అరుదైన వ్యక్తి వరప్రసాద్ అన్నారు. అంబటి మధుమోహన్ కృష్ణ, మాజీ ఎస్పీ ఎన్.సత్యనారాయణ, వినియోగదారుల కమిషన్ సభ్యులు ఏపీ రమణ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కేబీ సుందర్, బిషప్ విజయభాస్కర్, సావిత్రి కళాపీఠం అధ్యక్షురాలు పరుచూరి విజయలక్ష్మి, సునీల్, బ్రాహ్మణ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కొప్పరపు బలరాం, తెనాలి ఏలూరు సత్యనారాయణ, ఎన్.బాలభాస్కర్, వెడగంగోత్రి డైరక్టర్ రాజ్యలక్ష్మిలు పాల్గొని ఆయనను ఘనంగా సత్కరించి అభినందించారు.

వచ్చే ఎన్నికల్లో సంచలనాలు సృష్టించబోతున్నాం

● జడ శ్రావణ్‌కుమార్

ధర్నాచౌక్: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో జై భీమ్ రావు భారత్ పార్టీకి కేంద్ర ఎన్నికల సంఘం 'కోటు' గుర్తును కేటాయించడంపై ఆ పార్టీ వ్యవస్థాపక అ ధ్యక్షుడు జడ శ్రావణ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. జై భీమ్ నినాదంతో ఏర్పాటైన తమ పార్టీకి అంబేడ్కర్ ఎప్పుడూ ధరించే కోటును కేటాయించడాన్ని ఆయన స్వాగతించారు. వచ్చే ఎన్నికల్లో తమ పార్టీ సంచనాలను సృష్టించబోతుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాల్లో తమ పార్టీ అభ్యర్థులు పోటీ చేస్తారన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల అభివృద్ధి, సంక్షేమమే తమ ధ్యేయమన్నారు.

గ్రూప్-1 పరీక్షను రద్దు చేయాలి

● ఏపీ నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు హేమంత్‌కుమార్

పాయకాపురం: గవర్నర్ కల్పించుకుని 2018 నో టిఫికేషన్ ప్రకారం, హైకోర్టు తీర్పును అనుసరించి గ్రూప్-1 పరీక్షను రద్దు చేయాలని ఏపీ నిరుద్యోగ జే ఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సమయం హేమంత్‌కుమార్ ఒ క ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. 169 ఉద్యోగాలకు 2019 మే 25న పెట్టిన గ్రూప్-1 ప్రాథమిక పరీక్షలో 51 అక్షర దోషాలు అనువాద దోషాలు, తప్పులున్న ట్టు హైకోర్టులో అభ్యర్థులు కేసు వేయగా, ఐదు త ప్పులను, కానీ అప్పటి పోరాటాలను పరిగణనలోకి తీసుకుని 1:50గా ఎంపిక చేశారన్నారు.ఇదే విషయ మై సుప్రీంకోర్టుకు 51 తప్పులను చూపించి కేసు వేశామన్నారు. గవర్నర్ కలుగజేసుకుని గ్రూప్-1 ప్రధాన పరీక్షను రద్దు చేయాలని హేమంత్ కోరారు.

వేరే రాష్ట్రాల్లో వైద్య చికిత్సకు అనుమతిపై హర్షం

బస్టేషన్: ఆర్టీసీ ఉద్యోగులకు చెన్నై, బెంగుళూ రు. హైదరాబాద్‌లో ఎంప్లాయీస్ హెల్త్ స్కీం కింద చికిత్స చేయించుకునేందుకు ప్రభుత్వం అనుమతివ్వడంపై ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ బుధవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేసింది. ఆయా రా ష్ట్రాల్లోనూ చికిత్సలు చేయించుకుని మెడికల్ రీ ఇం బర్స్‌మెంట్‌ను పొందే అవకాశం కల్పిస్తూ సంబంధి త విభాగపు సెక్రటరీ ఉత్తర్వులు జారీ చేశారని యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరా వు, ప్రధాన కార్యదర్శి జీవీ నర్సయ్య తెలిపారు. రవా ణా శాఖ సెక్రటరీ ప్రద్యుమ్న, ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావుకు అభినందనలు తెలిపారు. ఏపీజేఏసీ అమరావతి ద్వారా ఈయూ రాష్ట్ర కమిటీ చేసిన కృషి మేరకు ఈ ఉత్తర్వులు వచ్చాయన్నారు.

కుసుమ ధర్మన్న జయంతిని అధికారికంగా జరపాలి

విజయవాడ కల్చరల్: ఆంధ్ర ఆది మహాసభ అధ్యక్షుడు, మాకొద్దీ నల్లదొరతనమంటూ నినదించిన తొలి అంబేద్కరిస్టు కవి కుసుల ధర్మన్న సాహిత్యాన్ని, ఆయన ఆశయాల్ని ముందుతరాలకు అం దించాల్సిన అవసరం మనపై ఉందని నవభారత నిర్మాణ సంఘం వ్యవస్థాపక చైర్మన్ సూరేపల్లి రవికుమార్ అన్నారు. గాంధీనగర్‌లోని ఆ సంస్థ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల స మావేశంలో ఆయన మాట్లాడుతూ మార్చి 17న రా ష్ట్రప్రభుత్వం కుసుమ ధర్మన్న జయంతిని అధికారికంగా జరపాలన్నారు. కుసుమ ధర్మన్న పేరుతో ప్ర భుత్వం సాహిత్య కళాపీఠం స్థాపించి, రాజమండ్రి దేవీచౌక్‌లో గానీ పుష్కరఘాట్ వద్ద గానీ కుసుమ ధర్మన్న విగ్రహం ఏర్పాటు చేయాలని కోరారు. ప్రతి వర్సిటీ తెలుగు శాఖలో కుసుమ ధర్మన్న స్మారక ఉ పన్యాసాలు ఏర్పాటు చేయాలన్నారు. కుసుమ ధర్మ న్న తొలి పురస్కార గ్రహీత కలిమిశ్రీ, ఆశిష్ ఫౌండేషన్ చైర్మన్ సత్యస్వాతి, నవ్యాంధ్ర రచయితల సం ఘం కోశాధికారి చొప్పా రాఘవేంద్రశేఖర్ పాల్గొన్నారు.

మహిళా ఉద్యోగుల క్రీడలు ప్రారంభం: విద్యాసాగర్



ధర్నాచౌక్: నిరంతరం పని ఒత్తిడితో సతమతమయ్యే మహిళా ఉద్యోగుల్లో మానసిక చైతన్యం నింపేందుకు క్రీడలు ఎంతో దోహదపడతాయని ఏ పీ ఎన్జీవో జిల్లా అధ్యక్షుడు ఏ విద్యాసాగర్ తెలిపా రు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా గాంధీనగర్‌లోని ఎన్జీవో హోంలో మహిళలకు రెండు రోజుల పాటు నిర్వహించే క్రీడలను ఆయన బుధవా రం ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ రా ష్ట్ర, జిల్లా స్థాయిలో నిర్వహించే ఆందోళనల్లో మహి ళా ఉద్యోగుల పాత్ర కీలకమన్నారు. వీరికి ఈ పోటీలు ఒక పండుగ లాంటిదన్నారు. సంఘం మహిళా విభాగం చైర్ పర్సన్ వి. నిర్మలా కుమారి మాట్లాడు తూ క్షేత్రస్థాయిలో ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుకు కృషి చేస్తున్న మహిళా ఉద్యోగుల సమస్యల ను పరిష్కరించాలన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన మెమరీ గేమ్స్, క్యారమ్స్, చదరంగం, అంత్యాక్షరి పోటీల్లో మహిళా ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొన్నా రు. నేతలు నాగభూషణం, సూర్యానారాయణరెడ్డి, ఎన్.రత్నమాల, పి.మాధవి, వీవీ.లలితాంబ పాల్గొన్నారు.

కోర్టు ఆవరణలో కుప్పకూలి మహిళ మృతి

● కోడలు పెట్టిన కేసులో విచారణకు హాజరయ్యేందుకు వచ్చిన విజయలక్ష్మి

వన్‌టౌన్: కోడలు పెట్టిన కేసులో విచారణను ఎదుర్కొంటూ బుధవారం వాయిదాకు హాజరైన పం చకర్ల విజయలక్ష్మి (70) కోర్టు ఆవరణలోని బల్లపై కూర్చుని అక్కడే కుప్పకూలి ప్రాణాలు కోల్పోయింది, కుమారుడు పంచకర్ల రామగణపతి ఫిర్యాదు మేరకు సూర్యారావుపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కస్తూరిబాయిపేట రామనాథం వీధికి చెందిన రామగణపతి 91వ వార్డు వలంటీరుగా పనిచేస్తున్నాడు. తండ్రి 12ఏళ్ల క్రితం మృతి చెందాడు. 2019లో మాచవరానికి చెందిన కూరాకుల సౌందర్యతో రామగణపతికి వివాహమైం ది. 6 నెలలు బాగానే ఉన్నారు. తరువాత ఆమె భర్త రామగణపతి, తల్లితో గొడవపడి కాపురం చేయనం టూ పుట్టింటికి వెళ్లిపోయింది. ఎన్నిసార్లు పిలిచినా రాలేదు. 2022లో సూర్యారావుపేట పోలీసుస్టేషన్‌లో భర్త, అత్త, భర్త అన్న, వదిన, భర్త సోదరిపై 498ఏ, 364 కింద కేసుపెట్టింది. ఈక్రమంలో బుధవారం అందరూ వాయిదాలకు హాజరు కాగా, కోర్టు ఆవరణలో మెట్లు ఎక్కలేక జయలక్ష్మి కింద బల్లపై కూర్చుని కొంచెంసేపటికే కుప్పకూలింది. 108 అంబులెన్స్‌వారు ఆమెను పరీక్షించి చనిపోయినట్టు తెలిపారు.

టికెట్ల అమ్మకంతో 1,000 కోట్ల వసూలు

» అవినీతి సొమ్ముతో ప్రజాస్వామ్యం ఖూనీ: అచ్చెన్న

అమరావతి, మార్చి 13(ఆంధ్రజ్యోతి): అవినీతి సొమ్ముతో జగన్ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయాలని చూస్తున్నారని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు బుధవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. సజ్జల చీకటి మాఫియాను మల్లెల రాజేశ్ వెలుగులోకి తెచ్చారన్నారు. సజ్జల అభ్యర్థుల నుంచి సుమారు రూ.1,000 కోట్లు వసూలు చేశారన్నారు. రాబోయే ఎన్నికల్లో జగన్‌కు ఓటమి ఖాయమని టికెట్ల దుకాణానికి తెరలేపారని, సీట్లు అమ్ముకుంటూ వెనకేసుకుంటున్నారని విమర్శించారు. సజ్జల లాంటి బ్రోకర్లను పెట్టుకుని జగన్ రూ. కోట్లు వసూలు చేస్తున్నారని, కమీషన్లు, పైరవీలు, సెటిల్‌మెంట్లుకు ఆయన కేరాఫ్ అడ్రస్సుగా మారారన్నారు.

గ్రూప్-1పై హైకోర్టు తీర్పు చెంపపెట్టు: టీడీపీ

అమరావతి, మార్చి 13(ఆంధ్రజ్యోతి): గ్రూప్-1 మెయిన్స్ పరీక్షపై హైకోర్టు తీర్పు ప్రభుత్వానికి చెంపపెట్టు అని టీడీపీ ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు అన్నారు. సంప్రదాయకంగా అనుసరిస్తున్న మాన్యువల్ మూల్యాంకనాన్ని కాదని డిజిటల్ మూల్యాంకనం చేశారన్నారు. మొదటిసారి మూల్యాంకనం చేసిన ఫలితాలను తొక్కిపెట్టి రెండోసారి మూల్యాంకనం చేసి తమకు కావాల్సిన వారిని ఎంపిక చేశారని ఆరోపించారు.

విష్ణు అభ్యంతరం వెనుక జగన్మాయ: రఘురామ

న్యూఢిల్లీ, మార్చి 13(ఆంధ్రజ్యోతి): 'నాకు నరసాపురం టికెట్ ఇవ్వవద్దని రాయలసీమకు చెందిన విష్ణువర్ధన్‌రెడ్డి అభ్యంతరం చెప్పడం వెనుక జగన్మాయ ఉంది. టీడీపీ కూటమి ఏర్పాటుతో వచ్చే ఎన్నికల్లో ఏపీ సీఎం జగన్మోహన్ రెడ్డి కలలు కల్లలవుతాయి' అని ఎంపీ రఘురామకృష్ణరాజు అన్నారు. ఓడిపోతాననే భయంతో బీజేపీతో టీడీపీ పొత్తును విచ్ఛిన్నం చేసేందుకు జగన్ విశ్వప్రయత్నాలు చేశారని విమర్శించారు. బుధవారం రచ్చబండ కార్యక్రమంలో మాట్లాడారు. 'వైసీపీ సర్వనాశమయ్యేవరకూ నిద్రపోను. 70 రోజుల్లో వైసీపీ ఫినిష్ కావడం ఖాయం' అని రఘురామ అన్నారు.

మళ్లీ మోదీ వస్తే.. మనుస్మృతి అమలు: రామకృష్ణ

గుంటూరు(తూర్పు), మార్చి 13: 'మరోసారి మోదీ అధికారంలోకి వస్తే అంబేడ్కర్ రాజ్యాంగాన్ని పక్కన పెట్టి దేశంలో మనుస్మృతిని ప్రవేశపెడతారు' అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ అన్నారు. గుంటూరు కొత్తపేటలోని ఆ పార్టీ కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... 'కేంద్రం తీసుకువచ్చిన సీఏఏ చట్టం బీజేపీ కుట్రలో భాగమే. మతాల మధ్య చిచ్చుపెట్టే ఈచట్టాన్ని ఉపసంహరించుకోవాలి' అని డిమాండ్ చేశారు.

పన్నుల భారాన్ని జనాలకు వివరించాలి: సీపీఎం

విశాఖపట్నం, మార్చి 13(ఆంధ్రజ్యోతి): 'సంక్షేమ పథకాల ద్వారా వైసీపీ ప్రభుత్వం ప్రజలకు ఎంత పంచిందో సీఎం జగన్మోహన్‌రెడ్డి చెబుతున్నారు. చెత్త పన్ను విధింపు, కరెంట్, ఆర్టీసీ చార్జీల పెంపు, ఆస్తి పన్ను పెంపు రూపంలో ఎంత భారం మోపారనేది ప్రజలకు కార్యకర్తలు వివరించాలి' అని సీపీ ఎం పిలుపునిచ్చింది. బుధవారం ఆ పార్టీ ఈమేరకు ఓ ప్రకటన చేసింది.

ఎన్టీఆర్‌కు భారతరత్న ప్రకటించాలి: కేఏ పాల్

విజయవాడ, మార్చి 13: మాజీ ప్రధాని పి.వి.నరసింహారావుకు భారతరత్న అవార్డు ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం స్వర్గీయ నందమూరి తారకరామారావుకు ఇవ్వకపోవడం దారుణమని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కె.ఎ.పాల్ విమర్శించారు. ఎన్టీఆర్‌కి, పీవీ నరసింహారావుకు భారతరత్న ఇవ్వాలని గత కొంత కాలంగా తాను పోరాటం చేస్తున్నానని తెలిపారు.

పోలీసు ఫిర్యాదుల కార్యాలయం ప్రారంభం

విజయవాడ, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : కృష్ణా జిల్లా పెనమలూరు మండలం కానూరులో రాష్ట్ర పోలీసు ఫిర్యాదుల ప్రాధికార సంస్థ కార్యాలయాన్ని బుధవారం ప్రారంభించారు. దీనికి చైర్‌పర్సన్‌గా హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ జె.ఉమాదేవి వ్యవహరిస్తారు. సభ్యులుగా మాజీ ఐపీఎస్ అధికారి బత్తిన శ్రీనివాసులు, మాజీ ఐఏఎస్ అధికారిణి బి.ఉదయలక్ష్మి, మాజీ ఐపీఎస్ అధికారి కేవీవీ గోపాలరావు వ్యవహరిస్తారు. దీంతోపాటు జిల్లాల్లోనూ పోలీసు ఫిర్యాదుల ప్రాధికార సంస్థ కార్యాలయాలు ప్రారంభమయ్యాయి.

బాలికలపై అత్యాచారం కేసు.. ముద్దాయికి యావజ్జీవం

విశాఖపట్నం/నాతవరం, మార్చి 13(ఆంధ్రజ్యోతి): బాలికలపై అత్యాచారం కేసులో నేరం రుజువుకావడంతో ముద్దాయికి యావజ్జీవ కారాగార శిక్షతో పాటు రూ.12 వేలు జరిమానా విధిస్తూ విశాఖ పోక్సో కోర్టు బుధవారం తీర్పు చెప్పింది. జరిమానా చెల్లించని పక్షంలో మరో మూడు నెలలు సాధారణ జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని పేర్కొంది. అనకాపల్లి జిల్లా నాతవరం గ్రామానికి చెందిన యర్రా సూరిబాబు అలియాస్ గూని సూరిబాబు(48).. 2013 ఫిబ్రవరి ఆరో తేదీన చాక్లెట్లు ఇస్తానని ఆశ చూపించి ముగ్గురు బాలికలను మేడపైకి తీసుకువెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు. ఒక బాలిక జరిగిన విషయాన్ని తల్లికి చెప్పడంతో నాతవరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నిందితుడికి శిక్ష పడేలా ఎస్ఐ పి.రమేష్, వాదనలు వినిపించిన అడిషనల్ పీపీ కరణం కృష్ణ, సకాలంలో సాక్షులను కోర్టులో హాజరుపరిచిన పోలీసులు, మానిటరింగ్ సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు.

రబీ జొన్న, మొక్కజొన్న కొనుగోలు ప్రారంభం

అమరావతి, మార్చి 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 2023-24 రబీ జొన్న, మొక్కజొన్నలను మే 31 వరకు కొనుగోలు చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. జొన్నల కొనుగోలు బుధవారం నుంచి ప్రారంభించగా, మొక్కజొన్న గురువారం నుంచి ప్రారంభిస్తున్నట్లు తెలిపింది. మొక్కజొన్న క్వింటా రూ.2,090 చొప్పున 85వేల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేస్తామని ప్రకటించింది. ప్రజల అవసరాలకు వాడే జొన్నలు క్వింటా రూ.3,180, పరిశ్రమలకు వాడే జొన్నలు రూ.2,090 చొప్పున మద్దతు ధర ఇచ్చి కొనుగోలు చేస్తామని తెలిపింది. ఈ-క్రాప్‌లో నమోదైన రైతులు ఆర్బీకేలను సంప్రదించి, పీఏసీఎస్‌లు, ఎఫ్‌పీవోలు, డ్వాక్రా సంఘాలకు విక్రయించాల్సి ఉంటుంది. ఆధార్ అనుసంధానంతో సీఎంయాప్ ద్వారా చెల్లింపులు జరుపుతామని ప్రభుత్వం పేర్కొంది.

సీఎం సభతో ప్రైవేటు స్కూళ్లకు సెలవు

తాడిపత్రి టౌన్, మార్చి 13: నంద్యాల జిల్లా బనగానపల్లిలో సీఎం జగన్ సభ నిర్వహిస్తున్న నేపథ్యంలో అనంతపురం జిల్లా తాడిపత్రి పట్టణంలోని ప్రైవేట్ పాఠశాలలకు విద్యాశాఖ అధికారులు గురువారం సెలవు ప్రకటించారు. సీఎం సభకు జనాలను తరలించడానికి ప్రైవేట్ పాఠశాలల బస్సులను వాడుతున్నారు. ఈ కారణంగా ప్రైవేటు పాఠశాలలకు సెలవు ప్రకటించారు. నాలుగు రోజుల్లో పదో తరగతి పరీక్షలు మొదలవుతున్నాయి. ఇలాంటి సమయంలో పాఠశాలలకు సెలవు ప్రకటించడం ఏమిటని తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలు మాత్రం యథావిధిగా పనిచేస్తాయని అధికారులు తెలిపారు.

ఎన్ఐఏ అదుపులో 'రామేశ్వరం' అనుమానితుడు

బళ్లారి, మార్చి 13(ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాజధాని బెంగళూరులోని రామేశ్వరం కేఫ్‌లో ఇటీవల జరిగిన పేలుళ్ల కేసులో షబ్బీర్ అనే అనుమానితుడిని ఎన్ఐఏ అధికారులు బళ్లారిలో బుధవారం అదుపులోకి తీసుకున్నారు. షబ్బీర్ బళ్లారి జిల్లాలోని ఒక ప్రైవేటు కంపెనీలో ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. రామేశ్వరం కేఫ్‌లో పేలుళ్ల ఘటనకు పాల్పడిన వ్యక్తికి ఇతను సాయం చేశాడని ఎన్ఐఏ అనుమానిస్తోంది. ఈ కేసుతో సంబంధం ఉన్న మరో ఇద్దరు వ్యక్తులు బళ్లారి నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు షబ్బీర్ సహకరించాడని ఎన్ఐఏ అధికారులు అనుమానిస్తున్నారు. పేలుళ్లకు పాల్పడిన వ్యక్తుల ఫోన్ల నుంచి షబ్బీర్‌కు కాల్స్ వచ్చాయని ఎన్ఐఏ అధికారుల విచారణలో వెలుగుచూసింది.

20 వేల నుంచి 20 లక్షల కేడెట్లకు ఎన్‌సీసీ

న్యూఢిల్లీ, మార్చి 13: ప్రపంచంలోనే అతిపెద్ద యూనిఫామ్డ్ యూత్ ఆర్గనైజేషన్‌గా నేషనల్ కేడెట్ కార్ప్స్(ఎన్‌సీసీ) అవతరించింది. 1948లో ఎన్‌సీసీలో 20 వేల మంది కేడెట్లు మాత్రమే ఉండగా ప్రస్తుతం వీరి సంఖ్య 20 లక్షలకు పెరిగింది. తాజాగా 3 లక్షల మంది కేడెట్లతో ఎన్‌సీసీ విస్తరణ ప్రతిపాదనలకు కేంద్ర రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఆమోదం తెలిపారు. దేశవ్యాప్తంగా విద్యాసంస్థల నుంచి ఎన్‌సీసీకి పెరుగుతున్న డిమాండ్‌ను తీర్చడానికి ఈ విస్తరణ తోడ్పడుతుందని రక్షణశాఖ తెలిపింది.

హరియాణాలో విశ్వాస పరీక్ష నెగ్గిన సైనీ సర్కార్

చండీగఢ్, మార్చి 13: హరియాణాలో కొత్తగా ఏర్పాటైన నాయబ్ సింగ్ సైనీ ప్రభుత్వం బుధవారం ఆ రాష్ట్ర అసెంబ్లీలో విశ్వాస పరీక్ష నెగ్గింది. జన నాయక్ జనతా పార్టీ తన 10 మంది శాసనసభ్యులను విశ్వాస పరీక్షకు దూరంగా ఉండాల్సిందిగా విప్ జారీ చేసింది. హరియాణా అసెంబ్లీలో 90 మంది ఎమ్మెల్యేలకు గాను బీజేపీకి 41 మంది ఎమ్మెల్యేలు ఉండగా ఏడుగురు స్వతంత్ర ఎమ్మెల్యేల్లో ఆరుగురి మద్దతు ఆ పార్టీకి ఉంది. వీరితోపాటు హరియాణా లోఖిత్ పార్టీకి చెందిన ఏకైక ఎమ్మెల్యే గోపాల్ మద్దతు కూడా బీజేపీకే ఉంది. హరియాణా మాజీ సీఎం మనోహర్‌లాల్ తన శాసన సభ్యత్వానికి బుధవారం రాజీనామా చేశారు.

అలల వంతెన డిజైన్ కొత్తగా..

హై డెన్సిటీ బ్లాకులు.. ముంబై నుంచి నిపుణులు



అలల వంతెన నిర్మాణానికి తెప్పించిన కొత్త బ్లాకులు

విశాఖపట్నం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): విశాఖ నగరంలోని రామకృష్ణా బీచ్‌లో ఏర్పాటు చేసిన ఫ్లోటింగ్ బ్రిడ్జి అలల తాకిడికి తట్టుకోలేక ముక్కలు ముక్కలుగా విడిపోతోంది. దీంతో దీని డిజైన్‌ను మార్చాలని అధికారులు నిర్ణయించారు. దీనికోసం ముంబై నుంచి నిపుణులను రప్పించారు. వీఎంఆర్‌డీఏ ఇంజనీరింగ్ అధికారులతో కలిసి వారు కొన్ని కొత్త డిజైన్లు రూపొందించారు. వాటిలో ఒక దాన్ని ఎంపిక చేసి ఆ ప్రకారం మళ్లీ పునర్నిర్మిస్తున్నారు. దీనికోసం హై డెన్సిటీ పాలీఎథిలీన్ (హెచ్‌డీపీఈ) బ్లాకులను తెప్పించారు. పాత బ్లాకులు ధృడంగా లేవని వీఎంఆర్‌డీఏ కమిషనర్ భావించడంతో దాని కంటే నాణ్యమైనవి తెప్పించారు. అలలు వచ్చేటప్పుడు వాటి ఒత్తిడిని తట్టుకునే సామర్థ్యం హై డెన్సిటీ పాలీఎథిలీన్ బ్లాకులకు ఉంటుందని అధికారులు చెబుతున్నారు. అదేవిధంగా ఫ్లోటింగ్ బ్రిడ్జిపై రెండు వైపులా (కుడి, ఎడమ) చిన్న చిన్న స్తంభాలతో రెయిలింగ్ ఏర్పాటుచేసిన సంగతి తెలిసిందే. అలలు ఉవ్వెత్తున వచ్చినప్పుడు బ్రిడ్జిపై ఉన్నవారు తూలి పడిపోతున్నందున మధ్యలో కూడా మరో వరుస స్తంభాలు పెట్టాలని నిర్ణయించారు. ఫ్లోటింగ్ బ్రిడ్జిని యాంకర్లతో నిలబెట్టి.. అవి గట్టిగా పట్టుకొని ఉన్నాయా..? లేదా..? అని స్కూబా డైవర్లను కిందికి పంపించి పరీక్ష చేయించారు. వీటన్నింటినీ వీడియో తీయించారు. కొత్త బ్లాకులతో రూపొందించిన బ్రిడ్జిని పౌర్ణమి సమయంలో రెండు, మూడు రోజులు పరీక్షించి, పటిష్ఠంగా ఉందని నిర్ధారించుకున్నాకే పర్యాటకులకు అందుబాటులోకి తేవాలని భావిస్తున్నారు. కేరళ తదితర ప్రాంతాల్లో ఈ ఫ్లోటింగ్ బ్రిడ్జిలు బాగానే నడుస్తున్నాయని, అందుకే ఇక్కడ ప్రయత్నం చేస్తున్నామని అధికారులు చెబుతున్నారు.

డ్రాగన్ దూకుడుకు చెక్!

సరిహద్దులో రూ.16 వేల కోట్లతో వ్యూహాత్మక హైవే

» 1,748 కి.మీ నిర్మించనున్న భారత్

» సరిహద్దులో 663 గ్రామాల ఏర్పాటుకు భారత్ ప్రణాళిక

న్యూఢిల్లీ, బీజింగ్, మార్చి 13: అరుణాచల్ ప్రదేశ్‌లో చైనా సరిహద్దు వెంబడి 1,748 కిలోమీటర్ల మేర వ్యూహాత్మక హైవే నిర్మాణానికి కేంద్ర రోడ్డు రవాణా మంత్రిత్వశాఖ సుమారు రూ.16 వేల కోట్లు మంజూరు చేసింది. అలాగే, భారత్-టిబెట్-చైనా-మయన్మార్ సరిహద్దుకు సుమారు 20 కిలోమీటర్ల దూరంలోని పలు ప్రాంతాలను కలుపుతూ గ్రీన్‌ఫీల్డ్ హైవే(ఎన్‌హెచ్913) నిర్మించనున్నారు. వీటి నిర్మాణంతో సరిహద్దు ప్రాంతాల అనుసంధానం మెరుగవనుందని కేంద్ర రోడ్డు రవాణా, హైవేల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ చెప్పారు. 'అరుణాచల్ ప్రదేశ్ సరిహద్దు ప్రాంతాల దిశగా జరుగుతున్న వలసలను అరికట్టడం, అలాగే పొరుగుదేశాల నుంచి వలసవచ్చేవారిని తిప్పి పంపడం తప్పనిసరి' అన్నారు. అరుణాచల్‌ప్రదేశ్‌లోని పలు నదీ పరీవాహక ప్రాంతాల అనుసంధానంతో పాటు, పలు జలవిద్యుత్ ప్రాజెక్టుల నిర్మాణానికి ఈ రోడ్లు దోహదపడనున్నాయని చెప్పారు. ఆమోదం పొందిన రోడ్డు నిర్మాణాలకు ప్రభుత్వ హైవే సంస్థలు త్వరలో బిడ్‌ల ప్రక్రియ నిర్వహించి ఈ ఏడాది జూలై, ఆగస్టు నాటికి పనులు ప్రారంభిస్తాయని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. కాగా, సరిహద్దు ప్రాంతాల్లో సైనిక బలగాలను భారీగా మోహరించే పనులను చైనా కొనసాగిస్తుండటం వల్ల భారత్-చైనా మధ్య ఉద్రిక్తతలు మరింత పెరగనున్నాయని అమెరికా ఇంటెలిజెన్స్ నివేదిక హెచ్చరించింది. చైనా కమ్యూనిస్టు పార్టీ లక్ష్యాలకు అనుగుణంగా ప్రపంచవ్యాప్తంగా కోవర్టు కార్యక్రమాలను డ్రాగన్ విస్తరిస్తోందని అమెరికా వార్షిక ముప్పు అంచనా నివేదిక-2024 తెలిపింది. డైరెక్టర్ ఆఫ్ నేషనల్ ఇంటెలిజెన్స్(డీఎన్ఐ) ఈ నివేదికను విడుదల చేసింది. ఇది భారత్, చైనా మధ్య సాయుధ పోరుకు దారితీసే అవకాశం ఉందని తెలిపింది. వాస్తవాధీన రేఖ వెంబడి క్సియాఓకాంగ్ గ్రామంలో సైనిక మోహరింపులను చైనా పెంచేస్తోందని ఆ నివేదిక తెలిపింది. అయితే, అరుణాచల్ ప్రదేశ్‌లో ఇటీవల ప్రారంభించిన సేలా సొరంగమార్గానికి కేవలం 3 కిలోమీటర్ల దూరంలో భారత్‌కూ అలాంటి రక్షణ గ్రామం ఉందని ఉపగ్రహ చిత్రాల ఆధారంగా అమెరికా గుర్తించింది. ఈ ప్రాంతంలో భారత్ కూడా మిలటరీ కార్యక్రమాలను బలోపేతం చేస్తోంది. దీంతోపాటు సైనిక దళాలను తక్షణమే అవసరమైన ప్రాంతానికి తరలించేలా సరిహద్దులో మౌలిక సదుపాయాల కల్పన పనులను భారత్ వేగవంతం చేసింది. అందులో భాగంగానే సరిహద్దు రహదారి సంస్థ(బీఆర్‌వో) 13 వేలకిలోమీటర్ల ఎత్తులో రూ.825 కోట్లతో సేలా సొరంగ మార్గాన్ని నిర్మించింది. కాగా, 2019 నుంచి సరిహద్దు వెంబడి సైనిక గ్రామాలను చైనా విస్తరిస్తోంది. తాజా నివేదిక ప్రకారం సరిహద్దు వెంబడి క్సియాఓకాంగ్ లాంటి 628 సైనిక గ్రామాలను చైనా ఏర్పాటుచేసింది. వీటిలో మొత్తం 2,41,835 మంది నివసిస్తున్నారు. దీనికి కౌంటర్‌గా సరిహద్దులో 663 గ్రామాలను ఏర్పాటు చేయాలని భారత్ ప్రణాళికలు రూపొందిస్తోంది. పైలట్ ప్రాజెక్టుగా 17 గ్రామాలను ఎంపిక చేశారు. కాగా, ఈనెల 9న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అరుణాచల్‌ప్రదేశ్‌లో పర్యటించడాన్ని చైనా తీవ్రంగా ఖండించింది. సేలా సొరంగ మార్గంతో పాటు, పలు అభివృద్ధి ప్రాజెక్టులను ఆ సందర్భంగా మోదీ ప్రారంభించారు. భారత్ చేస్తున్న ఇలాంటి చర్యలు సరిహద్దులో పరిస్థితిని మరింత సంక్లిష్టం చేస్తాయని చైనా విదేశాంగశాఖ అధికార ప్రతినిధి వాంగ్ వెన్‌బిన్ పేర్కొన్నారు. 'చైనాలోని జాంగ్‌నాన్ ప్రాంతాన్ని ఏకపక్షంగా అభివృద్ధి చేసే అధికారం భారత్‌కు లేదు' అన్నారు. అరుణాచల్‌ప్రదేశ్‌ను జాంగ్‌నాన్ అని చైనా పిలుస్తుంది. కాగా, చైనా వాదనను భారత్ తీవ్రంగా తప్పుబట్టింది. అరుణాచల్ ప్రదేశ్ భారత అంతర్గత భాగమని విదేశాంగశాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ తేల్చిచెప్పారు. దేశంలోని ఇతర ప్రాంతాల్లో పర్యటించినట్టే అరుణాచల్ ప్రదేశ్‌లోనూ ఎప్పుడైనా పర్యటించే అధికారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ఉందని నొక్కి చెప్పారు.



సరిహద్దు అంశమే సర్వం కాదు: చైనా

భారత్-చైనా సరిహద్దు అంశం ఇరుదేశాల మొత్తం ద్వైపాక్షిక సంబంధాలను ప్రతిబింబించబోదని చైనా బుధవారం వ్యాఖ్యానించింది. ఇరుదేశాల మధ్య అభిప్రాయ బేధాలను తొలగించుకునేందుకు, పరస్పర విశ్వాసాన్ని పెంపొందించుకొనే చర్యలకు పిలుపునిచ్చింది. అయితే, సరిహద్దు ప్రాంతాల్లో శాంతి నెలకొనే వరకూ చైనాతో తమ సంబంధాలు సాధారణ స్థితికి చేరబోవని భారత్ స్పష్టం చేసింది. సరిహద్దు వెంబడి బలగాలను మోహరించడం ఇరుదేశాలకూ ప్రయోజనకరం కాదని భారత విదేశాంగశాఖ మంత్రి ఎస్.జైశంకర్ సోమవారం చేసిన వ్యాఖ్యలపై చైనా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి వాంగ్ వెన్‌బిన్ తాజాగా స్పందించారు. సరిహద్దు సమస్యను ద్వైపాక్షిక అంశాల్లో సముచితంగా ఉంచాలన్నారు.

ఫైబర్‌నెట్ కేసులో..

అజయ్ జైన్‌ను నిందితుడిగా చేర్చాలన్న పిల్ కొట్టివేత

» ప్రత్యామ్నాయ మార్గాలను ఆశ్రయించాలని పిటిషనర్‌కు హైకోర్టు సూచన

అమరావతి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ఫైబర్‌నెట్ ప్రాజెక్ట్ వ్యవహారంలో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినట్లు మేజిస్ట్రేట్ ముందు సీనియర్ ఐఏఎస్ అధికారి అజయ్ జైన్ వాంగ్మూలం ఇచ్చినందున.. ఈ కేసులో ఆయన్ను నిందితుడిగా చేర్చాలంటూ దాఖలైన పిల్‌ను హైకోర్టు కొట్టివేసింది. కేసు దర్యాప్తు కొనసాగుతుండగా ఫలానా వ్యక్తిని నిందితుడిగా చేర్చాలని సీఐడీకి తామెలా ఆదేశాలు ఇవ్వగలమని ప్రశ్నించింది. మేజిస్ట్రేట్ వద్ద ప్రస్తావించేందుకు ప్రత్యామ్నాయం ఉండగా హైకోర్టుకు రావడాన్ని ఆక్షేపించింది. ప్రత్యామ్నాయ మార్గాలను ఆశ్రయించాలని పిటిషనర్‌కు సూచించింది. పిల్‌ను కొట్టివేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ ఆర్.రఘునందనరావుతో కూడిన ధర్మాసనం బుధవారం ఆదేశాలిచ్చింది. ఫైబర్‌నెట్ ప్రాజెక్టు వ్యవహారంలో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినట్లు నాటి ఇంధన శాఖ కార్యదర్శి అజయ్ జైన్ 2021 డిసెంబరు 10. మేజిస్ట్రేట్ ముందు వాంగ్మూలం ఇచ్చారని.. అందుచేత ఈ కేసులో ఆయన్ను కూడా నిందితుడిగా చేర్చేలా సీఐడీని ఆదేశించాలని కోరుతూ ఏపీ టుమారో ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నల్లమోతు చక్రవర్తి ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. ఇది బుధవారం విచారణకు రాగా పిటిషనర్ తరఫున న్యాయవాది ఎంఆర్‌కే చక్రవర్తి వాదనలు వినిపించారు. ఈ వ్యవహారంలో ప్రజాధనం ఇమిడి ఉన్నందున పిల్ దాఖలు చేశామన్నారు. ప్రజాధనం దుర్వినియోగం అయినట్లు మేజిస్ట్రేట్ ముందు వాంగ్మూలం ఇచ్చినందున నిర్ణయాల్లో భాగస్వామి అయిన అజయ్ జైన్‌ను నిందితుడిగా చేర్చాలని కోరామని తెలిపారు. మేజిస్ట్రేట్ వద్ద ప్రస్తావించేందుకు ప్రత్యామ్నాయం ఉండగా హైకోర్టులో పిటిషన్ ఎలా దాఖలు చేస్తారని ధర్మాసనం ప్రశ్నించింది. పిటిషనర్‌గా ట్రస్ట్‌ను పేర్కొంటూ వ్యాజ్యంలో వ్యక్తికి సంబంధించిన వివరాలు పేర్కొనడంపై అభ్యంతరం తెలిపింది. ప్రత్యామ్నాయ మార్గాలను ఆశ్రయించాలని సూచిస్తూ పిల్‌ను కొట్టివేసింది.

లేట్‌నైట్ పార్టీలో ముడుపుల కానుక!?

» ఆర్‌డబ్ల్యూఎస్‌లో 19 మంది డీఈఈలకు ఈఈలుగా పదోన్నతులు

» రూ.3 కోట్ల మేర ఉన్నతాధికారికి నజరానా?

» ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన వీడియోలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

గ్రామీణ నీటి సరఫరా విభాగం (ఆర్‌డబ్ల్యూఎస్)లో ఇంజనీర్ల పదోన్నతులకు సంబంధించి భారీ ఎత్తున అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సంస్థలో పనిచేస్తున్న 19 మంది డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ల(డీఈఈ)కు పదోన్నతులు కల్పించటం మాటున రూ.3 కోట్ల ముడుపుల బేరం నడిచిందన్న చెప్పుకొంటున్నారు. ఈ నేపథ్యంలోనే.. విజయవాడలో బందరు రోడ్డులోగల లెమన్ ట్రీ హోటల్‌లో రెండు రోజుల క్రితం అత్యంత రహస్యంగా నిర్వహించిన లేట్ నైట్ పార్టీ అసలు గుట్టును బయటపెట్టింది. మందు, విందుతో కూడిన ఖరీదైన ఈ పార్టీలో ఈఎన్‌సీ కార్యాలయ ఉన్నతాధికారి ఒకరు ఈఈలతో కలిసి చీర్స్ కొట్టగా, ఇదే సందర్భంగా ఈఈలంతా కలిసి రూ.3 కోట్ల ముడుపులను సదరు ఉన్నతాధికారికి నజరానాగా సమర్పించుకున్నట్లు తెలుస్తోంది. అధికార పార్టీ రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులంతా ఎన్నికల హడావుడిలో ఉండగా, తొలిసారిగా రాజకీయ నాయకులతో సంబంధం లేకుండా ఉన్నతాధికారులే పదోన్నతుల పేరుతో మామూళ్లు వసూలు చేసుకున్నట్లు చెప్పుకొంటున్నారు.

ఇలా సాగింది!.. దాదాపుగా 33 మంది డీఈఈల పదోన్నతులకు సంబంధించి ముందుగా ఫైల్‌ను సిద్ధం చేశారు. ఆరోపణలు ఉన్న వారికి, వివిధ కేసులున్న వారిని పక్కన పెట్టి.. 19 మందికే పదోన్నతులను ఖరారు చేశారు. ఇందులో అనర్హులకైతే పదోన్నతలు ఇవ్వలేదు కానీ, వారు కోరుకున్న చోట పోస్టింగ్‌లు ఇచ్చేశారు. పదోన్నతులు ఇచ్చినందున సదరు శాఖ ఉన్నతాధికారిని ఘనంగా సన్మానించుకోవటానికి లెమన్ ట్రీ హోటల్‌ను ఎంచుకుని, రెండు రోజుల కిందట అత్యంత రహస్యంగా లేట్ నైట్ పార్టీ నిర్వహించారు. ఈ పార్టీకి ఎంపిక చేసిన వారిని మాత్రమే అనుమతించారు. అయితే, దీనికి సంబంధించిన వీడియోలు రెండు రోజుల తర్వాత బయటపడి ఆర్‌డబ్ల్యూఎస్ వర్గాల్లో వైరల్ అవ్వడంతో ముడుపుల వ్యవహారం వెలుగులోకి వచ్చింది. లెమన్ ట్రీ హోటల్‌కు ఈఈలతో పాటు, ఈఎన్‌సీ కార్యాలయ ఉన్నతాధికారి ఒకరు రావటం హోటల్ సీసీ ఫుటేజీలో నిక్షిప్తమైంది. కనుక, పార్టీ చేసుకోలేదన్న వాదనలు తీసుకురావటానికి ఆస్కారం లేకుండా పోయింది. ఆర్‌డబ్ల్యూఎస్‌లో ప్రిన్సిపల్ సెక్రటరీగా బుడితి రాజశేఖర్ ఉన్నంతకాలం ఇలాంటి అడ్డగోలు వ్యవహారాలకు ఆస్కారం ఉండేది కాదన్న వాదన ఉంది. ప్రస్తుతం ఆయన ఈ శాఖలో లేకపోవటంతో మళ్లీ ఈఎన్‌సీ కార్యాలయ ఉన్నతాధికారులు అవినీతి జూలు విదిల్చారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కాగా, ఈ లేట్ నైట్ పార్టీపై విచారణ జరిపించాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు.

ప్రత్తిపాటి శరత్ కస్టడీకి అవసరం లేదు

అమరావతి, మార్చి 13(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ ఎగవేత, బోగస్ ఇన్వాయిస్‌లతో నిధులు మళ్లించారని ఆరోపిస్తూ నమోదు చేసిన కేసులో మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు కుమారుడు శరత్‌ను విచారణ నిమిత్తం 10 రోజులు కస్టడీకి ఇవ్వాలని పోలీసులు/సీఐడీ వేసిన పిటిషన్‌ను విజయవాడ ఫస్ట్ అడిషనల్ చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయాధికారి తిరస్కరించిన విషయం తెలిసిందే. దానిని సవాల్ చేస్తూ సీఐడీ దాఖలు చేసిన క్రిమినల్ రివిజన్ పిటిషన్‌ను బుధవారం హైకోర్టు కొట్టివేసింది. శరత్‌ను కస్టడీకి ఇవ్వాల్సిన అవసరం లేదని అభిప్రాయపడింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ టీ మల్లికార్జునరావు ఆదేశాలిచ్చారు. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది బీ ఆదినారాయణరావు, జవ్వాజి శరత్‌చంద్ర వాదనలు వినిపించారు.

25న జూన్ నెల రూ.300 దర్శన టికెట్ల కోటా

» 18, 21 తేదీల్లో ఆర్జితసేవల కోటా విడుదల

తిరుమల, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి దర్శనానికి సంబంధించి జూన్ నెల రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటాను టీటీడీ ఈ నెల 25వ తేదీన విడుదల చేయనుంది. ఉదయం 10 గంటలకు టీటీడీ అధికారిక వెబ్‌సైట్‌లో ఈ కోటాను విడుదల చేయనున్నారు. ఇదే నెలకు సంబంధించి శ్రీవారి ఆర్జితసేవా టికెట్ల లక్కీడిప్ కోసం భక్తులు ఈ నెల 18వ తేదీ ఉదయం 10 నుంచి 20వ తేదీ ఉదయం 10 గంటల వరకు నమోదు చేసుకోవచ్చు. 22వ తేదీ మధ్యాహ్నం 12 గంటల్లోపు సేవలకు ఎంపికైన భక్తులు నగదు చెల్లించి టికెట్లు ఖరారు చేసుకోవాల్సి ఉంటుంది. 21వ తేదీ ఉదయం 10 గంటలకు శ్రీవారి ఆర్జిత సేవలైన కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవా టికెట్ల కోటాను విడుదల చేస్తారు. జూన్ 19 నుంచి 21వ తేదీ వరకు జరగనున్న జ్యేష్ఠాభిషేక ఉత్సవాల్లో పాల్గొనేందుకు మార్చి 21న ఉదయం 10 గంటలకు టికెట్లు భక్తులకు అందుబాటులో ఉంచుతారు. అదేరోజు మధ్యాహ్నం 3 గంటలకు శ్రీవారి వర్చువల్ సేవలైన కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకార సేవా టికెట్లు, దర్శన టికెట్ల కోటాను విడుదల చేస్తారు. 23 ఉదయం 10 గంటలకు అంగ ప్రదక్షిణ టోకెన్లు, ఉదయం 11 గంటలకు శ్రీవాణి ట్రస్టు దాతల దర్శనం, గదుల కోటా, మధ్యాహ్నం 3 గంటలకు వృద్ధులు, దివ్యాంగుల దర్శన టికెట్ల కోటాను విడదల చేస్తారు. మార్చి 25న మధ్యాహ్నం 3 గంటలకు తిరుమల, తిరుపతిల్లోని గదుల కోటాను విడుదల చేస్తారు. 27న ఉదయం 11 గంటలకు తిరుమల, తిరుపతిల్లోని శ్రీవారి సేవా కోటాను, అదే రోజు మధ్యాహ్నం 12 గంటలకు నవనీత సేవ కోటా, ఒంటి గంటకు పరకామణి సేవ కోటాను ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచుతారు.


రూపెనగుంట్లలో శిలా శాసనం



రూపెనగుంట్లలోని హనుమంతుని మూల విరాట్టు

» 1591లో హనుమంతుని విగ్రహ ప్రతిష్ఠ

నకరికల్లు, మార్చి 13: పల్నాడు జిల్లా నకరికల్లు మండలం రూపెనగుంట్ల గ్రామంలో పలు చారిత్రక ఆనవాళ్లను గుర్తించారు. గ్రామంలో ఉన్న హనుమంతుని విగ్రహం 1591లో ప్రతిష్ఠించినట్టు పురావస్తు పరిశోధకుడు ఈమని శివనాగిరెడ్డి తెలిపారు. భరద్వాజ గోత్రానికి చెందిన కొత్తపల్లి రాఘవయ్య కుమారుడు తిమ్మాజీ ఈ విగ్రహాన్ని ప్రతిష్ఠించినట్లు శాసనం ద్వారా తెలుస్తోందన్నారు. తిమ్మాజీ వారసులు పుత్ర పౌత్ర పర్యంతంగా పుణ్య ఫలం పొందుతారని, సూర్య చంద్రులు ఉన్నంత కాలం ఈ పూజా ఫలం వారికి దక్కుతుందని శాసనంలో ఉందని తెలిపారు. ఆనాటి హనుమంత స్వామే నేడు రూపెనగుంట్ల వీరాంజనేయ స్వామిగా భక్తులు పూజిస్తున్నారని ఈమని తెలిపారు.



ప్రతిష్ఠ సమయంలో వేసిన శాసనం

కుటుంబ వివాదం.. ముగ్గురి ఆత్మహత్యాయత్నం

» భార్య మృతి, భర్త, కుమార్తె పరిస్థితి విషమం

» గుంటూరు ప్రధాన రహదారిపై బంధువుల రాస్తారోకో

తెనాలి, మార్చి 13(ఆంధ్రజ్యోతి): ఓ కుటుంబ వివాదంలో అధికార పార్టీ నేతల జోక్యం, ఆపై బాధితులు ఫిర్యాదు చేసినా నాలుగు నెలలుగా పోలీసులు పట్టించుకోకపోవడంతో తీవ్ర మనోవేదనకు గురై ఆ కుటుంబంలోని ముగ్గురు విషపు గుళికలు తిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. వీరిలో భార్య మృతి చెందగా, భర్త, వారి కుమార్తె ఆసుపత్రిలో ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. గుంటూరు జిల్లా తెనాలిలో ఈ దారుణం జరగగా, బుధవారం ఉదయం నుంచి తెనాలి జిల్లా వైద్యశాలలో బాధితులు చికిత్సపొందుతున్నారు. అయినా, వారి నుంచి పోలీసులు కనీసం స్టేట్‌మెంట్ కూడా తీసుకోలేదంటూ బాధితుల బంధువులు తెనాలి-గుంటూరు ప్రధాన రహదారిపై బైఠాయించి రాస్తారోకో చేపట్టారు. బాధితుల బంధువు సీలం రాజ, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గుంటూరు జిల్లా తెనాలిలో నివాసముంటున్న విష్ణుమొలకల శివశంకరరావు టీ స్టాల్ నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గత ఏడాది తన ఒక్కగానొక్క కూతురిని పట్టణానికే చెందిన సత్యనారాయణ, సుధారాణి దంపతుల కుమారుడు నాగసాయిగణేష్‌కు ఇచ్చి వివాహం చేశారు. పెళ్లికి రూ.10లక్షలకు పైగా అప్పు చేశారు. ఆ అప్పులు తీరక శివశంకరరావు కుటుంబం ఓవైపు సతమతమవుతుంటే, మరోవైపు కుమార్తె భర్త, అత్తమామలు అదనపు కట్నం తేవాలంటూ ఇబ్బందులకు గురిచేశారు. దీంతో శివశంకరరావు ఆరు నెలల క్రితం పోలీస్ స్టేషన్లో కేసు పెట్టి, కుమార్తెను తమ ఇంటికి తీసుకొచ్చారు. ఆ తర్వాత ఓ మధ్యవర్తి వచ్చి మాట్లాడుకుందామని పిలిపించి.. వైసీపీకి చెందిన ఓ ప్రముఖ నాయకుడు, అతడి సోదరుడి దగ్గర పంచాయతీ పెట్టారు. ఆ సమయంలో వైసీపీ నేతల ప్రోద్బలంతో తమపై దాడిచేసి గాయపరచగా, ఫిర్యాదు చేసేందుకు స్టేషన్‌కు వెళితే పోలీసులు తమ ఫిర్యాదు తీసుకోలేదని శివశంకరరావు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న సమయంలోనూ పోలీసులు తమ కేసు నమోదు చేయలేదన్నారు. బాధితురాలి అత్తమామల వెనుక అధికార పార్టీ నేతలు ఉన్నారని, పోలీసులు పట్టించుకోకపోవడం వల్లే ఒక నిండు ప్రాణం బలైపోయిందని కన్నీటి పర్యంతమయ్యారు. కాగా, రోడ్డుపై బైఠాయించిన ఆందోళనకారుల వద్దకు పోలీసులు వచ్చి.. న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు.

కాంగ్రెస్ విశాఖ సభ మళ్లీ వాయిదా

అమరావతి, మార్చి 13(ఆంధ్రజ్యోతి): ఏపీసీసీ విశాఖలో 15న నిర్వహించతలపెట్టి బహిరంగ సభ మళ్లీ వాయిదా పడింది. ఈ బహిరంగ సభను ఈ నెల 16వ తేదీకి వాయిదా వేసినట్లుగా ఏపీసీసీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది.

23 కుక్క జాతులపై కేంద్రం నిషేధం

న్యూఢిల్లీ, మార్చి 13: పెంపుడు జంతువులను ముఖ్యంగా కుక్కలను ప్రాణప్రదంగా పెంచుకునే వారికి కేంద్రం పిడుగులాంటి వార్త చెప్పింది. పిట్‌బుల్ టెర్రీర్, అమెరికన్ బుల్‌డాగ్, రాట్‌వీలర్, మాస్టిఫ్స్, షెపర్డ్ తదితర 23 జాతుల(బ్రీడ్స్)కు చెందిన కుక్కలపై నిషేదం విధిస్తున్నట్లు తెలిపింది. వాటి దాడి వల్ల మనుషులు చనిపోతుండటంతో ఈనిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది. ఈ మేరకు అన్ని రాష్ట్రాల, కేంద్రపాలిత ప్రాంతాల చీఫ్ సెక్రటరీలకు మార్చి 12న కేంద్ర పశుసంవర్ధకశాఖ ఆదేశాలు జారీచేసింది. జాబితాలోని 23 జాతుల కుక్కల అమ్మకాలను, వృద్ధి(బ్రీడింగ్)ని నిలిపివేయాలని, కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. సదరు కుక్కలకు సంబంధించి లైసెన్సులు జారీ చేయకూడదని ఆదేశించింది.


పేటీఎం ఫాస్ట్‌ట్యాగ్‌ను మార్చుకోండి: ఎన్‌హెచ్ఏఐ

న్యూఢిల్లీ, మార్చి 13: పేటీఎం ఫాస్టట్యాగ్‌ను తక్షణమే మార్చుకోవాలని భారత జాతీయ రహదారుల సంస్థ(ఎన్‌హెచ్ఏఐ) సూచించింది. ఆర్బీఐ ఆదేశాల మేరకు పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ లిమిటెడ్ ద్వారా మార్చి 15 తరువాత నగదు లావాదేవీలను నిర్వహించలేమని.. దీంతో వినియోగదారుడు పేటీఎం ఫాస్టట్యాగ్‌ను రీచార్జ్ చేయలేడని పేర్కొంది. పేటీఎం ఫాస్టట్యాగ్‌లోని చివరి రూపాయి వరకూ వాడుకునే అవకాశం ఉందని చెప్పింది.

సూక్ష్మ లేజర్‌తో అత్యంత వేగంగా ఎలక్ట్రాన్ల ఉత్పత్తి

హైదరాబాద్, మార్చి 13: అతి సూక్ష్మ లేజర్ తీవ్రతతో అత్యంత వేగంగా ఎలక్ట్రాన్లను ఉత్పత్తి చేసే కొత్త ప్రక్రియను హైదరాబాద్‌లోని టాటా ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్(టీఐఎఫ్ఆర్‌హెచ్) శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. భారీ ఖర్చు, పెద్దగా ఏర్పాట్లు అవసరం లేకుండా కేవలం టేబుల్ మీద అమర్చ గలిగే లేజర్ పరికరంతో సూపర్ ఫాస్ట్ ఎలక్ట్రాన్లను లభివృద్ధి చేయవచ్చని ఓ ప్రకటనలో వెల్లడించారు. ఇప్పటివరకు అవసరమని భావిస్తున్న లేజర్ సామర్థ్యంలో వందోవంతు కంటే తక్కువ లేజర్ తీవ్రతతో మెగా ఎలక్ట్రాన్ ఓల్ట్ ఎలక్ట్రాన్లు ఉత్పత్తి చేయవచ్చని టీఐఎఫ్ఆర్‌హెచ్ సెంటర్ డైరెక్టర్ ఎం.కృష్ణమూర్తి తెలిపారు.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
విజయవాడ ● గురువారం 14 మార్చి 2024
diksuchi@andhrajyothy.com



ఎన్‌సీహెచ్‌ఎంసీటీలో ఎమ్మెస్సీ హాస్పిటాలిటీ అడ్మినిస్ట్రేషన్

నోయిడాలోని నేషనల్ కౌన్సిల్ ఫర్ హోటల్ మేనేజ్‌మెంట్ అండ్ క్యాటరింగ్ టెక్నాలజీ(ఎన్‌సీహెచ్‌ఎంసీటీ)- ఎమ్మెస్సీ హాస్పిటాలిటీ అడ్మినిస్ట్రేషన్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఇందులో నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. హైదరాబాద్, చెన్నై, బెంగళూరు సహా దేశవ్యాప్తంగా 17 ఐహెచ్‌ఎంలు ఉన్నాయి. డైరెక్ట్ అడ్మిషన్స్, ఎమ్మెస్సీ జేఈఈ 2024 కేటగిరీల్లో ప్రవేశాలు కల్పిస్తారు. డైరెక్ట్ అడ్మిషన్స్‌కు అకడమిక్ మెరిట్ ద్వారా ఎమ్మెస్సీ జేఈఈ అభ్యర్థులకు ఆన్‌లైన్ కౌన్సెలింగ్ ద్వారా సీట్లు అలాట్ చేస్తారు. ఆసక్తిగల అభ్యర్థులు రెండు కేటగిరీలకు అప్లయ్ చేసుకోవచ్చు. నిబంధనల ప్రకారం ప్రోగ్రామ్ పూర్తిచేసినవారికి 'జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ(జేఎన్‌యూ)' పోస్ట్ గ్రాడ్యుయేషన్ డిగ్రీని ప్రదానం చేస్తుంది.

అర్హత వివరాలు: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి హోటల్ మేనేజ్‌మెంట్‌లో డిగ్రీ లేదా ఎన్‌సీహెచ్‌ఎంసీటీ నుంచి బీఎస్సీ(హాస్పిటాలిటీ అండ్ హోటల్ అడ్మినిస్ట్రేషన్) ప్రోగ్రామ్‌ను కనీసం 55 శాతం మార్కులతో పూర్తిచేయడానికి తోడు త్రీ స్టార్ హోటళ్లలో రెండేళ్లు పనిచేసిన అనుభవం ఉన్నవారికి డైరెక్ట్ అడ్మిషన్ ఇస్తారు. కేవలం హాస్పిటాలిటీ సహా ఏదేని విభాగంలో డిగ్రీ పూర్తిచేసినవారికి ఎమ్మెస్సీ జేఈఈ 2024 ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు. ప్రస్తుతం డిగ్రీ చివరి సంవత్సర పరీక్షలు రాసేవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. వీరు 2024 అక్టోబరు 31 నాటికి మార్కుల పత్రాలు సబ్మిట్ చేయాలి. వయోపరిమితి నిబంధనలు లేవు.

ఎమ్మెస్సీ జేఈఈ వివరాలు: దీనిని సీబీటీ/ఆన్‌లైన్ మోడ్‌లో నిర్వహిస్తారు. ఈ పరీక్షలో 100 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. జనరల్ నాలెడ్జ్, జనరల్ ఇంగ్లీష్, న్యూమరికల్ ఆప్టిట్యూడ్ అంశాల నుంచి డిగ్రీ స్థాయిలో ప్రశ్నలు అడుగుతారు. అప్లికేషన్ ఆఫ్ కంప్యూటర్స్, హాస్పిటాలిటీ ఆప్టిట్యూడ్ జనరిక్, జనరల్ హోటల్ ఆపరేషన్స్, కరెంట్ అఫైర్స్/జనరల్ నాలెడ్జ్, సస్టయినబుల్ టూరిజం అండ్ ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ అంశాల నుంచి ఒక్కోదానిలో 10 ప్రశ్నలు; హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్, మార్కెటింగ్ మేనేజ్‌మెంట్, ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్, స్ట్రాటజిక్ మేనేజ్‌మెంట్, రీసెర్చ్ మెథడాలజీ, అప్రిసియేషన్ ఆఫ్ కల్చరల్ డైవర్సిటీ అంశాల నుంచి ఒక్కోదానిలో 5 ప్రశ్నలు; కమ్యూనికేషన్ స్కిల్స్ ఇన్ ఇంగ్లీష్ అండ్ న్యూమరిక్ ఆప్టిట్యూడ్ నుంచి 20 ప్రశ్నలు అడుగుతారు. ఒక్కో ప్రశ్నకు ఒక మార్కు ఉంటుంది. సమాధానాన్ని తప్పుగా గుర్తిస్తే పావు మార్కు కోత విధిస్తారు. మొత్తం మార్కులు 100. పరీక్ష సమయం రెండు గంటలు.

ముఖ్య సమాచారం

- **డైరెక్ట్ అడ్మిషన్ అభ్యర్థులకు దరఖాస్తు ఫీజు:** రూ.500
- **ఎమ్మెస్సీ జేఈఈ 2024 అభ్యర్థులకు దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.1000; జనరల్ ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.700; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.500
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** డైరెక్ట్ అడ్మిషన్స్‌కు ఏప్రిల్ 15; ఎమ్మెస్సీ జేఈఈ అభ్యర్థులకు ఏప్రిల్ 30
- **అడ్మిట్ కార్డ్‌ల డౌన్‌లోడింగ్:** మే 10 నుంచి
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రం:** హైదరాబాద్
- **ఎన్‌సీహెచ్‌ఎంసీటీ ఎమ్మెస్సీ జేఈఈ 2024 తేదీ:** మే 18
- **ఫలితాలు విడుదల:** మే 31
- **కౌన్సెలింగ్ ఫీజు:** రూ.2,000
- **వెబ్‌సైట్:** www.nchm.gov.in

NCHMCT

ఐఐటీ తిరుపతిలో సమ్మర్ ఇంటర్న్‌షిప్



తిరుపతిలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ)- సమ్మర్ ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ వ్యవధి రెండు నెలలు. ఇది మే 15 నుంచి ప్రారంభమౌతుంది. ఎంపికైన అభ్యర్థులకు ఉచిత వసతి సౌకర్యం కల్పిస్తారు.

విభాగాలు: కెమికల్ ఇంజనీరింగ్, కెమిస్ట్రీ, సివిల్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్, మేథమెటిక్స్ అండ్ స్టాటిస్టిక్స్, మెకానికల్ ఇంజనీరింగ్, ఫిజిక్స్

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి బీఈ/బీటెక్/బీఎస్సీ/ఎమ్మెస్సీ/బీఏ/ఎంఏ ప్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

స్టయిపెండ్: ప్రతి విభాగంలో మొదటి అయిదు స్థానాల్లో ఉన్న వారికి ఒక్కొక్కరికి నెలకు రూ.5,000ల స్టయిపెండ్ ఇస్తారు.

ముఖ్య సమాచారం


- దరఖాస్తు ఫీజు లేదు
- ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: మార్చి 31
- సమ్మర్ ఇంటర్న్‌షిప్ 2024: మే 15 నుంచి జూలై 14 వరకు
- ఈ-మెయిల్: research@iittp.ac.in
- వెబ్‌సైట్: www.iittp.ac.in



మీకు తెలుసా?


- ఈ పక్షిని 'ఒకినావా రైల్' అని పిలుస్తారు. తోక లేకుండా ఎర్రటి కాళ్లు, ముక్కు, పై భాగంలో బ్రౌన్ కలర్, కింద భాగంలో నలుపు ఉండే ఈ పక్షి జపాన్‌లో కనపడుతుంది. మన దగ్గర కంజు పిట్టలాంటి పక్షి ఇది అనమాట.
- ఒకినావా ఐలండ్‌లో కనిపించే పక్షి కాబట్టి దీన్ని ఇలా పిలుస్తారు. అక్కడి ప్రజలు అగతి, ఎన్‌బారు పేర్లతో పిలుస్తారు.
- 5 సెం.మీ పొడవు, 3.5 సెం.మీ వెడల్పు ఉంటుంది. ఈ పక్షి రెక్కల పొడవు 16 సెం.మీ.
- పచ్చని చెట్ల మధ్య అది కూడా నీళ్లు ఉండే ప్రాంతాల్లోనే తిరుగుతుంది. సముద్రమట్టానికి 500 మీటర్ల ఎత్తులో కూడా ఇవి జీవిస్తాయి.
- ఇవి రెండు లేదా పది పక్షులు వరకూ గుంపులుగా ఉంటాయి.
- ఇది గాల్లో ఎగరలేదు.
- ఈ పక్షులు జనావాసాలుండే చోటున కూడా ఉంటుంది. దీని వల్ల కుక్కలు, ముంగీసలతో ప్రాణాలు పోగొట్టుకుంటాయి. ఇది ఒకినోవా కల్చర్‌గా భావిస్తారు. అందుకే పక్షి ప్రేమికులు వీటి కోసం విశేషమైన కృషి చేస్తుంటారు.
- బల్లులు, నత్తలు, పురుగులు తిని బతుకుతాయివి.
- చెట్ల కొమ్మల మీద నిద్రపోతాయి. గాల్లోకి ఎగరలేవు కాబట్టి నేలమీదనే నడుస్తూ వెళ్తాయి.
- రెండు లేదా నాలుగు గుడ్లు మాత్రమే పెడతాయి. అవి ఎరుపు, పింక్ కలర్‌లో ఉంటాయి.

సరైన నీడ ఏది?



ఏవి ఎన్ని?





10 తేడాలను గుర్తించండి

దారి కనుక్కోండి



నేషనల్ లా ఇన్‌స్టిట్యూట్‌లో ఎంసీఎల్ఐఎస్ ప్రోగ్రామ్



భోపాల్‌లోని నేషనల్ లా ఇన్‌స్టిట్యూట్ యూనివర్సిటీ(ఎన్‌ఎల్ఐయూ)- మాస్టర్ ఆఫ్ సైబర్ లా అండ్ ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ(ఎంసీఎల్ఐఎస్) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ ప్రోగ్రామ్‌ని సంస్థ ఆధ్వర్యంలోని రాజీవ్‌గాంధీ నేషనల్ సైబర్ లా సెంటర్ నిర్వహిస్తోంది. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. గరిష్ఠంగా నాలుగేళ్లలో పూర్తిచేయాల్సి ఉంటుంది. ఏడాదికి రెండు చొప్పున నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. దేశవ్యాప్తంగా నిర్వహించే రిటెన్ ఎంట్రెన్స్ టెస్ట్, పర్సనల్ ఇంటర్వ్యూల ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ ఉన్నాయి.

ప్రోగ్రామ్ వివరాలు: మొదటి సెమిస్టర్‌లో రీసెర్చ్ మెథడాలజీ, సైబర్ ఎన్విరాన్‌మెంట్, సైబర్ లా, క్రిప్టోగ్రఫీ-నెట్‌వర్క్ సెక్యూరిటీ, ప్రైవసీ అండ్ యాక్సెస్ మేనేజ్‌మెంట్; రెండో సెమిస్టర్‌లో సైబర్ క్రైమ్స్, ఈ కామర్స్ సెక్యూరిటీ అండ్ లా, సైబర్ ఆపరేషన్స్ సెక్యూరిటీ, 4ఐఆర్-లా, ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ-రిస్క్ మేనేజ్‌మెంట్; మూడో సెమిస్టర్‌లో ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్ ఇన్ సైబర్ స్పేస్, మొబైల్ వైర్‌లెస్-సెక్యూరిటీ, బిజినెస్ ప్లానింగ్-ఆడిట్, సైబర్ ఫోరెన్సిక్స్ అండ్ లా, క్లౌడ్ కంప్యూటింగ్ సెక్యూరిటీ అండ్ లా కోర్సులు ఉంటాయి. చివరి సెమిస్టర్‌లో డిజర్టేషన్, ఇంటర్న్‌షిప్ ఉంటాయి.

సీట్లు: మొత్తం 66 సీట్లు ఉన్నాయి. వీటిలో జనరల్ అభ్యర్థులకు 30, ఎస్టీలకు 12, ఎస్సీలకు 10, ఓబీసీలకు 8, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 6 సీట్లు కేటాయించారు. అన్ని కేటగిరీల్లో 50 శాతం సీట్లను స్థానికులకు(మధ్యప్రదేశ్ వాసులు) ప్రత్యేకించారు. మహిళలకు 18 సీట్లు, దివ్యాంగులకు 3 సీట్లు నిర్దేశించారు. విదేశీ విద్యార్థుల కోసం అదనంగా అయిదు సీట్లు ఉన్నాయి.

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ద్వితీయ శ్రేణి మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు.


ఆలిండియా రిటెన్ ఎంట్రెన్స్ టెస్ట్: దీనిని ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. ఇందులో మొత్తం 150 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. ఆప్టిట్యూడ్, జనరల్ అవేర్‌నెస్, ఇంగ్లీష్, కంప్యూటర్ నాలెడ్జ్, సైబర్ సెక్యూరిటీ అంశాల నుంచి ఒక్కోదానిలో 30 ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నకు ఒక మార్కు చొప్పున మొత్తం మార్కులు 150. నెగెటివ్ మార్కులు ఉన్నాయి. తప్పుగా గుర్తించిన సమాధానానికి పావు మార్కు కోత విధిస్తారు. పరీక్ష సమయం రెండు గంటలు. ఈ పరీక్షలో అర్హత పొందినవారిని మాత్రమే పర్సనల్ ఇంటర్వ్యూకి పిలుస్తారు. ఇంటర్వ్యూకి 50 మార్కులు ఉంటాయి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.1000; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.500
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 15
- **ఆలిండియా రిటెన్ ఎంట్రెన్స్ టెస్ట్ తేదీ:** మే 12
- **పర్సనల్ ఇంటర్వ్యూలు:** మే 12, 13, 14
- **వెబ్‌సైట్:** www.nliu.ac.in

రైల్వేలో టెక్నీషియన్లు

దేశ వ్యాప్తంగా వివిధ విభాగాల్లో టెక్నీషియన్ పోస్టుల భర్తీకి రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డ్ నోటిఫికేషన్ విడుదల చేసింది. రాత, వైద్య పరీక్షల ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.



ఆర్ఆర్‌బీ రీజియన్లు: అహ్మదాబాద్, అజ్మీర్, బెంగళూరు, భోపాల్, భువనేశ్వర్, బిలాస్‌పూర్, చండీగఢ్, చెన్నై, గువాహటి, జమ్మూ అండ్ శ్రీనగర్, కోల్‌కతా, మాల్దా, ముంబయి, ముజఫర్‌పూర్, పట్నా, ప్రయాగ్‌రాజ్, రాంచీ, సికింద్రాబాద్, సిలిగురి, తిరువనంతపురం, గోరఖ్‌పూర్.

1. **టెక్నీషియన్ గ్రేడ్-1 సిగ్నల్: 1,092 పోస్టులు**
2. **టెక్నీషియన్ గ్రేడ్-3: 8,052 పోస్టులు**

- మొత్తం ఖాళీల్లో ఆర్ఆర్‌బీ సికింద్రాబాద్ పరిధిలో 744 పోస్టులున్నాయి.

అర్హతలు

టెక్నీషియన్ గ్రేడ్-1 సిగ్నల్: బీఎస్సీ, బీఈ/బీటెక్, డిప్లొమా(ఫిజిక్స్/ఎలక్ట్రానిక్స్/కంప్యూటర్ సైన్స్/ఐటీ/ఇన్‌స్ట్రుమెంటేషన్) ఉత్తీర్ణులై ఉండాలి.

టెక్నీషియన్ గ్రేడ్-3: మెట్రిక్యులేషన్/ఎస్ఎస్ఎల్‌సీ, ఐటీఐ(ఎలక్ట్రీషియన్/వైర్‌మ్యాన్/ఎలక్ట్రానిక్స్ మెకానిక్/మెకానిక్ పవర్ ఎలక్ట్రానిక్స్/మెకానిక్/ఫిట్టర్/వెల్డర్/పెయింటర్ జనరల్/మెషినిస్ట్/కార్పెంటర్/ఆపరేటర్ అడ్వాన్స్‌డ్ మెషిన్ టూల్/మెషినిస్ట్/మెకానిక్/మెకానిక్ మెకట్రానిక్స్/మెకానిక్ డీజిల్/మెకానిక్(మోటార్ వెహికిల్)/టర్నర్/ఆపరేటర్ అడ్వాన్స్‌డ్ మెషిన్ టూల్/గ్యాస్ కట్టర్/హీట్ ట్రీటర్/ఫౌండ్రీమన్/ప్యాటర్న్ మేకర్/మౌల్డర్ తదితరాలు). లేదా 10+2(ఫిజిక్స్, మేథ్స్) ఉత్తీర్ణులై ఉండాలి.

వయోపరిమితి: 2024 జూలై 1 నాటికి టెక్నీషియన్ గ్రేడ్-1 సిగ్నల్ పోస్టులకు 18-36 ఏళ్లు; టెక్నీషియన్ గ్రేడ్-3 పోస్టులకు 18-33 ఏళ్ల మధ్య వయసు ఉండాలి. ఎస్సీ/ఎస్టీలకు అయిదేళ్లు; ఓబీసీలకు మూడేళ్లు; దివ్యాంగులకు 10-15 ఏళ్ల సడలింపు ఉంది.

ప్రారంభ వేతనం: నెలకు టెక్నీషియన్ గ్రేడ్-1 సిగ్నల్ పోస్టులకు రూ.29,200. టెక్నీషియన్ గ్రేడ్-3 పోస్టులకు రూ.19,900.

దరఖాస్తు ఫీజు: ఎస్సీ, ఎస్టీ, మాజీ సైనికోద్యోగులు, మహిళలు, ట్రాన్స్‌జెండర్, మైనారిటీ, ఈబీసీ అభ్యర్థులకు రూ.250. ఇతరులకు రూ.500.

ఎంపిక ప్రక్రియ: రాత పరీక్ష(కంప్యూటర్ బేస్డ్ ఆప్టిట్యూడ్ టెస్ట్), డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపిక చేస్తారు.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఏప్రిల్ 8

వెబ్‌సైట్: https://indianrailways.gov.in/

జాబ్ కార్నర్

ఈపీఎఫ్‌వోలో పర్సనల్ అసిస్టెంట్స్

ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్‌లో పర్సనల్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యూపీఎస్సీ)... దరఖాస్తులు కోరుతోంది.

ఖాళీలు: **323**(యూఆర్-132, ఈడబ్ల్యూఎస్-32, ఓబీసీ-87, ఎస్సీ-48, ఎస్టీలకు 24 కేటాయించారు)

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు స్టెనోగ్రఫీ(ఇంగ్లీష్ లేదా హిందీ) నైపుణ్యం కలిగి ఉండాలి.

వయోపరిమితి: కనిష్ఠంగా 18 ఏళ్లు, గరిష్ఠంగా యూఆర్/ఈడబ్ల్యూఎస్‌లకు 30 ఏళ్లు, ఓబీసీలకు 33 ఏళ్లు, పీడబ్ల్యూడీలకు 40 ఏళ్లు మించకూడదు.

ఎంపిక ప్రక్రియ: రిక్రూట్‌మెంట్ టెస్ట్, స్కిల్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేస్తారు.

దరఖాస్తు రుసుము: రూ.25. మహిళలు/ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగ అభ్యర్థులకు ఫీజు చెల్లింపు నుంచి మినహాయింపు ఉంటుంది.

తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు: విజయవాడ, విశాఖపట్నం, వరంగల్, అనంతపురం, హైదరాబాద్.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: మార్చి 27

వెబ్‌సైట్: https://upsc.gov.in/

నేషనల్ సీడ్స్ కార్పొరేషన్‌లో ఉద్యోగాలు

న్యూఢిల్లీలోని భారత ప్రభుత్వరంగ సంస్థకు చెందిన నేషనల్ సీడ్స్ కార్పొరేషన్ లిమిటెడ్... కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టు: ట్రాన్స్‌లేటర్ (అఫీషియల్ లాంగ్వేజ్)

ఖాళీలు: 6

అర్హత: కనీసం 55 శాతం మార్కులతో డిగ్రీ(హిందీ, ఇంగ్లీష్ సబ్జెక్టులతో). డిగ్రీ/డిప్లొమా(హిందీ/ఇంగ్లీష్ ట్రాన్స్‌లేషన్). కంప్యూటర్ పరిజ్ఞానంతో పాటు మూడేళ్ల పాటు పని అనుభవం ఉండాలి.

జీతం: రూ.22,000 నుంచి రూ.77,000

వయోపరిమితి: 30 ఏళ్లు మించకూడదు

ఎంపిక విధానం: రాత పరీక్ష, స్కిల్ టెస్ట్ తదితరాల ఆధారంగా

ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రారంభం: మార్చి 18

దరఖాస్తుకు చివరి తేదీ: ఏప్రిల్ 8

వెబ్‌సైట్: www.indiaseeds.com/

బెల్‌లో వైద్యాధికారులు



బెంగళూరులోని భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్... తాత్కాలిక ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టు: మెడికల్ ఆఫీసర్

ఖాళీలు: 2

అర్హత: పోస్టులను అనుసరించి ఎంబీబీఎస్‌లో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

వయోపరిమితి: 30 సంవత్సరాలు మించరాదు.

వేతనం: నెలకు రూ.40,000 - రూ.1,40,000

దరఖాస్తుకు చివరి తేదీ: మార్చి 27

వెబ్‌సైట్: https://bel-india.in/

ఏపీలో

ఫారెస్ట్ రేంజ్ అధికారులు

ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) దరఖాస్తులు కోరుతోంది.

మొత్తం ఖాళీలు: 37

అర్హత: ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణత. లేదా అగ్రికల్చరల్, బోటనీ, కెమిస్ట్రీ, కంప్యూటర్ అప్లికేషన్స్/కంప్యూటర్ సైన్స్, ఇంజనీరింగ్ (అగ్రికల్చరల్/కెమికల్/సివిల్/కంప్యూటర్/ఎలక్ట్రికల్/ఎలక్ట్రానిక్స్/మెకానికల్), పర్యావరణ శాస్త్రం, ఫారెస్ట్రీ, జాగ్రఫీ, హార్టికల్చర్, మేథమెటిక్స్, ఫిజిక్స్, స్టాటిస్టిక్స్, వెటర్నరీ సైన్స్, జువాలజీ విభాగాల్లో తత్సమాన విద్యార్హతతో పాటు నోటిఫికేషన్‌లో చూపిన విధంగా శారీరక/వైద్య ప్రమాణాలు కలిగి ఉండాలి.

వయోపరిమితి: 18 నుంచి 30 ఏళ్లు

దరఖాస్తు ఫీజు: రూ.250 అప్లికేషన్ ప్రాసెసింగ్ ఫీజుతో పాటు, పరీక్ష ఫీజు రూ.120 చెల్లించాల్సి ఉంటుంది. ఎస్సీ/ఎస్టీ, బీసీ/ఎక్స్ సర్వీస్‌మన్ తదితరులకు పరీక్ష ఫీజు రూ.120 నుంచి మినహాయింపు ఉంటుంది.

జీతం: రూ.48,000 నుంచి రూ.1,37,220

పరీక్ష కేంద్రాలు: శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణా, గుంటూరు, ప్రకాశం, ఎస్‌పీఎస్ఆర్‌నెల్లూరు, చిత్తూరు, వైఎస్ఆర్ కడప, అనంతపురం, కర్నూలు.

ఎంపిక విధానం: స్క్రీనింగ్ అండ్ మెయిన్స్ పరీక్షల ఆధారంగా

ఆన్‌లైన్‌లో దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం: ఏప్రిల్ 15

దరఖాస్తుకు చివరి తేదీ: మే 5

వెబ్‌సైట్: https://psc.ap.gov.in/

ఫిషరీస్ డెవలప్‌మెంట్ ఆఫీసర్లు

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్... ఏపీ ఫిషరీస్ సర్వీసులో కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

ఖాళీలు: 4

పోస్టు: ఫిషరీస్ డెవలప్‌మెంట్ ఆఫీసర్

అర్హత: బీఎఫ్ఎస్సీ ఉత్తీర్ణులై ఉండాలి.

వయోపరిమితి: 2024 జూలై 1 నాటికి 18 నుంచి 42 ఏళ్ల మధ్య ఉండాలి.

పే స్కేల్: నెలకు రూ.45,830 నుంచి రూ.1,30,580

ఎంపిక ప్రక్రియ: కంప్యూటర్ బేస్డ్ రిక్రూట్‌మెంట్ టెస్ట్, కంప్యూటర్ ప్రొఫిషియెన్సీ టెస్ట్, ధ్రువపత్రాల పరిశీలన తదితరాల ఆధారంగా ఎంపిక చేస్తారు.

దరఖాస్తు రుసుము: రూ.370. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, ఎక్స్-సర్వీస్‌మెన్ అభ్యర్థులకు రూ.250.

ఆన్‌లైన్ దరఖాస్తు తేదీలు: ఏప్రిల్ 23 నుంచి మే 13 వరకు

వెబ్‌సైట్: https://psc.ap.gov.in/

డైలీ సుడోకు - 254

9		6	2				5	
						3		
1			8	5				
3	6	9			1	4	8	
	8	4	6			9	7	1
				9	8			4
		3						
	5				2	6		3

సుడోకు - 253 సమాధానం

9	2	6	7	3	1	4	8	5
3	4	7	5	8	2	9	6	1
5	8	1	6	4	9	3	2	7
4	1	8	9	5	7	2	3	6
7	3	9	2	6	8	1	5	4
2	6	5	3	1	4	7	9	8
1	9	2	8	7	5	6	4	3
8	7	3	4	2	6	5	1	9
6	5	4	1	9	3	8	7	2

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.